సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 20 వెల: ₹ 5.50
సంపుటి: 18
సంచిక: 38
బుధవారం 30-4-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
70	7
80,288	24,336

విదేశీ సూచీలు

నాస్‌డాక్	17,424	▲	59
డోజోన్స్	40,536	▲	308
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,463	▲	46
డాక్స్	22,426	▲	154
షాంఘై	3,287	▼	2
నికాయ్ (సోమవారం ముగింపు)	35,840	▲	134

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. ల్లో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	84.70	85.72
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	112.90	115.77
€	యూరో	ఎస్‌బీఐ	95.67	98.37
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	59.07	60.63
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.61	55.80
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	62.49	67.89
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.60	23.28
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.25	24.01
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.75	12.59

ఇండస్‌ఇండ్.. రాజీనామా!

వైదొలగిన బ్యాంక్ సీఈవో సుమంత్...

- నైతిక బాధ్యత వహిస్తూ నిర్ణయం
- ఎగ్జిక్యూటివ్‌ల కమిటీ ఏర్పాటు కోసం ఆర్‌బీఐకి వినతి
- ఇప్పటికే తప్పుకున్న డిప్యూటీ సీఈవో అరుణ్ ఖురానా







న్యూఢిల్లీ: అకౌంటింగ్ అవకతవకల నేపథ్యంలో ఇండస్‌ఇండ్ బ్యాంక్‌లో పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. ఎండీ, సీఈవో సుమంత్ కథ్పాలియా మంగళవారం రాజీనామా చేశారు. అంతకన్నా ముందే సోమవారం నాడు డిప్యూటీ సీఈవో అరుణ్ ఖురానా తప్పుకోగా, ఈ ఉదంతం బైటపడటానికి ముందే చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్‌వో) గోవింద్ జైన్ వైదొలిగారు. డెరివేటివ్స్ పోర్ట్‌ఫోలియోలో దాదాపు రూ. 1,960 కోట్ల మేర అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో ఇవి ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కథ్పాలియా రాజీనామా ఏప్రిల్ 29న పని గంటలు ముగిసిన తర్వాత నుంచి తక్షణమే అమల్లోకి వచ్చినట్లు బ్యాంకు తెలిపింది. తన దృష్టికి వచ్చిన అంశాల విషయంలో తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైనందుకు గాను నైతిక బాధ్యత వహిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు కథ్పాలియా వివరించారు. శాశ్వత ప్రాతిపదికన కొత్త సీఈవోను నియమించే వరకు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బాధ్యతలను నిర్వర్తించేందుకు ఎగ్జిక్యూటివ్స్ కమిటీని ఏర్పాటు చేసేందుకు అనుమతించాల్సిందిగా ఆర్‌బీఐని ఇండస్‌ఇండ్ బ్యాంక్ కోరింది. డెరివేటివ్స్ లావాదేవీల అకౌంటింగ్ విధానాల్లో తేడాల వల్ల 2024–25 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు నికర విలువపై రూ. 1,979 కోట్ల మేర ప్రతికూల ప్రభావం పడుతుందంటూ బైటి ఏజెన్సీ నివేదిక ఇచ్చినట్లు బ్యాంకు ఇటీవలే ప్రకటించింది. దీని వల్ల 2024–25లో బ్యాంకు నికర లాభాలు భారీగా క్షీణించవచ్చని లేదా నష్టాలను ప్రకటించవచ్చని అంచనాలు నెలకొన్నాయి. క్యూ4 ఫలితాలను ఎప్పుడు ప్రకటించేది బ్యాంకు ఇంకా వెల్లడించలేదు.

ఏం జరిగిందంటే..

డెరివేటివ్స్ పోర్ట్‌ఫోలియోను లెక్కగట్టే అకౌంటింగ్ విధానాల్లో లోపాల కారణంగా బ్యాంక్ నికర విలువపై సుమారు 2.35 శాతం ప్రతికూల ప్రభావం పడొచ్చని ఇండస్‌ఇండ్ బ్యాంక్ గత నెల ప్రకటించడం కలకలం రేపింది. దీనిపై స్వతంత్ర విచారణ జరిపేందుకు మార్చి 20న బ్యాంకు ఓ ప్రొఫెషనల్ సంస్థను నియమించింది. అంతర్గతంగా డెరివేటివ్స్ ట్రేడ్‌లను నమోదు చేయడంలో లోపాల వల్ల ఊహాజనిత లాభాలు నమోదు కావడమే అకౌంటింగ్ అవకతవకలకు దారి తీసిందని, దీనితో మొత్తం గణాంకాలన్నీ మారిపోయాయని సదరు సంస్థ తన నివేదికలో విశ్లేషించింది. ఆర్‌బీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఇంటర్నల్ డెరివేటివ్ ట్రేడింగ్‌ను బ్యాంక్ నిలిపివేసినప్పటికీ, అంతకన్నా ముందు 5–7 ఏళ్లుగా డెరివేటివ్స్ పోర్ట్‌ఫోలియో ఖాతాల్లో వ్యత్యాసాలు నమోదవుతూ వస్తున్నాయి. ఇది అంతర్గత, ఆర్‌బీఐ ఆడిట్‌లలో కూడా బైటపడకపోవడం గమనార్హం. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఎండీగా సుమంత్‌ను మరో మూడేళ్ల పాటు పొడిగించాలన్న బ్యాంక్ ప్రతిపాదనకు ఆర్‌బీఐ నిరాకరించి, ఏడాదికే అనుమతించడం పరిస్థితి తీవ్రతపై సందేహాలు రేకెత్తాయి.

షేరు క్రాష్..!

ఈ క్రమంలోనే ఇండస్‌ఇండ్ బ్యాంకు షేరు ఏడాది గరిష్ట స్థాయి రూ. 1,576 నుంచి ఒక దశలో సుమారు యాభై శాతం పైగా పతనమైంది. ప్రస్తుతం రూ. 837 వద్ద ట్రేడవుతోంది. అయితే, తాజా వరుస రాజీనామాల పరిణామాలతో బుధవారం బ్యాంకు షేర్లు గణనీయంగా క్షీణించే అవకాశం ఉందని అంచనాలు నెలకొన్నాయి.

బజాజ్ ఫైనాన్స్
బోనస్ బొనాంజా

1 షేరుకి 4 షేర్లు ఉచితం

- 2:1 నిష్పత్తిలో షేర్ల విభజన
- షేరుకి రూ. 44 డివిడెండ్
- క్యూ4 లాభం రూ. 4,546 కోట్లు



న్యూఢిల్లీ: ఎన్‌బీఎఫ్‌సీ దిగ్గజం బజాజ్ ఫైనాన్స్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 16 శాతం ఎగసి రూ. 3,940 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 3,402 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 12,764 కోట్ల నుంచి రూ. 15,808 కోట్లకు జంప్ చేసింది. స్టాండెలోన్ ఫలితాలివి. వడ్డీ ఆదాయం రూ. 11,201 కోట్ల నుంచి రూ. 13,824 కోట్లకు బలపడింది. కాగా.. కన్సాలిడేటెడ్ నికర లాభం సైతం 19 శాతం వృద్ధితో రూ. 4,546 కోట్లకు చేరింది. నిర్వహణలోని మొత్తం ఆస్తులు(ఏయూఎం) 26 శాతం ఎగసి రూ. 4,16,661 కోట్లయ్యాయి. 2025 మార్చి31కల్లా స్థూల మొండి బకాయిలు(ఎన్‌పీఏలు) 0.96 శాతం, నికర ఎన్‌పీఏలు 0.44 శాతంగా నమోదయ్యాయి.

అందుబాటులోకి షేరు

బజాజ్ ఫైనాన్స్ వాటాదారులకు రూ. 2 ముఖ విలువగల ఒక్కో షేరుకి రూ. 44 డివిడెండ్ చెల్లించనుంది. రూ. 2 ముఖ విలువగల ప్రతీ షేరుని రూ. 1 ముఖ విలువగల 2 షేర్లుగా విభజించనుంది. అంతేకాకుండా 4:1 నిష్పత్తిలో బోనస్ ప్రకటించింది. అంటే వాటాదారుల వద్దగల ప్రతీ 1 షేరుకి 4 షేర్లు ఉచితంగా జారీ చేయనుంది. ఈ ప్రతిపాదనలను తాజాగా బోర్డు అనుమతించినట్లు కంపెనీ వెల్లడించింది. కాగా.. గతంలో నమోదు చేసిన రూ. 249 కోట్ల పన్ను వ్యయాలను రివర్స్ చేసింది. దీంతో పూర్తి ఏడాదిలో పన్ను ప్రొవిజన్ రూ. 99 కోట్లకు పరిమితమైనట్లు పేర్కొంది. వెరసి క్యూ4లో రూ. 348 కోట్ల పన్ను తగ్గినట్లు తెలిపింది.

ఫలితాల నేపథ్యంలో బజాజ్ ఫైనాన్స్ షేరు బీఎస్‌ఈలో నామమాత్ర నష్టంతో రూ. 9,089 వద్ద ముగిసింది.

సోలార్ కాంట్రాక్టుల్లో అవకతవకలేమీ జరగలేదు

స్వతంత్ర దర్యాప్తులో వెల్లడైందన్న అదానీ గ్రీన్


న్యూఢిల్లీ: సౌర విద్యుత్ కాంట్రాక్టులు దక్కించుకునే విషయంలో తాము ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదంటూ స్వతంత్ర దర్యాప్తులో తేలిందని అదానీ గ్రీన్ వెల్లడించింది.



సౌర విద్యుత్ కాంట్రాక్టుల కోసం భారత్‌లో ప్రభుత్వ వర్గాలకు లంచాలిచ్చారని, అమెరికన్ ఇన్వెస్టర్ల నుంచి నిధులు సమీకరించే క్రమంలో ఆ విషయాన్ని దాచి పెట్టారని అదానీ గ్రూప్ చైర్మన్ గౌతం అదానీ, ఆయన సోదరుడి కుమారుడు సాగర్ అదానీ, ఎండీ వినీత్ జైన్‌లపై అమెరికాలో అభియోగాలు మోపారు. అదానీ గ్రూప్ ఈ ఆరోపణలను ఖండించింది. స్వతంత్ర దర్యాప్తులో అవకతవకలు జరగలేదని వెల్లడైనట్లు అదానీ గ్రీన్ పేర్కొంది.

సూచీలకు స్వల్ప లాభాలు

రెండో రోజూ ముందుకే...



ముంబై: ఒడిదుడుకుల ట్రేడింగ్‌లో భాగంగా స్టాక్ సూచీలు మంగళవారం స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. సెన్సెక్స్ 70 పాయింట్లు పెరిగి 80,288 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఏడు పాయింట్ల నామమాత్ర లాభంతో 24,336 వద్ద నిలిచింది. వరుసగా రెండో రోజూ లాభాల్లో నిలిచాయి. భారత్–పాక్‌ల మధ్య నెలకొన్న భౌగోళిక ఉద్రికత్త పరిస్థితుల దృష్ట్యా ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. సెన్సెక్స్ 443 పాయింట్లు ఎగసి 80,661 వద్ద, నిఫ్టీ 129 పాయింట్లు పెరిగి 24,458 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. ఐటీ, క్యాపిటల్ గూడ్స్, ఇండస్ట్రియల్, కన్జూమర్ రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. మెటల్, యుటిలిటీ, టెలీకమ్యూనికేషన్, సర్వీసెస్, బ్యాంకులు, ఫైనాన్స్ సర్వీసెస్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 27 పైసలు బలపడి 84.96 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- మెరుగైన ఫలితాలతో పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ 4% పెరిగి రూ.1,031 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో 10% ఎగసి రూ.1,085 తాకింది.
- రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 2%, టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లు ఒకశాతం చొప్పున రాణించి సూచీలకు దన్నుగా నిలిచాయి.

హైదరాబాద్‌లో ఆజాద్ ఇంజనీరింగ్ తయారీ ప్లాంటు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జీఈ వెర్నోవాకి చెందిన స్టీమ్ పవర్ సర్వీసెస్ అవసరాల కోసం హైదరాబాద్‌లో లీన్ తయారీ ప్లాంటును ప్రారంభించినట్లు ప్రెసిషన్ ఇంజినీరింగ్ సంస్థ ఆజాద్ ఇంజినీరింగ్ వెల్లడించింది.



ఈ ప్లాంటు లో 180 మంది సుశిక్షితులైన ప్రొఫెషనల్స్ ఉండగా, రాబోయే రోజుల్లో వందల సంఖ్యలో మరింత మంది నిపుణులను రిక్రూట్ చేసుకోనున్నట్లు సంస్థ చైర్మన్ రాకేష్ చోప్దార్ వివరించారు. ఈ ఫ్యాక్టరీ నుంచి ఏటా 1,00,000 బ్లేడ్లను ఉత్పత్తి చేయనున్నట్లు చెప్పారు. ఏరోస్పేస్, డిఫెన్స్, ఎనర్జీ, ఆయిల్..గ్యాస్ తదితర రంగాల సంస్థలతో పటిష్టమైన భాగస్వామ్యాలు కుదుర్చుకునేందుకు ఇలాంటి వ్యూహాలు తోడ్పడగలవని రాకేష్ తెలిపారు.

తెలుగు రాష్ట్రాల్లో 3 రెట్లు వృద్ధి: టాటా ఏఐజీ

మెడికేర్ సెలెక్ట్ పాలసీ ఆవిష్కరణ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రిటైల్ హెల్త్ పోర్ట్‌ఫోలియోకి సంబంధించి తెలుగు రాష్ట్రాల్లో గత ఏడాది వ్యవధిలో మూడు రెట్లు వృద్ధి సాధించినట్లు టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ హెడ్ (ఏజెన్సీ) ప్రతీక్ గుప్తా తెలిపారు. 1,600 పైగా ఆస్పత్రుల నెట్‌వర్క్, 14,500 మంది అడ్వైజర్లతో రెండు రాష్ట్రాల్లోనూ కార్యకలాపాలు మరింత విస్తరిస్తున్నట్లు వివరించారు. రాబోయే రోజుల్లో మరో 15,000 మంది డిస్ట్రిబ్యూషన్ పార్ట్‌నర్స్‌ను చేర్చుకోనున్నట్లు సంస్థ హెడ్ (యాక్సిడెంట్, హెల్త్ క్లెయిమ్స్) రుద్రరాజు రాజగోపాల్ చెప్పారు. గత రెండేళ్లలో తెలుగు రాష్ట్రాల్లో తమ వాటా 2.1% నుంచి 3.6%కి పెరగ్గా, దీన్ని 5%కి పెంచుకోనున్నట్లు వివరించారు. మెడికేర్ సెలెక్ట్ పేరిట ఆరోగ్య బీమా పాలసీని ఆవిష్కరించిన సందర్భంగా ఈ విషయాలు పేర్కొన్నారు. అందుబాటు స్థాయి ప్రీమియంలతో వయోపరిమితుల్లాంటివేమీ లేకుండా డిస్కౌంట్లు కూడా ఇస్తున్నట్లు సంస్థ హెడ్ (ఏజెన్సీ) ప్రతీక్ గుప్తా తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో గత మూడేళ్లుగా చికిత్స వ్యయాలు గణనీయంగా పెరిగిపోయిన నేపథ్యంలో ఆరోగ్య బీమా ఆవశ్యకత కూడా పెరిగిందని వివరించారు.



'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

మళ్లీ ఐపీవోల సందడి..!	బీపీసీఎల్ లాభం నేలచూపు

భవిత
స్పర్ధయా వర్ధతే విద్య



హెచ్ఏఎల్ హైదరాబాద్‌లో 16 టెక్నీషియన్ పోస్టులు

హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్).. వివిధ విభాగాల్లో డిప్లొమా టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 16.
» **పోస్టుల వివరాలు:** డిప్లొమా టెక్నీషియన్(మెకానికల్)–1,డిప్లొమా టెక్నీషియన్ (ఎలక్ట్రికల్)–2,డిప్లొమా టెక్నీషియన్(ఎలక్ట్రానిక్స్)–13.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:**07.05.2025 నాటికి 28ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.23,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.05.2205
» **పరీక్ష తేది:** 25.05.2025.
» **వెబ్‌సైట్:** https://hal-india.co.in

బీఎంఆర్‌సీఎల్‌లో 150 మెయింటైనర్ పోస్టులు

బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (బీఎంఆర్‌సీఎల్).. మెయింటైనర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 150.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, ఐటీఐలో ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: 50 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.25,000 నుంచి 59,060.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మెరిట్, రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.05.2025
» **ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 27.05.2025
» **వెబ్‌సైట్:** https://bmrc.co.in

ఎన్ఎండీఎఫ్‌సీ, ఢిల్లీలో 10 మేనేజర్ పోస్టులు

ఢిల్లీలోని నేషనల్ మైనారిటీస్ డెవలప్‌మెంట్–ఫైనాన్స్ కార్పొరేషన్(ఎన్ఎండీఎఫ్‌సీ).. మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 10.
» **పోస్టుల వివరాలు:** డిప్యూటీ మేనేజర్(కంపెనీ సెక్రటరీ)–1,అసిస్టెంట్ మేనేజర్ (ప్రాజెక్ట్ లీగల్–రికవరీ)–2,అసిస్టెంట్ మేనేజర్(ఫైనాన్స్–అకౌంట్స్)–1, అసిస్టెంట్ మేనేజర్(హెచ్ఆర్ ఎం–అడ్మిన్)–1,ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్–5.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 31.01.2025 నాటికి డిప్యూటీ మేనేజర్ పోస్టుకు 32 ఏళ్లు, ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్‌కు రూ.25,000 నుంచి రూ.95,000, అసిస్టెంట్ మేనేజర్ పోస్టుకు రూ.30,000 నుంచి రూ.1,20,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.05.2025
» **వెబ్‌సైట్:** https://nmdfc.org

సిడ్బీలో అసోసియేట్ మేనేజర్ పోస్టులు

స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్ఐడీబీఐ).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో అసోసియేట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 06.
» **పోస్టుల వివరాలు:** అసోసియేట్ మేనేజర్–ఎన్విరాన్‌మెంట్ అండ్ సోషల్ సేఫ్ గార్డ్–1, అసోసియేట్ మేనేజర్–మానిటరింగ్ అండ్ ఎవల్యూషన్–1, అసోసియేట్ మేనేజర్–ఎనర్జీ–2, అసోసియేట్ మేనేజర్–క్లైమేట్ ఛేంజ్–2.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ, మాస్టర్స్ డిగ్రీ, డిగ్రీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 45 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.1,00,000 నుంచి రూ.2,50,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా.
» **ఈమెయిల్:** gcfv@sidbi.in, neerajverma@sidbi.in.
» **దరఖాస్తులకు చివరితేది:** 14.05.2025.
» **వెబ్‌సైట్:** https://www.sidbi.in

సమయం తక్కువ.. సిలబస్ ఎక్కువ!

» 16,347 పోస్టులతో ఏపీ డీఎస్సీ నోటిఫికేషన్
» జూన్ 6 నుంచి జూలై 6 వరకు పరీక్షలు
» కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహణ

ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగార్థులను ఊరిస్తూ.. వాయిదాలు పడుతూ వచ్చిన ఏపీ డీఎస్సీ నోటిఫికేషన్ ఎట్టకేలకు విడుదలైంది. దీనిద్వారా మొత్తం 16,347 పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు. జూన్ 6 నుంచి జూలై 6 వరకూ.. నెల రోజుల పాటు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో పరీక్షలను నిర్వహించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అంటే.. పరీక్షకు అందుబాటులో ఉన్న సమయం కేవలం 36 రోజులు!! ఒకవైపు సిలబస్ విస్తృతంగా ఉండటం.. మరోవైపు పరీక్షకు అందుబాటులో ఉన్న సమయం తక్కువ! ఈ నేపథ్యంలో.. ఏపీ డీఎస్సీ పోస్టులు, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ గైడెన్స్ తదితర వివరాలు..



పోస్టులు ఇవే

ఏపీ డీఎస్సీ తాజా నోటిఫికేషన్ ద్వారా మొత్తం 16,347 పోస్టులను భర్తీ చేయనున్నారు. స్కూల్ ఎడ్యుకేషన్ పరిధిలోని ఎంపీపీ/జడ్‌పీపీ తదితర స్కూల్స్‌లో 6,940 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 4,712 ఎస్‌జీటీ పోస్టులు ఉన్నాయి. అదే విధంగా స్కూల్ ఎడ్యుకేషన్ పరిధిలోనే మున్సిపల్ పాఠశాలల్లో 267 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు; 1,273 ఎస్‌జీటీ పోస్టులున్నాయి. ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్స్‌లో 881 పోస్టులు, జువనైల్ వెల్ఫేర్ విభాగంలో 15 పోస్టులు, డిఫరెంట్లీ ఏబుల్డ్ విభాగంలో 31 పోస్టులు భర్తీ చేయనున్నారు. రెసిడెన్షియల్స్ స్కూల్స్ పరిధిలో 2.228 పోస్టులున్నాయి. వీటిలో టీజీటీ, పీజీటీ, ప్రిన్సిపల్, ఫిజికల్ డైరెక్టర్, పీఈటీ కొలువులకు నియామక ప్రక్రియ చేపట్టనున్నారు.

అర్హతలివే

- ఏపీ డీఎస్సీ నియామకాల్లో టెట్ స్కోర్‌కు 20 శాతం వెయిటేజీ కల్పిస్తారు. టెట్ ఉత్తీర్ణులను మాత్రమే డీఎస్సీకి అర్హులుగా పేర్కొన్నారు.
- **ఎస్‌జీటీ:** ఇంటర్మీడియెట్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత తర్వాత రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్(డీఎడ్)/డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్ఈడీ) (లేదా) కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు బీఈడీ పాసవ్వాలి.
- **స్కూల్ అసిస్టెంట్:** ఆయా సబ్జెక్టులతో బ్యాచిలర్స్ డిగ్రీలో 50 శాతం మార్కులతో లేదా సంబంధిత సబ్జెక్ట్‌లో 55 శాతం మార్కులతో పీజీతో పాటు, బీఈడీ/తత్సమాన కోర్సులో ఉత్తీర్ణత సాధించాలి (లేదా) నాలుగేళ్ల బీఏ బీఈడీ /బీఎస్సీ బీఈడీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.
- **వయసు:** జూలై 1,2024 నాటికి అన్ని రకాల పోస్టులకు గరిష్ట వయో పరిమితి 44 సంవత్సరాలుగా నిర్ణయించారు. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు 49 ఏళ్లుగా పేర్కొన్నారు.

పరీక్ష విధానం

- ఎస్‌జీటీ పోస్టులకు 80 మార్కులతో నాలుగు విభాగాల్లో పరీక్ష ఉంటుంది. జీకే అండ్ కరెంట్ అఫైర్స్(8 మార్కులు), పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్ (4 మార్కులు), ఎడ్యుకేషనల్ సైకాలజీ (8 మార్కులు), కంటెంట్ అండ్ మెథడాలజీస్ (60 మార్కులు) నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్‌జీటీలకు సంబంధించి కేటగిరీ ఆఫ్ డిజెబులిటీ స్పెషలైజేషన్ నుంచి 20 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. అదే విధంగా కంటెంట్ అండ్ మెథడాలజీ విభాగంలో 40 మార్కులకే పరీక్ష ఉంటుంది.
- స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు జీకే అండ్ కరెంట్ అఫైర్స్ (10 మార్కులు), పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్(5 మార్కులు), క్లాస్‌రూమ్ ఇంప్లికేషన్స్ ఆఫ్ ఎడ్యుకేషనల్ సైకాలజీ(5 మార్కులు), కంటెంట్ (40 మార్కులు), మెథడాలజీ (20 మార్కులు) చొప్పున మొత్తం 80 మార్కులకు పరీక్ష ఉంటుంది.
- టీజీటీ పోస్టులకు జీకే అండ్ కరెంట్ అఫైర్స్(10 మార్కులు), పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్ (5 మార్కులు), ఎడ్యుకేషనల్ సైకాలజీ (5 మార్కులు), కంటెంట్ (40 మార్కులు), మెథడాలజీ (20 మార్కులు) చొప్పున 80 మార్కులకు పరీక్ష ఉంటుంది.
- పీజీటీ పోస్టులకు జీకే అండ్ కరెంట్ అఫైర్స్(10 మార్కులు), పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్(10 మార్కులు), ఎడ్యుకేషనల్ సైకాలజీ (10 మార్కులు); కంటెంట్ (50 మార్కులు), మెథడాలజీ (20 మార్కులు) చొప్పున అయిదు విభాగాల్లో 100 మార్కులకు పరీక్ష ఉంటుంది.
- టీజీటీ, పీజీటీ, ప్రిన్సిపల్ పోస్టులకు ఇంగ్లిష్ లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్ట్ కూడా ఉంటుంది. ఈ పేపర్‌ను 100 మార్కులకు నిర్వహిస్తారు.
- ప్రిన్సిపల్ పోస్టులకు జీకే అండ్ కరెంట్ అఫైర్స్ (15 మార్కులు), పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్ (15 మార్కులు), ఎడ్యుకేషనల్ సైకాలజీ (20 మార్కులు), కంటెంట్ (35 మార్కులు), మెథడాలజీ (15 మార్కులు) చొప్పున 100 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.

ఎస్‌జీటీకి ప్రిపరేషన్ ఇలా

జీకే, కరెంట్ అఫైర్స్

ఎస్‌జీటీలో కీలకంగా భావించే జీకే, కరెంట్ అఫైర్స్ విభాగానికి సంబంధించి స్టాక్ జీకే, కరెంట్ అఫైర్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి. అదేవిధంగా భౌగోళిక నామాలు, నదీతీర నగరాలు, దేశాలు–రాజధానులు, అవార్డులు, సదస్సులు, వార్తల్లో వ్యక్తులు,బడ్జెట్, అంతర్జాతీయ రాజకీయాలు, సైన్స్ అండ్ టెక్నాలజీ గురించి క్షుణ్నంగా తెలుసుకోవాలి.

విద్యా దృక్పథాలు

దేశంలో విద్యా చరిత్ర, కమిటీలు, వర్తమాన భారతదేశంలో విద్యా సంబంధిత అంశాలు, చట్టాలు–హక్కులు, జాతీయ పాఠ్యప్రణాళికా చట్రం(ఎన్‌సీఎఫ్–2005), విద్యాహక్కు చట్టం, నూతన విద్యా విధానం తదితర అంశాలపై పట్టు సాధించాలి. డీఎడ్ స్థాయి తెలుగు అకాడమీ పుస్తకాన్ని అధ్యయనం చేయాలి.

విద్యా మనోవిజ్ఞాన శాస్త్రం

శిశు వికాసంలో వికాసం, పెరుగుదల, పరిపక్వత భావన–స్వభావం, వికాస నియమాలు, వికాసంపై ప్రభావం చూపే కారకాలు, వికాస దశలు తదితర అంశాలపై దృష్టి సారించాలి. ముఖ్య భావనలకు సంబంధించిన అనువర్తనాలను తప్పనిసరిగా అధ్యయనం చేయాలి.

కంటెంట్

- తెలుగు(ఆప్షనల్), ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్, సైన్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టుల కంటెంట్ ప్రిపరేషన్‌కు పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠ్య పుస్తకాలను అధ్యయనం చేయాలి. తెలుగులో కవులు–కావ్యాలు, అర్థాలు, పర్యాయపదాలు, జాతీయాలు తదితరాలతోపాటు భాషాంశాలను చదవాలి. ఇంగ్లిష్‌లో పార్ట్స్ ఆఫ్ స్పీచ్, టెన్సెస్, టైప్స్ ఆఫ్ సెంటెన్సెస్, ఆర్టికల్స్, ప్రిపోజిషన్స్ వంటి వాటిపై పట్టు సాధించాలి.
- గణితం(మ్యాథమెటిక్స్)లో అర్థమెటిక్, సంఖ్యా వ్యవస్థ, క్షేత్ర గణితం, రేఖా గణితం, బీజ గణితం, సాంఖ్యక శాస్త్రం అంశాలను చదవాలి. పదో తరగతి స్థాయిలోని మ్యాథమెటిక్స్‌ను ప్రాక్టీస్ చేయాలి.
- సైన్స్‌లో.. జీవ ప్రపంచం, మొక్కలు, జంతువులు, ఆహారం, పోషణ, ఆహార పిరమిడ్, మానవ శరీరం, పదార్థాలు, కొలతలు, ప్రమాణాలు, ఆమ్లాలు–క్షారాలు, శక్తి రూపాలు, పునరుత్పాదక ఇంధన వనరులు తదితర అంశాలపై దృష్టి సారించాలి. ధ్వని, విద్యుత్, కాంతి, ఉష్ణం చాప్టర్లలోని ముఖ్య భావనలు, శాస్త్రవేత్తలు, ఆవిష్కరణలపై పట్టుసాధించాలి.
- సోషల్ స్టడీస్‌లో స్థానిక భౌగోళిక అంశాలు, ఖండాలు, పారిశ్రామిక విప్లవం, మనీ–బ్యాంకింగ్, ప్రభుత్వం, రాజకీయ వ్యవస్థలు, జాతీయ ఉద్యమం, భారత రాజ్యాంగం, పరిపాలన, అసమానతలు, మతం–సమాజం, సంస్కృతి, కమ్యూనికేషన్ తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

స్కూల్ అసిస్టెంట్ సాధించేలా

- ఆయా సబ్జెక్టుల కంటెంట్ ప్రిపరేషన్‌కు సంబంధించి ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను అధ్యయనం చేయాలి.
- మ్యాథమెటిక్స్‌లో ప్రధానంగా బీజ గణితం,సదిశా బీజగణితం,వైశ్లేషిక రేఖాగణితం,కలన గణితం, త్రికోణమితి అంశాలపై పట్టు సాధించాలి.
- బయాలజీలో జీవ ప్రపంచం, సూక్ష్మజీవులు, జీవశాస్త్రం–ఆధునిక పోకడలు, జంతు ప్రపంచం తదితర పాఠ్యాంశాలు ముఖ్యమైనవి.
- సోషల్ స్టడీస్‌లో భారత స్వాతంత్ర్య ఉద్యమం, ప్రపంచ యుద్ధాలు–అనంతర పరిస్థితులు, రాజ్యాంగం, యూఎన్‌వో, సమకాలీన ప్రపంచ అంశాలు, జాతీయ ఆదాయం, భారత ఆర్థిక వ్యవస్థ లక్షణాలు తదితర అంశాలపై దృష్టి సారించాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2025, మే 15
- డీఎస్సీ తేదీలు: 2025, జూన్ 6 నుంచి జూలై 6 వరకు
- వెబ్‌సైట్: https://apdsc.apcfss.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..


» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం– జాగ్రఫీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–జనరల్ స్టడీస్– బయాలజీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం– రీజనింగ్

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50




'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'



కెనడాలో లిబరల్ పార్టీ విజయం

కెనడా సార్వత్రిక ఎన్నికల్లో ప్రధానమంత్రి మార్క్ కార్నీ సారథ్యంలోని అధికార లిబరల్ పార్టీ విజయం సాధించింది.

- వివరాలు 6లో ▶



స్పైవేర్‌ను వాడితే తప్పేంటి?

ఉగ్రవాదులపై నిఘా సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తే తప్పేమిటని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

- వివరాలు 6లో ▶

సైన్యానికి పూర్తి స్వేచ్ఛ

ప్రధాని మోదీ సంచలన నిర్ణయం

- 'పహల్గాం'కు త్వరలో దీటైన జవాబు...
- ఎప్పుడు, ఎక్కడ, ఎలాగన్నది వారిష్టం
- బలగాల సామర్థ్యంపై పూర్తి విశ్వాసం
- ఉగ్రవాదాన్ని అంతం చేసి తీరాల్సిందే
- దేశమంతా అదే కోరుతోందన్న ప్రధాని
- సీడీఎస్, త్రివిధ దళాధిపతులతో భేటీ
- పాల్గొన్న రాజ్‌నాథ్, ఎన్ఎస్ఏ దోవల్
- ఎన్ఎస్‌జీ చీఫ్‌తో హోం కార్యదర్శి భేటీ
- పాల్గొన్న బీఎస్ఎఫ్, ఎస్ఎస్‌బీ చీఫ్‌లు
- సరిహద్దుల్లో కొనసాగిన పాక్ కాల్పులు

" ఉగ్రవాదంపై పోరాటంలో జవాన్లు పూర్తి స్వేచ్ఛగా వ్యవహరించవచ్చు. సొంతంగా నిర్ణయాలు తీసుకోవచ్చు. ఉగ్ర ముష్కరులకు, వారి సూత్ర ధారులకు చెప్పబోయే గుణపాఠం దాయాది జన్మలో మర్చిపోలేని రీతిలో ఉండాలి. "



ప్రతీకారానికి వేళైంది. ఉగ్ర వేటకు రంగం సిద్ధమైంది. ఈ దిశగా మంగళవారం రోజంతా కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. 'పహల్గాం'కు దీటుగా బదులిచ్చేందుకు సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇస్తూ ప్రధాని మోదీ కీలక నిర్ణయం తీసుకున్నారు. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్, జాతీయ భద్రతా సలహాదారు, రక్షణ మంత్రి సమక్షంలో త్రివిధ దళాధిపతులతో ఆయన సమావేశమయ్యారు. ''మీ సామర్థ్యంపై పూర్తి విశ్వాసముంది. 'పహల్గాం' ముష్కరులకు, వారి సూత్రధారుల కు ఎప్పుడు, ఎక్కడ, ఎలా బదులిస్తారో మీ ఇష్టం'' అంటూ ఫుల్ పవర్స్ ఇచ్చేశారు. మరోవైపు ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ కూడా మోదీతో సమావేశమయ్యారు. పహల్గాం ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఇక ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ల కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన ఎన్ఎస్‌జీ చీఫ్‌తో కేంద్ర హోం శాఖ కార్యదర్శి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బీఎస్ఎఫ్, ఎస్ఎస్‌బీ, అస్సాం రైఫిల్స్ తదితర కీలక దళాల చీఫ్‌లు కూడా భేటీలో పాల్గొన్నారు. ఈ దిశగా మరిన్ని కీలక పరిణామాలు బుధవారం చోటు చేసుకోనున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం దాకా భద్రత, రాజకీయ, ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీలతో మోదీ వరుస భేటీలు, ఆపై కేంద్ర కేబినెట్ భేటీ జరగనున్నాయి. దాయాదికి బుద్ధి చెప్పేందుకు రంగాలవారీగా తీసుకోవాల్సిన చర్యలను నిర్ణయించి ఆమోదముద్ర వేస్తారని తెలుస్తోంది.

- వివరాలు 6లో

- పాక్‌కు భారత్ ఫార్మా ఉత్పత్తులు బంద్
- కశ్మీర్‌లో 48 పర్యాటక ప్రాంతాల మూసివేత
- పాక్ విమానాలకు నో ఎంట్రీ
- పార్లమెంట్‌ను సమావేశపర్చండి: కాంగ్రెస్

- వివరాలు 6లో

అంతులేని అవినీతి.. అంతా అరాచకం



చంద్రబాబు విధ్వంసం అంతా ఇంతా కాదు: వైఎస్ జగన్ మండిపాటు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో చంద్రబాబు సర్కారు అన్నింటా ఘోర వైఫల్యం చెందిందని.. యథేచ్ఛగా రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని.. అంతులేని అవినీతి జరుగుతోందని.. వీటన్నింటినీ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ జిల్లాల అధ్యక్షులకు పిలుపునిచ్చారు. చంద్రబాబు చేస్తున్న విధ్వంసం అంతా ఇంతా కాదని మండిపడ్డారు. విద్య, వైద్యం, వ్యవసాయం.. ఇలా అన్ని రంగాల్లో విధ్వంసమే కొనసాగుతోందన్నారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులతో వైఎస్ జగన్ సమావేశమయ్యారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు.. జరుగుతున్న పరిణామాలపై చర్చించారు. ''ప్రజల పక్షాన గట్టిగా పోరాడుతూ పార్టీని మరింత బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా అధ్యక్షులకు వైఎస్ జగన్ దిశానిర్దేశం చేశారు. చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న విధ్వంసాల వల్ల కష్టాల్లో కూరుకుపోయిన ప్రజలకు అండగా నిలబడాలి. ఆ కార్యక్రమాలు రాష్ట్ర స్థాయి దృష్టిని ఆకర్షిస్తాయి. వాటి ద్వారా మీ పనితీరు కూడా బయట పడుతుంది. ఈ ప్రక్రియలో పార్టీ జిల్లా అధ్యక్షులది చాలా కీలక బాధ్యత. సమాజంలో గొంతులేని వారికి బాసటగా నిలిచేది ఎప్పుడైనా మనమే. ప్రతి సమస్యలోనూ మనం బాధితులకు తోడుగా ఉంటాం. తొలి నుంచి అలా నిలుస్తోంది, ఆ పని చేస్తోంది ఒక్క వైఎస్సార్‌సీపీనే''అని అన్నారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

కేటీఆర్ త్వరగా కోలుకోవాలి

జిమ్‌లో వ్యాయామం చేస్తూ గాయపడిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ త్వరగా కోలుకోవాలని వైఎస్ జగన్ ఆకాంక్షించారు. 'బ్రదర్ త్వరగా కోలుకోవాలి. మీ ఆరోగ్యం వేగంగా మెరుగుపడాలని ప్రార్థిస్తున్నా'అని వైఎస్ జగన్ మంగళవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

ఎన్‌క్రిప్టెడ్ యాప్స్ ద్వారా డ్రగ్స్ దందా

- నలుగురు నిందితులను అరెస్ట్ చేసిన హెచ్–ఎన్‌ఈడబ్ల్యూ
- రూ. 1.4 కోట్ల విలువైన ఓజీ, ఎల్ఎస్డీ, మ్యాజిక్ మష్రూమ్స్ డ్రగ్స్ స్వాధీనం
- విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన అదనపు సీపీ విశ్వప్రసాద్


వివరాలు వెల్లడిస్తున్న అదనపు సీపీ విశ్వప్రసాద్

సాక్షి, హైదరాబాద్: ఎన్‌క్రిప్టెడ్ యాప్స్ ద్వారా ఐదారేళ్లుగా సాగుతున్న అంతర్జాతీయ డ్రగ్స్ దందా గుట్టును హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్–ఎన్‌ఈడబ్ల్యూ) రట్టు చేసింది. నలుగురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి మొత్తంగా రూ. 1.4 కోట్ల విలువైన 1.38 కిలోల ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్‌గా (ఓజీ) పిలిచే హైడ్రోపోనిక్ గంజాయి, 44 ఎల్ఎస్డీ (లైసెర్జిక్ యాసిడ్ డైఎథిలమైడ్) బ్లాట్లు, 250 గ్రాముల మ్యాజిక్ మష్రూమ్స్ (సైలోసైబిన్ డ్రగ్), మరికొన్ని వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ నిందితులంతా ఉన్నత విద్యావంతులే కావడం గమనార్హం. టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్రతో కలిసి మంగళవారం విలేకరుల సమావేశంలో అదనపు సీపీ (నేరాలు) పి.విశ్వప్రసాద్ ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించారు.

కస్టమర్ నుంచి పెడ్లర్‌గా మారి...

సికింద్రాబాద్‌కు చెందిన అభిషేక్ ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ ఐఐటీ నుంచి బీటెక్ పూర్తిచేశాడు. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తూ నెలకు రూ. 2 లక్షలు సంపాదిస్తున్నాడు. రాయ్‌పూర్‌లో ఉండగా మాదకద్రవ్యాల వినియోగానికి అలవాటుపడిన అతను.. తేలిగ్గా డబ్బు సంపాదన కోసం పెడ్లర్‌గానూ మారాడు. అభిషేక్‌కు డార్క్ వెబ్‌లో ఉన్న డ్రెడ్ మార్కెట్ అనే కమ్యూనిటీ ద్వారా 'హెచ్‌హెచ్ హ్యాండ్లర్'అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. తనకు కావాల్సిన ఓజీ, ఎల్ఎస్డీ కోసం సిగ్నల్, స్నాప్‌చాట్ వంటి ఎన్‌క్రిప్టెడ్ యాప్స్ ద్వారా ఆర్డర్ ఇచ్చేవాడు. జబల్‌పూర్‌కు చెందిన హర్షవర్ధన్ శ్రీవాస్తవ బీ–ఆర్క్ పూర్తి చేసినప్పటికీ ఆ రంగంపై ఆసక్తి లేక ఓ స్టార్టప్ కంపెనీ తెరవడానికి డబ్బు కోసం డ్రగ్ పెడ్లర్ అవతారం ఎత్తాడు. డ్రెడ్ మార్కెట్ ద్వారానే 'హెచ్‌హెచ్ హ్యాండ్లర్'కి లోకల్ ఏజెంట్‌గా మారాడు. అయితే అతనికి డ్రగ్స్ అలవాటు లేకపోవడం గమనార్హం. సికింద్రాబాద్‌కు చెందిన మరో ఆర్కిటెక్ట్ ధావల్ కూడా హర్షవర్ధన్‌కు మరో పెడ్లర్‌గా వ్యవహరిస్తున్నాడు. అలాగే డ్రగ్స్ సప్లయిర్ అయిన చెన్నైవాసి బి. శ్రీనివాస రాహుల్‌ను కొన్నేళ్ల క్రితం పరిచయం చేసుకున్న అభిషేక్ అతన్నుంచి డ్రగ్స్ కొని విక్రయిస్తున్నాడు. ఈ దందాపై హెచ్–న్యూకు సమాచారం అందడంతో ఇన్‌స్పెక్టర్ జీఎస్ డానియేల్ నేతృత్వంలో ఎస్సై సి.వెంకట రాములు, నల్లకుంట ఇన్‌స్పెక్టర్ బి.జగదీశ్వర్‌రావు తమ బృందాలతో వలపన్ని హర్షవర్ధన్, రాహుల్, ధావల్, అభిషేక్‌లను నగరంలో పట్టుకున్నారు. రాహుల్ చెన్నైతోపాటు బెంగళూరు, హైదరాబాద్‌లోని కస్టమర్లకు డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు తేలింది. ఈ కేసును తదుపరి చర్యల నిమిత్తం నల్లకుంట పోలీసులకు అప్పగించారు.

పోలీసుల నిఘాకు చిక్కకుండా సరఫరా...

థాయ్‌లాండ్ నుంచి ఓడల ద్వారా డ్రగ్స్ భారత్‌లోకి.. అక్కడి నుంచి జబల్‌పూర్‌లో ఉంటున్న హర్షవర్ధన్ వద్దకు చేరుతున్నాయి. అతను వినియోగదారుడికి కొరియర్ సంస్థల ద్వారా పంపుతున్నాడు. పోలీసుల నిఘాకు చిక్కకుండా ఉండేందుకు పార్శిల్ బుక్ చేసేటప్పుడు చిరునామా, ఫోన్ నంబర్ ఇచ్చి ట్రాకింగ్ ఐడీని మాత్రం అభిషేక్ వంటి వినియోగదారులకు పంపుతున్నాడు. ఆ పార్శిల్ కొరియర్ ఆఫీసుకు చేరగానే అక్కడకు వెళ్లి వారు తీసుకొనేవారు. హ్యాండ్లర్ నుంచి డ్రగ్స్‌ను ఔన్స్ (28.34 గ్రాములు)కు రూ. 15 వేల నుంచి రూ. 25 వేల వరకు క్రిప్టో కరెన్సీ రూపంలో చెల్లించి తెప్పించుకొని వినియోగదారులకు ఔన్స్‌కు రూ. 25 వేల నుంచి రూ. 35 వేల మధ్య విక్రయిస్తున్నారు.

విద్యుత్ చార్జీలు పెరగవు

- ప్రస్తుత చార్జీలే కొనసాగింపు..వార్షిక టారిఫ్ ఉత్తర్వులు జారీ
- ఈఆర్సీ చైర్మన్ జస్టిస్ నాగార్జున్ ప్రకటన

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025–26లో రాష్ట్రంలో ఎలాంటి విద్యుత్ చార్జీలు పెంచడం లేదని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్ ప్రకటించారు. దక్షిణ/ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్/ టీజీఎన్పీడీసీఎల్)లు, సిరిసిల్ల కోఆపరేటివ్ ఎలక్ట్రికల్ సప్లై సొసైటీ(సెస్)లు 2025–26లో మొత్తం రూ.65,849.74 కోట్ల ఆదాయ అవసరాలుంటాయని ప్రతిపాదించగా, తాము శాస్త్రీయ పద్ధతిలో లెక్కించి రూ.58,628.09 కోట్లకు తగ్గించి ఆమోదించామన్నారు. ప్రస్తుత విద్యుత్ చార్జీలతో రూ.45,710.05 కోట్ల ఆదాయం మాత్రమే రానుండడంతో రూ.13,499.41 కోట్ల ఆదాయ లోటును ఎదుర్కోనున్నాయని నిర్ధారించామన్నారు. ఆ మేరకు విద్యుత్ సబ్సిడీలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమ్మతి తెలపడంతో విద్యుత్ చార్జీలు పెంచడం లేదన్నారు. గతేడాదితో పోల్చితే విద్యుత్ సబ్సిడీ రూ.1999.89 కోట్లు(17.4శాతం) పెరిగిందని చెప్పారు. మంగళవారం ఈఆర్సీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వార్షిక విద్యుత్ టారిఫ్ ఉత్తర్వులు 2025–26లను ప్రకటించారు. మే 1 నుంచి అమల్లోకి వస్తుందన్నారు. రాష్ట్రంలో గత మార్చి 28న రికార్డు స్థాయిలో 17,162 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ ఏర్పడిందని, రాష్ట్రం ప్రగతి బాటలో ఉందనడానికి ఇది నిదర్శనమని జస్టిస్ దేవరాజు నాగార్జున్ అన్నారు.

పరిహారం పెంపుపై త్వరలో నిర్ణయం...

ట్రాన్స్‌ఫార్మర్లకు సకాలంలో మరమ్మతులు చేయడం లేదని, విద్యుదాఘాతంతో రైతులు, యువకులు మృత్యువాత పడుతున్నారని పెద్ద మొత్తంలో ఫిర్యాదులు వచ్చాయని జస్టిస్ దేవరాజు నాగార్జున్ అన్నారు. మృతులకు రూ.5 లక్షల పరిహారం ఇస్తుండగా, పెంచాలని వచ్చిన విజ్ఞప్తులపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు.




చార్జీలు పెంచడమే పరిష్కారం: ఈఆర్సీ చైర్మన్

డిస్కంల ఆర్థిక పరిస్థితి ఏమాత్రం బాగా లేదని, తెలంగాణ ఏర్పడిన నాటి నుంచే సంక్షోభంలో ఉన్నాయని జస్టిస్ నాగార్జున్ అన్నారు. ప్రభుత్వం ఎంత సబ్సిడీ ఇచ్చేందుకు ముందుకొస్తే ఆ మేరకు ఈఆర్సీ డిస్కంల ఆదాయ లోటును తగ్గించి చూపుతోందని అనడంలో వాస్తవం లేదన్నారు. ఎంత ఆదాయలోటు ఉందో ఈఆర్సీ నిర్ధారించాక ఆ మేరకు సబ్సిడీ ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. ఈఆర్సీ ఆమోదించిన ఆదాయలోటు అంచనాలతో పోల్చితే వాస్తవ ఆదాయ లోటు అధికంగా ఉండడంతో డిస్కంలు నష్టాలను మూటగట్టుకుంటున్నాయని, ఏటేటా నష్టాలు పేరుకుపోయి సంక్షోభంలో కూరుకుంటున్నాయని విలేకరులు ప్రశ్నించగా, విద్యుత్ చార్జీలు పెంచడం లేదా ప్రభుత్వ సబ్సిడీలు పెంచడమే దీనికి పరిష్కారమని బదులిచ్చారు.

'గర్భంలోని పిండానికీ జీవించే హక్కు'

సాక్షి, హైదరాబాద్: గర్భంలోని పిండానికి కూడా జీవించే హక్కు ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. భర్త చేయిస్తున్న చికిత్సతో తమ కుమార్తె ప్రాణాలకు ముప్పుందన్న తల్లిదండ్రుల ఆరోపణల నేపథ్యంలో గర్భిణైన కూతురికి, ఆమె కుమారుడి (2)కి వైద్య పరీక్షలు నిర్వహించాలని మహిళా శిశు సంక్షేమ శాఖను హైకోర్టు ఆదేశించింది. తమ కుమార్తెకు మానసిక వైద్యం అందించే విషయంలో సందేహాన్ని వ్యక్తం చేస్తూ మియాపూర్ పోలీసులకు ఇచ్చిన వినతిపత్రంపై చర్యలు తీసుకునేలా ఆదేశాలివ్వాలని గుంటూరుకు చెందిన శ్రీనివాసరావు దంపతులు పిటిషన్ వేశారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. కుమార్తె ఇంటికి వెళ్లి పరిశీలించి ఆరోగ్య పరిస్థితిపై నివేదిక అందజేయాలని హైకోర్టు న్యాయ సేవాధికార సంస్థను ఆదేశించింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ వినోద్ కుమార్ మంగళవారం విచారణ చేపట్టారు. గర్భిణి అయిన పిటిషనర్ కుమార్తె ఇంటికి కార్యదర్శి వెళ్లి వాస్తవాలను పరిశీలన చేసి ఇచ్చిన నివేదిక అందజేశారు. ఈ నివేదికను పరిశీలించిన న్యాయమూర్తి.. గర్భిణి, ఆమె గర్భంలోని పిండం బాగానే ఉన్నాయని, గర్భంలోని పిండానికి జీవించే హక్కు ఉందన్నారు. ఆమెకు భద్రత కల్పించాలని పోలీసులను ఆదేశించారు.



మే 31 వరకు 'కాళేశ్వరం' కమిషన్ గడువు పొడిగింపు

ఎన్డీఎస్ఏ నివేదిక సమర్పించాలని ఈఎన్సీకి కమిషన్ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌ల నిర్మాణంలో జరిగిన అవకతవకలపై విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ గడువు ఈ నెలాఖరుతో ముగియనుండగా, మే 31 వరకు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలా ఉండగా, నీటిపారుదల శాఖ ఈఎన్సీ(జనరల్) జి.అనిల్‌కుమార్‌ను కమిషన్ మంగళవారం పిలిపించుకొని మాట్లాడింది. కాళేశ్వరం బరాజ్‌ల వైఫల్యాలపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సమర్పించిన తుది నివేదికను తమకు సమర్పించాలని ఆదేశించింది.

మే 2న ఎన్డీఎస్ఏ నివేదికపై సీఎం సమీక్ష

కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌ల వైఫల్యాలపై ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ సమర్పించిన తుది నివేదికపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మే 2న జలసౌధలో సమీక్షించనున్నారు.

మళ్లీ రిటైర్డ్ ఇంజనీర్లకు పోస్టింగ్స్...

నీటిపారుదలశాఖ నాగర్‌కర్నూల్ ఎస్ఈగా, ఈఎన్సీ(ఓఅండ్ ఎం)గా అదనపు బాధ్యతల్లో గత మార్చి 31న ఉద్యోగ విరమణ చేసిన జి.విజయ భాస్కర్‌రెడ్డిని మళ్లీ నాగర్‌కర్నూల్ ఎస్ఈగా ప్రభుత్వం పునర్నియమించింది. సీఈగా సైతం ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఎస్ఈగా ఉద్యోగ విరమణ చేసిన భీమ్‌ప్రసాద్‌ను మంత్రి ఉత్తమ్‌కు ఓఎస్డీగా నియమించింది.

పదవీకాలం పొడిగింపు రద్దు చేయాలి

మిషన్ భగీరథ ఈఎన్సీ కృపాకర్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఈఎన్సీ కనకరత్నం, నీటిపారుదల శాఖలో ఎస్ఈ విజయభాస్కర్ రెడ్డి పదవీకాలాన్ని పొడించడంపై ఇంజనీర్ల సంఘాలు మండిపడ్డాయి. సీఎం రేవంత్ రెడ్డి హామీకి విరుద్ధంగా ఇచ్చిన ఈ ఉత్తర్వులను రద్దు చేయాలని తెలంగాణ ఇరిగేషన్ గ్రాడ్యుయేట్ ఇంజనీర్ల సంఘం, హైదరాబాద్ ఇంజనీర్ల సంఘం, తెలంగాణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల సంఘం, ఇరిగేషన్ డిప్లొమా ఇంజనీర్ల సంఘం వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశాయి.

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 38

బుధవారం 30-4-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రాజెక్టులు పూర్తి చేసి శాశ్వత వనరుల ద్వారా రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలి'



నైట్‌రైడర్స్ గెలుపుబాట

ఢిల్లీపై 14 పరుగులతో కోల్‌కతా విజయం. రాణించిన నరైన్ -15లో



ఆడించండి.. చదివించండి..

వేసవి సెలవులు వచ్చేశాయి.. పిల్లల్ని పుస్తకాలకు దగ్గరగా తీసుకెళ్లాలి -14లో

52వ సీజేఐగా జస్టిస్ గవాయ్



కేంద్ర న్యాయ శాఖ నోటిఫికేషన్

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు 52వ ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)గా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ నియమితులయ్యారు. ఆయన నియామకానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోద ముద్ర వేశారు. ఈ మేరకు కేంద్ర న్యాయ శాఖ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. నూతన సీజేఐగా జస్టిస్ గవాయ్ వచ్చే నెల 14వ తేదీన బాధ్యతలు స్వీకరిస్తారు. సుప్రీంకోర్టులో రెండో దళిత

మిగతా 2వ పేజీలో ▶

● రేపు అంతర్జాతీయ కార్మిక దినోత్సవం

వేతన యాతన!



కేంద్రం కనీస వేతనాన్ని రూ. 21 వేలుగా ఖరారు చేసినా తెలుగు రాష్ట్రాల్లో అమలుకాని వైనం

నిబంధనల ప్రకారం ఐదేళ్లకోసారి సవరణ జరగాల్సి ఉన్నా 11 ఏళ్లుగా కార్యాచరణ శూన్యం

ఉమ్మడి రాష్ట్రంలో 2006-12 మధ్య నిర్ణయించినకనీస వేతన ఉత్తర్వులే నేటికీ కొనసాగింపు

తెలంగాణలో 73 ఉపాధి రంగాల్లో ఐదింటికి జీఓలిచ్చినా ఫలితం నిల్.. మరో 12 ప్రతిపాదనలకే పరిమితం

కొత్త ప్రభుత్వం అన్ని ఉపాధి రంగాలకూ నోటిఫికేషన్లు ఇవ్వడంతో మళ్లీ మొదటికొచ్చిన వ్యవహారం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అసంఘటిత రంగ కార్మికుల కనీస వేతన సవరణ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఒక్కసారి కూడా కనీస వేతన సవరణ జరగలేదు. ఐదేళ్లకోసారి తప్పనిసరిగా కనీస వేతన సవరణను ఖరారు చేయాలని కార్మిక చట్టాల్లో ఉన్నప్పటికీ 11 ఏళ్లుగా ఆ దిశగా ప్రభుత్వాలు కసరత్తు చేయలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2006 నుంచి 2012 మధ్య ఇచ్చిన వేతన సవరణ ఉత్తర్వులే ఇప్పటికీ దిక్కయ్యాయి. ఆ ఉత్తర్వుల ప్రకారం వివిధ ఉపాధి రంగాల్లో కనీస వేతనం రూ. 3,370 నుంచి రూ. 5,138 మధ్య ఉంది. రాష్ట్రంలో 73 ఉపాధి రంగాలు ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించగా వాటిలో దాదాపు 1.27 కోట్ల మంది కార్మికులు పనిచేస్తున్నారు. వారిలో 38 లక్షల మంది మహిళలు ఉన్నట్లు రాష్ట్ర కార్మిక శాఖ గణాంకాలు చెబుతున్నాయి. పెరుగుతున్న జీవన ప్రమాణాలు, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఐదేళ్లకోసారి ప్రభుత్వ ఉద్యోగులకు

మిగతా 2వ పేజీలో ▶

అసంఘటిత రంగ కార్మికుల కనీస వేతన సవరణకు పడని ముందడుగు

అన్‌స్కిల్డ్ కార్మికుడైన నర్సింహ 20 ఏళ్లుగా ఓ ప్రైవేటు నిర్మాణ సంస్థలో పనిచేస్తున్నాడు. ఉమ్మడి రాష్ట్రంలో 2007లో ఈ రంగానికి సంబంధించి జరిగిన వేతన సవరణ ప్రకారం ఆయన నెలవారీ కనీస వేతనంరూ. 3,370గా ఖరారైంది. ఆ నిబంధనల ప్రకారం ప్రస్తుతం నర్సింహ అందుకుంటున్న వేతనం రూ. 12,420 మాత్రమే. వాస్తవానికి తెలంగాణ రాష్ట్రంలో రెండో కనీస వేతన సవరణ సలహా బోర్డు సిఫార్సుకు అనుగుణంగా ప్రభుత్వం జారీ చేసిన జీఓ 22 ప్రకారం నర్సింహ నెలవారీ కనీస వేతనం రూ. 23,275గా ఉండాలి. కానీ ఆ జీఓను గెజిట్‌లో ప్రచురించకపోవడం వల్ల ఆయన ఏకంగా రూ. 10,855 తక్కువ వేతనం పొందుతున్నాడు.

ప్రతిష్టాత్మకంగా 'మిస్ వరల్డ్'

ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం



- నిర్వహణలో లోటుపాట్లు ఉండొద్దని స్పష్టీకరణ
- అదనపు డీజీ ర్యాంకు అధికారి ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లు
- పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తం
- 2017లో ఇవాంకా ట్రంప్ హైదరాబాద్ పర్యటనలో విధులు చేపట్టిన వారి సేవలూ వినియోగం

12లో


'కాళేశ్వరం' బాధ్యుల్ని వదిలిపెట్టం



- నీటిపారుదల మంత్రి ఉత్తమ్
- అతిపెద్ద మానవ నిర్మిత వైపరీత్యం కాళేశ్వరం ప్రాజెక్టు అని ఎన్డీఎస్‌ఏ తేల్చింది
- ఎన్డీఎస్‌ఏ నివేదికపై త్వరలో కేబినెట్‌లో చర్చిస్తాం
- తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ పనులు త్వరలో ప్రారంభిస్తాం

13లో

ఎన్డీఎస్‌ఏ నివేదిక రాజకీయ ప్రేరేపిత చర్య



- ఆ నివేదికను అడ్డుపెట్టుకుని ఉత్తమ్ రాజకీయం చేస్తున్నారు
- మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజం
- ఎన్డీఎస్‌ఏ బిల్లును గతంలో ఉత్తమ్ వ్యతిరేకించారు..
- 'మేడిగడ్డ'లో అవినీతి జరిగిందని నివేదికలో చెప్పకున్నా బురద చల్లేందుకు యత్నం

13లో

క్లుప్తంగా...

గణేశశర్మ అభిషేక వేడుక గర్వకారణం

కంచి కామకోటి పీఠాధిపతికి సీఎం అభినందన లేఖ



సాక్షి, హైదరాబాద్: అక్షయ తృతీయ రోజున.. కంచి కామకోటి పీఠం 71వ ఆచార్యునిగా శ్రీదుడ్డు సత్య వెంకట సూర్య సుబ్రహ్మణ్య గణేశ శర్మ అభిషేక వేడుక జరగనున్న సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. రుగ్వేద పండితునిగా బాసరలోని జ్ఞాన సరస్వతి దేవికి, తెలంగాణ ప్రాంతానికి గణేశ శర్మ ఎనలేని సేవ చేశారని సీఎం మంగళవారం కంచి కామకోటి పీఠాధిపతికి రాసిన లేఖలో పేర్కొన్నారు. బాసర అమ్మవారికి అమూల్య సేవలందించిన గణేశ శర్మ.. 71వ ఆచార్యునిగా కంచి కామకోటి పీఠానికి సేవలందించేందుకు జరుగుతున్న ఈ అభిషేక వేడుక.. తెలంగాణ ప్రజలందరికీ సంతోషకరమని, గర్వకారణమని తెలిపారు.

ఉపాధి ఆధారిత సాంకేతిక కోర్సుల్లో ఉచిత శిక్షణ

స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థ డైరెక్టర్ లక్ష్మి


భూదాన్ పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పురంలోని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో మేధా చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో 6 నెలల కాలవ్యవధి కలిగిన ఉపాధి ఆధారిత సాంకేతిక కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్ (డొమెస్టిక్), సోలార్‌సిస్టమ్ ఇన్‌స్టాలేషన్ అండ్ సర్వీస్ కోర్సుకు ఐటీఐ లేదా ఏదేని డిప్లొమా పాసై ఉండాలన్నారు. కంప్యూటర్ హార్డ్‌వేర్, సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్ అండ్ సీసీ టీవీ టెక్నీషియన్ కోర్సుకు పదవ తరగతి విద్యార్హత కలిగి ఉండాలన్నారు. టైలరింగ్ ఎంబ్రాయిడరీ, జర్దోజీ క్విల్ట్ బ్యాగుల తయారీ కోర్సుకు మాత్రం 8వ తరగతి పాసైన వారు అర్హులని తెలిపారు. ఉచిత భోజనంతో కూడిన హాస్టల్ వసతి ఉంటుందని, శిక్షణ పూర్తి చేసుకొన్న అభ్యర్థులకు ఉద్యోగం కూడా కల్పిస్తామని చెప్పారు. అభ్యర్థులు 18 నుంచి 25 ఏళ్ల వయసు కలిగి ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు మే 7న సంస్థలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని, వివరాలకు 9133908000, 9133908111 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఇదండీ సంగతి



మన రాష్ట్రంలో వీధి వీధికి బెల్ట్‌షాపులు తొలగించాలి సార్!

విద్యా రుణం.. నిబంధనలు శరాఘాతం



తల్లిదండ్రులు డిఫాల్టర్స్ అయితే రుణం కష్టమే

ఈ విధానంలోనే పలు బ్యాంకుల నిబంధనలు

పీఎం విద్యాలక్ష్మి స్కీమ్ లక్ష్యం నీరుగారే పరిస్థితి

ఎన్‌బీఎఫ్‌సీల్లో మాత్రం రెట్టింపు రుణాలు

విద్యా రుణం (ఎడ్యుకేషన్ లోన్).. ఉన్నత విద్య చదవాలన్న ఆసక్తి ఉన్నా, స్తోమత లేని వారి పాలిట వరం. విదేశీ విద్యకు, ఆయా కోర్సులకు ఉండే రూ. లక్షల్లో ఫీజులు సొంతంగా చెల్లించలేని పరిస్థితుల్లో విద్యా రుణానికి దరఖాస్తు చేసుకుంటున్నారు. ఆ రుణం మంజూరు అయితే తమ కలల చదువు పూర్తి చేసుకుని.. లక్షల్లో జీతాలొచ్చే ఉద్యోగాల్లో స్థిరపడవచ్చని. లేదంటే సొంతంగా స్టార్టప్స్ వంటివి ప్రారంభించవచ్చనే ఆలోచనతో అడుగులు వేస్తున్నారు.

కానీ.. ఈ ఆలోచనలకు, ఆశలకు భిన్నంగా బ్యాంకుల నిబంధనలు విద్యార్థులకు శరాఘాతంగా మారుతున్నాయి. విద్యారుణాల మంజూరులో బ్యాంకులు పాటిస్తున్న నిబంధనలు విద్యార్థులను డిఫాల్టర్స్ (ఎగవేతదారుల) జాబితాలో చేరే పరిస్థితికి కారణమవుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం.. రుణ దరఖాస్తుకు కో- అప్లికెంట్ (సహ దరఖాస్తుదారు)గా తమ తల్లిదండ్రులను లేదా సంరక్షకులను పేర్కొనడమే.

- సాక్షి, స్పెషల్ డెస్క్

'డిఫాల్టర్స్'సమస్య

సాధారణంగా విద్యార్థులకు సొంత ఆదాయ వనరులు ఉండవు. ఈ క్రమంలో విద్యా రుణ దరఖాస్తు సమయంలో తల్లిదండ్రులను కో అప్లికెంట్స్‌గా పేర్కొంటున్నారు. కానీ తల్లిదండ్రులు అప్పటికే ఏదైనా వ్యక్తిగత రుణం, ఇతర రుణాలు తీసుకుని చెల్లించకపోతే వారితోపాటు, విద్యార్థులను కూడా డిఫాల్టర్స్ జాబితాలో చూపించేలా బ్యాంకులు వ్యవహరిస్తున్నాయని తల్లిదండ్రులు అంటున్నారు. అంతేకాదు, భవిష్యత్తులో విడతల వారీగా మంజూరు చేసే రుణ మొత్తాన్ని కూడా నిలిపివేస్తున్నాయి బ్యాంకులు. ఈ సమస్యను పలు బ్యాంకులు కొద్ది రోజుల కిందట రిజర్వ్ బ్యాంకు, కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాయి.

సహ రుణగ్రహీతగా పేరెంట్ లేదా గార్డియన్

ప్రస్తుతం అమల్లో ఉన్న మోడల్ ఎడ్యుకేషన్ లోన్ పథకం ప్రకారం.. రూ.7.5 లక్షల రుణం వరకు ఎలాంటి హామీ లేదా థర్డ్ పార్టీ గ్యారెంటీ అక్కర్లేదు. ఈ సందర్భంలో పేరెంట్ లేదా గార్డియన్‌ను సహ రుణ గ్రహీతగా పేర్కొంటున్నారు. ఇలాంటి సందర్భాల్లో రుణాలు మంజూరు చేసే ముందు.. బ్యాంకులు సహ రుణ గ్రహీతలు ఇతర లోన్స్ చెల్లింపులో విఫలమైతే.. ఆ కారణంగా విద్యార్థుల రుణ దరఖాస్తులను పక్కన పెట్టేస్తున్నాయి. ఒకవేళ విద్యా రుణం మంజూరు అయ్యాక పేరెంట్స్ వాటిని తిరిగి చెల్లించలేకపోతే విద్యార్థులనూ రుణ ఎగవేతదారులుగా పేర్కొంటున్న పరిస్థితి. ఇది భవిష్యత్తు రుణ దరఖాస్తుల ఆమోదంపై ప్రతికూల ప్రభావం చూపుతోంది.

ఆర్‌బీఐ నిబంధనలు కూడా..

ఆర్‌బీఐ ప్రస్తుత నిబంధనల ప్రకారం రుణాలను లోన్ అకౌంట్ ప్రాతిపదికగా కాకుండా వ్యక్తుల ప్రాతిపదికగా మంజూరు చేస్తున్నారు. దీంతో ఒక వ్యక్తి ఏదైనా ఒక లోన్ చెల్లింపులో విఫలమైతే ఇతర లోన్ అకౌంట్లను కూడా నిరర్థక ఆస్తుల జాబితాలో చేర్చుతున్నారు. అయితే ఇది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశమని, ఆర్‌బీఐ ఈ విషయంలో కొన్ని సడలింపులు ఇవ్వాలని బ్యాంకింగ్ వర్గాలు కోరుతున్నాయి. కానీ, ఆర్‌బీఐ నుంచి ఇంతవరకు ఎలాంటి సమాధానం రాలేదు.

ఎన్‌బీఎఫ్‌సీల్లో విద్యా రుణాలు

ప్రభుత్వ రంగ బ్యాంకులు విద్యా రుణాల విషయంలో కఠిన నిబంధనలు అమలు చేయడంతో దరఖాస్తుల మంజూరు సంఖ్య తక్కువగా ఉంది. కానీ ఉన్న నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల్లో (ఎన్‌బీఎఫ్‌సీ) మాత్రం విదేశీ విద్యా రుణాల్లో రుణాల మంజూరు గత అయిదేళ్లలో దాదాపు నూరు శాతం వృద్ధి నమోదు కావడం విశేషం. అంతేకాదు, రూ.15 లక్షల కంటే ఎక్కువ మొత్తంలో ఈ రుణాలు మంజూరయ్యాయి.

తెలుగు రాష్ట్రాల నుంచి ఎక్కువగానే

విద్యా రుణాల కోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఎక్కువ సంఖ్యలోనే దరఖాస్తులు వస్తున్నాయని ఒక ప్రభుత్వ రంగ బ్యాంకు రిటైల్ అసెట్ విభాగం జనరల్ మేనేజర్ సాక్షికి తెలిపారు. మొత్తం రుణ దరఖాస్తుల్లో దాదాపు 40 శాతం వరకు మనవాళ్లవే ఉంటున్నాయని.. దరఖాస్తుదారుల్లో 50 శాతం మేర రుణాలను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు.

'పీఎం విద్యాలక్ష్మి'ఆశలు నిరాశేనా?

దేశంలో ప్రతిభావంతులైన యువత ఉన్నత విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో కేంద్రం గత ఏడాది పీఎం విద్యాలక్ష్మి స్కీమ్ పేరిట విద్యారుణ పథకం ప్రవేశ పెట్టింది. 2024-25 నుంచి 2030-31 వరకు అమలు చేసే ఈ పథకం ద్వారా ఏటా 22 లక్షల మందికి ప్రయోజనం కల్పించాలన్నది లక్ష్యం. ఇందుకోసం రూ. 3,600 కోట్లు కేటాయించారు. రూ. 7.5 లక్షల వరకు రుణ మొత్తంలో 75 శాతం మొత్తానికి కేంద్ర ప్రభుత్వమే గ్యారెంటీగా ఉంటుందని గత ఏడాది బడ్జెట్‌లో పేర్కొన్నారు. కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షల లోపు ఉండి, ప్రభుత్వం నుంచి స్కాలర్‌షిప్స్, ఇతర ఆర్థిక ప్రోత్సాహకాలు పొందని విద్యార్థుల విషయంలో లోన్‌రీ పేమెంట్ మారటోరియం సమయంలో మూడు శాతం వడ్డీని కేంద్ర ప్రభుత్వం భరిస్తుంది. గరిష్ఠంగా రూ. 10 లక్షల రుణం వరకు ఈ సదుపాయాన్ని కల్పిస్తోంది. ఈ క్రమంలో డిసెంబర్ 2024 నాటికి 11.26 లక్షల క్రెడిట్ గ్యారెంటీలను అందించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. మరోవైపు 50,800 అకౌంట్లను నిర్ధరక ఆస్తులుగా గుర్తించారు. బ్యాంకుల నిబంధనలతో 'పీఎం విద్యా లక్ష్మి'ద్వారా రుణం కూడా కష్టమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పోర్టల్లోనూ సమస్యలు


- విద్యాలక్ష్మి పోర్టల్ పనితీరుపైనా విద్యార్థులు, తల్లిదండ్రులు పెదవి విరుస్తున్నారు. ఈ వెబ్‌సైట్‌లో లాగిన్ సమస్యలు, బ్యాంకులతో అనుసంధానమయ్యే సాంకేతిక ప్రక్రియలో ఇబ్బందులు, ఆన్‌లైన్ దరఖాస్తు పూర్తి చేస్తున్న సమయంలో సర్వర్ డౌన్ అవడం వంటి కారణాలతో దరఖాస్తుల సంఖ్య, మంజూరు సంఖ్య మధ్య ఎంతో వ్యత్యాసం ఉంటోంది.
- 2025 ఏప్రిల్ నెల గణాంకాలను పరిశీలిస్తే.. ఎస్‌బీఐకి 1,125 దరఖాస్తులకు గాను 20 దరఖాస్తులకు; కెనరా బ్యాంకులో 483కు గాను 24కి; బ్యాంక్ ఆఫ్ బరోడాలో 342కు గాను 19 దరఖాస్తులకు; పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో 304కుగాను 28కి; యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 212 దరఖాస్తులకుగాను 16 దరఖాస్తులకే రుణాలు మంజూరు అయ్యాయి.
- మొత్తమ్మీద.. విద్యా రుణాల మంజూరు విషయంలో తల్లిదండ్రుల వ్యక్తిగత ఆర్థిక స్తోమత నుంచి ఇతర సాంకేతిక అంశాల వరకు పలు అంశాల్లో నిబంధనలను సరళీకృతం చేయాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో విద్యా రుణాలు

ఆర్థిక సంవత్సరం	అకౌంట్ల సంఖ్య	మంజూరు చేసింది (రూ.కోట్లలో)
2019-20	6,11,933	15,282
2020-21	4,07,395	11,558
2021-22	4,56,703	16,183
2022-23	6,29,594	24,997
2023-24	7,36,580	28,699

ఆధారం : రిజర్వ్ బ్యాంకు

2019 - 2024 మధ్యలో ఆర్థిక సంవత్సరాల వారీగా ఎన్‌బీఎఫ్‌సీల్లో రూ. 15 లక్షల కంటే ఎక్కువ మొత్తంలో మంజూరైన విద్యా రుణాలు



తీర్పు వచ్చేవరకు పదోన్నతులొద్దు: హైకోర్టు

విద్యుత్ సంస్థల్లో పదోన్నతులపై ప్రభుత్వానికి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విద్యుత్ సంస్థలకు సంబంధించిన కేసుల్లో తీర్పు వెలువరించే వరకు పదోన్నతులను నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేస్తూ.. విచారణను జూన్ 30కి వాయిదా వేసింది. రాష్ట్రం ఆవిర్భవించినప్పటి నుంచి విద్యుత్ సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పదోన్నతులను 8 వారాల్లో సమీక్షించి.. నష్టపోయిన బీసీ, ఓసీ ఉద్యోగులకు సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాల ప్రకారం పదోన్నతి కల్పించాలని తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.కుమారస్వామి, తెలంగాణ విద్యుత్ బీసీ, ఓసీ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ ముత్యం వెంకన్న గౌడ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. రివ్యూ పిటిషన్ విచారణ పూర్తయ్యే వరకు పదోన్నతులు చేపట్టవద్దని ఉత్తర్వులు జారీ చేశారు.

తెలంగాణ భవన్ స్పెషల్ సీఎస్‌గా శశాంక్ గోయల్

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి శశాంక్ గోయల్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇటీవల ఆయన్ను సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ వైస్ చైర్మన్‌గా, ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్‌గా బదిలీ చేయగా.. తాజాగా ఈ మేరకు పోస్టింగ్‌లో మార్పులు చేశారు.



మంగళవారం గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, డిప్యూటీ సీఎం మల్లు భట్టిలను మర్యాదపూర్వకంగా కలిసిన కాబోయే సీఎస్ రామకృష్ణారావు

నేడు ఒంటి గంటకు టెన్త్ ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: పదవ తరగతి పరీక్ష ఫలితాలు బుధవారం విడుదల కానున్నాయి. రవీంద్రభారతి వేదికగా మధ్యాహ్నం ఒంటిగంటకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫలితాలను విడుదల చేస్తారని పరీక్షల విభాగం నియంత్రాధికారి కృష్ణారావు మంగళవారం తెలిపారు. టెన్త్ పరీక్షలు మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు జరిగాయి. ఈ పరీక్షలకు 5,09,403 మంది దరఖాస్తు చేయగా, వీరిలో 4.9 లక్షల మంది పరీక్ష రాశారు. ఈసారి మార్కుల మెమోలో మార్పులు చేశారు. గ్రేడింగ్‌తోపాటు, మార్కులు కూడా ఇస్తున్నారు. ఫలితాల వెల్లడి తర్వాత నెల రోజుల్లో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించే వీలుందని అధికారులు తెలిపారు. ఫలితాలను వేగంగా అందించేందుకు సాక్షి యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. www.sakshieducation.comకు లాగిన్ అయి ఫలితాలు వేగంగా పొందవచ్చు.

52వ సీజేఐగా జస్టిస్ గవాయ్

▶ మొదటి పేజీ తరువాయి

ప్రధాన న్యాయమూర్తిగా రికార్డుకెక్కబోతున్నారు. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా వచ్చే నెల 13న పదవీ విరమణ చేయబోతున్నారు. జస్టిస్ గవాయ్ ఆరు నెలలపాటు పదవిలో కొనసాగుతారు. ఈ ఏడాది డిసెంబర్ 23న పదవీ విరమణ చేస్తారు. ఆయన 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. జస్టిస్ గవాయ్ తండ్రి, దివంగత ఆర్ఎస్ గవాయ్ బిహార్, కేరళ గవర్నర్‌గా సేవలందించారు. ప్రముఖ సామాజిక కార్యకర్తగా పేరు ప్రఖ్యాతలు పొందారు.

వేతన యాతన!

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వం వేతన స్థిరీకరణ చేస్తుంది. అదే తరహాలో అసంఘటితరంగ కార్మికుల వేతన సవరణను కూడా ఐదేళ్లకోసారి చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియలో రాష్ట్ర స్థాయిలోని కార్మిక వేతన సలహా బోర్డు పాత్ర కీలకం. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్కసారి కూడా వేతన సవరణ ప్రక్రియ కొలిక్కిరాలేదు.

కొత్త రాష్ట్రంలో నాలుగు బోర్డులు...

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత నాలుగు కనీస వేతన సవరణ సలహా బోర్డులు ఏర్పాటయ్యాయి. మొదటి సలహా బోర్డు 2014 నవంబర్‌లో ఏర్పాటై 2016 నవంబర్‌తో ముగిసింది. రెండో బోర్డు 2016 డిసెంబర్ నుంచి 2018 డిసెంబర్ వరకు కొనసాగాల్సి ఉంది. కానీ తదుపరి బోర్డు ఏర్పాటులో జాప్యంతో 2021 ఫిబ్రవరి కొనసాగింది. ఈ కాలంలో మొత్తం ఆరుసార్లు సమావేశమైంది. ఆ తర్వాత మూడో బోర్డును ప్రభుత్వం 2023 మేలో ఏర్పాటు చేసింది. అయితే 2023 డిసెంబర్‌లో ఏర్పాటైన కొత్త ప్రభుత్వం నామినేటెడ్ పదవులను రద్దు చేయడంతో ఆ బోర్డు రద్దయ్యింది. 2024 మార్చిలో నాలుగో బోర్డు చైర్మన్‌ను నియమించిన ప్రభుత్వం.. పూర్తిస్థాయి బోర్డును 2024 డిసెంబర్‌లో నియమించింది.

ఏయే బోర్డులు ఏం చేశాయి?

అసంఘటితరంగ కార్మికుల వేతన సవరణ కోసం రాష్ట్రంలో ఏర్పాటైన మొదటి బోర్డు పలు దఫాల చర్చల అనంతరం అన్‌స్కిల్డ్ కార్మికుడి కనీస వేతనాన్ని రూ. 11,905.36 నుంచి రూ. 12,068.80 మధ్య ఉండేలా సిఫారసు చేసింది. మొత్తం 73 షెడ్యూల్డ్ రంగాలకుగాను 34 రంగాలకు ఈ వేతనాలను ఖరారుచేస్తూ కార్మిక శాఖకు ప్రతిపాదనలు పంపింది. ఇక రెండో బోర్డు.. మొదటి బోర్డు చేసిన సిఫార్సులను పునఃసమీక్షించి కేటగిరీలవారీగా వేతన సవరణ పూర్తిచేసి ప్రభుత్వానికి సిఫారసు చేసింది. అందులో 5 కేటగిరీలకు ప్రభుత్వం జీఓలు ఇచ్చినప్పటికీ వాటిని గెజిట్‌లో చేర్చలేదు. దీంతో మరో 12 కేటగిరీల ప్రతిపాదనలను పెండింగ్‌లో పెట్టింది. ఇక మిగిలిన 56 కేటగిరీల ప్రతిపాదనల ఊసేలేదు. ఆ తర్వాత ఏర్పాటైన మూడో బోర్డు ప్రస్తుతమున్న ఏడు కార్మిక కేటగిరీలను నాలుగుకు కుదించేందుకు ప్రయత్నించింది. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో మూడో బోర్డు రద్దైంది. ప్రస్తుత నాలుగో బోర్డు పలు దఫాలు సమావేశమైనా ఇంకా నిర్ణయాలేవీ తీసుకోలేదు. ఈలోగా రేవంత్ ప్రభుత్వం గతేడాది మొత్తం 73 ఉపాధి రంగాలకూ కనీస వేతన సవరణ చేయాలని నిర్ణయిస్తూ ప్రిలిమినరీ నోటిఫికేషన్లు జారీ చేసింది. దీంతో కనీస వేతన సవరణ ప్రక్రియ మళ్లీ మొదటికొచ్చింది.

వేతన సవరణ లెక్క సూత్రం...

ఒక కార్మికుడి కుటుంబంలో నలుగురు సభ్యులుంటే అందులో కార్మికుడిని ఒక యూనిట్ విలువగా, కార్మికుని భార్యను 0.8 యూనిట్‌గా, ఇద్దరు పిల్లల్ని 0.6 చొప్పున నిర్ధారిస్తారు. లేబర్ మినిస్టర్స్ కాన్ఫరెన్స్ ఆమోదం ప్రకారం ఒక కార్మికుడు జీవించేందుకు అవసరమైన కేలరీలు 2,700. ఒక కుటుంబానికి ఏడాదికి కావాల్సిన వస్త్రం 72 గజాలు. ఇంటి అద్దె కింద 10 శాతం, పిల్లల చదువులు, వైద్యం, ఇతర ఖర్చులకు 20 శాతం చొప్పున లెక్కించి వేతన సవరణ చేయాలి. సవరణ సమయంలో నిత్యావసరాల ధరలు, మార్కెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలి.

శాస్త్రీయత పాటించకుంటే న్యాయ చిక్కులు



కార్మికుల కనీస వేతన సవరణ ప్రక్రియను చట్టప్రకారం చేయాలి. అక్రాయిడ్ ఫార్ములా ఆధారంగా గణించాలి. గత ప్రభుత్వ నిర్ణయాల కంటే మెరుగ్గా వేతన సవరణ చేస్తామని ఇప్పటి ప్రభుత్వం చెబుతున్నా అందుకు శాస్త్రీయత, క్రమపద్ధతి పాటించకుంటే న్యాయ చిక్కులు తప్పవు.

- ఎండీ యూసుఫ్, కనీస వేతన సలహా బోర్డు సభ్యుడు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు

దుర్భరంగా కార్మికుల జీవితాలు



తెలంగాణ ఏర్పాటు తర్వాత అసంఘటితరంగ కార్మికుల వేతన సవరణ కోసం చాలాసార్లు ప్రభుత్వానికి విన్నవించాం. అయినా వేతన సవరణ జరగకపోవడంతో కార్మికుల జీవితాలు దుర్భరంగా ఉన్నాయి. నిత్యావసరాల ధరలు భారీగా పెరిగినా కనీస వేతన సవరణపై ప్రభుత్వం దృష్టిపెట్టకపోవడం సరికాదు. కేంద్రం కనీస వేతనాన్ని రూ. 21 వేలకు ఖరారు చేసినా తెలుగు రాష్ట్రాల్లో అత్యంత తక్కువగా వేతనాలున్నాయి.

- సుంకరి మల్లేశం, ఈపీఎఫ్ఓ సీబీటీ మెంబర్, భారత్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు

ఇది శ్రమ దోపిడీయే



ప్రభుత్వం దశాబ్దన్నర కాలంగా వేతన సవరణ చేయకపోవడం కార్మికుల శ్రమను దోచుకోవడమే. మొత్తం 73 ఉపాధి రంగాలకు వేతనాలను సవరించాలని రెండో కార్మిక వేతన సవరణ సలహా బోర్డు 2021 ఫిబ్రవరి 3న రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తే అందులో 5 ఉపాధి రంగాలకు తుది ఉత్తర్వులు వెలువడ్డా గెజిట్‌లో ప్రచురించకపోవడం, మిగిలిన ఉపాధి రంగాలకు జీఓలు ఇవ్వకపోవడంతో కార్మికులు నష్టపోతున్నారు.

- దేవసాని భిక్షపతి, కనీస వేతన సలహా బోర్డు మాజీ సభ్యుడు, ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి

కెమిస్ట్రీలో మూలకాలు.. ఫిజిక్స్‌లో థర్మోడైనమిక్స్

- ఈఏపీ సెట్‌లో ఎక్కువ ప్రశ్నలు వీటి నుంచే..
- తేలికగా జవాబులు ఇచ్చామన్న విద్యార్థులు
- తొలిరోజు ప్రశాంతంగా అగ్రి, ఫార్మా పరీక్ష


హైదరాబాద్ షేక్‌పేట్‌లోని ఓ పరీక్ష కేంద్రం వద్ద..

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఈఏపీసెట్) మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా మొదలైంది. తొలి రోజు అగ్రి, ఫార్మా సెట్ జరిగింది. ఈఏపీ సెట్‌పై ఎక్కువ మంది విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. బోటనీ, జువాలజీ పేపర్లలో ప్రశ్నలకు తేలికగా సమాధానాలు ఇవ్వగలిగామని చెప్పారు. కెమిస్ట్రీలో ఈసారి మూలకాల నుంచి ఎక్కువ ప్రశ్నలు వచ్చాయని తెలిపారు. ఆర్గానిక్ కెమిస్ట్రీపై పట్టు ఉన్న విద్యార్థులు చాలా ప్రశ్నలకు తేలికగా సమాధానాలు ఇవ్వగలిగారు. ఫిజిక్స్‌లో కొన్ని ప్రశ్నలు తేలికగా ఉంటే, మరికొన్ని మధ్యస్తంగా ఉన్నాయని తెలిపారు. మెకానిక్స్, థర్మోడైనమిక్స్ ప్రశ్నలు కొన్ని సంవత్సరాలుగా వస్తున్నవే ఇచ్చినట్టు తెలిపారు. అయితే కొన్ని ప్రశ్నలు తిప్పి ఇచ్చినట్టు చెప్పారు. మొత్తంగా రెండు సెషన్లలో పేపర్లు ఈజీగా ఉన్నట్లు తెలిపారు.

పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్ల పరిశీలన

ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి పేపర్ సెట్‌ను లాంఛనంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, జేఎన్‌టీయూహెచ్ వీసీ ప్రొఫెసర్ టి.కిషన్‌కుమార్ రెడ్డి, ఈఏపీ సెట్ కన్వీనర్ దీన్‌కుమార్, కో కన్వీనర్, యూనివర్సిటీ రెక్టార్ డాక్టర్ విజయకుమార్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలకు వెళ్లిన అధికారులు ఏర్పాట్లు పరిశీలించారు. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ఉదయం, సాయంత్రం రెండు షిఫ్టుల్లో పరీక్ష నిర్వహిస్తున్నారు. తొలిరోజు ఉదయం షిఫ్టులో 28,834 మంది సెట్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకుంటే, వారిలో 26,741 మంది పరీక్ష రాశారు. సాయంత్రం షిఫ్టులో 28,830 మందికి స్లాట్ అలాట్ చేయగా, 26,964 మంది హాజరయ్యారు. మొత్తంగా ఉదయం 92 శాతం, సాయంత్రం 95 శాతం విద్యార్థులు పరీక్ష హాజరైనట్లు అధికారులు తెలిపారు.

ఎక్కువ మంది హైదరాబాద్ నుంచే

హైదరాబాద్‌లో నాలుగు జోన్లు ఏర్పాటు చేయగా, ఎక్కువ మంది ఈ ప్రాంతాల నుంచే దరఖాస్తు చేశారు. పరీక్ష హాజరు శాతం కనిష్టంగా 91.3 శాతం, గరిష్టంగా 95 శాతం నమోదైంది. జిల్లాల్లో పరీక్షకు దరఖాస్తు చేసింది తక్కువే అయినా ఎక్కువ మంది హాజరయ్యారు. ఆదిలాబాద్ జిల్లాలో ఉదయం 97 శాతం, సాయంత్రం 100 శాతం హాజరు నమోదైంది.

అన్నిచోట్లా హడావుడి

తొలి రోజున అన్నిచోట్లా హడావుడి కన్పించింది. పరీక్ష కేంద్రాలను ముందే చూసుకునేలా సెట్ అధికారులు ఈసారి క్యూఆర్ కోడ్ అందుబాటులో ఉంచారు. మరోవైపు బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు. దీంతో పరీక్ష కేంద్రాల వద్ద కొద్దిసేపు విద్యార్థులు ఒత్తిడికి గురయ్యారు. ఆదిలాబాద్ జిల్లాలో దూర ప్రాంతాల నుంచి వచ్చిన ఆరుగురు విద్యార్థులు ఆఖరి నిమిషంలో పరీక్ష కేంద్రానికి చేరుకుని టెన్షన్ పడ్డారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎక్కువ మంది విద్యార్థులు కంప్యూటర్లు సకాలంలో ఆన్ అవ్వలేదంటూ ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లోనూ పలుచోట్ల కొద్దిసేపు కంప్యూటర్లు మొరాయించినట్టు విద్యార్థులు తెలిపారు.



రియాక్టర్ పేలుడు ధాటికి కుప్పకూలిన 18 - ఏ బ్లాక్


సందీప్


దేవిచరణ్


కల్వల నరేష్

ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్‌లో భారీ పేలుడు

రియాక్టర్ పేలడంతో ముగ్గురు కార్మికులు మృతి

ఆరుగురికి తీవ్ర గాయాలు

లభించని ఇద్దరి మృతదేహాలు

మోటకొండూర్: యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ మండలం కాటేపల్లి గ్రామంలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ (పేలుడు పదార్థాలు) కంపెనీలో భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ముగ్గురు కార్మికులు మృతిచెందగా.. ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం సాయంత్రం 5 గంటల సమయంలో కంపెనీలోని బ్లాక్ 18–ఏలో ఉన్న రియాక్టర్ ఒక్కసారిగా పేలింది. ఈ సమయంలో అక్కడ నలుగురు కార్మికులు బుగ్గ లింగస్వామి, గునుగుంట్ల సందీప్(30), చెన్నోజి దేవిచరణ్ (22), బర్మల శ్రీకాంత్ పనిచేస్తున్నారు. పేలుడుతో సందీప్, దేవిచరణ్ మృతి చెందినట్లు యాదగిరిగుట్ట రూరల్ ఇన్‌స్పెక్టర్ కొండల్‌రావు తెలిపారు. కానీ వారి మృతదేహాలు మాత్రం బయ టపడలేదు. ఈ పేలుడు ప్రభావం ఆ పక్కనే ఉన్న బ్లాక్ 26–బీపై కూడా పడింది. దీంతో అక్కడ పని చేస్తున్న కార్మికుల్లో కల్వల నరేష్ (32), రాజబోయిన శ్రీకాంత్, సందా మహేందర్, ఎస్. మహేష్, ఎస్.మహేష్‌లకు తీవ్ర గాయాల య్యాయి. వారిని ఆస్పత్రికి తరలిస్తుండగా కల్వల నరేష్ మృతి చెందాడు. సందీప్, దేవిచరణ్‌ల మృతదేహాలు భవనం శిథిలాల కింద ఉన్నట్లు పోలీ సులు భావిస్తున్నారు. అగ్నిమాపక వాహనాలను రప్పించి శిథిలాలను తొలగిస్తున్నారు. ఘటన జరిగిన దాదాపు 3 గంటల తర్వాత అంబులెన్స్‌లు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. క్షతగాత్రులను మొదట భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్‌లోని యశోదా ఆస్పత్రికి తరలించారు. మృతులు, క్షతగాత్రులంతా యాదగిరిగుట్ట, ఆత్మకూరు, మోత్కూరు, మోటకొండూరు మండలా లకు చెందిన వారు. కాగా పేలుడు శబ్దం సుమారు ఆరు కిలోమీటర్ల దూరం వరకు వినిపించిందని స్థానికులు తెలిపారు.

బాధిత కుటుంబాల ఆందోళన

కంపెనీలో రక్షణ ప్రమాణాలు పాటించకుండా కార్మికుల ప్రాణాలను బలిగొన్నారంటూ బాధిత కుటుంబాల సభ్యులు, ఆయా గ్రామాల ప్రజలు, అన్ని పార్టీల నాయకులు కంపెనీ వద్ద ఆందోళనకు దిగా రు. రాత్రి 7.30 గంటలకు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సంఘటనా స్థలానికి చేరు కుని బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఘటనకు కంపెనీ యాజమాన్యం బాధ్యత వహించి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రతీ నియోజకవర్గంలో పారిశ్రామిక వాడలు

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు


శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, స్పీకర్ ప్రసాద్‌కుమార్, మహేందర్‌రెడ్డి

మోమిన్‌పేట: ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో పారిశ్రామిక వాడలు ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. మండల పరిధిలోని ఏన్కతల టీజీఐఐసీ పారిశ్రామిక పార్కు అభివృద్ధి పనులకు మంగళవారం శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏన్కతలలో టీజీఐఐసీకి సంబంధించిన 862 ఎకరాల్లో మొబిలిటీ వ్యాలీ కంపెనీలు రానున్నాయని తెలిపారు. ప్రస్తుతం రూ.44.30 కోట్లతో రోడ్లు, విద్యుత్ తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నామని, వచ్చే మూడేళ్లలో రూ.5 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయన్నారు. దీనివల్ల 10 వేల మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఎంఎస్ఎంఈ పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు యువత ముందుకొస్తే తప్పనిసరిగా అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చేవేళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తు తరాలకు పునరుత్పాదక

ఇంధన వనరులు అవసరం

విశాఖ సంస్థ ఆటమ్ ప్రాజెక్టుల ప్రారంభోత్సవంలో రాహుల్ గాంధీ


ఆటమ్ ప్రాజెక్టును ప్రారంభిస్తున్న రాహుల్‌గాంధీ

సాక్షి, న్యూఢిల్లీ: పునరుత్పాదక ఇంధన వనరులు భవిష్యత్తు తరాలకు ఎంతో అవసరమని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. విశాఖ ఇండస్ట్రీస్ రూపొందించిన ఆటమ్ సోలార్ రూఫ్–ఆటమ్ చార్జింగ్ స్టేషన్లు, ఆటమ్ ఈ–బైక్‌ను ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీలో మంగళవారం ఆయన అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. దేశంలో పునరుత్పాదక వినియోగాన్ని, గ్రీన్ మొబిలిటీ పరిష్కారాలను ఈ ప్రాజెక్టులు వేగవంతం చేసే దిశగా ఒక కీలక ముందడుగు అని ప్రశంసించారు. విశాఖ ఇండస్ట్రీస్ పర్యావరణ అనుకూలమైన, ఆవిష్కరణాత్మక దృష్టిని ప్రతిబింబిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమానికి చెన్నూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే గడ్డం వివేక్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ, అంబేడ్కర్ విద్యా సంస్థల కరస్పాండెంట్ గడ్డం సరోజ తదితరులు పాల్గొన్నారు.


ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్‌రావు పిటిషన్

ముందస్తు బెయిల్‌పై విచారణ నేటికి వాయిదా

సాక్షి, హైదరాబాద్: ఫోన్‌ట్యాపింగ్ కేసులో నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌లో విచారణ బుధవారానికి వాయిదా పడింది. అంతకుముందు ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ లూత్రా వాదనలు వినిపిస్తూ.. ఐపీఎస్ అధికారిగా పనిచేసిన ప్రభాకర్‌రావు వ్యవస్థను సొంత అవసరాలకు వినియోగించుకుని అపహాస్యం చేశారన్నారు. తనను అన్యాయంగా ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇరికించారని, అరెస్టు కాకుండా ముందస్తు బెయిల్ ఉత్తర్వులు జారీ చేయాలంటూ ప్రభాకర్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు మంగళవారం మరోసారి విచారణ చేపట్టారు. ఫోన్ ట్యాపింగ్ కేసు వెనుక ఎవరున్నారు? చట్టవిరుద్ధంగా పనులు ఎలా చేశారు? అధికారుల బృందాన్ని ఎలా వినియోగించుకున్నారు? ఇలాంటి వివరాలన్నీ తెలియాలంటే ప్రభాకర్‌రావు కస్టడీ తప్పనిసరి అని లూత్రా వాదించారు. అతని ఆదేశాల మేరకే ఇతర నిందితులు హార్డ్‌డిస్కులు, సెల్‌ఫోన్‌లు, సీసీటీవీ కెమెరాలను ధ్వంసం చేశారని, ప్రభాకర్‌రావును విచారిస్తే గానీ ఆధారాలు బహిర్గతం కావని చెప్పారు. కేసు నమోదు చేసిన ఇన్నాళ్లవుతున్నా ప్రభాకర్‌రావు భారత్ వచ్చి దర్యాప్తు సంస్థ ముందు హాజరు కావడానికి ప్రయత్నించలేదన్నారు. 2004, 2005, 2008లో ఇచ్చిన నివేదికను తీసుకొచ్చి గొంతు కేన్సర్, దంతాల ఇంప్లాంట్ సహా ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నట్లు చెబుతున్నారని, అలాంటి వ్యక్తి పదవీ విరమణ పొందిన తర్వాత కూడా ఎలా విధులు నిర్వహించారని ప్రశ్నించారు.

అజహరుద్దీన్ పేరును తొలగించవద్దు: హైకోర్టు

హెచ్‌సీఏకి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలోని నార్త్ స్టాండ్‌కున్న అజహరుద్దీన్ పేరును తొలగించవద్దని, ఎలాంటి కఠిన చర్యలు చేపట్టవద్దని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను వాయిదా వేసింది. రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలోని నార్త్ స్టాండ్‌కున్న అజహరుద్దీన్ పేరును తొలగించాలని హెచ్‌సీఏ అంబుడ్స్‌మన్ జస్టిస్ ఈశ్వరయ్య గత వారం ఆదేశాలు జారీ చేయడం తెలిసిందే. తన పేరును తొలగించడాన్ని సవాల్ చేస్తూ.. భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ అజహరుద్దీన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పదేళ్ల పాటు ఇండియన్ క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా, రెండు దశాబ్దాల పాటు క్రికెటర్‌గా దేశం తరఫున సేవలందించానని ఆయన గుర్తు చేశారు. అంబుడ్స్‌మన్ ఆదేశాలపై స్టే ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ పుల్ల కార్తీక్ మంగళవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తాము తదుపరి ఆదేశాలిచ్చే వరకు ఎలాంటి కఠిన చర్యలు చేపట్టవద్దని హెచ్‌సీఏను ఆదేశించారు.

ఆదర్శ గ్రామం గంగదేవిపల్లికి కరెంట్ కట్

- రూ.లక్ష వరకు పేరుకుపోయిన పంచాయతీ కరెంటు బిల్లు
- సమస్య తీర్చాలని డీపీఓకు గ్రామస్తుల వినతి


విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్న విద్యుత్ సిబ్బంది

గీసుకొండ: జాతీయ ఆదర్శగ్రామంగా ఎంపికైన వరంగల్ జిల్లా గీసుకొండ మండలం గంగదేవిపల్లిలో విద్యుత్ బిల్లు బకాయిలు చెల్లించడంలేదని ఆ శాఖ సిబ్బంది మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. గ్రామంలోని మినరల్ వాటర్ ప్లాంటుతోపాటు ఇతరత్రా అవసరాలకు వాడుకున్న విద్యుత్‌కు సంబంధించి గ్రామపంచాయతీ రూ.లక్ష వరకు బిల్లు బకాయి పడింది. దీంతో కరెంట్ బంద్ చేశామని విద్యుత్‌శాఖ సిబ్బంది తెలిపారు. మరోవైపు గ్రామ పంచాయతీ నుంచి బిల్లుల చెల్లింపు చెక్కులు ఎస్‌టీఓలో జమ చేసినా నిధుల ఫ్రీజింగ్ కారణంగా ఏడాది నుంచి బిల్లులు పాస్ కావడం లేదని, దీంతో చెక్కులను కాపులకనపర్తి ఏడీ తీసుకోవడం లేదని గ్రామపంచాయతీ అధికారులు చెబుతున్నారు. వేసవి కాలం కావడంతో గ్రామస్తులు తాగునీటి కోసం ఇబ్బందులు పడతారని, విద్యుత్‌ను వెంటనే పునరుద్ధరించాలని గ్రామ మాజీ సర్పంచ్ కూసం రాజమౌళి మంగళవారం డీపీఓకు వినతిపత్రం సమర్పించారు.

లా సెట్‌కు మెడిసిన్, ఇంజనీరింగ్

విద్యార్థులు అర్హులు

నేటితో ముగియనున్న లాసెట్ గడువు

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): లాసెట్–2025కు మెడిసిన్, ఇంజనీరింగ్ విద్యార్థులతో ఏదేని డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు కూడా అర్హులని టీఎస్ లాసెట్ కన్వీనర్ విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా దరఖాస్తుల స్వీకరణ గడువు బుధవారంతో ముగియనున్నట్లు పేర్కొన్నారు. ఇంత వరకు 46,880 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు లాసెట్ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని సూచించారు.

వచ్చే నెల 4న టీజీఈజేఏసీ సమావేశం

సాక్షి, హైదరాబాద్: పెండింగ్‌లో ఉన్న అన్ని డిమాండ్లను పరిష్కరించాలనే డిమాండ్‌తో వచ్చే నెల 4న తెలంగాణ ఉద్యోగులు జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసీ) ఉద్యోగ సదస్సు సమావేశం ఉంటుందని టీజీఈజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాస్‌రావు తెలిపారు. ఈ సమావేశాన్ని బాగ్‌లింగంపల్లి, సుందరయ్య విజ్ఞానం కేంద్రంలో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నామని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న డిమాండ్లు, షెడ్యూల్ ప్రోగ్రాం, ఇటీవల పరిణామాలపై చర్చించనున్నామని వెల్లడించారు.

'మునిసిపల్' పదోన్నతులు ఆపండి

మునిసిపల్ ఉద్యోగుల సంఘం నేతల డిమాండ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మునిసిపల్ కార్యాలయాలలో పనిచేస్తున్న మేనేజర్లు, రెవెన్యూ అధికారుల పదోన్నతుల విషయంలో జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దాలని, హైకోర్టు తీర్పు వెలువడే వరకు కేటగిరీ–3 మునిసిపల్ కమిషనర్ పదోన్నతులను ఆపాలని మునిసిపల్ ఉద్యోగుల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మంగళవారం సంఘం అధ్యక్షుడు జి. ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్ గోపాల్, అసోసియేట్ అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్ గౌడ్ సీడీఎంఏ కార్యాలయంలో డైరెక్టర్ శ్రీదేవితోపాటు సచివాలయంలో కార్యదర్శి సైదాను కలిసి వినతిపత్రం సమర్పించారు. హైకోర్టు కేసును జూన్ 24కు వాయిదా వేసిన నేపథ్యంలో ప్రస్తుతం జరపతలపెట్టిన మునిసిపల్ కమిషనర్ కేటగిరి–3 పదోన్నతులను నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. మునిసిపల్ ఉద్యోగుల పదోన్నతుల విషయంలో ప్రతిసారి సీనియారిటీ లిస్టును ప్రదర్శించాలని, ఎవరికి ఎప్పుడు పదోన్నతి వస్తుందనే విషయం అధికారులు తెలపాలని కోరారు. మునిసిపల్ డైరెక్టర్ కార్యాలయంలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న కొందరు అధికారులు ఉద్యోగుల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.



తెలంగాణ రాష్ట్ర పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన జస్టిస్ శివశంకర్‌రావు.



రాష్ట్ర మానవ హక్కుల సంఘం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన జస్టిస్ షమీమ్ అక్తర్.

పాస్‌బుక్ ఉంటే తహసీల్దార్.. లేదంటే ఆర్డీవోకు

- వారసత్వ హక్కుల బదలాయింపుపై రెవెన్యూ శాఖ స్పష్టత
- పాస్‌బుక్ ఉంటే తహసీల్దార్ స్థాయిలోనే పరిష్కారం
- పాస్‌బుక్ లేకపోతే తొలుత దరఖాస్తు చేసుకునేందుకే అవకాశం
- దరఖాస్తుపై తహసీల్దార్ నివేదిక మేరకు ఆర్డీవో అనుమతి



సాక్షి, హైదరాబాద్: భూభారతి చట్టం ద్వారా వారసత్వ హక్కుల బదలాయింపు (విరాసత్) విషయంలో రెవెన్యూ శాఖ స్పష్టతనిచ్చింది. విరాసత్ ప్రక్రియ పూర్తి చేసే విషయంలో అనుసరించాల్సిన నిబంధనలను పేర్కొంటూ అన్ని జిల్లాల కలెక్టర్లకు భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) కార్యాలయం సర్క్యులర్ పంపింది. ఈ సర్క్యులర్ ప్రకారం.. వారసత్వ హక్కుల బదిలీ కోరే సమయంలో ఆ భూమికి పాసు పుస్తకం ఉన్నట్టైతే తహసీల్దార్ స్థాయిలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. పాసు పుస్తకం లేని పక్షంలో తహసీల్దార్ నివేదిక మేరకు రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. సీసీఎల్ఏ పంపిన ఆర్‌వోఆర్/3069215/2025 సర్క్యులర్ ప్రకారం విరాసత్ ప్రక్రియను ఇలా పూర్తి చేయాల్సి ఉంటుంది.

పాసు పుస్తకం ఉంటే

- విరాసత్ ప్రక్రియ కోసం భూభారతి పోర్టల్ ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది.
- ఆపరేటర్ లాగిన్‌లో దరఖాస్తుదారుల బయోమెట్రిక్ తీసుకుని సదరు దరఖాస్తును తహశీల్దార్‌కు పంపుతారు.
- ఈ వారసత్వ హక్కుల బదిలీ కోసం సంబంధీకులకు తహసీల్దార్ నోటీసులు జారీ చేస్తారు. నోటీసు గడువు ముగిసిన అనంతరం ఆ దరఖాస్తును తహసీల్దార్ పరిశీలిస్తారు. సంబంధీకుల నుంచి అభ్యంతరాలు వచ్చి ఉంటే వాటిపై విచారణ జరుపుతారు. అన్నీ సక్రమంగా ఉంటే డిజిటల్ సిగ్నేచర్ అనంతరం మ్యుటేషన్ ప్రక్రియను తహసీల్దార్ పూర్తి చేస్తారు.

పాసు పుస్తకం లేకపోతే

- విరాసత్ ప్రక్రియ కోసం తొలుత భూభారతి పోర్టల్ ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన ఫీజును చెల్లించాల్సి ఉంటుంది.
- భూభారతి పోర్టల్ ద్వారా వచ్చిన విజ్ఞప్తి మేరకు ఆర్డీవో నోటీసులు ఇస్తారు. వీటిని తహసీల్దార్ ద్వారా సంబంధీకులకు పంపి అభ్యంతరాలను కోరతారు.
- నోటీసు గడువు ముగిసిన తర్వాత తహసీల్దార్ విచారణ జరిపి తన నివేదికను ఆర్డీవోకు పంపుతారు. ఈ నివేదిక ఆధారంగా సదరు విజ్ఞప్తిని ఆర్డీవో ఆమోదిస్తారు. ఒకవేళ ఆధారాలు సక్రమంగా లేకపోతే తిరస్కరిస్తారు. సదరు విజ్ఞప్తిని ఆమోదించేందుకు లేదంటే తిరస్కరించేందుకు గల కారణాలను కూడా తన ఉత్తర్వుల్లో ఆర్డీవో పేర్కొనాల్సి ఉంటుంది.
- సదరు విజ్ఞప్తిని ఆర్డీవో ఆమోదించిన పక్షంలో దరఖాస్తుదారులు స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది.
- అప్పుడు దరఖాస్తు ఆపరేటర్ లాగిన్‌కు వెళుతుంది. తర్వాత దరఖాస్తుదారుల బయోమెట్రిక్ వివరాలను తీసుకుంటారు.
- అనంతరం మళ్లీ సంబంధీకులకు నోటీసులు పంపి అభ్యంతరాలను కోరతారు. నోటీసు గడువు ముగిసిన అనంతరం ఈ అభ్యంతరాలను తహసీల్దార్ పరిశీలించి మరో మారు విచారిస్తారు.
- అప్పుడు అన్నీ సక్రమంగా ఉంటే డిజటల్ సిగ్నేచర్ చేసి తహసీల్దార్ మ్యుటేషన్ ప్రక్రియను పూర్తి చేస్తారు.

సాక్షి
బుధవారం, 30 ఏప్రిల్ 2025

కెనడాలో లిబరల్స్‌కు పట్టం

అనుకున్నట్టే అయింది. సోమవారం కెనడాలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో లిబరల్ పార్టీ మరోసారి విజయకేతనం ఎగరేయబోతున్నదని ఫలితాల సరళి తెలియజెబుతోంది. 343 స్థానాలున్న పార్లమెంటులో ఆ పార్టీకి పూర్తి స్థాయి మెజారిటీ వస్తుందా, లేక వేరే పార్టీల ఆసరా కావాల్సివస్తుందా అన్నది మరికొన్ని గంటల్లో తేలిపోతుంది. గత మూడేళ్లుగా అధికార లిబరల్ పార్టీ అసంతృప్తిని మూటగట్టుకుంది. ఈసారి దాని ఓటమి ఖాయమని అన్ని సర్వేలూ జోస్యం చెప్పాయి. మొన్న జనవరిలో సైతం కన్సర్వేటివ్‌ల కన్నా లిబరల్స్ 20 పాయింట్లు వెనకబడివున్నారు. ఈ దశలో అమెరికాలో డోనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడు కావటం, ఆయన మతిమాలిన ప్రకటనలు, ఎడాపెడా సుంకాల విధింపు లిబరల్ పార్టీకి వరంలా మారాయి. ఇతరేతర సమస్యలవీ మాయమై కెనడాను అమెరికా కబళిస్తుందన్న భయాందోళనలు ఆవహించి కన్సర్వేటివ్ పార్టీని కాదని జనం ఎప్పటిలా లిబరల్ పార్టీవైపే మొగ్గు చూపారు. ప్రధాని పదవి నుంచి జస్టిన్ ట్రూడో తప్పుకోవటం కూడా లిబరల్స్‌కు కలిసొచ్చింది. ఆయన స్థానంలో గత నెల మొదట్లో ప్రధానిగా వచ్చిన మార్క్ కార్నీ చకచకా చక్రం తిప్పారు. ట్రంప్‌తో సాన్నిహిత్యమున్న కన్సర్వేటివ్ పార్టీ వస్తే దేశాన్ని అమెరికా పాదాక్రాంతం చేయటం ఖాయమన్న ప్రచారం పనికొచ్చింది. కన్సర్వేటివ్ పార్టీ జాతకం తలకిందులైంది.

ప్రపంచ సంపన్న రాజ్యాల్లో ఒకటిగా, అమెరికా సన్నిహిత మిత్ర దేశంగా, వాణిజ్య భాగస్వామిగా దశాబ్దాలపాటు వెలుగులీనిన కెనడా కొన్నాళ్లుగా కష్టాల్లో కూరుకుపోయింది. అయిదేళ్ల నాడు విరుచుకుపడిన కోవిడ్ వల్ల ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైంది. జీవనవ్యయం అపారంగా పెరిగింది. నిరుద్యోగం తారస్థాయికి చేరింది. ఇళ్ల ధరలు ఆకాశాన్నంటాయి. నగరాల్లో అద్దెలు విపరీతంగా పెరగటంతో శివారు ప్రాంతాలకు జనం తరలిపోయారు. గృహ కొనుగోలుదారులు ఆ ఆలోచనను వాయిదా వేసుకున్నారు. ఇళ్లు లేని పౌరుల సంఖ్య పెరుగుతూ పోయింది. వీటన్నిటి పర్యవసానంగా పుట్టుకొచ్చిన సామాజిక అశాంతి మాదకద్రవ్యాల వాడకాన్ని ఊహించని స్థాయికి తీసుకెళ్లింది. దాంతోపాటే నేరాల సంఖ్య ఎక్కువైంది. నిజానికి ఇది కెనడాకు మాత్రమే పరిమితమైన సమస్య కాదు. సంపన్న దేశాలన్నీ ఈ మాదిరే సంక్షోభంలో కొట్టుమిట్టాడు తున్నాయి. కానీ కెనడా పౌరులు దీన్నంతటినీ లిబరల్ పార్టీ చేతగానితనంగా పరిగణించారు. గత మూడేళ్లుగా కన్సర్వేటివ్ పార్టీ నాయకుడు పియర్ పాయ్‌లేవ్ దేశం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం తమకే సాధ్యమని ప్రచారం చేశారు. ఆవరించిన ఈ సంక్షోభం బహుశా చాలా దేశాల మాదిరే కెనడాలో కూడా మితవాదపక్షాన్ని అందలం ఎక్కించివుండేది. కానీ ట్రంప్ అధిక సుంకాలు విధించటం, కెనడాను 51వ రాష్ట్రంగా విలీనం చేసుకోవటం ఖాయమని తరచు చెప్పటం కన్సర్వేటివ్‌ల ఆశల్ని అడియాసలు చేసింది. పౌరుల్లో ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. వారు గెలిస్తే అదే జరగొచ్చునన్న సంశయం బలపడింది. తమ సహజ వనరులు, ఆర్థిక సంపద దోచుకోవటానికి అమెరికా తహతహలాడుతున్నదని, దీన్ని నిలువరించగల పార్టీ లేకుంటే ట్రంప్ అన్నంతపనీ చేస్తారని వోటర్లు భావించారు.

ఇళ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యతనిచ్చి వాటి ధరలు దిగొచ్చేలా చేస్తామని రెండు ప్రధాన పక్షాలూ వాగ్దానం చేశాయి. కొత్త భవనాల నిర్మాణంపైవున్న ఆంక్షల్ని ఎత్తేస్తామని కన్సర్వేటివ్‌లు హామీ ఇస్తే... ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం అందిస్తామని కార్నీ వాగ్దానం చేశారు. అమెరికా నిజ స్వరూపం తెలిసింది గనుక ఇకపై భద్రతకు ఆ దేశంపై ఆధారపడకుండా సొంతంగా సైన్యాన్ని రూపొందించుకోవాలని రెండు పార్టీలూ ప్రతిపాదించాయి. అధిక సుంకాల విషయంలో కూడా ఆ రెండు పక్షాలదీ ఒకే మాట. కెనడా ఎగుమతుల్లో 80 శాతం అమెరికాకే చేరతాయి. అధిక సుంకాలు విధిస్తే కెనడా తీవ్రంగా నష్టపోతుంది. తాము కూడా అధిక సుంకాల ప్రక్రియ మొదలెట్టామని, దాంతో ఆ దేశం గత్యంతరం లేక చర్చలకు దిగొచ్చిందని కార్నీ చెప్పారు. అయితే కన్సర్వేటివ్‌లు ఇంత బలంగా ట్రంప్‌పై విరుచుకుపడలేకపోయారు. ఇక అధిక వలసలపై కూడా ప్రజల్లో ఆగ్రహం వుంది. లిబరల్స్ ఏలుబడిలో వలసలు పెరిగాయని వారు నమ్మారు. పర్యావరణ పరిరక్షణ పేరుతో కొత్తగా ఖనిజాలు, శిలాజ ఇంధనాల వెలికితీతను నిలిపేయటంవల్ల ఆ రంగాల్లో ఉపాధి అవకాశాలు అడుగంటాయని, తామొస్తే దీన్ని సరిదిద్దుతామని కన్సర్వేటివ్‌లు హామీ ఇచ్చారు. నిజానికి ఈ సమస్యలే అమెరికాలో మితవాద రిపబ్లికన్ పార్టీని అందలం ఎక్కించాయి. కానీ ట్రంప్ రాకతో ఆ సమస్యలన్నీ మరుగునపడి కెనడాలోని మితవాద పక్షాన్ని కోలుకోలేని దెబ్బతీశాయి.

కార్నీ ఏలుబడిలో మనతో కెనడా సంబంధాలు మెరుగుపడతాయన్న అభిప్రాయం అందరిలో వుంది. ఆర్థిక సంక్షోభం నుంచి దేశాన్ని గట్టెక్కించే దారి దొరక్క, ఆ అసంతృప్తిని కప్పిపుచ్చటానికి ట్రూడో భారత్‌తో కోరి వైరాన్ని తెచ్చుకున్నారు. తీరా జగ్మీత్ సింగ్ ఆధ్వర్యంలోని ఖలిస్తానీ అనుకూల న్యూడెమాక్రటిక్ పార్టీ(ఎన్‌డీపీ)కే ఈసారి దిక్కులేకుండా పోయింది. బలపడిన జాతీయ వాదం ఎన్‌డీపీని దెబ్బతీసింది. సిక్కువోటర్లు లిబరల్స్ వైపే మొగ్గారు. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ గవర్నర్‌గా, కెనడా సెంట్రల్ బ్యాంక్ చీఫ్‌గా కార్నీకి ఆర్థిక రంగంలో అపార అనుభవం వుంది. దేశ ఆర్థికవ్యవస్థకు నూతన జవసత్వాలు తెచ్చేందుకు ఆయన సహజవాయు నిక్షేపాల, ఖనిజాల వెలికితీతకు ప్రాధాన్యమిస్తారని అంచనాలున్నాయి. మొత్తానికి ఇరుగుపొరుగు దేశాల్లో మితవాదులుంటే వారిలో ఒకరికి మాత్రమే గెలుపు దక్కుతుందని... ఒకచోట మితవాదుల దూకుడు మరొక దేశ మితవాదులకు ప్రాణాంతకమవుతుందని కెనడా ఫలితం నిరూపించింది.

ఇంతకూ పరిష్కారం ఏమిటి?

అభిప్రాయం



టంకశాల అశోక్

పహల్‌గామ్‌లో తీవ్రవాదుల ఘాతుకమైన దాడి ఏప్రిల్ 22న జరిగి వారం రోజులు గడిచాయి. ప్రతిగా భారత ప్రభుత్వం దౌత్యపరమైన చర్యలు కొన్ని తీసుకున్నది గాని, దేశంలో రగులుతున్న ఆగ్రహావేశాలు చల్లారుతున్న సూచనలు లేవు. 'కశ్మీర్ రెసిస్టెన్స్' పేరిట దాడి జరిపిన వారిని పట్టుకుని శిక్షించటం ఒకటైతే, ఇటువంటి సంస్థలను మొదటినుంచి ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్‌పై తగిన ప్రతీకార చర్య అన్నది అంతకుమించిన అవసరంగా సాధారణ భారతీయుల మనస్సులను దహించి వేస్తున్నది. పాక్‌తో గల సింధూ నదీ జలాల ఒప్పందం అమలును నిలిపివేస్తున్నామన్న ప్రకటన దాని పర్యవసానాల రీత్యా తీవ్రమైనదేగానీ, అంతకుమించిన తక్షణ చర్య, సూటిగా చెప్పాలంటే సైనిక చర్యను జనం కోరుతున్నారు.

తీవ్రవాదుల కోసం కశ్మీర్‌లో ముమ్మరమైన తనిఖీలు సాగుతున్నాయి. అనుమానితులను ఇప్పటికే పెద్ద సంఖ్యలో అదుపులోకి తీసుకుని కొందరి ఇళ్లను కూల్చివేస్తున్నారు. సాధారణంగా జరిగేట్లు ఇంతవరకు ఎవరినీ ఎన్‌కౌంటర్లలో కాల్చివేయలేదు. కశ్మీర్‌లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది పర్యటించి సైన్యాన్ని అప్రమత్తం చేశారు. వైమానిక బలగాన్ని కూడా. నౌకా బలాలు విన్యాసాలు జరిపాయి. అనగా త్రివిధ బలాలు సన్నద్ధమవుతున్నాయన్నమాట.

యుద్ధంతో మనకూ నష్టమే!

కొద్ది రోజులుగా ప్రతి రోజూ రాత్రి సరిహద్దు దళాల మధ్య కాల్పులు జరుగుతున్నాయి. అది 'తేలిక రకం' ఆయుధాలతోనన్నది సైన్యం స్వయంగా చెప్తున్నమాట. తేలిక రకం అనే మాట కిందకు పలు రకాల ఆయుధాలు వస్తాయి. వాటిలో ప్రజలు వినే పేర్లు ఇన్సాస్ రైఫిళ్లు, లైట్ మెషీన్ గన్స్, సబ్ మెషీన్ గన్స్. వాటి ప్రయోగంతో రెండువైపులా ప్రాణ నష్టాలు ఇప్పటికి జరగలేదు. సరిహద్దులలో తగినంత దూరం పాటిస్తారు, బంకర్లలో ఉంటారు. గనుక ప్రాణ నష్టాలు సాధారణంగా జరగవు. తేలిక రకం ఆయుధాల వినియోగం స్థానిక కమాండర్ల నియంత్రణలో జరుగుతుంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో భారీ ఆయుధాల వినియోగం జరిగితేనే ఘర్షణ పైస్థాయికి వెళ్లినట్లు!

త్రివిధ బలాలను అప్రమత్తం చేసినందున పూర్తి స్థాయి యుద్ధమా? 2019లో పుల్వామా వద్ద భారత సైనికులపై దాడిలో 40 మంది చనిపోయిన దరిమిలా పాకిస్తాన్‌లోని బాలాకోట్ టెర్రరిస్టు స్థావరాలపై మెరుపు దాడులు జరిపి అంతకు పరిమితం కావడం వంటిదా? కొద్దిగా ఆలోచించినట్లయితే పూర్తి స్థాయి యుద్ధానికి అవకాశం కన్పించదు. ఇండియా కన్నా పాకిస్తాన్ సైనిక శక్తి తక్కువే గానీ మరీ అంత బలహీనమైనది కాదు. యుద్ధం దీర్ఘకాలం సాగితే పాకిస్తాన్ ఓడుతుంది గానీ భారతదేశానికి కూడా తీవ్ర నష్టాలు కలుగుతాయి. యుద్ధాన్ని అవకాశంగా తీసుకుని పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనపరచుకోవచ్చునని ఎవరైనా భావిస్తే, కొత్త సమస్యలు కొని తెచ్చుకోవటమవుతుంది. సగం కశ్మీర్‌తోనే ఇన్ని సమస్యలున్నాయి. అణు యుద్ధానికి ఇపుడెవరూ సుముఖంగా లేరు. కానీ పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనపరచుకునే స్థితి అంటూ కనిపిస్తే, అణు ప్రయోగానికి పాక్ సైన్యం వెనుకాడబోదు. తూర్పు పాకిస్తాన్ తమది కాకుండా పోయిందనే ఆగ్రహం వారికి ఇప్పటికీ చల్లారలేదు.



అందువల్ల, అటు ఇటుగా బాలాకోట్ నమూనా ప్రతిదాడులకే అవకాశాలు కనిపిస్తున్నాయి. వివాదాన్ని ముదరనివ్వకండంటూ ఇప్పటికే సూచనలు చేస్తున్న అమెరికా జోక్యాలు తెర వెనుక నుంచి ఎట్లుండవచ్చునన్నది మరో ప్రశ్న. అమెరికా మాటను కాదనే శక్తి భారత, పాకిస్తాన్‌లలో దేనికీ లేదన్నది ఒక చేదు నిజం. కశ్మీర్‌లో అంతర్గతంగా టెర్రరిజంపై, మిలిటెన్సీపై ఎటువంటి చర్యలైనా భారత భద్రతాదళాలు యథేచ్ఛగా తీసుకోగలవు. ఆ చర్యలు సుమారు 1990 నుంచి 35 సంవత్సరాలుగా తీసుకుంటున్నవే. అందువల్ల కలిగిన ఫలితాలేమిటన్నది వేరే ప్రశ్న.

నీటిని ఆపగలమా?

ప్రభుత్వం ఇప్పటికి ప్రకటించిన చర్యలలో నిజంగా తీవ్రమైనది సింధూ ఒప్పందాన్ని సస్పెండ్ చేయటం. 1960 నాటి ఆ ఒప్పందం పాకిస్తాన్‌కు కీలకమైనది. ఆ జలాలు ఆగినా, తగ్గినా వారి వ్యవసాయం అల్లకల్లోలమవుతుంది. కనుకనే పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, అది తమపై 'యుద్ధ చర్య' కాగలదంటూ తీవ్రమైన భాషను ఉపయోగించారు. పాకిస్తాన్‌కు 'ఒక్క చుక్క' నీరు కూడా పోనివ్వమని భారత ప్రభుత్వ బాధ్యులు ప్రకటించనైతే ప్రకటించారు గానీ, పోకుండా ఆపటం నిజంగా సాధ్యమా? ప్రపంచబ్యాంకు ఆధ్వర్యాన జరిగిన ఈ అంతర్జాతీయ జలాల పంపిణీ ఒప్పందంలో ఐక్యరాజ్య సమితి పాత్ర ఉంది. బ్యాంకు పక్షాన 'ఇంటర్నేషనల్ బ్యాంక్ ఫర్ రీకన్‌స్ట్రక్షన్ అండ్ డెవలప్‌మెంట్' (ఐబీఆర్‌డీ) సంతకం చేసింది. ఏదైనా వివాదం తలెత్తితే మొదట 'తటస్థ నిపుణుని' దృష్టికి, తర్వాత 'కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్' ముందుకు వెళ్లాలి. తిరిగి ఇందులోనూ రెండు దేశాల సార్వభౌమాధికారానికి ఏది వర్తిస్తుంది, ఏది వర్తించదనే మీమాంస ఉంది. లోగడ రెండుసార్లు వాస్తవంగా యుద్ధాలు జరిగినపుడు కూడా ఇటువంటి సస్పెన్షన్లు జరగలేదు. ఇదంతా సాంకేతికపరమైన కోణం కాగా, నీరు అటు పోకుండా ఆపగల జలాశయ నిర్మాణాలు అసలు ఇండియాకు లేనే లేవనీ, ఆ నిర్మాణాలకు అనేక చిక్కులున్నాయనే ఆచరణపరమైన విషయాలను నిపుణులు ప్రస్తావిస్తున్నారు. అనగా, ఈ చర్య ఎంత ప్రభావం చూపగలిగేది అయినా ఇప్పటికిప్పుడు జరిగేది కాదన్నమాట.

◆ యుద్ధం దీర్ఘకాలం సాగితే పాకిస్తాన్ ఓడుతుంది గానీ భారతదేశానికి కూడా తీవ్ర నష్టాలు కలుగుతాయి.

◆ నీరు పాకిస్తాన్‌కు పోకుండా ఆపగల జలాశయ నిర్మాణాలు ఇండియాకు లేవనీ, ఆ నిర్మాణాలకు అనేక చిక్కులున్నాయనే విషయాలను నిపుణులు ప్రస్తావిస్తున్నారు.

◆ నియంత్రణ రేఖను(ఎల్‌ఓసీ) శాశ్వత సరిహద్దుగా గుర్తించుకున్నట్లయితే అన్ని సమస్యలు సమసిపోగలవని 1972లో ఇందిరాగాంధీ, జుల్ఫికర్ అలీ భుట్టో సూత్రప్రాయమైన నిర్ణయం తీసుకున్నారు. అదే శాశ్వత పరిష్కారం కాగలదా?

వాస్తవాధీన రేఖే పరిష్కారమా?

మనం విస్మరించేదేమంటే కశ్మీర్ తరహా అనేక భౌగోళిక, సరిహద్దు సమస్యలను బ్రిటిష్ వలస పాలకులు ప్రపంచమంతటా సృష్టించిపోయారు. భారత–చైనా, భారత–బంగ్లాదేశ్, పాలస్తీనా–ఇజ్రాయెల్ వంటివన్నీ అందుకు ఉదాహరణలు. తిరిగి వాటిని సొమ్ము చేసుకుంటూ పాశ్చాత్య దేశాలు ఇరుపక్షాలకూ ఆయుధాలను అమ్ముకుంటున్నాయి.

కశ్మీర్‌కు సంబంధించి ఒక వివేకవంతమైన పరిష్కార మార్గాన్ని మొదటిసారిగా కనుగొన్నది 1972లో అప్పటి ప్రధానులు ఇందిరా గాంధీ, జుల్ఫికర్ అలీ భుట్టో. 1971లో బంగ్లాదేశ్ యుద్ధం తర్వాత వారు సిమ్లాలో సమావేశమై, కశ్మీర్‌లో నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ, లేదా లైన్ ఆఫ్ కంట్రోల్)ను శాశ్వత సరిహద్దుగా గుర్తించుకున్నట్లయితే అన్ని సమస్యలూ సమసిపోగలవని సూత్రప్రాయమైన నిర్ణయం తీసుకున్నారు. కానీ, తమ రాజధానులకు తిరిగి వెళ్లి ప్రజాభిప్రాయానికి జంకి వెనుకకు పోయారు. ఆచరణాత్మకంగా ఆలోచించినట్లయితే, అది మాత్రమే ఎప్పటికైనా శాశ్వత పరిష్కారం కాగలదా?

ఇది భారత–పాకిస్తాన్ సమస్యల పరిష్కారం అయితే, ఇక మిగిలేది కశ్మీర్‌లో అంతర్గత సమస్యలు. మొదటిది తేలినపుడు రెండవది సగం మేర తేలుతుంది. తక్కినది అభివృద్ధి, ఉపాధి కల్పన, అవినీతిని అదుపు చేయటం, స్వేచ్ఛాయుతమైన ఎన్నికలతో తప్పకుండా పరిష్కారమవుతుంది. ఈ మాట నేను 3 విడతలుగా 55 రోజుల పాటు కశ్మీర్ అన్ని ప్రాంతాలలో తిరిగి అన్ని వర్గాల ప్రజలతో మాట్లాడిన మీదట అంటున్నది. 1947 నుంచి ఇంతవరకు గల కశ్మీర్ చరిత్ర నేపథ్యంలో అక్కడి ప్రస్తుత పరిస్థితులను, యుద్ధం ద్వారా ఏదైనా తేలగలదా అనే అవకాశాలను, మిలిటెన్సీ–టెర్రరిజాల హెచ్చు తగ్గుల క్రమాన్ని, ముఖ్యంగా 1987 నుంచి తీవ్రవాదం తలెత్తి సాగుతున్న కారణాలను పరిశీలించినపుడు, ఇటువంటి అభిప్రాయం ఏర్పడుతున్నది. అందువల్ల రెండు దేశాలూ విజ్ఞతతో ఆలోచించి ఇందిరా గాంధీ–భుట్టోల స్ఫూర్తితో రాజీ మార్గానికి రావటం సమస్యను శాశ్వతంగా పరిష్కరించి ఇరు దేశాలకు ఎనలేని మేలు చేయగలదు.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ మీడియా

ఏది మన కుటుంబం?



చైనా, టర్కీ, అజర్‌బైజాన్ స్పష్టంగా పాకిస్తాన్ వైపున్నాయి. నిజానికైతే ఇలాంటి దానికి మూల్యం ఉండాలి, కానీ ఇండియా వాటికి భారీ వాణిజ్య ఒప్పందాలు, రక్షణ కాంట్రాక్టుల ప్రతిఫలమిస్తుంది. ఇజ్రాయెల్ ఒక్కటే బహుశా ఇండియా వైపుంది. యూఎస్, ఈయూ, యూకే, ఆఖరికి రష్యా కూడా లెక్కలు వేసుకుంటున్నాయి. వసుధైవ కుటుంబం అట! మనం ఎప్పుడూ చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోం.

– సుశాంత్ సరీన్, సీనియర్ ఫెలో

నిజ యోగిని



కువైట్‌లో యోగాకు గొప్ప ప్రాచుర్యం కల్పించినందుకుగానూ ప్రతిష్ఠాత్మక 'పద్మశ్రీ' పురస్కారం అందుకున్నందుకు అల్ షేఖా షేఖా అల్‌సబాహ్‌కు అభినందనలు. నిజమైన యోగిని అయిన ఆమెతో నాకు వ్యక్తిగత పరిచయం ఉండటం నాకు గౌరవ కారణం.

– నౌఫ్ అల్‌మర్‌వాయీ, సౌదీ యోగాచార్య

ఇలాగే ప్రయాణించాలా?



వాహనం నడుపుతూనే క్యాబ్ డ్రైవర్లు సినిమాలు, సీరియల్స్ చూస్తున్నారు. ఫ్రంట్ ప్యానెల్ మధ్యలో పెద్ద స్క్రీన్ పెట్టి వుంటుంది, వాళ్లు దాన్ని చూస్తూనే ఉంటారు. మనం ఏదైనా అంటే, వాళ్లు కేవలం సౌండ్ తగ్గిస్తారు. అసలు సురక్షితం కానేకాదు!

– దీపికా నారాయణ్ భరద్వాజ్, డాక్యుమెంటరీ మేకర్

గెలుపు వెనుక...



మార్క్ కార్నీ, ఇంకా ఉదారవాదులు కృతజ్ఞతా సూచికగా తమ పార్టీ ఆఫీసులో డోనాల్డ్ ట్రంప్ ఫొటో పెట్టుకోవాలి. ట్రంప్ అలజడి లేకుంటే ఉదారవాదులు కెనడా ఎన్నికల్లో ఎప్పటికీ గెలిచేవాళ్లు కాదు.

– స్టాన్లీ జానీ, జర్నలిస్ట్

శాంతి కోసం...



ఒక అఫ్గాన్‌గా నేను ఇండియాకు మద్దతిస్తాను. న్యాయం, శాంతి కోసం రాజ్య ప్రాయోజిత తీవ్రవాదానికి వ్యతిరేకంగా నిలబడతాను. ఈ పరోక్ష యుద్ధాలతో బాధలు ఎలా ఉంటాయో అఫ్గాన్స్‌కు తెలుసు. జై హింద్!

– మరియమ్ సోలైమంఖిల్, అఫ్గాన్ బహిష్కృత ఎంపీ

ఇన్ బాక్స్

కగార్‌తో ఎవరికి ప్రయోజనం?

నేడు మధ్య భారతదేశంలో, ముఖ్యంగా 5వ షెడ్యూల్‌లో ఉన్న భూభాగాలలో ప్రభుత్వమే రాజ్యాంగాన్ని ఉల్లంఘించడం అశాంతికి కారణమవుతోంది. 'ఆపరేషన్ గ్రీన్ హంట్', 'ఆపరేషన్ కగార్'ల వంటివాటితో కేంద్రం, ఆ యా రాష్ట్రాలు నక్సలైట్లను ఏరివేసే పేరుతో ఆదివాసీల బతుకులను ఇక్కట్ల పాలు చేస్తున్నాయి. రాజ్యాంగ హక్కులను అనుభవించే స్థితిలో ఇక్కడి ప్రజలు లేరు. మావోయిస్టులను ఏరివేతకు ప్రభుత్వం ప్రజాధనాన్ని ఖర్చు పెట్టేకంటే తమ ప్రాంత ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో కేటాయించాలని ఆదివాసీలు కోరుకుంటున్నారు. యుద్ధంతో అభివృద్ధి సాధ్యం కాదు. కొందరు రాజకీయ నాయకులు, ప్రభుత్వాల వ్యవహారశైలి వల్ల ఇప్పటికే మధ్యభారతంలో పెద్ద ఎత్తున ఆదివాసీలు 'పథల్ గడి' పోరాటం, 'భుంకల్' పోరాటాలు, స్వయంపాలన పోరాటాలకు జై కొడుతున్నారు. ఆపరేషన్ కగార్‌తో ఆదివాసీ ప్రజల బతుకులు మారవు కనుక కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు 5వ షెడ్యూల్‌లో ఉన్న భూభాగంలో శాంతి నెలకొల్పాలి.

ప్రస్తుతం యుద్ధం జరుగుతున్న కర్రెగుట్ట... వాజేడు మండలం బొగత జలపాతం చీకుపల్లి ఆదివాసీ గూడెం నుండి 15 కిలోమీటర్ల దూరంలో దట్టమైన అటవీ గుట్టలపై ఉంది. ఇక్కడ జరిగే ఆపరేషన్ కగార్‌తో చుట్టుపక్కల గూడేలకు చెందిన సుమారు 6 వేల మంది ఆదివాసీ ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. స్వేచ్ఛగా వారి పనులు చేసుకోలేక పోతున్నారు. అసలు ఎవరి ప్రయోజనం కోసం ఈ సైనిక చర్య జరుగుతుందని ఆదివాసీలు ప్రశ్నిస్తున్నారు.

కనుక తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రభావిత ఆదివాసీ గ్రామాల పెద్దలతో పీసా చట్టం ప్రకారం సమావేశాలు ఏర్పాటు చేసి ఈ సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే మావోయిస్టులు శాంతి చర్చలకు సిద్ధం అని పిలుపు నిచ్చారు. నక్సలైట్ సమస్యను శాంతి భద్రతల దృష్టి కోణంలో కాకుండా సామాజిక దృష్టి కోణంలో చూడాలి. విప్లవ గ్రూపులు కూడా ఇన్ఫార్మర్ల ముద్రవేసి ఆదివాసీలను బలి తీసుకోవడం మానాలి. ప్రభుత్వాలు, విప్లవ పార్టీలు సంయమనం పాటించాలి.

– డా౹౹ సంతోష్ కుమార్ మైపతి, ఇండిజీనియస్ ఆక్టివిస్ట్

బైబిల్... షేక్‌స్పియర్... అగథా క్రిస్టీ!

కామెంట్



కరణ్ థాపర్

ఎప్పటికీ గుర్తుండిపోయే నా టీనేజ్ జ్ఞాపకం: నేను అగథా క్రిస్టీ నవల్ని చదవటం! అంతుచిక్కని క్రిస్టీ హత్యోదంతాలలో గల్లంతవుతూ ఉక్కపోత వేసవి మధ్యాహ్నాలను గడిపేవాడిని. ప్రధానంగా హెర్క్యూల్ పాయ్‌రోట్, మిస్ మార్పుల్ (క్రిస్టీ నవలల్లోని కల్పిత డిటెక్టివ్ పాత్రలు)ల అపరాధ పరిశోధనలు నన్ను కదలనివ్వకుండా చేసేవి. తక్కిన డిటెక్టివ్ పాత్రలు... టామీ, టపెన్స్ బెరెస్‌ఫోర్డ్; పార్కర్ పైన్, హార్లీ క్విన్ అనే వాళ్ల గురించి నాకసలు ఏమీ తెలియకపోయినా... క్రిస్టీ 66 డిటెక్టివ్ నవలలు రాశారనీ, అవి 200 కోట్ల కాపీలకు పైగా అమ్ముడయ్యాయనీ; బైబిలు, షేక్‌స్పియర్ రచనలు మాత్రమే ఆ సంఖ్యను దాటిన ప్రచురణలనీ, క్రిస్టీ నవలలు వందకు పైగా భాషలలోకి తర్జుమా అయ్యాయనీ అస్పష్టంగానైనా తెలుసు.

అగథా క్రిస్టీ వ్యక్తిగత విషయాలు మాత్రం నాకు దాదాపుగా ఏమీ తెలియదు. అయితే ఆ లోటును, గత వారం నేను అనుకోకుండా చూసిన రెండేళ్ల నాటి లూసీ వర్స్‌లీ 'అగథా క్రిస్టీ' జీవిత చరిత్ర భర్తీ చేసింది. ఆమె ఇంగ్లండ్ రచయిత్రి. ఆమె తండ్రి అమెరికన్. క్రిస్టీ అనే పేరు ఆమెకు మొదటి భర్త నుండి వచ్చింది. వాళ్ల ఏకైక సంతానం కుమార్తె రోసాలిండ్. వారి వైవాహిక జీవితం 1914 నుండి 1928 వరకు కొనసాగింది. భర్తకున్న వివాహేతర సంబంధం చివరికి ఆమె చేత అత్యంత బాధాకరమైన విడాకులకు దారి తీయించింది.

ఆ తర్వాత రెండేళ్లకు క్రిస్టీ తనకన్నా పదేళ్లు చిన్నవాడైన ఒక పురావస్తు శాస్త్రవేత్తను పెళ్లి చేసుకున్నారు. మధ్య ప్రాచ్యంలో అతడు జరిపిన తవ్వకాల ద్వారానే క్రిస్టీ ఇరాక్ (మెసపటేమియా), ఈజిప్టుల గురించి తెలుసుకున్నారు. భర్త తవ్వకాల పనికి చాలా వరకు క్రిస్టీనే డబ్బును సమకూర్చారని పుస్తక రచయిత్రి వర్స్‌లీ రాశారు. ప్రతిఫలంగా ఆమెకు 'డెత్ ఆన్ ద నైల్', 'మర్డర్ ఇన్ మెసపటేమియా', 'మర్డర్ ఆన్ ది ఓరియెంట్ ఎక్స్‌ప్రెస్' అనే మూడు పుస్తకాలు రాసేందుకు ముడి సరకు లభించింది. ఆమె తరచూ భర్త పాల్గొనే పురావస్తు త్రవ్వకాల దగ్గరకు వెళుతూ ఉండేవారు.

బహుశా మీలో చాలామందికి అగథా క్రిస్టీ అనే ఆవిడ 'థ్రిల్లర్'ల నవలా రచయిత్రి అని తెలిసి ఉండొచ్చు. కానీ ఆమె గురించి తెలుసుకోవలసినవి ఇంకా చాలా ఉన్నాయి. 'మేరీ వెస్ట్‌మెకాట్' పేరుతో ఆమె ఆరు రొమాంటిక్ నవలలు రాశారు. ఆమె నిష్ణాతురాలైన నాటక రచయిత్రి కూడా! వాటిల్లో ప్రసిద్ధి చెందిన రెండు నాటకాలు 'మౌస్ ట్రాప్', 'విట్నెస్ ఫర్ ద ప్రాసిక్యూషన్'. మొదటి నాటకాన్ని లండన్ వెస్ట్ ఎండ్ థియేటర్‌లో 1952 నుండి 2020 వరకూ ప్రదర్శించారు. ఇంకా నడిచేదే కానీ, కోవిడ్ రాకతో తాత్కాలికంగా నిలిపి వేయవలసి వచ్చింది. తిరిగి 2021 నుండి నిరవధికంగా ప్రదర్శిస్తూ ఉన్నారు.



ఆనాటి పత్రికల్లో అగథా క్రిస్టీ 'మిస్సింగ్' వార్తలు



లూసీ వర్స్‌లీ రాసిన పుస్తకం

హెర్క్యూల్ పాయ్‌రోట్ ఆమె అత్యంత ప్రసిద్ధ కాల్పనిక డిటెక్టివ్ పాత్ర. అయితే ఆ పాత్రను మోయటం ఆ 'కల్పితుడికి' తలకు మించిన పనైపోయిందని క్రిస్టీ తలపోశారు. 1975 నాటి 'కర్టెన్' నవలలో చివరిసారి అతడు కనిపించాక, 'న్యూయార్క్ టైమ్స్' తన మొదటి పేజీలో అతడికి శ్రద్ధాంజలి ఘటించింది.

అగథా 86 సంవత్సరాలు జీవించారు. ఆమె తన 80లలో కూడా రాస్తూనే ఉన్నారని వర్స్‌లీ వెల్లడించారు. ''ఆమె చనిపోయాక, ఆమె చివరి రాత పుస్తకాల్లో సైతం, తర్వాత రాయబోయే నవల కోసం తన ఆలోచనల్ని రాసి పెట్టుకున్నారు. అవి పూర్తిగా కొత్త ఆలోచనలు. ఇద్దరు విద్యార్థులు ఒక బాలుడిని ఏ కారణం లేకుండానే ఒక ప్రయోగంలా హత్య చేయటం గురించిన ఐడియాలు అవి...'' అని రాశారు వర్స్‌లీ.

అగథా క్రిస్టీ జీవితాన్ని కూడా రహస్యాలు చుట్టుముట్టాయంటే ఆశ్చర్యంగా ఏమీ అనిపించదు. మొదటి భర్త క్రిస్టీతో తన వివాహ బంధం ఊగిసలాడుతూ ఉన్న సమయంలో 1926లో ఆమె పది రోజుల పాటు అదృశ్యమైపోయారు. ఆమె కోసం భారీ ఎత్తున గాలింపు జరిగింది కానీ, ఆమె జాడ తెలియలేదు. ''నమ్మకద్రోహం చేసిన తన భర్తపై ప్రతీకారం తీర్చుకోటానికి ఈ మాయలాడి ఏదో పథకం వేసి ఉంటుంది'' అని విమర్శకులు కొందరు ఆమె గురించి మాట్లాడినట్లు వర్స్‌లీ రాశారు.

మహోజ్జ్వలమైన అగథా రచనా జీవితం... ఆరంభంలోనే తడబాటుకు లోనైంది. ఆమె తొలి పుస్తకం 'ద మిస్టీరియస్ ఎఫైర్స్ ఎట్ స్టైల్స్'ను ఇద్దరు ప్రచురణకర్తలు తిరస్కరించారు. ఆ తర్వాత 'ద బాడ్లీ హెడ్' అనే సంస్థ ప్రచురణకు తీసుకుంది. 36 ఏళ్ల వయసులో అగథా 70 కిలోల బరువు ఉండేవారు. తర్వాతి సంవత్సరాలలో ఆ బరువు 82 కిలోలకు చేరుకుంది. ఆమె భారీ మనిషి అనడంలో సందేహం లేదు. అగథాకు నివాస గృహాలంటే ఇష్టం. ఆమెకు ఎనిమిది ఇళ్లు ఉండేవి.

ఆమె చాలాసార్లు నిర్లక్ష్యపూరితంగా రచన చేసేవారు. వర్స్‌లీ చెప్పినదాని ప్రకారం... పాయ్‌రోట్ ' వైట్‌హెవెన్ మాన్షన్స్'లో నివసిస్తాడు, కానీ కొన్నిసార్లు అతను 'వైట్‌హౌస్ మాన్షన్స్'లో కూడా ఉన్నట్లు చూపిస్తారు. 'స్లీపింగ్ మర్డర్'లో, ఒక క్లర్క్, రిసెప్షనిస్ట్, రైలు ప్రయాణీకుడు... ముగ్గురికీ యాదృచ్ఛికంగా ఒకే పేరు 'నార్రాకాట్' పెట్టారు. ఈ పేరు మరో మూడు వేర్వేరు పుస్తకాల్లో ఒక చాంబర్‌మేడ్, పడవవాడు, పోలీసు అధికారి పేరుగా కూడా కనిపిస్తుంది.

1974లో గుండెపోటు వచ్చి కోలుకున్నాక, ఒక సందర్భంలో అగథా క్రిస్టీని ''మీరెలా గుర్తుండిపోవాలని కోరుకుంటున్నారు?'' అని ప్రశ్నించారు. ''డిటెక్టివ్ కథలు రాసిన ఒక మంచి రచయిత్రిగా'' అని ఆమె చెప్పారు. ఆశించినట్టే ఆమె డిటెక్టివ్ కథారచయిత్రిగా చరిత్రలో నిలిచిపోయారు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

శ్రద్ధ ముఖ్యం!

ఒక భక్తుడు ప్రతిరోజూ అపరిమిత శ్రద్ధతో 'ఓం నమో నారాయణాయ' అనే అష్టాక్షరిని నారాయణుని విగ్రహం ముందు కూర్చుని జపిస్తూ ఉండేవాడు. లౌకిక విషయాలపై అతనికి ఏ మాత్రం ఆసక్తి లేదు. దైవమే అతని లోకం. ఒకరోజు దేవుడు అతని నిష్ఠకు మెచ్చి శంఖ చక్రాలు ధరించి అతని పూజా మందిరంలో ప్రత్యక్షమయ్యాడు. భక్తునికి ఆశ్చర్యం, ఆనందం, ఉద్వేగాలతో ఏం చేయాలో తోచలేదు. తాను బీదవాడవటం వల్ల దేవునికి పెట్టటానికి తన ఇంట్లో ఏం లేదే అని బాధపడ్డాడు. పూజా మందిరం అంతా చూశాడు. ఒక అరటిపండు కనిపించింది. దేవుని దివ్య దర్శన పారవశ్యంలో అరటిపండు వలిచి, గుజ్జు పారేసి తొక్క పెట్టాడు. పరిపూర్ణ శ్రద్ధాభక్తులతో, స్వచ్ఛమైన మనసుతో భక్తుడు పెట్టిన ఆ అరటి తొక్కను దేవుడు సంతోషంగా స్వీకరించి తిని అంతర్ధానమయ్యాడు.

జ్యోతిర్మయం

తర్వాత భక్తునికి తన పొరపాటు తెలిసివచ్చి అనేక విధాల బాధ పడ్డాడు. ఈ సారి దేవుడు వస్తే జాగ్రత్తగా పెట్టాలి అనుకుని, ఎలాగైనా దేవుణ్ణి ప్రత్యక్షం చేసుకోవాలి అని అష్టాక్షరీ జపం చేశాడు. అరటిపళ్ళ గెల తెచ్చి అరటి పండు ఒలిచి తొక్క పారేసి గుజ్జు పెడుతున్నట్లు అనేక మార్లు అరటిపళ్ళతో అభ్యాసం చేశాడు.

ఒక రోజు దేవుడు ప్రత్యక్షమయ్యాడు. వెంటనే భక్తుడు అరటిపండు తొక్క తీసి, గుజ్జును దేవునికి పెట్టాడు. దేవుడు స్వీకరించలేదు. భక్తుడు కన్నీళ్ళతో ఎందుకు తినటం లేదని అడిగాడు. అప్పుడు దేవుడు, 'ఇంతకు ముందు తొక్కను పెట్టినప్పుడు నీ మనసు పూర్తిగా నాపైనే లగ్నమై ఉంది. ఆ తొక్కలో నీ శ్రద్ధ, భక్తి పరిపూర్ణంగా నిండి ఉన్నాయి. ఈ సారి నీ మనసు అంతా అరటి పండు జాగ్రత్తగా పెట్టటం పైనే ఉండటం వల్ల ఆ పండు భక్తి రస హీనమై, విషతుల్యంగా ఉంది' అని అంతర్ధానమయ్యాడు.

దైవం తన భక్తుడు ఏమి ఇచ్చాడు అని చూడడు. ఎంత శ్రద్ధతో నివేదించాడు అన్నదే చూస్తాడు. పూజాదులలో, నివేదనలలో శ్రద్ధా భక్తులే ముఖ్యం అని ఇలాంటి కథలు చెబుతాయి.

– డా౹౹ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** శు.తదియ రా.6.20 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** రోహిణి రా.8.25 వరకు, తదుపరి మృగశిర, **వర్జ్యం:** ప.12.53 నుండి 2.24 వరకు, తదుపరి రా.1.45 నుండి 3.16 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.35 నుండి 12.25 వరకు, **అమృతఘడియలు:** సా.5.26 నుండి 6.57 వరకు, అక్షయతృతీయ; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.39, **సూర్యాస్తమయం:** 6.14.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

- సీపీఐ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



సాక్షి, హైదరాబాద్: ఆదివాసీ జాతిని హననం చేస్తున్న 'ఆపరేషన్ కగార్'ను నిలిపివేయడంతోపాటు కేంద్ర ప్రభుత్వం తక్షణమే మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. దాదాపు 20 వేల మంది పోలీసుల బలగాలతో కర్రి గుట్టలను చుట్టుముట్టి నరమేధం సృష్టించడం దుర్మార్గమని, వెంటనే అక్కడి నుంచి పోలీసు క్యాంప్ ఎత్తివేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కోరారు. హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన సీపీఐ సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు వేములపల్లి వెంకట్రామయ్య, సాధినేని వెంకటేశ్వర్‌రావు, గోవర్ధన్ తదితర నేతలతో కలిసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పరాయి దేశంపై యుద్ధం చేస్తున్నట్టు దేశ పౌరులైన మావోయిస్టులను తుదముట్టిస్తామని ప్రతిజ్ఞ చేసి మరీ అత్యంత కిరాతకంగా వ్యవహరిస్తుందని ధ్వజమెత్తారు.

వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మే 2న సదస్సు

కేంద్ర ప్రభుత్వం తక్షణమే కగార్ ఆపరేషన్ నిలిపివేసి మావోయిస్టులతో బేషరతుగా చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మే 2వ తేదీన హైదరాబాద్ బషీర్ బాగ్ దేశోద్ధారకభవన్‌లో సదస్సు నిర్వహించనున్నట్లు కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఈ సదస్సులో వామపక్ష పార్టీల నాయకులతోపాటు వివిధ వర్గాల మేధావులు పాల్గొంటారని ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో కేజీ.రాంచందర్, గాదగోని రవి, ప్రసాదన్న, జానకిరాములు, రమేశ్‌రాజా, మురహరి, ప్రసాద్ పాల్గొన్నారు.

కర్రి గుట్టల ఆపరేషన్‌పై సమీక్ష

చర్ల: తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రిగుట్టల్లో కొనసాగుతున్న ఆపరేషన్‌పై ఉన్నతాధికారులు సమీక్షించారు. మంగళవారం కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్ తపన్ దేఖా రాయ్‌పూర్ చేరుకున్నారు. డీజీపీ అరుణ్‌దేవ్ గౌతమ్, ఏడీజీ వివేకానంద సిన్హా తదితరులతో కర్రి గుట్టల్లో కొనసాగుతున్న కూంబింగ్‌పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా, సోమ, మంగళవారాల్లో సుమారు 5 వేల మంది అదనపు బలగాలను కర్రి గుట్టల ప్రాంతానికి తరలించారు.

కొత్త షెల్టర్ జోన్లకు మావో అగ్రనేతలు?

బస్తర్ ఆవల విస్తరణకు 2011లోనే మావోయిస్టుల ప్రణాళిక

- కేకేటీ-4, ఎంఎంసీ-5 పేర్లతో కొత్త గెరిల్లా జోన్లు
- అక్కడ ఆశించిన విజయాలు దక్కకున్నా..పునాదులైతే పడ్డాయి
- కర్రి గుట్టల నుంచి ముఖ్యనేతలు తరలినట్టు అనుమానాలు !

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కర్రి గుట్టల్లో భద్రతా దళాలకు చిక్కకుండా మావోయిస్టు నేతలు దాక్కున్నారా.. లేక ఆపరేషన్ మొదలు కాకముందే రహస్యంగా సేఫ్‌జోన్లకు తరలి వెళ్లారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వేలాదిమంది పారా మిలిటరీ, హెలికాప్టర్లు, డ్రోన్ల సాయంతో భద్రతాదళాలు 'బచావో కర్రి గుట్టలు'ఆపరేషన్ చేపట్టిన విషయం తెలిసిందే. ఆపరేషన్ మొదలై తొమ్మిది రోజులు పూర్తయినా ఇంత వరకు ఈ గుట్టలపై మావోల జాడ కానరాలేదు. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే మావోయిస్టులు ఉత్తర దండకారణ్యంపై దృష్టి సారించినట్టు తెలుస్తోంది. మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా 2009లో కేంద్రం ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను మొదలుపెట్టిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దూకుడు పెంచింది. దీంతో ఎప్పటికైనా ప్రభుత్వ నిర్బంధం తీవ్రం అవుతుందనే అంచనాతోపాటు కొత్త ప్రాంతాల్లో పార్టీ విస్తరణపై మావోయిస్టులు దృష్టి సారించారు.

2011లో కేకేటీ గెరిల్లా జోన్

కర్ణాటక-తమిళనాడు సరిహద్దులో ఉన్న అటవీ ప్రాంతంలో ఉన్న గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్‌ను తుదముట్టించేందుకు ఆ రెండు రాష్ట్రాలు సంయుక్తంగా ఏళ్ల తరబడి ఆపరేషన్ చేపట్టాయి. ఎట్టకేలకు 2004 అక్టోబర్ 18న జరిగిన ఎన్‌కౌంటర్‌లో వీరప్పన్ చనిపోయాడు. దీంతో అప్పటివరకు ఈ అడవులపై కొనసాగిన పోలీస్ నిఘా ఆ తర్వాత క్రమంగా పలుచపడింది. దీంతో ఉత్తర తెలంగాణ, బస్తర్, ఏఓబీ తర్వాత నాలుగో గెరిల్లా జోన్‌గా కర్ణాటక -కేరళ-తమిళనాడు (కేకేటీ) సరిహద్దులో ఉన్న అటవీ ప్రాంతాన్ని 2011లో మావోయిస్టు పార్టీ ప్రకటించినట్టు సమాచారం. ఈ మేరకు కొత్తగా సదరన్ రీజనల్ బ్యూరోను ఏర్పాటు చేసింది. 2011లో విస్తరణ పనులు మొదలు పెడితే 2014 నాటికి ఈ జోన్‌లో పొలిటికల్ మిలిటరీ క్యాంపెయిన్ చేయగలిగే స్థాయికి చేరుకుంది.

2015లో గెరిల్లా జోన్ -5

పొలిటికల్ మిలిటరీ క్యాంపెయిన్ మొదలు పెట్టిన మరుసటి ఏడాది నుంచే కేకేటీ జోన్‌లో మావోలకు ఎదురుగాలి వీయడం మొదలైంది. ఆ పార్టీకి చెందిన కీలకనేతల అరెస్ట్, లొంగుబాటు లేదా ఎన్‌కౌంటర్లలో చనిపోవడం వంటి ఘటనలతో ఆశించిన స్థాయిలో పుంజుకోలేకపోయారు. దీంతో అప్రమత్తమైన ఆ పార్టీ మధ్యప్రదేశ్- మహారాష్ట్ర- ఛత్తీస్‌గఢ్ (ఎంఎంసీ) సరిహద్దు ప్రాంతాన్ని గెరిల్లా జోన్-5గా 2015 లో ప్రకటించింది. ఈ రెండు గెరిల్లా జోన్లలో పార్టీని విస్తరించే పనులను కేంద్ర కమిటీతోపాటు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ, సెంట్రల్ రీజినల్ బ్యూరోలో ఉన్న పెద్ద తలలకు అప్పగించినట్టు చెబుతారు.



ఎవరు ఉన్నారు..ఎవరు వెళ్లారు

గెరిల్లా జోన్లుగా ప్రకటించిన కేకేటీ, ఎంఎంసీ ప్రాంతాల్లో ఆ పార్టీకి ఉత్తర తెలంగాణ, బస్తర్, ఏఓబీ ప్రాంతాల్లో దక్కినంత ఆదరణ లభించలేదు. కానీ ఆ పార్టీకి అక్కడ పునాదులైతే పడ్డాయి. కేకేటీ జోన్‌లో వెస్టర్న్ ఘాట్ స్పెషల్ జోనల్ కమిటీ ఏర్పాటైంది. కేరళలోని కన్నూరు, కోజికోడ్, వయనాడ్ జిల్లాల్లోని అటవీ ప్రాంతాలు మావోయిస్టులకు షెల్టర్ జోన్లుగా మారాయని నిఘా వర్గాల అంచనా. ఇక్కడ పార్టీ విస్తరణ కార్యక్రమాలను నల్లగొండ జిల్లాకు చెందిన ఉయికే గణేశ్ అలియాస్ పాక హనుమంతు చూస్తున్నట్టు సమాచారం. ఎంఎంసీ గెరిల్లా జోన్‌లో మహారాష్ట్రలో గోండియా, మధ్యప్రదేశ్‌లో బాల్‌ఘాట్, ఛత్తీస్‌గఢ్‌లో రాజ్‌నంద్‌గావ్ జిల్లాల్లో ఆ పార్టీకి పట్టు చిక్కినట్టు తెలుస్తోంది. అందువల్లే ఇక్కడ కొత్తగా దర్ర డివిజన్ కమిటీ ఏర్పాటైంది. అయితే ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఈ డివిజన్ కమిటీ సభ్యుడు జగదీశ్ మరణించడం ఆ పార్టీకి నష్టాన్ని చేకూర్చింది. అయినా ఈ మూడు జిల్లాల సరిహద్దులో విస్తరించిన కన్హా నేషనల్ పార్క్, భరాన్‌దేవ్ టైగర్ రిజర్వ్, అమర్‌కంటక్ అడవుల్లో మావోయిస్టులకు ఆశ్రయం ఇచ్చే పరిస్థితులు ఉన్నట్టు సానుభూతిపరులు అంటున్నారు. ఇవి కాకుండా మావోలకు పట్టున్న ఏఓబీ నుంచి జార్ఖండ్, బీహార్- బెంగాల్ మీదుగా విదేశాల్లో ఉన్న సేఫ్‌డెన్‌లకు మావోలు చేరుకునే అవకాశం ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో మావోయిస్టు పార్టీ అగ్రనేతల్లో ఎంత మంది కర్రిగుట్టల మీద ఉన్నారు? ఎంత మంది సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లారనే చర్చ సాగుతోంది.

కాంగ్రెసోళ్లకే ఇందిరమ్మ ఇళ్లా?

అర్హులమైన మాకు ఇవ్వరా?

- ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపై పలు జిల్లాల్లో నిరసనలు
- జమ్మికుంట మున్సిపల్ కార్యాలయం ఎక్కిన దివ్యాంగుడు
- ఇల్లందకుంట మండలం సిరిసేడులో మహిళల ఆందోళన
- ఖమ్మం జిల్లాలో గ్రామ కార్యదర్శిని నిర్బంధించిన గ్రామస్తులు
- సూర్యాపేట జిల్లాలో ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి



వాటర్ ట్యాంక్ పైకి ఎక్కిన బయ్య కనకయ్య



సిరిసేడులో వాటర్ ట్యాంక్ ఎక్కేందుకు ప్రయత్నిస్తున్న మహిళలు



జమ్మికుంట మున్సిపల్ కార్యాలయం పైకి ఎక్కిన దివ్యాంగుడు కోటేశ్వర్



గ్రామపంచాయతీ కార్యాలయానికి తాళం వేసిన గ్రామస్తులు

జమ్మికుంట/ఇల్లందకుంట/ముదిగొండ/తుంగతుర్తి: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో మంగళవారం పలుచోట్ల గందరగోళం ఏర్పడింది. అసలైన లబ్ధిదారులకు కాకుండా కాంగ్రెస్ కార్యకర్తలకే ఇళ్లు ఇస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేశారు. పలుచోట్ల అధికారుల నిర్బంధం, ఆత్మహత్యాయత్నాలు కూడా చోటుచేసుకున్నాయి. కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంటలో దివ్యాంగుడు, ఇల్లందకుంట మండలం సిరిసేడులో మహిళలు మంగళవారం ఆందోళనకు దిగారు. అన్ని అర్హతలు ఉన్న తనకు కనీసం దివ్యాంగ కోటాలోనైనా ఇల్లు ఇవ్వలేదని దొంకటి కోటేశ్వర్ మున్సిపల్ కార్యాలయ భవనం ఎక్కి ఆందోళనకు దిగాడు. కాంగ్రెసోళ్లకే ఇళ్లు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశాడు. ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామంలో అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చారని పలువురు మహిళలు రోడ్డుపై బైఠాయించారు. కొందరు మహిళలు మంచినీటి ట్యాంక్ ఎక్కేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. గ్రామంలో 18 మంది కాంగ్రెసోళ్లకు ఇళ్లు ఇచ్చారని, దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని మహిళలు డిమాండ్ చేశారు.

గ్రామకార్యదర్శి నిర్బంధం

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో అర్హుల పేర్లు లేవంటూ ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం వనంవారి కిష్టాపురం గ్రామస్తులు నిరసన తెలిపారు. మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ కార్యదర్శి శ్రీనివాస్‌ను నిర్బంధించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో అనర్హుల పేర్లు ఉన్నాయని ఆందోళనకు దిగారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు వచ్చి సమాధానం చెప్పేవరకు తాళం తీసే ప్రసక్తే లేదని భీష్మించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని కార్యదర్శిని విడిపించారు. ఈ విషయంపై మండల ప్రత్యేకాధికారి పెద్ద రాంబాబు మాట్లాడుతూ.. గ్రామంలో అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు.

ఇల్లు రాలేదని ఆత్మహత్యాయత్నం

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం వెలుగుపల్లి గ్రామానికి చెందిన బయ్య కనకయ్య తనకు ఇందిరమ్మ ఇల్లు రాలేదని వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. పోలీసులు అక్కడికి చేరుకుని కనకయ్యకు నచ్చజెప్పి కిందికి దింపారు. ఇందిరమ్మ ఇల్లు కావాలంటే రూ.50 వేలు ఇవ్వాలని గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు డిమాండ్ చేస్తే.. ముందుగా రూ.20 వేలు ఇచ్చానని కనకయ్య తెలిపాడు. డబ్బు తీసుకొని కూడా ఇల్లు ఇవ్వలేదని వాపోయాడు. ఇందిరమ్మ ఇళ్ల ప్రత్యేక అధికారిగా ఉన్న ఎంపీడీవో శేషుకుమార్ ఈ విషయంపై మాట్లాడుతూ.. కనకయ్య భార్య సైదమ్మ పేరు మీదుగా ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని తెలిపారు.

బెట్టింగ్ ప్రకటనలు తొలగించాం

- హైకోర్టుకు స్పష్టం చేసిన మెట్రో

సాక్షి, హైదరాబాద్: మెట్రోరైళ్లలో బెట్టింగ్ యాప్‌ల ప్రకటనలను పూర్తిగా తొలగించామని, ఇప్పుడు ఎలాంటి యాడ్స్ లేవని అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి హైకోర్టుకు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన మెమో దాఖలు చేశారు. నిబంధనల ప్రకారం మెట్రో రైలు లోపల, ప్లాట్‌ఫామ్‌లు, స్టేషన్లలో ప్రకటనలన్నీ ఎల్‌అండ్‌టీ పరిధిలోకి వస్తాయన్నారు. బెట్టింగ్ యాప్‌ల ప్రకటనల గురించి జీహెచ్‌ఎంసీ తెలియజేయడంతో హెచ్‌ఎంఆర్‌ఎల్ దీనిపై ఎల్‌అండ్‌టీకి లేఖ రాసిందని చెప్పారు. బెట్టింగ్ యాప్‌లతో మెట్రో రైల్వే డిపార్ట్‌మెంట్ కుదుర్చుకున్న ఒప్పందాలపై దర్యాప్తు చేయించాలని కోరుతూ న్యాయవాది నాగూర్‌బాబు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. మెట్రో రైలులో, ఫ్లాట్‌ఫారాలు, స్టేషన్, హోర్డింగ్‌లలో బెట్టింగ్ యాప్‌లపై ప్రకటనలను వెంటనే నిలిపివేసేలా ఆదేశించాలని కోరారు. మెట్రో రైల్వేకు బెట్టింగ్ యాప్ సంస్థలకు మధ్య కుదిరిన లావాదేవీలపై దర్యాప్తు చేపట్టేలా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు ఆదేశాలు జారీ చేయా లన్నారు. బెట్టింగ్ యాప్‌లపై ఈడీ ఇప్పటికే కేసు నమోదు చేసిన నేపథ్యంలో ఈ ఒప్పందాలపై విచారణ జరపాలని కోరారు. ఈ పిల్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. ఏజీ వాదనలను నమోదు చేసుకున్న ధర్మాసనం విచారణ వాయిదా వేసింది.

ఎంఎస్‌ఎంఈలు భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక

- 'ఎంఎస్‌ఎంఈ వివాద పరిష్కార' పుస్తకాన్ని ఆవిష్కరించిన కేంద్రమంత్రి అర్జున్ మేఘవాల్



సాక్షి, హైదరాబాద్: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఈలు) భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రాం మేఘవాల్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో 'ఎంఎస్‌ఎంఈ అభివృద్ధి చట్టం (2006) ప్రకారం ఆలస్యం అయిన చెల్లింపులపై వివాద పరిష్కారం పట్ల రెడీ రెకనర్' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఆసియా లా హౌస్ ప్రచురించిన ఈ విస్తృత మార్గదర్శిని, టీబీహెచ్‌సీబీఎల్ వ్యవస్థాపక డైరెక్టర్ బి.ఎర్రంరాజు, క్రక్స్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ మిస్ హేమా జైన్ సంయుక్తంగా దీన్ని రచించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మేఘవాల్ మాట్లాడుతూ ఈ పుస్తకం భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి, ఉపాధి సృష్టికి కీలకమైన ఎంఎస్‌ఎంఈలు ఎదుర్కొంటున్న సమస్యలు, చెల్లింపుల సమస్యను పరిష్కరించేందుకు దోహద పడుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. మిస్ హేమా జైన్ సుదీర్ఘ వ్యాపార అనుభవం, ఎంఎస్‌ఎంఈలకు ఆమె అందిస్తున్న మెంటరింగ్‌ను మంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. హేమా జైన్ మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈలు ఎకానమీకి వెన్నెముకలుగా ఉన్నప్పటికీ, ఇంకా మెరుగైన మద్దతు అవసరమన్నారు.

పాక్‌కు భారత ఫార్మా ఉత్పత్తులు బంద్!

న్యూఢిల్లీ: భారత్–పాకిస్తాన్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలు నానాటికీ క్షీణిస్తున్నాయి. భారత్ నుంచి పాకిస్తాన్‌ను ఫార్మా ఉత్పత్తులను ఎగుమతి చేయకుండా నిషేధం విధించే సంకేతాలు కనిపిస్తున్నాయి. మన దేశం నుంచి ఎగుమతి అవుతున్న ఫార్మా ఉత్పత్తుల వివరాలు ఇవ్వాలని కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ పరిధిలోని డిపార్టుమెంట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్స్(డీఓపీ) కేంద్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖకు చెందిన ఎగుమతుల సంస్థ 'ఫార్మెక్సిల్'ను ఆదేశించింది. ఇక్కడి నుంచి పాకిస్తాన్‌కు వెళ్లే ఔషధాలు, ఫార్మాస్యూటికల్స్ జాబితా రూపొందించాలని పేర్కొంది. ఈ వివరాలు చాలా అత్యవసరమని స్పష్టంచేసింది. ఇండియా నుంచి ప్రపంచవ్యాప్తంగా 200కుపైగా దేశాలు ఫార్మా ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటున్నాయి. ఇందులో పాకిస్తాన్ 38వ స్థానంలో ఉంది. ప్రధానంగా ఇండియా నుంచి యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియెంట్స్(ఏపీఐ) పాకిస్తాన్ దిగుమతి చేసుకుంటోంది. భారత్‌నుంచి దిగుమతులు ఆగిపోతే ఔషధాల ధరలు విపరీతంగా పెరిగిపోయే ప్రమాదం ఉంటుంది.

పాక్ విమానాలకు నో ఎంట్రీ

పాక్ నౌకలపైనా ఆంక్షలు విధించాలని యోజన

న్యూఢిల్లీ: పాకిస్తాన్‌పై మరిన్ని కఠిన ఆంక్షలను భారత ప్రభుత్వం సిద్ధమవుతోంది. తమ గగనతలం గుండా పాకిస్తానీ ఎయిర్‌లైన్స్ విమానాలు ప్రయాణించకుండా నిషేధం విధించాలని యోచిస్తున్నట్లు తెలిసింది. భారత గగనతలాన్ని మూసివేస్తే పాకిస్తాన్ విమానాలకు ప్రయాణం మరింత భారమవుతుంది. సింగపూర్, మలేషియా వంటి ఆగ్నేయ ఆసియా దేశాలకు వెళ్లాలంటే చుట్టూ తిరిగి చైనా లేదా శ్రీలంక మీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది. మరోవైపు పాకిస్తాన్ నౌకలపైనా ఆంక్షలు అమల్లోకి వచ్చే పరిస్థితి కనిపిస్తోంది. భారత ఓడరేవుల్లో పాకిస్తాన్ నౌకలకు ఎలాంటి అనుమతి ఇవ్వకూడదని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. భారత ప్రాదేశిక జలాల్లో ప్రవేశానికి సైతం అనుమతి ఉండబోదు. ఇండియా విమానాలు ప్రయాణించకుండా తమ గగనతలాన్ని పాక్ ప్రభుత్వం గత వారం మూసి వేసిన సంగతి తెలిసిందే. పహల్గాం ఉగ్రవాద దాడి తర్వాత భారత్–పాక్ మధ్య ఉద్రిక్తతలు పెరుగు తున్నాయి. ఇరుదేశాలు పరస్పరం ఆంక్షలు విధి స్తున్నాయి. ప్రధానంగా సింధూనది జలాల ఒప్పందాన్ని భారత ప్రభుత్వం నిలిపివేయడం సంచలనాత్మకంగా మారింది. ఇది తమపై ముమ్మాటికీ ప్రకటనేనని పాక్ ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది.

పాక్ రక్షణ మంత్రి 'ఎక్స్' ఖాతా నిలిపివేత

న్యూఢిల్లీ: పాకిస్తాన్ రక్షణ శాఖ మంత్రి ఖ్వాజా అసిఫ్ 'ఎక్స్' ఖాతాను భారత ప్రభుత్వం మంగళవారం నిలిపివేసింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్తాన్‌తో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. పాకిస్తాన్ ప్రభుత్వ 'ఎక్స్' ఖాతాను ఐదు రోజుల క్రితమే రద్దు చేసిన సంగతి తెలిసిందే. అలాగే 16 పాకిస్తానీ యూట్యూబ్ చానళ్లను భారత ప్రభుత్వం సోమవారం నిషేధించింది. ఆయా చానళ్లలో ఇండియాకు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టేలా వీడియోలు, ఫొటోలు, విద్వేషపూరిత వ్యాఖ్యలు, వార్తలు పోస్టు చేస్తున్నట్లు గుర్తించారు. డాన్ న్యూస్, ఏఆర్‌వై న్యూస్, జియోన్యూస్, సమా టీవీతోపాటు పలు వ్యక్తిగత యూట్యూబ్ ఖాతాలపై నిషేధం అమల్లోకి వచ్చింది. మాజీ క్రికెటర్ షోయబ్ అక్తర్ యూట్యూబ్ చానల్ ప్రసారాలు ఇండియాలో బంద్ అయ్యాయి. పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా అసిఫ్ ఇటీవల మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాద గ్రూప్‌లకు నిధులు అందజేస్తున్నామని, అన్ని విధాలుగా మద్దతు ఇస్తున్నామని అంగీకరించారు. అమెరికా కోసమే గత 30 ఏళ్లుగా ఈ చెత్త పనులన్నీ చేస్తున్నామని చెప్పారు.

కశ్మీర్‌లో 48 పర్యాటక ప్రాంతాలు మూసివేత



అనంత్‌నాగ్‌లోని మొఘల్ గార్డెన్‌కు తాళం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో 48 పర్యాటక ప్రాంతాలను అధికారులు మూసివేశారు. పర్యాటకులను అనుమతించడం లేదు. ఇక్కడ ఉగ్రవాద దాడులు జరిగే ప్రమాదం ఉందన్న అంచనాతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు మంగళవారం వెల్లడించారు. కశ్మీర్ లోయలో 87 పబ్లిక్ పార్కులు, గార్డెన్లు ఉండగా, సున్నితమైన ప్రాంతాల్లోని 48 టూరిస్టు సైట్లు మూతపడ్డాయి. గేట్లకు తాళాలు వేశారు. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేదాకా పర్యాటకులెవరూ రావొద్దని అధికారులు విన్నవించారు. రాబోయే రోజుల్లో మరికొన్ని పర్యాటక ప్రాంతాలను మూసివేయనున్నట్లు తెలిపారు. జమ్మూకశ్మీర్‌లో భద్రతపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహి స్తున్నామని వెల్లడించారు. పర్యాటకుల భద్రతను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకుంటున్నామని స్పష్టంచేశారు. మరోవైపు కొకెర్‌నాగ్, దుక్సుమ్, సింథాన్ టాప్, అచ్చాబల్, బంగూస్ వ్యాలీ, మార్గాన్ టాప్, తోసామైదాన్ వంటి పర్యాటక ప్రాంతాల్లో జనం రాకపై అధికారులు ఆంక్షలు విధించారు. పరిమిత సంఖ్యలోనే రావాలని సూచించారు. కొన్ని పర్యాటక ప్రాంతాలకు జనం చేరుకోకుండా రహదారులను మూసివేశారు. దక్షిణ కశ్మీర్‌లోని మొఘల్ గార్డెన్స్‌ను ఎవరినీ అనుమతించడం లేదు.



మంగళవారం తన నివాసంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్, ఎన్ఎస్ఏ దోవల్, సీడీఎస్ చౌహాన్, త్రివిధ దళాధిపతులు జనరల్ ద్వివేది, అడ్మిరల్ దినేశ్ త్రిపాఠి, ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్‌సింగ్‌తో ఉన్నత స్థాయి సమావేశంలో మోదీ

సైన్యానికి పూర్తి స్వేచ్ఛ

ప్రధాని నరేంద్ర మోదీ సంచలన నిర్ణయం

'పహల్గాం'కు త్వరలో దీటైన జవాబు ● ఎప్పుడు, ఎలాగన్నది వారిష్టమని స్పష్టీకరణ

న్యూఢిల్లీ: 'పహల్గాం' ముష్కరులకు, వెనకుండి వారిని నడిపిస్తున్న దాయాది దేశానికి మర్చిపోలేని గుణపాఠం చెప్పేందుకు పూర్తిస్థాయిలో రంగం సిద్ధమవుతోంది. ఆ పాశవిక ఉగ్ర దాడికి పాల్పడ్డ, ప్రేరేపించిన వారు కలలో కూడా ఊహించని రీతిలో శిక్షించి తీరతామని ప్రతిజ్ఞ చేసిన ప్రధాని మోదీ ఆ దిశగా కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయమై సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నట్టు స్పష్టం చేశారు. ''దేశ భద్రతకు ముప్పుగా మారిన ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో అంతం చేసి తీరాల్సిందే. ప్రజలంతా అదే కోరుకుంటున్నారు. ఉగ్రవాదాన్ని ఖతం చేయాలన్నది దేశ సమష్టి సంకల్పం. పహల్గాం ఉగ్ర దాడికి దీటైన జవాబు ఇవ్వక తప్పదు. ఉగ్ర ముష్కరులపై మన ప్రతిస్పందన ఎలా ఉండాలో నిర్ణయించే స్వేచ్ఛను సైన్యానికే ఇస్తున్నాం. శత్రువుపై ఎప్పుడు, ఎక్కడ, ఎలా దాడి చేయాలన్న దానిపై ఎలాంటి నిర్ణయమైనా సైన్యం తనంత తానుగా తీసుకోవచ్చు'' అని పేర్కొన్నారు. ప్రధాని మంగళవారం ఢిల్లీలోని తన నివాసంలో త్రివిధ దళాల అధిపతులు జనరల్ ఉపేంద్ర ద్వివేది, అడ్మిరల్ దినేశ్ కె.త్రిపాఠి, ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్‌తో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. గంటన్నరపాటు జరిగిన ఈ కీలక భేటీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో పాటు చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనీల్ చౌహాన్ కూడా పాల్గొన్నారు. పహల్గాం దాడి, తదనంతర పరిణామాలపై లోతుగా చర్చించారు. తగిన ప్రతీకారం తీర్చుకుని తీరాల్సిందేనని ప్రధాని పునరుద్ఘాటించారు. సైనిక దళాల శక్తి సామర్థ్యాలపై తనకు పూర్తి విశ్వాసముందన్నారు. ''ఉగ్రవాదంపై పోరాటంలో జవాన్లు పూర్తిస్థాయిలో స్వేచ్ఛగా వ్యవహరించవచ్చు. సొంతంగా నిర్ణయాలు తీసుకోవచ్చు'' అని స్పష్టం చేశారు. సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాక్ తీరుపై ప్రధాని ఈ సందర్భంగా తీవ్రంగా మండిపడ్డట్టు సమాచారం. ఉగ్ర ముష్కరులకు, వారి సూత్రధారులకు చెప్పబోయే గుణపాఠం దాయాది జన్మలో మర్చిపోలేని రీతిలో ఉండాలని ఆయన నిర్దేశించారు. ఏప్రిల్ 22న జమ్మూ కశ్మీర్‌లో పహల్గాం సమీపంలోని బైసారన్ లోయలో అమాయక పర్యాటకులపై పాక్ ప్రేరేపిత లష్కరే తొయిబా ముసుగు సంస్థకు చెందిన ముష్కరులు కాల్పులకు తెగబడి 26 మందిని పొట్టన పెట్టుకోవడం తెలిసిందే. దీనిపై 140 కోట్ల పై చిలుకు భారతీయుల రక్తం మరిగిపోతోందని, ముష్కరులతో పాటు వారిని ప్రేరేపించిన వారిని కూడా కఠినాతి కఠినంగా శిక్షించి తీరతామని ఆదివారం మన్ కీ బాత్‌లో కూడా మోదీ పునరుద్ఘాటించారు.

హోం శాఖ ఉన్నత స్థాయి భేటీ

త్రివిధ దళాధిపతులతో మోదీ సమావేశానికి ముందే మంగళవారం కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ సారథ్యంలో మరో ఉన్నతస్థాయి భేటీ జరిగింది. బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ దల్జీత్ సింగ్ చౌదరి, నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జీ) డీజీ బ్రిఘూ శ్రీనివాసన్, అస్సాం రైఫిల్స్ డీజీ లెఫ్టినెంట్ జనరల్ వికాస్ లఖేరా, సశస్త్ర సీమాబల్ అదనపు డీజీ అనుపమ నీలేకర్ చంద్రతో పాటు పలువురు సీనియర్ సైనికాధికారులు ఈ కీలక భేటీలో పాల్గొన్నారు. పహల్గాం దాడి నేపథ్యంలో ఉగ్రవాదుల అణచివేతతోపాటు దేశ సరిహద్దుల్లో భద్రతను మరింత పటిష్టం చేయాలని నిర్ణయించినట్టు చెబుతున్నా అసలు అజెండా వేరేనంటున్నారు. భేటీలో చర్చించిన అంశాలను అత్యంత రహస్యంగా ఉంచారు. పాక్, బంగ్లాదేశ్ సరిహద్దుల రక్షణ బీఎస్ఎఫ్ బాధ్యత. మయన్మార్ సరిహద్దులను అస్సాం రైఫిల్స్ గస్తీ కాస్తుంది. ఇక ఎన్ఎస్‌జీ ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్పెషలైజ్డ్ కమెండో విభాగం.

2016లో సర్జికల్ స్ట్రైక్స్ 2019లో 'బాలాకోట్' ఇప్పుడెలా ఉంటుందో!

ప్రతీకార చర్యలపై ఉత్కంఠ

సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇస్తూ ప్రధాని తీసుకున్న నిర్ణయంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ముష్కర మూకపై, వారికి అన్నివిధాలా వెన్నుదన్నుగా నిలుస్తున్న దాయాదిపై ప్రతీకార చర్యలు ఎలా ఉంటాయన్నది ఆసక్తికరంగా మారింది. ఉగ్ర దాడులకు ప్రతిస్పందనగా మోదీ సర్కారు పాక్ భూభాగంపై 2016లో చేపట్టిన సర్జికల్ స్ట్రైక్స్, 2019లో చేసిన బాలాకోట్ వైమానిక దాడులు ప్రపంచవ్యాప్తంగా సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. భారత్ నుంచి ఈ స్థాయి దాడులను ఊహించని పాక్ ఒక్కసారిగా బిత్తరపోయింది. 2016లో జమ్మూ కశ్మీర్‌లోని ఉరి సెక్టర్లో సైనిక క్యాంప్‌పై జైషే మహ్మద్‌కు చెందిన నలుగురు ఉగ్రవాదులు పాశవిక దాడికి తెగబడ్డారు. 18 మంది సైనికులను పొట్టన పెట్టుకున్నారు. దానికి ప్రతీకారంగా సైన్యానికి చెందిన స్పెషల్ ఫోర్సెస్ కమెండోలు పాక్ భూభాగంలోకి చొచ్చుకెళ్లి సర్జికల్ స్ట్రైక్స్ చేశారు. కనీసం 200 మందికి పైగా ఉగ్రవాదులను అంతం చేశారు. 2019లో జమ్మూలోని పుల్వామాలో సీఆర్పీఎఫ్ కాన్వాయ్‌పై ఉగ్రవాదులు జరిపిన ఆత్మాహుతి దాడిలో 40 మంది అమరులయ్యారు. ఇందుకు ప్రతీకారంగా పాక్‌లోని బాలాకోట్‌లో ఉగ్రవాదుల స్థావరాలపై అత్యంత కచ్చితత్వంతో వైమానిక దాడులు జరిపి వందలాది మంది ముష్కరులను మట్టుబెట్టింది. 12 మిరాజ్ ఫైటర్ జెట్లు పాక్ కన్నుగప్పి, వారి రాడార్ వ్యవస్థలను ఏమార్చి లక్ష్యాలపై నిప్పుల వర్షం కురిపించాయి. బాలాకోట్‌లోని జైషే మహ్మద్ శిక్షణ స్థావరాలను నామరూపాల్లేకుండా చేసింది. గత అనుభవాల నేపథ్యంలో సర్జికల్ స్ట్రైక్స్, వైమానిక దాడులను ఎదుర్కొనేందుకు పాక్ సైన్యం పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతున్నట్టు వార్తలొస్తున్నాయి. కనుక ఈసారి కూడా భారత ప్రతి చర్య దాయాది ఊహించని విధంగా ఉంటుందని రక్షణ నిపుణులు అంటున్నారు. ''పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో క్షిపణి దాడుల వంటివి ఒక ఆప్షన్. కానీ ఆ క్రమంలో పాక్ ఆర్మీ యూనిట్లకు నష్టం వాటిల్లితే పరిస్థితి అదుపు తప్పి పూర్తి స్థాయి యుద్ధానికి దారితీసే ప్రమాదం లేకపోలేదు. కనుక ఏం జరుగుతుందన్నది వేచి చూడాల్సిందే'' అని చెబుతున్నారు.

నేడు కేంద్ర కేబినెట్ భేటీ

- అంతకుముందు కీలక సీసీఎస్ భేటీ
- రాజకీయ, ఆర్థిక కమిటీల భేటీలు కూడా
- 'పహల్గాం' కార్యాచరణపై కీలక నిర్ణయాలు

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ సారథ్యంలో బుధవారం సాయంత్రం కేంద్ర కేబినెట్ సమావేశం జరగనుంది. అంతకుముందు ఆయన నేతృత్వంలో రోజంతా అతి కీలకమైన అత్యున్నత స్థాయి సమావేశాలు జరగనున్నాయి. ఉదయం 11 గంటలకు భద్రత వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఎస్), తర్వాత రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీపీఏ), ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ భేటీలు ఉంటాయి. జాతీయ భద్రతకు సంబంధించి అత్యున్నత నిర్ణాయక విభాగమైన సీసీఎస్ సమావేశం వారం వ్యవధిలోనే ఇది రెండోసారి కావడం విశేషం. పహల్గాం దాడి జరిగిన మర్నాడే ఏప్రిల్ 23న జరిగిన సీసీఎస్ భేటీలో పాక్‌పై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ''ఈ సమావేశాలన్నింటికీ పహల్గాం దాడే ప్రధాన అజెండా అని తెలుస్తోంది. పాక్‌కు బుద్ధి చెప్పేందుకు తీసుకోవాల్సిన సైనిక, రాజకీయ, ఆర్థికపరమైన నిర్ణయాలను సీసీఎస్ తదితర భేటీల్లో ఖరారు చేస్తారు. అనంతరం జరిగే మంత్రివర్గం భేటీలో వాటికి ఆమోదముద్ర వేస్తారు'' అని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. పహల్గాం దాడి తర్వాత కేంద్ర కేబినెట్ సమావేశం అవుతుండడం ఇదే తొలిసారి.

పార్లమెంట్‌ను సమావేశపర్చండి

మోదీకి ఖర్గే, రాహుల్ లేఖ

సాక్షి, న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లో పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో పార్లమెంట్‌ను ప్రత్యేకంగా సమావేశపర్చాలని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ ప్రధాని మోదీని కోరారు. ఈ పాశవిక చర్యపై చర్చించడం తోపాటు దేశమంతా ఐక్యంగా ఉందనే విషయాన్ని చాటిచెప్పాల్సిన అవసరముందన్నారు. గత వారం చోటుచేసుకున్న దారుణ ఘటనలో 26 మంది పర్యాటకులు అసువులు బాయడం తెల్సిందే. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. వివిధ పార్టీలకు చెందిన ఎంపీలు పార్లమెంట్ సమావేశాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని ఇప్పటికే కోరారు. 'ఈ సమయంలో ఐక్యత, సంఘీభావం ప్రకటించాల్సిన అవసరముంది. వీలైనంత త్వరగా పార్లమెంటు ఉభయ సభల ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయడం ముఖ్యమని ప్రతిపక్షం విశ్వసిస్తోంది. అమాయక పౌరులపై జరిగిన క్రూరమైన ఉగ్రవాద దాడిని ఎదుర్కోవడానికి మనందరి సమిష్టి సంకల్పానికి ఇది శక్తివంతమైన ప్రదర్శన అవుతుంది'అని ఆయన తెలిపారు. ప్రధానికి రాసిన లేఖలో రాహుల్ గాంధీ సైతం ఇదే విషయం తెలిపారు.

ఉగ్రవాదులపై స్పైవేర్ వాడితే తప్పేంటి?

పెగాసస్ నిఘా వ్యవహారంలో సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ: దేశభద్రతకు ముప్పుగా వాటిల్లిన ఉగ్రవాదులపై నిఘా సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తే తప్పుబట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. దేశ భద్రత, సార్వభౌమత్వానికి సంబంధించిన ఏదైనా నివేదికను రూపొందిస్తే దానిని అందరికీ అందుబాటులో ఉంచాల్సిన అవసరం లేదని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌ల సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం స్పష్టంచేసింది. ''సాంకేతిక కమిటీ ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న సంబంధిత కీలక నివేదిక పట్ల వ్యక్తులు ఏవైనా అభ్యంతరాలు వ్యక్తం చేస్తే వారికి మాత్రమే ఆ నివేదికను అందుబాటులో ఉంచుతాం. తమ వ్యక్తిగత గోప్యతకు భంగం వాటిల్లిందని ఆందోళన వ్యక్తంచేసిన నేపథ్యంలో ఆ నివేదికలోని వివరాలను కోరే హక్కు వాళ్లకు ఉంటుంది. అంతేగానీ దీనితో సంబంధంలేని ఇతర వ్యక్తులు వీధుల్లో చర్చించుకునేలా ఆ నివేదికను బహిర్గతంచేయబోం'' అని కోర్టు వ్యాఖ్యానించింది. దేశవ్యాప్తంగా పలు రంగాల ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు, విపక్ష నేతలు, పాత్రికేయులకు చెందిన దాదాపు 300కుపైగా ఫోన్లపై పెగాసస్ నిఘా సాఫ్ట్‌వేర్ ద్వారా భారత ప్రభుత్వ వర్గాలు నిఘా పెట్టాయని, హ్యాకింగ్‌కు పాల్పడ్డాయని గతంలో ఇంటర్నేషనల్ మీడియా కన్సార్షియం సంచలన ప్రకటన చేయడంతో వెంటనే సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. సంబంధిత పిటిషన్ల విచారణ మంగళవారం సుప్రీంకోర్టులో కొనసాగింది.

స్పైవేర్‌ను కేంద్రం వాడిందా చెప్పాలి

ఒక పిటిషనర్ తరఫున న్యాయవాది దినేశ్ ద్వివేది వాదించారు. '' ఈ ఉదంతంలో అసలు ఈ స్పైవేర్ కేంద్ర ప్రభుత్వం వద్ద ఉందా? ఆనాడు ఈ నిఘా సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించిందా?. అది వాస్తవమే అయితే అప్పటి నుంచి ఇప్పటిదాకా వాళ్లు ఆ స్పైవేర్‌ను అడ్డూఅదుపులేకుండా వాడుతున్నట్లు భావించాలి. ఈనాటికీ వాళ్లు దుర్వినియోగం చేస్తూ ఉండొచ్చు'' అని ద్వివేది వాదించారు. దీనిపై ధర్మాసనం స్పందించింది. '' తమ గోప్యతకు భంగం కల్గిందంటూ సంబంధిత వ్యక్తులు ఇచ్చిన ఆధారాలను సమర్పించండి. ఇక దేశ భద్రత, సార్వభౌమత్వానికి సంబంధించిన కీలక నివేదికను బహిర్గతం చేయాలని ఆదేశించలేం. ప్రస్తుత(పహల్గాం దాడి) పరిస్థితుల్లో మనం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలి'' అని కోర్టు వ్యాఖ్యానించింది. '' ఉగ్రవాదులకు వ్యతిరేకంగా స్పైవేర్‌ను వాడితే తప్పేంటి?. స్పైవేర్‌ను వాడటం తప్పుకాదు. అయితే ఎవరిపై వాడుతున్నామనేదే అసలు ప్రశ్న. దేశ భద్రత, రక్షణ విషయంలో ఏమాత్రం రాజీపడకూడదు. అయితే రాజ్యాంగం ప్రకారం ప్రతి పౌరుని వ్యక్తిగత గోప్యతను సైతం పరిరక్షించాల్సిందే'' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. '' వాట్సాప్ అకౌంట్లు హ్యాకింగ్‌కు గురయ్యాయని స్వయంగా వాట్సాప్ సంస్థే ధృవీకరించింది. ఇక్కడ ఆధారాలు కూడా ఉన్నాయి. అందుకే నివేదికను పిటిషనర్లకు ఇవ్వాల్సిందే'' అని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదించారు. ఈ వాదనను ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తప్పుబట్టారు. '' టెక్నికల్ కమిటీ ఇచ్చిన నివేదికను ఎలాంటి సవరణలు చేయకుండా పిటిషనర్లకు అందించాలి'' అని మరో సీనియర్ లాయర్ శ్యామ్ దివాన్ కోరారు. దీంతో ఈ కేసు వాదనను జూలై 30వ తేదీకి వాయిదావేస్తున్నట్లు కోర్టు తెలిపింది. 29 మంది బాధితుల సెల్‌ఫోన్లను సుప్రీంకోర్టు నియమిత టెక్నికల్ ప్యానెల్ పరీక్షించి వాటిలో ఐదింటిలో మాల్‌వేర్ ఉన్నట్లు కనుగొంది. అయితే అది పెగాసస్‌దే అని నిర్ధారించలేదు.

ట్రంప్ 'వందరోజుల' ర్యాలీ



వారెన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన రెండో విడత పాలనకు 100 రోజులు పూర్తయిన సందర్భంగా మంగళవారం మిషిగన్‌లో ర్యాలీ చేపట్టారు. అధికార పగ్గాలు చేపట్టాక నిర్వహించిన అతిపెద్ద ర్యాలీ ఇదే కావడం గమనార్హం. మంగళవారం మధ్యాహ్నం సెల్ఫ్‌రిడ్జ్ ఎయిర్ నేషనల్ గార్డ్ బేస్‌కు ట్రంప్ చేరుకున్నారు. డెట్రాయిట్‌లోని మకోంబ్ కమ్యూనిటీ కాలేజీలో జరిగిన సభకు చాలా తక్కువ మంది హాజరయ్యారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకే నేను పనిచేస్తున్నట్లు భావిస్తున్నా'అని వంద రోజుల పాలనపై ఓ ఇంటర్వ్యూలో ట్రంప్ పేర్కొన్నారు. కాగా, ట్రంప్ పాలనపై ప్రతి 10 మంది అమెరికన్లలో నలుగురు మాత్రమే సంతృప్తి వ్యక్తం చేస్తుండగా, ఆర్థిక రంగం, వాణిజ్య విధానాలపై ట్రంప్ రేటింగ్ మరింత దిగువకు చేరింది.

21వ శతాబ్ది అవసరాలకు తగ్గట్లు..

- విద్యా వ్యవస్థను ఆధునీకరిస్తున్నాం
- యుగ్మ్ ఆవిష్కరణ సదస్సులో మోదీ



న్యూఢిల్లీ: 21వ శతాబ్ది అవసరాలకు తగ్గట్లుగా విద్యా వ్యవస్థను ఆధునీకరిస్తున్నామని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. మంగళవారం ఢిల్లీలో భారత్ మండపంలో జరిగిన యుగ్మ్ ఆవిష్కరణ సదస్సులో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. '' దేశ భవితకు ఉపయోగపడేలా యువతను తీర్చిదిద్దడంలో విద్యావ్యవస్థ కీలకభూమిక పోషిస్తోంది. అందుకే విద్యావ్యవస్థ ఆధునీకరణను దృష్టిలో ఉంచుకుని అంతర్జాతీయ ప్రమాణాలకు అనువుగా నూతన విద్యావిధానాన్ని అమల్లోకి తెచ్చాం. కృత్రిమ మేధ, క్వాంటమ్ కంప్యూటింగ్, అడ్వాన్స్‌డ్ అనలైటిక్స్, స్పేస్ టెక్, హెల్త్ టెక్, సింథటిక్ బయోలజీలను ప్రోత్సహిస్తున్నాం. ఒక ఆలోచన ప్రయోగశాలలో మొగ్గ తొడికి అది వస్తువుగా మారి అత్యంత తక్కువ సమయంలో మార్కెట్లోకి అందుబాటులోకి రాగలగాలి. ఇందుకు తగ్గట్లు పరిశోధనా రంగం విస్తరించాలి. ఇందుకు విద్యాసంస్థలు, పెట్టుబడిదారులు, పరిశ్రమలు తమ వంతు చేయూతనందించాలి'' అని మోదీ పిలుపునిచ్చారు.

ఉగ్రవాదానికి పాక్ ఆజ్యం పోస్తోంది

ఆ దేశ రక్షణమంత్రే ఒప్పుకున్నారు ● ఐరాసలో ధ్వజమెత్తిన భారత్



యోజనా పాటిల్

ఐక్యరాజ్య సమితి: ఐక్యరాజ్య సమితి వేదికగా భారత్ పాకిస్తాన్‌ను కడిగిపారేసింది. ఉగ్రసంస్థలకు శిక్షణనిస్తూ, వాటికి ఆర్థిక తోడ్పాటునందిస్తూ చెత్త పనిచేశామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ స్వయంగా ఒప్పుకున్నారని ఐరాసలో భారత శాశ్వత ఉప ప్రతినిధి యోజనా పాటిల్ గుర్తుచేశారు. సోమవారం న్యూయార్క్‌లోని ఐరాసలో ఉగ్రవ్యతిరేక విభాగంలో 'ఉగ్రసంస్థల నెట్‌వర్క్‌ల బాధితులు' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ''ఐరాసలో ఒక భాగస్వామి (పాక్) ఇప్పటికీ భారత్‌పై నిరాధార ఆరోపణలు గుప్పిస్తోంది. వాళ్ల మంత్రి ఒప్పుకోలు ప్రకటనతో ఎవరూ ఆశ్చర్యపోవట్లేరు. కానీ అంతర్జాతీయ ఉగ్రవాదానికి మరింత ఊతమందిస్తూ ప్రాంతీయ అస్థిరతకు కారణమైన పాకిస్తాన్ నిజస్వరూపం మరోసారి బట్టబయలైంది'' అని ఆమె దాయాది దేశం తీరును ఎండగట్టారు.

లిబరల్ పార్టీ విజయం

- మెజారిటీ మార్కుకు అతి సమీపంలో...
- 'ట్రంప్' భయంతో అధికార పార్టీకే పట్టంకట్టిన కెనడా ప్రజలు
- ప్రధానిగా మార్క్ కార్నీ


టొరంటో: కెనడా సార్వత్రిక ఎన్నికల్లో ప్రధానమంత్రి మార్క్ కార్నీ సారథ్యంలోని అధికార లిబరల్ పార్టీ అనూహ్యంగా విజయం సాధించింది. జస్టిన్ ట్రూడో హయాంలో ప్రజాదరణ కోల్పోయిన అధికార పార్టీకి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆక్రమణ హెచ్చరికలు, ఆ దేశంతో వాణిజ్య యుద్ధం వంటివి కలిసొచ్చాయి. దీనికి తోడు ఆర్థిక నిపుణుడిగా పేరున్న కార్నీ అమెరికాకు వ్యతిరేకంగా కెనడా ప్రజలను ఏకం చేయడంలో విజయం సాధించారు. అధికార పార్టీ అనుకూల పవనాలను ప్రతిపక్ష కన్జర్వేటివ్ పార్టీ గట్టిగా ఎదుర్కొనలేక రెండోస్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ట్రంప్ మాదిరిగా కెనడా ఫస్ట్ అంటూ ఆ పార్టీ నేత పియెర్రె తీసుకువచ్చిన నినాదాన్ని జనం నమ్మలేదు. మొన్నమొన్నటిదాకా ప్రజాదరణలో ముందుండి, కెనడా తదుపరి ప్రధాని, ఫైర్‌బ్రాండ్ అంటూ ప్రచారం జరిగిన పియెర్రె స్వయంగా ఒట్టావా నియోజకవర్గంలో ఓటమి చవిచూశారు. పార్లమెంట్‌లోని మొత్తం 343 స్థానాలకు గాను కన్జర్వేటివ్‌ల కంటే లిబరల్స్‌కే అత్యధికంగా దక్కుతాయనే అంచనాలున్నాయి. ఫలితాలు వెలువడే సమయానికి లిబరల్ పార్టీకి చెందిన అభ్యర్థులు 168 సీట్లలో గెలుపు/ఆధిక్యం సాధించారు. మెజారిటీ మార్కు 172కు మరో నాలుగు సీట్ల దూరంలో ఆ పార్టీ నిలిచింది. ఒకవేళ 168 సీట్లకే పరిమితమైన పక్షంలో అధికారంలో కొనసాగాలన్నా, చట్టాలు చేయాలన్నా ఏదో ఒక చిన్న పార్టీని కలుపుకుని వెళ్లాల్సి ఉంటుంది.

కెనడా ఆక్రమణ ట్రంప్ తరంకాదు: మార్క్ కార్నీ

లిబరల్ పార్టీ నేతలు, కార్యకర్తలు సంబరాల్లో మునిగిపోయారు. ఈ సందర్భంగా ప్రధాని మార్క్ కార్నీ విజయోత్సవ ప్రసంగం చేశారు అమెరికా నుంచి ముప్పు ఎదురవుతున్న తరుణంలో కెనడా ప్రజలంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. కెనడా–అమెరికాలు పరస్పరం సహకరించుకుంటూ ప్రయోజనం పొందే విధానం రెండో ప్రపంచ యుద్ధం నుంచి అమలవుతోందని గుర్తుచేశారు. అది ఇటీవలే ముగిసిందని అన్నారు. అమెరికా తమను దగా చేసిందని మండిపడ్డారు. అమెరికా తీరుపట్ల దిగ్భ్రాంతికి గురైనప్పటికీ ఆ పాఠాలు ఎప్పటికీ మర్చిపోలేమని వ్యాఖ్యానించారు. కొన్ని నెలలుగా హెచ్చరికలు వస్తున్నాయని, మన భూమి, మన వనరులు, మన నీరు, మన దేశాన్ని ఆక్రమించుకుంటామని కొందరు బెదిరిస్తున్నారని ఆరోపించారు. కెనడాను విచ్ఛిన్నం చేసి, సొంతం చేసుకోవాలన్నదే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పన్నాగమని ధ్వజమెత్తారు. అది ఎప్పటికీ సాధ్యం కాదన్న సంగతి తెలుసుకోవాలని హితవు పలికారు. అయితే, ప్రపంచం మారుతోందన్న నిజాన్ని మనం గుర్తించాలని కెనడా పౌరులకు మార్క్ కార్నీ సూచించారు. సార్వత్రిక ఎన్నికల్లో లిబరల్ పార్టీ విజయం సాధించడంతో ఆయన మరోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టబోతున్నారు.

కెనడాతో బంధం బలోపేతం చేసుకుంటాం: మోదీ

కెనడా ఎన్నికల్లో లిబరల్ పార్టీ విజయం సొంతం చేసుకున్న నేపథ్యంలో ప్రధానమంత్రి మార్క్ కార్నీకి భారత ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం అభినందనలు తెలియజేశారు. కెనడాతో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలన్నదే తమ లక్ష్యమని ఉద్ఘాటించారు. రెండు దేశాల పౌరులకు ఎన్నో అవకాశాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ మేరకు మోదీ సోషల్ మీడియాలో పోస్టుచేశారు. ప్రజాస్వామ్య విలువలు, చట్టబద్ధ పాలనలకు ఇరుదేశాలూ కట్టుబడి ఉన్నాయని పేర్కొన్నారు.



ఫలితాల తర్వాత ప్రసంగిస్తున్న కార్నీ

సత్తా చాటిన భారత సంతతి అభ్యర్థులు

కెనడా ఎన్నికల్లో పలువురు భారత సంతతి అభ్యర్థులు సత్తా చాటారు. లిబరల్, కన్జర్వేటివ్ పార్టీల నుంచి రికార్డు స్థాయిలో 22 మంది అభ్యర్థులు విజయం సాధించడం గమనార్హం. ప్రస్తుతం కెనడా పార్లమెంట్ దిగువ సభలో 17 మంది భారత సంతతి ఎంపీలున్నారు. ఈ సంఖ్య 22కు చేరుకుంది. పంజాబ్ నుంచి వలసవెళ్లిన కుటుంబంలో జన్మించిన సుఖ్ దలీవాల్(లిబరల్) ఆరోసారి నెగ్గడం విశేషం. బర్నాబై సెంట్రల్ స్థానం నుంచి పోటీ చేసిన న్యూ డెమొక్రటిక్ పార్టీ(ఎన్‌డీపీ) నేత జగ్మీత్‌సింగ్(46) పరాజయం పాలయ్యారు. 18.1 శాతం ఓట్లతో మూడోస్థానంలో నిలిచారు. ఇక్కడ లిబరల్ పార్టీ అభ్యర్థి వేడ్ చాంగ్ గెలిచారు. కెనడా జనాభాలో 3 శాతానికి పైగా భారత సంతతి ప్రజలు ఉన్నారు.

చైనా రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం

బీజింగ్: చైనాలో ఘోర అగ్ని ప్రమాదం సంభవించింది. లియావోనింగ్ ప్రావిన్స్‌లోని లియావోయంగ్ నగరంలోని ఓ రెస్టారెంట్‌లో మంగళవారం మధ్యాహ్నం మంటలు చెలరేగిన ఘటనలో 22 మంది చనిపోగా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదానికి కారణాలు వెల్లడి కాలేదని అధికార వార్తాసంస్థ జిన్హువా తెలిపింది.



..కండ్ల నిండా దుమ్మండి!
బాటసింగారం పండ్ల మార్కెట్‌లో నిలువ నీడ దొరకంలేదు. అంతర్గత రహదారులు.. దుమ్మూ ధూళి, దుర్వాసనలకు నిలయంగా మారింది.

-10లో



కళల నగరం.. కలల సాగరం..
ప్రస్తుతం నగరంతో పాటు ఆర్ట్ గ్యాలరీల పరిధి పెరుగుతోంది. ముఖ్యంగా ప్రశాంతమైన పరిసరాలు ఉండే ప్రాంతాలకు ఇవి విస్తరిస్తున్నాయి.

- సిటీప్లస్‌లో

గరిష్ఠం/కనిష్ఠం
38.0/26.0

వాతావరణం
నగరంలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 38, కనిష్ఠంగా 26 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

ఉగ్రవాదం అణచివేతకు పూర్తి మద్దతు: మేయర్



నిరసన వ్యక్తం చేస్తున్న మేయర్, కార్పొరేటర్లు, అధికారులు

లక్డీకాపూల్: ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ తీసుకునే ఏ చర్యకైనా తమ పూర్తి మద్దతు ఉంటుందని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. పహల్గాం ఉగ్రదాడిపై మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన నిరసన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్ రెడ్డి, కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, కార్పొరేటర్లు, జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బందితో కలిసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పాల్గొన్నారు. ఉగ్రదాడి మృతులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... పహల్గాంలో ఉగ్రదాడి భారతీయుల గుండెలను కలచి వేసిందన్నారు. ఉగ్రవాదంపై ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయన్నారు. ఉగ్రదాడి.. మానవతా విలువలకు, శాంతికి, సమాజ శ్రేయస్సుకు వ్యతిరేక చర్యగా ఆమె అభివర్ణించారు. ఈ దారుణంపై కులమతాలకు అతీతంగా ఐక్యతతో స్పందించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రధాని మోదీ దేశ రక్షణకు, ప్రజల భద్రతకు తీసుకునే ఏ చర్యకైనా పూర్తి మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల కార్పొరేటర్లు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

చదివేది ఏడో తరగతి.. వాడేది ఐ ఫోన్

ట్యూషన్ మాస్టారునే బుక్ చేసిన స్టూడెంట్

జీడిమెట్ల: ఆ బాలుడు ఏడో తరగతి చదువుతున్నాడు. ఇంట్లో ఎవరూ చూడకుండా సంవత్సర కాలంగా ఇంట్లో ఐ ఫోన్ వాడుతున్నాడు. కుమారుడు ఐ ఫోన్ వాడటాన్ని గమనించిన తండ్రి.. 'నీకు ఫోన్ ఎలా వచ్చింది' అని నిలదీయడంతో అసలు విషయం చెప్పేశాడు. 'మన షాపులోంచి రోజూ కొంత డబ్బు తీసి ట్యూషన్ మాస్టారుకు ఇచ్చేవాణ్ని. మాస్టారే ఈ ఫోన్ కొనిచ్చాడు' అని బాలుడు తన తండ్రికి వివరించాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. షాపూర్‌నగర్‌కు చెందిన వ్యాపారవేత్త కమల్‌జైన్. ఆయన కుమారుడు ఏడో తరగతి చదువుతున్నాడు. సంవత్సర కాలంగా బాలుడు తమ షాపులోంచి కొంత నగదు దొంగిలించసాగాడు. ఆ డబ్బును తనకు ట్యూషన్ చెప్పే మాస్టారుకు ఇచ్చేవాడు. ఈ క్రమంలో బాలుడికి సదరు ట్యూషన్ మాస్టారు ఐ ఫోన్ కొనిచ్చాడు. ఈ విషయం ఇంట్లో తెలియడంతో కుమారుడికి ట్యూషన్ చెబుతున్న వ్యక్తిపై జీడిమెట్ల పీఎస్‌లో కమల్‌జైన్ ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు ట్యూషన్ మాస్టారు సందీప్‌పై కేసు నమోదు చేశారు. సంవత్సర కాలంగా కుమారుడు తమ షాపులోంచి డబ్బులు తీస్తున్న తండ్రి పసిగట్టకపోవడం గమనార్హం. అలాగే సంవత్సర కాలంగా కుమారుడు ఇంట్లో ఫోన్ వాడుతున్నా కుటుంబ సభ్యులు చూడకపోవడం మరో విచిత్రం. ఎవరైనా పిల్లలు ఇలాంటి పనులు చేస్తే వారికి కౌన్సెలింగ్ ఇప్పించాలని సీఐ గడ్డం మల్లేష్ తల్లిదండ్రులకు సూచించారు.



ప్రశాంతంగా ఎప్‌సెట్

నగరంలో మంగళవారం తెలంగాణ ఎప్‌సెట్ (ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్) పరీక్ష ప్రశాంతంగా జరిగింది. సమయానికి కంటే ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకుని తమ హాల్ టికెట్ నంబర్లను చెక్ చేసుకున్నారు. షేక్‌పేటలోని నారాయణమ్మ ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఈ దృశ్యాలు కనిపించాయి.



కర్ణన్‌కు సమస్యల తో'రణం'

కొత్త కమిషనర్‌కు బల్దియాలో సవాలక్ష సమస్యలు

పరిపాలన నుంచి ప్రజా ఫిర్యాదుల దాకా..

సాక్షి, సిటీబ్యూరో: ఫుడ్‌సేఫ్టీ కమిషనర్‌గా ఆర్‌వీ కర్ణన్ తన ప్రత్యేకతను చాటుకున్నారు. ఎక్కడ పడితే అక్కడ విచ్చలవిడిగా జరుగుతున్న ఆహార కల్తీ నిరోధానికి ఆయన హయాంలో జరిగినన్ని తనిఖీలు, దాడులు గతంలో ఎన్నడూ జరగలేదు. చిన్న హోటళ్ల నుంచి స్టార్ హోటళ్ల దాకా వేటినీ వదల్లేదు. ఒకరకంగా చెప్పాలంటే ఆయన ఆ పదవిలోకి రాకముందు ఎన్ని తనిఖీలు జరిగేవో తెలియదు. కానీ.. కర్ణన్ ఆ హోదాతో ప్రజారోగ్యంపై తగిన శ్రద్ధ చూపించారనే చెప్పాలి. కానీ.. జీహెచ్ఎంసీ కమిషనర్ పోస్టులోనూ అదేవిధంగా పని చేయడం కష్టమనే చెప్పాలి. ఆ శాఖలో పరిమిత సిబ్బంది, పరిమిత విధులు. జీహెచ్ఎంసీ కోటిమందికి పైగా ప్రజలకు ఒక్కటని కాదు రకరకాల సేవలందించే విభాగం. కుక్కకాట్ల నుంచి మొదలు పెడితే వరద కాలువల వంటి ప్రాజెక్టుల దాకా ఎన్నింటికో బాధ్యత వహించాలి, ఆస్తిపన్ను విధింపుల్లో అవకతవకలు, టౌన్‌ప్లానింగ్ అక్రమాలు, బర్త్, డెత్ సర్టిఫికెట్లలో లొసుగులు, పారిశుద్ధ్య సమస్యలు, దోమల సంగీతాలు.. ఇలా చెబుతూ పోతే సమస్యలకు అంతే ఉండదు.

పట్టు సాధించేనా?

- ఆయా విభాగాలకు నేతృత్వం వహించే వారి నుంచి దిగువస్థాయి వారి దాకా సమన్వయంతో పని చేయాలి. ఎన్నికలొచ్చినా, ఓటర్ల జాబితాలు సరి చేయాలన్నా జీహెచ్ఎంసీ కమిషనర్‌దే బాధ్యత. జీహెచ్ఎంసీలో దీర్ఘకాలంగా పాతుకుపోయిన సిబ్బంది అక్రమాలు, అవకతవకలు ఒక పట్టాన ఎవరికీ తెలియవు. వాటిని కనిపెట్టడంలో ఇలంబర్తి కొంతమేర సఫలమయ్యారనే చెప్పాలి. అక్రమాలపై ఉక్కుపాదం మోపేందుకు వెనుకాడకుండా 27 మంది ఔట్ సోర్సింగ్ ఇంజినీర్లను ఇంటికి పంపడం ఇందుకు మచ్చుతునక. జీహెచ్ఎంసీకి ఉన్న ఆస్తులెన్నో, వాటిద్వారా రావాల్సిన ఆదాయమెంతో, అందులో ఖజానాకు చేరుతున్నదెంతో సిబ్బంది సొంత జేబుల్లోకి మళ్లుతున్నదెంతో తెలుసుకునేందుకూ ఇలంబర్తి శ్రీకారం చుట్టారు.
- ఇలంబర్తి పని తీరు తెలిసి, ఆయన ఎప్పుడు వెళ్తారో అని చూసిన అధికారులెందరో ఉన్నారనడం అతిశయోక్తి కాదు. ఫుడ్‌సేఫ్టీ విభాగంలో నిర్వహించిన విధులతో జీహెచ్ఎంసీ గురించీ కర్ణన్‌కు తెలిసి ఉండవచ్చు. కానీ.. అక్కడిలా వ్యవహరించడం ఇక్కడ కుదరదని చెబుతున్నారు. జోనల్, అడిషనల్, డిప్యూటీ కమిషనర్లు, ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ తదితర ఎన్నో విభాగాల అధికారులకు పనులప్పగించడం.. ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా ఫ్లై ఓవర్ల వంటి పనులు, రోడ్ల సమస్యలు ఇలా ఎన్నింటి గురించో సరైన అవగాహన రావడానికే సమయం పట్టనుంది. ఎంత వ్యవధిలోగా పట్టు సాధించి, సరైన పాలనతో ప్రజల సమస్యలు పరిష్కరించగలరో తెలిసేందుకు సమయం పట్టనుంది.
- ఫుడ్‌సేఫ్టీ కమిషనర్‌గా జడ్‌సీలకు బాధ్యతలు సాధారణంగా జీహెచ్ఎంసీలోని అధికారులు, సిబ్బందికి పోస్టింగులిచ్చేది, బాధ్యతలప్పగించేది జీహెచ్ఎంసీ కమిషనర్. కానీ, కర్ణన్ ఫుడ్‌సేఫ్టీ కమిషనర్‌గానే జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్లకు సైతం బాధ్యతలప్పగించడం ఈ సందర్భంగా గమనార్హం. ఆహార కల్తీకి పాల్పడే హోటళ్లు, సంస్థల లైసెన్సులు రద్దు చేసే అధికారాలు జోనల్ కమిషనర్లకు అప్పగిస్తూ వారిని ఇన్‌చార్జి ఫుడ్‌సేఫ్టీ డిజిగ్నేటెడ్ ఆఫీసర్లుగా నియమించారు. కల్తీకి పాల్పడే వారిపై త్వరితగతిన చర్యలు తీసుకునేందుకు జోనల్ కమిషనర్లకు బాధ్యతలప్పగించారు. జీహెచ్ఎంసీ పరిధిలో జోన్‌కొకటి చొప్పున ఆరు ఆహారపరీక్షల కేంద్రాల ఏర్పాటుకూ చర్యలు చేపట్టారు.

కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కర్ణన్

జీహెచ్ఎంసీ కొత్త కమిషనర్‌గా ఆర్‌వీ కర్ణన్ మంగళవారం ఇలంబర్తి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఇద్దరు అధికారులకు జీహెచ్ఎంసీ అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కమిషనర్ కర్ణన్ మేయర్ విజయలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.





గ్రాండ్ వెల్‌కమ్..

లక్డీకాపూల్: జీహెచ్ఎంసీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆర్‌వీ కర్ణన్‌కు మంగళవారం ఘన స్వాగతం లభించింది. ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన వారిలో తెలంగాణ స్వచ్ఛ ఆటో టిప్పర్, రిక్షా కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కలమడుగు రాజేందర్, జీహెచ్ఎంజీ అధ్యక్షుడు కాట్రావత్ గోపాల్ నాయక్, ఖైరతాబాద్ ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్, కోశాధికారి పరశురాములు, మీడియా ఇన్‌చార్జి మూడవత్ మహేష్, కోఆర్డినేటర్ మచ్చగిరి, కార్యదర్శి ప్రభాకర్, లక్ష్మణ్, బాషా, హతీరాం తదితరులు ఉన్నారు.

అత్యవసర పంపింగ్.. ఏర్పాట్లు చకచకా

డెడ్‌స్టోరేజీకి చేరువలో సాగర్ జలాశయం

- సిద్ధమవుతున్న భారీ మోటార్లు
- నగరంలో నీటి సమస్య ఉండదు
- జలమండలి అధికారులు



నాగార్జున సాగర్‌లో అత్యవసర పంపింగ్ కోసం సిద్ధమవుతున్న మోటార్లు

సాక్షి, సిటీబ్యూరో: మహా నగరానికి తాగునీరు సరఫరా చేసే నాగార్జున సాగర్ జలాశయంలో నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చేరుతుండటంతో అత్యవసర పంపింగ్ కోసం జలమండలి చకచకా ఏర్పాట్లు చేస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా, మంగళవారం నాటికి 514.300 అడుగులకు చేరింది. జలాశయం నీటి మట్టం 510 అడుగులకు పడిపోతే అక్కంపల్లి రిజర్వాయర్‌లోకి గ్రావిటీ ద్వారా రావాల్సిన నీళ్లు తరలించే పరిస్థితి ఉండదు. సాగర్‌లోని ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు నుంచి పుట్టంగండి పంప్‌హౌస్, అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారానే నీటిని సేకరిస్తున్నారు. నీటి మట్టం డెడ్‌స్టోరేజీకి చేరుకుంటే మాత్రం కృష్ణాజలాల పంపింగ్ నిలిచిపోయి అత్యవసర పంపింగ్ ద్వారా నీటిని తోడాల్సిన పరిస్థితి ఉంటుంది. దీంతో జలమండలి ముందస్తు చర్యల్లో భాగంగా నెల రోజుల ముందే అత్యవసర పంపింగ్ ఏర్పాట్ల కోసం టెండర్ల ప్రక్రియ పూర్తి చేసింది. మొత్తం మూడు ప్యాకేజీల్లో రూ.5.95 కోట్ల అంచనా వ్యయంతో వర్క్ ఆర్డర్ ఇచ్చి భారీ మోటార్లు, పంపింగ్ కోసం ఏర్పాట్లు చేస్తోంది.

రోజువారీగా 0.179 టీఎంసీలు డ్రా

నగర తాగునీటి అవసరాల కోసం నాగార్జున సాగర్ నుంచి గ్రావిటీ ద్వారా ప్రస్తుతం రోజువారీగా 0.179 టీఎంసీల నీటిని తరలిస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం 312.045 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 139.080 టీఎంసీలు అందుబాటులో ఉండగా 131.66 టీఎంసీల వరకు నీటి లభ్యత ఉంటుంది. డెడ్ స్టోరేజీ ఉన్నా.. 2.05 టీఎంసీలు వాడుకోవచ్చు. అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ మొత్తం నీటిమట్టం 1.499 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1.254 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. రోజువారీగా 0.045 టీఎంసీల నీటిని సరఫరా చేస్తున్నారు.

ముచ్చటగా మూడోసారి..

నాగార్జున సాగర్ నుంచి మహానగర తాగు నీటి అవసరాల కోసం మూడోసారి అత్యవసర పంపింగ్ ద్వారా నీటిని తరలించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. తొలిసారిగా 2017లో సాగర్ జలాశయంలో నీటి మట్టం డెడ్‌స్టోరేజీకి చేరడంతో అత్యవసర మోటార్లు ఏర్పాటు చేసి ఆ ఏడాది సెప్టెంబర్ వరకు నీటిని పంపింగ్ చేశారు. ఎనిమిదేళ్ల తర్వాత గతేడాది నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చేరడంతో అత్యవసర పంపింగ్ ఏర్పాటు చేసి ఆగస్టు చివరి నాటికి నీటిని తరలించారు. తాజాగా సాగర్ జలాశయం డెడ్‌స్టోరేజీకి చేరుతుండటంతో పంపింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేశారు. నీరు డెడ్ స్టోరేజీకి చేరినా...వేసవిలో తాగునీటి సరఫరాలో ఎలాంటి ఆటంకాలు ఉండవని జలమండలి అధికారులు పేర్కొంటున్నారు.

క్యాబ్.. క్యా సాబ్!

రద్దీ వేళల్లో, సర్‌చార్జీల పేరుతో రెట్టింపు వసూళ్లు

- మండుతున్న ఎండలతో ఆటోలు, క్యాబ్‌లకు డిమాండ్
- ప్రయాణికులను అడ్డగోలుగా దోచేస్తున్న వైనం
- ఏళ్లు గడిచినా అమలుకు నోచుకోని సిటీక్యాబ్ చట్టం

సాక్షి, సిటీబ్యూరో: మండుతున్న ఎండలతో పాటు క్యాబ్‌లు, ఆటోలు ప్రయాణికులను తారెత్తిస్తున్నాయి. రద్దీ వేళల నెపంతో అడ్డగోలుగా సర్‌చార్జీలు విధిస్తూ ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తున్నాయి. క్యాబ్ అగ్రిగేటర్ సంస్థలపై ప్రభుత్వం నియంత్రణ చర్యలు చేపట్టకపోవడంతో ఇష్టారాజ్యంగా చార్జీల వసూళ్లకు దిగుతున్నాయి. మరోవైపు ప్రయాణికుల నుంచి తీసుకొనే చార్జీల్లో కమిషన్ల పేరిట క్యాబ్ సంస్థల ఖాతాల్లోకి పెద్ద మొత్తంలో చేరుతున్నాయని, రాత్రింబవళ్లు వాహనాలు నడిపే తమకు ఎలాంటి మిగులుబాటు ఉండడం లేదని డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోజుకు 5,000 క్యాబ్‌లు..

నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి నిత్యం సుమారు 5,000 క్యాబ్‌లు రాకపోకలు సాగిస్తాయి. బంజారాహిల్స్ నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు సుమారు 32 కిలోమీటర్ల దూరం ఉంటుంది. సాధారణంగా అయితే రూ.450 నుంచి రూ.500 వరకు చార్జీ అవుతుంది. ప్రస్తుత వేసవి రద్దీని సాకుగా చూపుతూ క్యాబ్ సంస్థలు రూ.750 నుంచి రూ.800 వరకు చార్జీలు విధిస్తున్నాయి. ఇలా ప్రయాణికుల నుంచి అధికంగా వసూలు చేస్తున్నప్పటికీ ఎయిర్ పోర్టుకు క్యాబ్‌లు నడిపేందుకు డ్రైవర్లు నిరాకరిస్తున్నారు. క్యాబ్ సంస్థలు విధించే చార్జీల వల్ల ఒకవైపు ప్రయాణికులు, మరోవైపు క్యాబ్ డ్రైవర్లు కూడా అన్యాయానికి గురవుతున్నట్లు ఆర్టీఏ అధికారి విస్మయం వ్యక్తం చేశారు.

రద్దీ లేకున్నా సర్‌చార్జీలు..

సాధారణంగా ప్రయాణికుల రద్దీ, డిమాండ్ ఎక్కువగా ఉన్న సమయంలో ఎంపిక చేసుకున్న ప్రాంతాల్లో వాహనాలు అందుబాటులో లేనప్పుడు సర్‌చార్జీలను విధిస్తారు. 10 కిలోమీటర్ల పరిధిలో ఉన్న క్యాబ్‌లను ఏర్పాటు చేసేందుకు ఇలా అదనపు వడ్డింపులకు పాల్పడుతున్నారు. నిజానికి మోటారు వాహన చట్టం ప్రకారం ప్రజారవాణా వాహనాలకు రద్దీ సమయాలు, రద్దీ లేని సమయాలు అంటూ ప్రత్యేకమైన తేడాలు లేవు. అన్ని వేళల్లోనూ ఒకే విధమైన చార్జీలను వసూలు చేయాలి. కానీ.. ఇందుకు భిన్నంగా కొన్ని క్యాబ్ సంస్థలు సర్‌చార్జీలను విధిస్తున్నాయి. ప్రయాణికులు క్యాబ్ బుక్ చేసుకున్నప్పుడు నమోదైన చార్జీలకు అదనంగా రూ.50 నుంచి రూ.100 వరకు విధిస్తున్నారు. క్యాబ్‌లకు ఎక్కువ డిమాండ్ ఉండే హైటెక్ సిటీ, మాదాపూర్, కొండాపూర్ తదితర ఐటీ కారిడార్‌ల నుంచి నగరంలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. క్యాబ్ అగ్రిగేటర్ సంస్థలతో అనుసంధానమైన ఆటోల్లో ఒక్కోసారి క్యాబ్‌ల కంటే ఎక్కువ చార్జీలు నమోదు కావడం గమనార్హం. సాధారణంగా తిరిగే ఆటోల్లోనూ మీటర్ రీడింగ్‌తో నిమిత్తం లేకుండా వసూళ్లకు దిగుతున్నారు. అంతర్జాతీయ క్యాబ్ సంస్థలు విధించే చార్జీలపై ప్రభుత్వానికి ఎలాంటి నియంత్రణ లేకుండా పోయింది. ఆటో, ట్యాక్సీ చట్టాలు అమలు కావడం లేదు.



త్వరలో 'సహకార్ ట్యాక్సీ'

దేశవ్యాప్తంగా ఓలా, ఉబెర్ తదితర క్యాబ్ సంస్థలకు పోటీగా కేంద్రం సరికొత్త మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు సన్నాహాలు చేపట్టింది. 'సహకార్ ట్యాక్సీ' పేరుతో రానున్న ఈ యాప్ డ్రైవర్ల సహకార సంస్థగా పని చేయనుంది. ఈ యాప్‌లో నమోదైన డ్రైవర్ల సేవలకు తగిన ఫలితం వారి ఖాతాల్లో చేరిపోతుంది. సహకార్ ట్యాక్సీ నిర్వహణ కోసం మాత్రం నామమాత్రంగా కొంతమొత్తాన్ని డ్రైవర్ల నుంచి తీసుకుంటారు. ఈ మొబైల్ యాప్ అందుబాటులోకి వస్తే ప్రయాణికులకు ఊరట లభించనుంది.

ఆడుకుంటూ వెళ్లి అసువులు బాసింది

ప్రమాదవశాత్తు చెరువులో పడి ఆరేళ్ల చిన్నారి మృతి



అభిత (ఫైల్)

చైతన్యపురి: ఇంటి పక్క నుంచి ఆడుకుంటూ వెళ్లిన ఆరేళ్ల బాలిక ప్రమాదవశాత్తు చెరువు నీళ్లలో పడి మృతి చెందిన ఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని నెల్లూరు జిల్లాకు చెందిన పాలకుర్తి శ్రీను, శ్రావణి దంపతులు. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి కూలిపనులు చేసుకుంటూ గ్రీన్‌పార్కు కాలనీ రోడ్‌నం.14లో నివసిస్తున్నారు. వీరికి నలుగురు కూతుళ్లు. సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో తల్లిదండ్రులు పక్కింటివారితో మాట్లాడుతుండగా రెండో కూతురు అభిత (6) ఆడుకుంటోంది. కొద్ది సేపటి తర్వాత తర్వాత చూడగా అభిత కనిపించలేదు. ఎక్కడ వెతికినా జాడ తెలియకపోవటంతో రాత్రి సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు అభిత మృతదేహం చెరువు నీటిలో తేలుతూ కనిపించింది. ఇంటి సమీపంలోనే చెరువు ఉండటంతో బాలిక ఆడుకుంటూ వెళ్లి అందులో పడి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. తమ ఆరేళ్ల కూతురు మృతి చెందడంతో శ్రీను, శ్రావణి దంపతులు కన్నీరుమున్నీరుగా విలపించారు. చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వెస్ట్‌జోన్‌కు ఫోన్ ట్యాపింగ్ సిట్ కార్యాలయం

బంజారాహిల్స్: ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు చేస్తున్న సిట్ కార్యాలయాన్ని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ నుంచి రెడ్‌హిల్స్‌లోని వెస్ట్‌జోన్ కార్యాలయానికి తరలించారు. అంతేకాకుండా ఫోన్ ట్యాపింగ్ సిట్ దర్యాప్తు అధికారి, జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరిని పూర్తి స్థాయిలో ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు కోసం నియమించారు. ఈ కేసు విచారణ వేగవంతం చేయాలని, త్వరితగతిన ముగించాలనే ఉద్దేశంతో వెంకటగిరికి పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించి కార్యాలయాన్ని కూడా వెస్ట్‌జోన్‌కు తరలించారు. దీంతో జూబ్లీహిల్స్ ఏసీపీగా బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు పూర్తయ్యేవరకు వెంకటగిరిని పూర్తిగా అదే కేసులో నిమగ్నం కావాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసు విచారణ నెమ్మదిస్తున్న నేపథ్యంలో ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించడంతో పోలీసు ఉన్నతాధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి పూర్తిగా ఇదే కేసులో నిమగ్నం కావాలని, దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశించారు. దీంతో రెండు రోజులుగా సిట్ బృందం పూర్తిగా వెస్ట్‌జోన్ కార్యాలయంలోనే విచారణ కొనసాగిస్తున్నది. ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులు, ఇతరత్రా శాస్త్రీయ ఆధారాలు, ఇంకా కొనసాగించాల్సిన విచారణ వీటన్నింటిని ముమ్మరం చేయాలని కూడా సూచించారు.

హత్య.. ఓ ఆత్మహత్య

ఒకే రోజు జరిగిన రెండు ఘటనలకు లింక్

- విచారణలో తేల్చిన పోలీసులు
- అవమానిస్తున్నాడని బావమరిదిని హత్య చేసిన బావ
- ఆ హత్యను చూసిన మరో యువకుడు..
- పోలీసు విచారణ భయంతో అదే రోజు ఆత్మహత్య
- యువకుడికి మే4న నిశ్చితార్థం ఉండగా.. ఇంతలోనే విషాదం


ఆత్మహత్య చేసుకున్న మోహనకృష్ణ (ఫైల్)

సికింద్రాబాద్: ఒకే రోజు రాత్రి (ఈ నెల 27న) జరిగిన హత్య, ఆత్మహత్యకు సంబంధం ఉన్నట్టు వారాసిగూడ పోలీసుల విచారణలో తేలింది. ఒకచోట జరిగిన హత్యను...మరో చోట జరిగిన ఆత్మహత్యను వేర్వేరు కేసులుగా నమోదు తొలుత నమోదు చేసుకున్న పోలీసులు మంగళవారం రెండింటికీ సంబంధం ఉన్నట్టు నిర్ధారించారు. అవమాన భారాన్ని భరించలేక బావమరిదిని బావ చావబాదిన ఘటన ఒకటి కాగా...మిత్రుడి హత్యను కళ్లారా చూడడం, తాను పోలీసుల విచారణలో సాక్షిగా మారుతానన్న భయంతో ఐదు రోజుల్లో నిశ్చితార్థం జరగాల్సిన మరో యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డట్టు పోలీసులు తేల్చారు. వారాసిగూడ పోలీస్ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌గౌడ్ వెల్లడించిన వివరాల ప్రకారం...బౌద్ధనగర్‌కు చెందిన గద్దం లక్ష్మి కుమారుడు మోహనకృష్ణ (29) ముషీరాబాద్‌లో బైక్ మెకానిక్ షాపు నిర్వహిస్తున్నాడు. మోహనకృష్ణకు పెళ్లి కుదిరింది. మే 4న నిశ్చితార్థం జరగాల్సి ఉంది. ఇదిలా ఉండగా ఈ నెల 27న ఆదివారం రాత్రి మోహనకృష్ణ ముషీరాబాద్‌కు చెందిన తన స్నేహితుడు శ్యాంసన్‌రాజు, మరి కొంత మంది స్నేహితులతో కలిసి పార్శిగుట్ట ప్రాంతంలోని ఒక పురాతన భవనంపై మద్యం పార్టీ చేసుకున్నారు. ఇందులో శ్యాంసన్‌రాజు బావ లూథరస్ కూడా ఉన్నాడు. లూథరస్ బావమరిది శ్యాంసన్‌రాజ్ మద్యానికి బానిసై భార్యా పిల్లలను కొద్ది సంవత్సరాల క్రితమే వదిలేసి ఆవారాగా తిరుగుతున్నాడు. ఈ క్రమంలో ఆస్తి విషయంలో శ్యాంసన్‌రాజు, లూథరస్ మధ్య గొడవలు ఉన్నాయి. ఇదే విషయంలో మద్యం పార్టీలో ఇరువురి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. దీంతో శ్యాంసన్‌రాజు తలపై ఇనుపరాడ్‌తో బాదిన లూథరస్ అతన్ని హత్య చేశాడు. మిత్రుడి హత్యను ప్రత్యక్షంగా చూడడం ఒకవైపు, పెళ్లి పీటలు ఎక్కాల్సిన సమయంలో తాను హత్యకు ప్రత్యక్ష సాక్షిగా ఉంటే పోలీసుల విచారణను ఎదుర్కోవాల్సి వస్తుందన్న భయంతో మోహనకృష్ణ ఘటనా స్థలం నుంచి ఇంటికి వెళ్లిపోయి అదే రాత్రి తన బెడ్‌రూంలో చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పార్శిగుట్టలో జరిగిన శ్యాంసన్‌రాజు హత్యను, బౌద్ధనగర్‌లో జరిగిన మోహనకృష్ణ ఆత్మహత్యను వేర్వేరు కేసులుగా మొదట పోలీసులు నమోదు చేసుకున్నారు. తీరా పోలీసుల విచారణలో పెళ్లి చేసుకోవాల్సిన తనపై పోలీసు కేసులు నమోదవుతాయన్న భయంతోనే మోహనకృష్ణ ఆత్మహత్యకు పాల్పడ్డట్టు తేలింది. మోహనకృష్ణ ఆత్మహత్యతో లక్ష్మి కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. నిశ్చితార్థం కోసం బట్టలు కొనేందుకు తన దగ్గర మోహనకృష్ణ డబ్బులు కూడా తీసుకున్నాడని మృతుడి తల్లి లక్ష్మి విలపించింది. ఇదిలా ఉండగా శ్యాంసన్‌రాజ్ మద్యం తాగినప్పుడల్లా తనను అసభ్యకరమైన మాటలతో దూషిస్తున్నందుకే లూథరస్ హత్య చేసినట్టు పోలీసుల విచారణలో తేలింది.

స్నేహితుడే హంతకుడు

- హిమాయత్‌నగర్ హత్య కేసును ఛేదించిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ శిల్పవల్లి తదితరులు

కవాడిగూడ: దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని హిమాయత్‌నగర్ స్ట్రీట్ నెంబర్ 8లో జరిగిన గుర్తు తెలియని యువకుడి దారుణ హత్యకేసును పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం దోమలగూడ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి తదితరులు వివరాలు వెల్లడించారు. నల్గొండ జిల్లా సూర్యాపేటకు చెందిన పాత నేరస్తుడు చేపూరి నరేందర్ కూలి పనులు చేస్తూ ఫుట్‌పాత్‌పై జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి ఆసిఫాబాద్ కొమురం భీం జిల్లాకు చెందిన అజయ్‌తో పరిచయం ఏర్పడింది. వీరిద్దరు కలిసి పనులకు వెళ్తుండగా..ఇటీవల వ్యక్తిగత విషయాలకు సంబంధించి విభేదాలు తలెత్తాయి. దీంతో నరేందర్..అజయ్‌పై కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో 27వ తేదీ అర్ధరాత్రి నరేందర్ బండరాయితో అజయ్ తలపై పలుమార్లు మోది హత్య చేసి.. పంజాబ్ నేషనల్ బ్యాంక్ పక్కనే ఉన్న లిఫ్ట్ గుంతలో శవాన్ని పడేసి వెళ్లి పోయాడు. సీసీ కెమెరాలు, స్థానికులు తెలిపిన వివరాల ఆధారంగా సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, దోమలగూడ పోలీసులు దర్యాప్తు చేపట్టి చనిపోయిన వ్యక్తిని అజయ్‌గా, హంతకుడు చేపూరి నరేందర్‌గా గుర్తించారు. మంగళవారం ఉదయం జూబ్లీబస్ స్టేషన్ వద్ద నరేందర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. అజయ్ తనను కించపరిచేలా మాట్లాడమే కాకుండా తన స్నేహితుల వద్ద, బంధువుల వద్ద చెడుగా చెప్పాడని, అందుకే బండరాయితో మోది చంపినట్లు నరేందర్ విచారణలో అంగీకరించాడని డీసీపీ శిల్పవల్లి వెల్లడించారు. కాగా అజయ్ హత్య ఘటనలో ముగ్గురు వ్యక్తులు పాల్గొన్నట్లు సీసీ ఫుటేజీలో కన్పించిందని తెలిసింది. ఈ విషయంపై కూడా దర్యాప్తు చేస్తున్నట్లు డీసీపీ తెలిపారు.

కాంగ్రెస్ పార్టీకి 'యూత్' ముఖ్యం

- మంత్రి పొన్నం ప్రభాకర్


'యూత్ కాంగ్రెస్ భవిష్యత్ కార్యాచరణ' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం తదితరులు

మన్సూరాబాద్: కాంగ్రెస్ పార్టీకి యువజన కాంగ్రెస్ గుండె కాయలాంటిదని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లోని ఓ ఫంక్షన్ హాలులో మంగళవారం రాత్రి యూత్ కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి వైట్ టీ షర్ట్ క్యాంపెయిన్ చేపట్టారు. ఈ కార్యక్రమానికి మంత్రితో పాటు యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్‌భాను చిబ్, యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కృష్ణ అల్లారు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంలో యూత్ కాంగ్రెస్ కృషి మరువలేనిదన్నారు. రానున్న రోజుల్లో దేశ భవిష్యత్తు యువత దేనని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ పటిష్టంగా పనిచేయాలని సూచించారు. యూత్ కాంగ్రెస్‌లో కష్టపడి పనిచేసే వారికి పదవులు తప్పకుండా వస్తాయని తెలిపారు. యూత్ కాంగ్రెస్ భవిష్యత్ కార్యచరణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్

'వన్ నేషన్ వన్ ఎలక్షన్'తో ప్రయోజనాలెన్నో..

బొల్లారం: 'వన్ నేషన్ వన్ ఎలక్షన్' వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ అన్నారు. థాట్ ఆర్క్ ఇండియా, జైన్ స్టార్ గ్రూప్ సంయుక్త ఆధ్వర్యంలో తిరుమలగిరిలోని ఓ ఫంక్షన్ హాలులో మంగళవారం 'వన్ నేషన్ వన్ ఎలక్షన్'పై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సునీల్ బన్సల్ మాట్లాడుతూ దేశంలో ఏటా ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరగడం వల్ల ఖర్చు పెరుగుతోందని, అభివృద్ధికి ఆటంకాలు ఏర్పడుతున్నాయన్నారు. ఒకేసారి రాష్ట్రాలకు, దేశానికి ఎన్నికలు జరిగితే భారీగా ఖర్చును నివారించవచ్చన్నారు. దేశవ్యాప్తంగా 10 లక్షలకు పైగా పోలింగ్ బూత్‌లు ఉండడం వల్ల మానవ వనరుల వినియోగం అధికమవుతోందన్నారు. ఎన్నికల నిర్వహణకు రూ.5 వేల నుంచి రూ.6 వేల కోట్ల వరకు ఖర్చవుతోందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, బీజేవైఎం నేత పీఎం సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ కటౌట్ దగ్ధం చేసేందుకు యత్నించిన నిందితుడి అరెస్టు



బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్ ముందు ఏర్పాటుచేసిన 50 అడుగుల కేసీఆర్ కటౌట్‌ను దగ్ధం చేసేందుకు యత్నించిన వ్యక్తిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే..బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల సందర్భంగా నాలుగు రోజుల క్రితం తెలంగాణ భవన్ ముందు మాజీ సీఎం కేసీఆర్ నిలువెత్తు కటౌట్‌ను ఏర్పాటుచేశారు. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో తిరుపతికి చెందిన ఎడవల్లి రాజా (35) అనే వ్యక్తి అగ్గి పుల్లతో దగ్ధం చేసేందుకు అంటించాడు. అదే సమయంలో అటు నుంచి వెళ్తున్న మంజునాథ్ అనే వ్యక్తి కటౌట్ కాలుతున్న విషయాన్ని గమనించి దగ్ధం చేస్తున్న రాజాను పక్కకు తోసి తెలంగాణ భవన్ సెక్యూరిటీని అప్రమత్తం చేశాడు. క్షణాల్లో అక్కడికి చేరుకున్న సెక్యూరిటీ సిబ్బంది మంటలను ఆర్పి నిందితుడిని బంజారాహిల్స్ పోలీసులకు అప్పగించారు. ఎడవల్లి రాజా తిరుపతి గాంధీపురంలో ఉంటాడని, ఇటీవల మతిస్థిమితం కోల్పోయాడని, నిరాశ్రయుడని, ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తుంటాడని పోలీసుల దర్యాప్తులో తేలింది. కేసీఆర్ కటౌట్‌ను ఎందుకు దగ్ధం చేయాలనుకున్నాడో పోలీసులు ఆరా తీస్తున్నారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు.

రిజర్వేషన్ల పెంపు ఉత్తర్వులు రాకుంటే ఆందోళన

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య

కాచిగూడ: స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయని పక్షంలో.. పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు, ఉద్యమాలు చేపడతామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన మంగళవారం కాచిగూడ అభినందన్ గ్రాండ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కోర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల విషయాన్ని ప్రస్తావించకుండానే.. మూడు రోజుల క్రితం పంచాయతీరాజ్ శాఖమంత్రి సీతక్క మాట్లాడుతూ.. త్వరలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుపుతామని ప్రకటించారన్నారు. వాస్తవానికి దాదాపు 12 నెలల క్రితం జరగాల్సిన ఎన్నికలు..బీసీ రిజర్వేషన్ కోసం వాయిదాల మీద వాయిదా పడుతున్నాయన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నేత గుజ్జ సత్యం, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆ రెండు కాలనీల మధ్య తగ్గిన దూరం

- కబ్జాలను కూల్చివేసిన హైడ్రా



సాక్షి, సిటీబ్యూరో: గండిపేట సమీపంలోని శ్రీ వెంకటేశ్వర కాలనీ, ఉస్మానియా కాలనీల మధ్య ఉన్న అడ్డంకిని హైడ్రా అధికారులు మంగళవారం తొలగించారు. దీంతో ప్రజలు నేరుగా షేక్‌పేట రావడానికి..అటు గోల్కొండ కోటకు వెళ్లడానికి దగ్గరి దారి ఏర్పడింది. నెక్నాంపూర్‌లో హైటెన్షన్ విద్యుత్ తీగల కింద రహదారిని కబ్జా చేసిన కొందరు గోడను నిర్మించారు. అక్కడ ఉన్న దాదాపు 800 గజాల స్థలాన్ని ఆక్రమించి షెడ్లు నిర్మించారు. దీంతో శ్రీ వేంకటేశ్వర కాలనీకి, ఉస్మానియా కాలనీకి మధ్య రాకపోకలకు అవాంతరాలు ఏర్పడ్డాయి. ఈ అంశంపై శ్రీ వేంకటేశ్వర కాలనీ వాసులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ప్రాథమిక విచారణ అనంతరం శనివారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ క్షేత్రస్థాయిలో పర్యటించి విషయం నిర్ధారించారు. వెంటనే అడ్డుగోడను కూల్చేయాలని, కబ్జాలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం రంగంలోకి దిగిన హైడ్రా బృందాలు ఆ పనులు పూర్తి చేశాయి. ఫలితంగా రెండు కాలనీల మధ్య 30 అడుగుల వెడల్పుతో రహదారి ఏర్పడి దూరం తగ్గింది. దాదాపు మూడు వేల మంది స్థానికులకు ఉపయుక్తంగా మారింది.

హెచ్‌సీయూ ఇంటిగ్రేటెడ్ విద్యార్థి అదృశ్యం


దినేష్ (ఫైల్)

గచ్చిబౌలి: లవ్యూ డాడీ, మమ్మీ అంటూ తల్లిదండ్రులకు ఫోన్ మెసేజ్ పెట్టిన హెచ్‌సీయూ ఇంటిగ్రేటెడ్ విద్యార్థి అదృశ్యమైన ఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా చింతకాని మండలం, పాతర్లపాడు గ్రామానికి చెందిన దంపతులు జీవన్, రాధా పెద్ద కొడుకు గార్లపాటి దినేష్ (19) హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఇంటిగ్రేటెడ్ ఎకనామిక్స్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సౌత్ క్యాంపస్‌లోని 'కె' హాస్టల్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 27న లవ్యూ డాడీ, లవ్యూ మమ్మీ అంటూ మెసేజ్ చేశాడు. ఆ వెంటనే అతని సెల్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉంది. కుటుంబ సభ్యులు యూనివర్సిటీకి వెళ్లి ఆరా తీయగా శుక్రవారం బైక్‌పై బయటకు వెళ్లాడని తెలుసుకున్నారు. అంతే కాకుండా తల్లిదండ్రులకు చెప్పకుండా ఢిల్లీ, చెన్నై వెళ్లినట్లు తెలుసుకున్నారు. దినేష్ స్నేహితులకు ఫోన్ చేసినా ఆచూకీ లభించలేదు. మేసేజ్ పెట్టి కనిపించకుండా పోవడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దినేష్ తండ్రి జీవన్ ఫిర్యాదుతో గచ్చిబౌలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. హెచ్‌సీయూ సౌత్ క్యాంపస్‌లో సీసీ కెమెరాల పుటేజీని పోలీసులు పరిశీలిస్తున్నారు.

క్వారీ గుంతలో పడి యువకుడి మృతి


తరుణ్ (ఫైల్)

జవహర్‌నగర్: రీల్స్ చేస్తూ..ఫొటోలు దిగుతూ ఓ యువకుడు క్వారీ గుంతలో పడి మృతిచెందిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. కౌకూర్ భరత్‌నగర్‌లో నివసించే రమేష్ చిన్న కుమారుడు తరుణ్ (17) ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. మూడు రోజుల్లోనే తరుణ్ పుట్టినరోజు ఉండటంతో ఫొటోషూట్ చేద్దామని తన ఐదుగురు స్నేహితులతో కలిసి మల్కారంలోని గుట్టలు, పక్కనే ఉన్న క్వారీ గుంత వద్దకు సోమవారం సాయంత్రం వచ్చారు. తరుణ్ ఫోటో దిగుతూ క్వారీ గుంతలోకి దిగడానికి ప్రయత్నించగా..లోతు తెలియక, ఈత రాక మునిగిపోయాడు. తరుణ్‌ని బయటకు తీసేందుకు స్నేహితులు ఎంతగా ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. వెంటనే జవహర్‌నగర్ పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సోమవారం రాత్రి కావడంతో మృతదేహాన్ని బయటకు తీయడానికి సాధ్యం కాకపోవడంతో మంగళవారం ఉదయం డీఆర్ఎఫ్ బృందాలు, జవహర్‌నగర్ పోలీసుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులను సంప్రదించగా కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

ఎల్ఆర్ఎస్ రాయితీ గడువు పొడిగించేనా?

- హెచ్ఎండీఏలో 64 వేల దరఖాస్తులు పరిష్కారం
- రూ.189 కోట్ల ఆదాయం



సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎల్ఆర్ఎస్-2020 పథకంపైన రాయితీ గడువు బుధవారంతో ముగియనుంది. లే అవుట్ రెగ్యులరైజేషన్ కోసం గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి ప్రస్తుతం ఫీజుల్లో 25 శాతం రాయితీని అందజేస్తున్న సంగతి తెలిసిందే. గత నెలాఖరుతోనే ఈ గడువు ముగిసినప్పటికీ దరఖాస్తుదారుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన కనిపించకపోవడంతో మరో నెల రోజులు పొడిగించారు. ఇప్పటి వరకు హెచ్ఎండీఏలో 64 వేల దరఖాస్తులను పరిష్కరించినట్లు అధికారులు తెలిపారు. హెచ్ఎండీఏ పరిధిలోని ఏడు జిల్లాల నుంచి సుమారు 3.44 లక్షల దరఖాస్తులు రాగా కనీసం లక్ష దరఖాస్తులు కూడా పరిష్కారం కాకపోవడం గమనార్హం. ఈ ఎల్ఆర్ఎస్ పథకం పైన హెచ్ఎండీఏకు సుమారు రూ.1500 కోట్ల ఆదాయం రానున్నట్లు అంచనా. కానీ ప్రస్తుతం కేవలం రూ.189 కోట్లు లభించింది. సాంకేతిక చిక్కుల కారణంగా ఎల్ఆర్ఎస్ అమలులో తీవ్ర జాప్యం నెలకొంది. గతంలో నేరుగా హెచ్ఎండీఏ అధికారులే దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు.కానీ హైడ్రా అనంతరం చేసిన మార్పుల్లో భాగంగా ఎల్-1, ఎల్-2 దశల్లో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోంది.నీటిపారుదల, రెవెన్యూ విభాగాల అనుమతుల అనంతరమే హెచ్ఎండీఏ నుంచి ప్రొసీడింగ్స్ లభిస్తాయి.దీంతో దరఖాస్తుల పరిశీలన నుంచి ప్రొసీడింగ్‌ల వరకు కాలయాపన చోటుచేసుకుంటుంది.ఒకవైపు ఈ జాప్యం ఇలా ఉండగా సాంకేతిక వైఫల్యాల కారణంగా వందల కొద్దీ తప్పులు చోటుచేసుకుంటున్నాయి.ఈ తప్పుల సవరణ అధికారులకు సవాల్‌గా మారింది. దరఖాస్తుదారులు సైతం హెచ్ఎండీఏ కార్యాలయం చుట్టూ పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఇలా రకరకాల ఇబ్బందుల దృష్ట్యా ఈ పథకం విజయవంతం కావడం లేదు. ఈ క్రమంలో తాజాగా రాయితీ గడువు ముగియనున్న దృష్ట్యా మరోసారి గడువు పొడిగిస్తారా లేదా అనే అంశంపైన సందిగ్ధం నెలకొంది.

ప్రొసీడింగ్స్ పెండింగ్

ఇలా ఉండగా ఇప్పటి వరకు 64 వేల దరఖాస్తులను పరిష్కరించి ఫీజులు వసూలు చేసినప్పటికీ సగానికి పైగా ప్రొసీడింగ్స్ పెండింగ్‌లోనే ఉన్నాయి. ఫిబ్రవరిలో ఫీజులు చెల్లించిన వారికి ఇప్పటి వరకు ప్రొసీడింగ్స్ లభించలేదు. దీంతో చాలా మంది హెచ్ఎండీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రం వద్ద ప్రొసీడింగ్స్ కోసం, తప్పుల సవరణ కోసం నిరీక్షించవలసి వస్తుంది. పని ఒత్తిడి వల్లనే సకాలంలో ప్రొసీడింగ్స్‌ను అందజేయలేకపోతున్నామని, నిబంధనల మేరకు ఫీజులు చెల్లించిన ప్రతి ఒక్కరికి ప్రొసీడింగ్స్ లభిస్తాయని అధికారులు చెప్పారు. నీటి వనరులకు దగ్గరగా ఉండి తిరస్కరణకు గురైన దరఖాస్తులకు మాత్రం ప్రాసెసింగ్ ఫీజులు మినహాయించి మిగతా ఫీజు మొత్తాన్ని రీఫండ్ చేయనున్నట్లు పేర్కొన్నారు.

నీట్ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు

సాక్షి, సిటీబ్యూరో: నీట్ పరీక్షను జిల్లాలో పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని, ఆ దిశగా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నీట్ పరీక్ష నిర్వహణపై సెంటర్ సూపరింటెండెంట్లు, సిటీ కో-ఆర్డినేటర్స్, అనుబంధ శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. మే 4న నిర్వహించే నీట్ పరీక్ష కోసం 62 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఈ.వెంకటాచారి, అదనపు డీసీపీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మహాత్మ బసవేశ్వర జయంత్యుత్సవం

పంజగుట్ట: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బుధవారం శ్రీ మహాత్మా బసవేశ్వర 892వ జయంత్యోత్సవం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పటోళ్ల సంగమేశ్వర్ తెలిపారు. కార్యక్రమ ఆహ్వాన పత్రికను మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయంతి కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డిలు హాజరు కానున్నారని తెలిపారు.

మేయర్ గద్వాల్ విజయలక్ష్మికి స్వల్ప అస్వస్థత

సాక్షి, సిటీబ్యూరో: నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మంగళవారం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో పహల్గామ్ ఘటనపై సమావేశం జరుగుతున్న సమయంలో ఆమెకు కళ్లు తిరుగుతున్నట్లు అనిపించడంతో వైద్యులను సంప్రదించారు. విశ్రాంతి తీసుకోవాలని వారు సూచించడంతో ఈ మేరకు ఆమె సాయంత్రం కార్యక్రమాలన్నీ రద్దు చేసుకున్నారని మేయర్ క్యాంప్ కార్యాలయం సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు.

జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో వేసవి శిక్షణ శిబిరం షురూ



జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో వేసవి శిక్షణ శిబిరంలో చిన్నారుల సందడి

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో 'లిటిల్ రాయల్స్‌-ఎ రాయల్ అడ్వంచర్ ఇన్ లీడర్‌షిప్' పేరిట వేసవి శిబిరాన్ని ప్రారంభించింది. పాఠశాల ఆవరణలోని విశ్వం ఎడ్యుటైన్‌మెంట్ బ్లాక్‌లో 4-10 ఏళ్ల వయస్సు గల చిన్నారులకు వచ్చేనెల 24వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో ఈ వేసవి శిక్షణ శిబిరం కొనసాగనుంది. అర్థశాస్త్రం, ధర్మం, కుటుంబం, అభ్యాసం, శాంతి తదితర అంశాలపై దృష్టి సారించి ఈ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు. నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించడం, జ్ఞానం, ఉన్నత విలువలు పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. హెర్బల్ క్రీమ్ తయారు, విలు విద్య అభ్యాసం, కాలీగ్రఫీ, పర్యావరణ వ్యవస్థలను అర్థం చేసుకోవడం, 3డీ సిరామిక్స్ ఉపయోగించి నాణేలను రూపొందించడం వంటి అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.

మే డే పోస్టర్ ఆవిష్కరణ



హిమాయత్‌నగర్: తెలంగాణ భవన నిర్మాణ చైతన్య కార్మిక యూనియన్, కార్మిక హక్కుల పోరాట సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన కార్మికుల డిమాండ్స్‌తో కూడిన మే డే వాల్ పోస్టర్‌ను బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో టీయూజేఏసీ ప్రధాన కార్యదర్శి బత్తుల సోమయ్యతో కలిసి సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ భవన నిర్మాణ చైతన్య కార్మిక యూనియన్ ప్రధాన కార్యదర్శి కేసీఎస్ ప్రసాద్, ఇ.బాబు, కార్మిక హక్కుల పోరాట సంఘం అధ్యక్షుడు సురుగు ప్రభాకర్, టీయూజేఏసీ ప్రధాన కార్యదర్శి క్రిష్టాఫర్, సెక్రటరీ జనరల్ తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి, బోగి పద్మ, మార్వాడి సుదీర్షన్, టీజేఎఫ్ నాయకులు మోహన్ బైరాగి, జర్నలిస్ట్ ఆంజనేయులు, రచయిత ఇంద్రవెల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆ బాధ్యత మహిళా సమాఖ్యలదే..

- బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా అధికారుల వినూత్న ప్రయత్నం
- జరిమానా వేసే హక్కు మహిళా సమాఖ్యలకు కల్పించిన అధికారులు
- చెత్త సేకరించే వాహనాల్లో మాత్రమే చెత్త వేయాలి
- వారం రోజుల పాటు స్థానికంగా అవగాహన కార్యక్రమాలు
- ఆ తర్వాత రూ.500 మొదలు రూ.2 వేల వరకు జరిమానా



మహిళా సమాఖ్యల సభ్యులతో మాట్లాడుతున్న జూబ్లీహిల్స్ డీఎంసీ సమ్మయ్య



బంజారాహిల్స్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయవద్దని ఇప్పటికే పలు ప్రయోగాలు చేసిన అధికారులు ఇప్పుడు మరో వినూత్న ప్రయోగానికి సిద్ధమయ్యారు. గతంలో మహిళా సమాఖ్యలు, రిసోర్స్‌పర్సన్లు చెత్త వేయకుండా నిరోధించడం వరకు మాత్రమే పరిమితం చేసిన అధికారులు తాజాగా ఆ మహిళా సమాఖ్యల సభ్యులు, రిసోర్స్ పర్సన్లకు చెత్త వేసిన వారికి జరిమానాలను సైతం విధించేలా అధికారులు హక్కులు కల్పిస్తామని చెబుతున్నారు. జూబ్లీహిల్స్ సర్కిల్-18 డీఎంసీ సమ్మయ్య జూబ్లీహిల్స్ డివిజన్‌తో పాటు బంజారాహిల్స్ డివిజన్లలో ఉన్న మహిళా సమాఖ్యల అధ్యక్షులు, రిసోర్స్‌పర్సన్లు, చెత్త సేకరించే వాహనదారులు, శానిటేషన్ సూపర్‌వైజర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఇకపై మహిళా సమాఖ్యలదేనని జీహెచ్‌ఎంసీ యంత్రాంగంలోని వనరులను సమర్థవంతంగా మహిళా సమాఖ్యల సభ్యులు వినియోగించుకోవాలని సూచించారు.

చెత్త వేస్తే జరిమానా..

- బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయవద్దని మహిళా సమాఖ్యల సభ్యులు వారి వీధుల్లో వారం రోజుల పాటు అవగాహన కల్పించాలి.
- ఆ తర్వాత చెత్త వేయవద్దని ఇంటింటికీ జీహెచ్‌ఎంసీ నోటీసులు ఇస్తుంది.
- చెత్త సేకరించే వాహనాలకు మాత్రమే చెత్తను అందించాలి. ఒక వేళ చెత్త సేకరించే వాహనాలు అక్కడికి రాకపోతే వారి నంబర్లకు ఫోన్లు చేసి చెత్తను సేకరించే విధంగా చూడాలి.
- బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ఉండేలా ఆ ఇంటి యజమాని సైతం కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలి.
- అవగాహన కార్యక్రమాలు పూర్తయిన తర్వాత ప్రతి ఇంటి యజమానికి చెత్త వేయవద్దని కోరుతూ జీహెచ్‌ఎంసీ ఇచ్చే నోటీసులను వారికి ఇవ్వాలి.
- మొదటిసారి చెత్త వేస్తే ఆ ఇంటి యజమానికి రూ.500, రెండోసారి వేస్తే రూ.వెయ్యి, మూడోసారి వేస్తే రూ.2 వేలు జరిమానా వేయాలి.
- జరిమానాల ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆయా మహిళా సమాఖ్యల అవసరాలకే వినియోగించాలి.
- జరిమానాలు విధించాలనే లక్ష్యంతో కాకుండా ప్రతి వీధి శుభ్రంగా ఉండటంతో పాటు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా చూసుకోవడమే లక్ష్యంగా పని చేయాలి.

ఇంటింటికీ తిరిగి అవగాహన

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయవద్దనేది మా లక్ష్యం. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటి మీద పట్టుండే మహిళా సమాఖ్యల సభ్యులను, రిసోర్స్‌పర్సన్లను ఇందుకు వినియోగిస్తున్నాం. ఇంటి యజమానులకు సైతం అవగాహన కల్పిస్తాం. వారికి నోటీసులు సైతం ఇస్తాం. తీరు మార్చుకోకపోతే మహిళా సమాఖ్యల సభ్యులే వారికి జరిమానాలు విధిస్తారు.

– డీఎంసీ సమ్మయ్య, జూబ్లీహిల్స్

ఉద్యోగం పేరుతో ఆన్‌లైన్ మోసం

బంజారాహిల్స్: ఉద్యోగం ఆశ చూపించి ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా రూ.95,050లను కాజేసి మోసానికి పాల్పడిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్-1, దోభీఘాట్ ప్రాంతంలో నివాసం ఉండే నేతికుంట మౌనికకు ఈ నెల 15న తన పేరు నితిన్‌గా పేర్కొంటూ ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. తాను యాక్సిస్ బ్యాంకుకు ప్రాతినిధ్యం వహిస్తున్నానని, ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నట్లు చెప్పాడు. నమ్మిన ఆమె వాట్సప్‌లో సంభాషణను కొనసాగించింది. ఈ క్రమంలో రిజిస్ట్రేషన్ లింక్‌ను షేర్ చేసి, ఉద్యోగ దరఖాస్తు రుసుము రూ.30లు చెల్లించాలని అడిగాడు. ఇందుకోసం ఆమె ఐసీఐసీఐ క్రెడిట్ కార్డు ఉపయోగించి చెల్లించింది. ఆ తర్వాత గూగుల్ మీట లింక్ ద్వారా ఆన్‌లైన్‌కు రావాలని, పరీక్షా సమయంలో మౌనిక స్క్రీన్‌ను చూపించాల్సి ఉంటుందని నమ్మబలికాడు. పరీక్ష కొనసాగుతున్నప్పుడు మౌనిక స్క్రీన్‌పై ప్రదర్శించే ఓటీపీలతో సహా బ్యాంక్ సమాచారాన్ని పొందాడు. వీటి ఆధారంగా ఒకసారి రూ.40 వేలు, మరోసారి రూ.51,050లు మొత్తం రూ.95,050లను మౌనిక ఖాతా నుంచి బదిలీ చేసుకున్నాడు. దీంతో తాను మోసపోయానని గ్రహించి వెంటనే సైబర్ క్రైమ్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసింది. మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముఫకంజా కళాశాల ప్రాజెక్టుకు రూ.15లక్షల గ్రాంట్



ఎంఎస్‌ఎంఈ ఐడియా హ్యాక్‌థాన్ 3.0 ప్రారంభ కార్యక్రమంలో అతిథులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్-3 లోని ముఫకంజా ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో లిడార్ డ్రోన్ ఆధారిత 3డీ మ్యాపింగ్ ప్రాజెక్ట్‌ను మంగళవారం ప్రారంభించారు. ఎంఎస్‌ఎంఈ సహకారంతో ఐడియా హ్యాకథాన్ 3.0 కింద చేపట్టిన ఈ ప్రాజెక్టుకు రూ.15 లక్షల గ్రాంట్ లభించింది. కేవలం మహిళల నాయకత్వంలో జరిగే ఈ ప్రాజెక్టును సుల్తాన్-ఉల్-ఉలూమ్ ఎడ్యుకేషన్ సొసైటీ గౌరవ కార్యదర్శి జాఫర్ జావీద్, ఎంఎస్‌ఎంఈ-డీఎఫ్‌ఓ జాయింట్ డైరెక్టర్ విజయ్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ నవీన్‌కుమార్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జాఫర్ జావీద్ మాట్లాడుతూ కళాశాల ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ సాధించిన విజయానికి ఈ ప్రాజెక్టు నిదర్శనమన్నారు. ఆవిష్కరణలు, పరిశోధనల పట్ల అధ్యాపకులు, విద్యార్థుల నిబద్ధతను ప్రశంసించారు. జాతీయ స్థాయిలో పోటీపడేలా ప్రతిష్టాత్మక ప్రాజెక్టును సాధించడంపై ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహిపాల్‌సింగ్ రావత్, రిజిస్ట్రార్ కేవీ నర్సింహరావు, అకడమిక్ డీన్ డాక్టర్ మహ్మద్ హమ్రాజ్, అడ్మినిస్ట్రేషన్ డీన్ సయ్యద్ ఫర్హతుల్లా హుస్సేని, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి మహ్మద్ హసీబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కరెంటు ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: హిందూ 11కేవీ ఫీడర్ గ్రీన్‌లాండ్స్ సబ్‌స్టేషన్ పరిధిలో కొనసాగుతున్న మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు వెంకట్‌ప్లాజా, ఓరా జ్యువెలరీ, కృష్ణా జ్యువెలరీ, ఎక్సైడ్ బ్యాటరీలైన్, పోచమ్మ దేవాలయం, పంజగుట్ట ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపిపోతుందని గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ మంగళవారం పేర్కొన్నారు.

నేడు ట్యాంక్‌బండ్‌పై బసవేశ్వర జయంతి ఉత్సవాలు

హిమాయత్‌నగర్: మహాత్మా బసవేశ్వర జయంతి ఉత్సవాలను వీరశైవ సమాజం ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్‌పై గల బసవేశ్వర విగ్రహం వద్ద బుధవారం నిర్వహిస్తున్నట్లు వీరశైవ సమాజం అధ్యక్షుడు మాడపు వీర మల్లేష్, ఉపాధ్యక్షుడు బద్రి ఈశ్వరప్ప, కార్యదర్శి కోట గుండప్ప, సహాయ కార్యదర్శి వేపూరి రాజేశ్వర్, కోశాధికారి తంగడిపల్లి లింగం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మహాత్మా బసవేశ్వర విగ్రహానికి పూజా కార్యక్రమం అనంతరం ప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రభాకర్, చిన్న వీరప్ప, బీసప్ప, ప్రవీణ్ కుమార్, గౌరీ శంకర్, శ్రీనివాస్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవస్థపై యువత అధ్యయనం చేయాలి

జాతీయ సెమినార్‌లో ఓయూ రిజిస్ట్రార్ డాక్టర్ నరేష్‌రెడ్డి



జాతీయ సదస్సులో ప్రసంగిస్తున్న నరేష్‌రెడ్డి

హిమాయత్‌నగర్: ఆర్థిక వ్యవస్థపై నేటి యువత అధ్యయనం చేస్తూ రాష్ట్రం, దేశం ప్రగతి పథంలో నడిచేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఓయూ రిజిస్ట్రార్ డాక్టర్ నరేష్‌రెడ్డి అన్నారు. నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ ఆడిటోరియంలో 'ఆదాయ నిర్వహణ సమస్యలు-సవాళ్లు' అంశంపై మంగళవారం నిర్వహించిన జాతీయ సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో భారత దేశానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, పలు రకాలుగా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమ నైపుణ్యాలు పెంచుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దేశ ఆర్థిక వ్యవస్థలో యువత పాత్ర కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ ప్రతినిధులు ఓబుల్‌రెడ్డి, అప్పారావు, కేశవ్ మెమోరియల్ విద్యాసంస్థల డైరెక్టర్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ శాంతి పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

ఫిలింనగర్: గంజాయి విక్రేతతో పాటు కొనుగోలు చేయడానికి వచ్చిన ఇద్దరు యువకులను ఫిలింనగర్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. రాయదుర్గం ప్రాంతానికి చెందిన కే.వంశీకాంత్ అలియాస్ బబ్లూ(23) ఎలక్ట్రీషియన్. ఈజీ మనీ కోసం అలవాటు పడి గంజాయి విక్రయిస్తున్నాడు. సోమవారం రాత్రి 10.30 గంటల సమయంలో టోలిచౌకి పాస్‌పోర్ట్ ఆఫీసు వద్ద ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో ఫిలింనగర్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. వంశీకాంత్ వద్ద గంజాయి కొనుగోలు చేయడానికి వచ్చామని మణికొండలో నివసించే ఎస్.ప్రవీణ్(22), ఆర్.దీపక్(18) వెల్లడించారు. ఈ ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరి వద్ద నుంచి 40 గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. షేక్‌పేటలోని కిషోర్ అనే వ్యక్తి వద్ద తాను గంజాయి కొనుగోలు చేశానని, అవసరమైన వారికి రూ.500లకు ఒక ప్యాకెట్ చొప్పున విక్రయిస్తుంటానని వంశీకాంత్ వెల్లడించారు. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డు తప్పనిసరి



వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న డీఎంసీ

వెంగళరావునగర్: వీధి వ్యాపారులు ఖచ్చితంగా గుర్తింపు కార్డును పొందాలని జీహెచ్‌ఎంసీ సర్కిల్-19 ఉప కమిషనర్ జకియా సుల్తానా తెలియజేశారు. వీధి వ్యాపారుల అవలంభించాల్సిన విధానాలను తెలియజేస్తూ మంగళవారం యూసుఫ్‌గూడ సర్కిల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉప కమిషనర్ జకియా సుల్తానా మాట్లాడుతూ వీధి వ్యాపారుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. ఈ పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రతి వ్యాపారి ఉన్నతంగా బతకాలని సూచించారు. అదేవిధంగా ఎక్కడ పడితే అక్కడ తన బండ్లను నిలిపి వ్యాపారం చేయవద్దని, జీహెచ్‌ఎంసీ సూచించిన స్థలాల్లోనే, తమకు కేటాయించిన ప్రాంతాల్లోనే వ్యాపారం చేసుకోవాలని అన్నారు. ముఖ్యంగా అనేకమంది ట్రాఫిక్‌ను పట్టించుకోకుండా రోడ్లమీదే వ్యాపారం చేయడం వల్ల గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోందని, ఇలాంటి సమయంలో ట్రాఫిక్ అధికారులు కేసులు నమోదు చేసే అవకాశం ఉందని అన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటూ వ్యాపారాలను వృద్ధి చేసుకోవాలన్నారు. సర్కిల్-19 ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకట కిషన్, ఎస్‌ఆర్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు, ఏఎంఓహెచ్ శ్యాంసన్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ప్రసీద, టీఎల్‌ఎఫ్ మెంబర్లు, వీధి వ్యాపారుల కమిటీ నేతలు, ఎన్‌జీఓ సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలంటూ ఆస్పత్రి సిబ్బంది ధర్నా

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్-1/12 చౌరస్తాలో ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేస్తున్న హౌస్ కీపింగ్ సిబ్బంది తమకు వేతనాలు చెల్లించాలంటూ మంగళవారం ధర్నా నిర్వహించారు. ఇక్కడ పనిచేస్తున్న సుమారు 200 మంది హౌస్ కీపింగ్ సిబ్బంది ఈ ధర్నాలో పాల్గొని సమస్యలు పరిష్కరించాలంటూ బైఠాయించారు. రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని ఆరోపించారు. హౌస్ కీపింగ్‌గా పనిచేస్తున్న ఓ మహిళ ఆరోగ్యం క్షీణించడంతో ఆమెకు ఈఎస్‌ఐ లేకపోవడంతో ఇబ్బంది పడుతుండటాన్ని గమనించి తట్టుకోలేక సిబ్బంది అందరం కలిసి చందాలు వేసుకొని ఆమెకు చికిత్స చేయించుకున్నామన్నారు. ఈఎస్‌ఐ, పీఎఫ్ తప్పనిసరిగా కావాలని డిమాండ్ చేశారు. ఇటీవల వచ్చిన కొంతమంది తమను వేధింపులకు గురిచేస్తున్నారని, కఠినంగా వ్యవహరిస్తున్నారని, జీతాలు అడిగితే ఉద్యోగాల్లో నుంచి తొలగిస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగంలో నుంచి తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న జీతాలను చెల్లించాలని కోరారు.

ఫుట్‌ఫాత్‌లను ఆక్రమిస్తే చర్యలు తప్పవు



అపోలో ఆస్పత్రి వద్ద ఆక్రమణలు తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఫిలింనగర్: ఫుట్‌ఫాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు కేసులు తప్పవని జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. ఆపరేషన్ రోప్‌లో భాగంగా జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రికి దారి తీసే మార్గాల్లో ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన బోర్డులు, డబ్బాలు, దుకాణాలను పోలీసులు తీసివేయించారు. ఇది ఇరుకైన రోడ్డుతో పాటు ఈ దుకాణాలకు వచ్చే వారు రోడ్లపైనే వాహనాలు నిలుపుతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

విధుల్లోకి తిరిగి తీసుకోవాలని వినతి



విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్న ఉద్యోగులు

పంజగుట్ట: తెలిసో తెలియకో చేసిన తప్పులకు ఉద్యోగం నుంచి తొలగించబడిన మమ్మల్ని మన్నించి తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాలని విధుల నుంచి తొలగించిన ఆర్టీసీ ఉద్యోగులు విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తొలగింపబడ్డ ఆర్టీసీ ఉద్యోగులు దాసరి రాంబాబు, వీరాంజనేయులు, పి.శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. తాము ఉద్దేశ్యపూర్వకంగా ఏ తప్పు చేయలేదని, పొరపాటున జరిగిన తప్పుకు తమను ఉద్యోగం నుంచి తొలగించారని, కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వివిధ కారణాలతో ఆర్టీసీలో ఉద్యోగాలు కోల్పోయిన వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం త్రిసభ్య కమిటీ వేసి మొదటి లిస్టులో దాదాపు 136 మందిని తిరిగి విధుల్లోకి తీసుకున్నారని, మిగిలిన సుమారు 300 మందిని కూడా త్వరగా విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



వేడుకల్లో కార్పొరేటర్ వనం సంగీత

శ్రీనగర్‌కాలనీ: బస్తీల్లో దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తామని కార్పొరేటర్ వనం సంగీత అన్నారు. ఎల్లారెడ్డిగూడలోని నల్ల పోచమ్మ నాగదేవత ఆలయంలో మంగళవారం ధ్వజస్తంభ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేడుకలకు కార్పొరేటర్ దంపతులు వనం సంగీత, వనం శ్రీనివాసయాదవ్‌తో పాటు బస్తీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జి నవీన్ యాదవ్ పూజల్లో పాల్గొని అన్నదానం చేశారు. బస్తీ కమిటీ ప్రెసిడెంట్ భిక్షపతి, ఆలయ చైర్మన్ చిన బాబు, గొంటి సాయినాథ్‌యాదవ్, గని, మాజిద్ భాయ్, మహేష్, సత్యనారాయణ, గోవర్ధన్, మురళి, రాజు, సాగర్, కపిల్, దుర్గేష్ పాల్గొన్నారు.

వార్డు కార్యాలయాల్లో దరఖాస్తులు అందజేయాలి

షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి



ఫిలింనగర్: రాజీవ్ యువ వికాసం పథకం కింద మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న ఆన్‌లైన్ దరఖాస్తు ఫారాలను తమ పరిధిలోని జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయాల్లో సంబంధిత దరఖాస్తుదారులు సత్వరమే అందజేయాలని షేక్‌పేట మండల తహసీల్దార్ వై.అనితారెడ్డి కోరారు. ఈ పథకానికి సంబంధించిన దరఖాస్తుల స్క్రూటినీ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోందన్నారు. చాలామంది దరఖాస్తుదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని వదిలేశారని, అలా కాకుండా సంబంధిత పత్రాలు జతపర్చి దరఖాస్తులను ఫిజికల్‌గా వార్డు కార్యాలయాల్లో అందజేయాలన్నారు. దరఖాస్తులు అందజేయడానికి ఈ నెల 30వ తేదీ చివరి గడువు అన్నారు. ఎవరైతే మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నారో వారందరూ వెంటనే వార్డు కార్యాలయాల్లో దరఖాస్తులు అందజేయాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు ఫారాలతో పాటు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలను తప్పనిసరిగా తీసుకువచ్చి అందజేయాలన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్ కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: కిలో టమాటా రూ.15, నల్లవంకాయ.18, పాడుగువంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జిమిర్చి 33, క్యాప్సికం 45, పచ్చికాకరకాయ 35, పందిరిబీర 35, క్యాబేజీ 08, క్యారెట్ 19, దొండకాయ 28, గుండు బిన్నీస్ 65, గింజచిక్కుడు 55, గోకరకాయ 35, కీర 20, దోసకాయ 18, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 25, చామగడ్డ 35, మొరంగడ్డ 15, కందగడ్డ 75, క్యాలీఫ్లవర్ 18, సొరకాయ 09, పొట్లకాయ 15, అరటికాయ 10, ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకూ అందుబాటులో ఉంటాయి.

ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం స్పందించకుంటే సమ్మె

టీజీఆర్టీసీ జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ నరసింహ

హిమాయత్‌నగర్: తెలంగాణ ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల సమస్యలను యాజమాన్యం, ప్రభుత్వం చర్చలకు పిలిచి పరిష్కరించకుంటే వచ్చేనెల 7 నుంచి సమ్మె తప్పదని టీజీ ఆర్టీసీ జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో టీజీఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో జేఏసీ చైర్మన్, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న అధ్యక్షతన ఆర్టీసీ పరిరక్షణ, ప్రభుత్వ హామీలు, ఆర్టీసీలో సమ్మె అంశాలపై జాతీయ కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం మంగళవారం జరిగింది. సమావేశంలో ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాబు, ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎం.నరసింహ, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకురాలు అనురాధ, నాయకులు రమేష్, జేఏసీ కో చైర్మన్ కె.హన్మంతు ముదిరాజ్, వైస్ చైర్మన్ ఎం.థామస్‌రెడ్డి, కన్వీనర్ ఎండీ మౌలానా, కో-కన్వీనర్ కత్తుల యాదయ్య, నేతలు సుద్దాల సురేష్, బి.యాదగిరి, టీఎంయూ నాయకులు పాల్గొన్నారు.

చింత చిగురు కిలో ధర రూ.800



మార్కెట్‌లో విక్రయానికి ఉంచిన చింత చిగురు

నాంపల్లి: చింత చిగురు మార్కెట్‌లో రికార్డు స్థాయిలో ధర పలుకుతోంది. రోజు రోజుకీ చింత చిగురు పసిడి ధరలాగా పైకి ఎగబాకుతుందే తప్ప కిందకు దిగిరావడం లేదు. శని, ఆదివారాల్లో జరిగే వారాంతపు సంతల్లో కిలో చింతచిగురు రూ.650 పలికింది. కానీ, ఈ ధర మంగళవారం రూ.800 చేరుకుంది. అంత ధర పెట్టి కొనుగోలు చేయకలేక చాలామంది వినియోగదారులు వెనక్కి వెళ్లిపోతున్నారు. వర్షాలు లేక చింత చిగురు రావడం లేదని విక్రయదారులు పేర్కొంటున్నారు. ధరలు ఎక్కువగా ఉండటం, కొనుగోలుదారులు ఆసక్తిని కనబరచకపోవడంతో విక్రయదారులు చింత చిగురును అమ్మడానికి ముందుకు రావడం లేదు.

ఎస్సై కుమార్తెకు నీట్ ఎస్ఎస్‌లో 3వ ర్యాంకు

ఉస్మానియా మెడికల్ కాలేజీలో పీజీ పూర్తిచేసిన శ్రావ్య



జీడిమెట్ల: ఎస్సై కుమార్తె ఆలిండియా స్థాయి నీట్ ఎస్ఎస్ (సూపర్ స్పెషాలిటీ) ఎంట్రన్స్‌లో 3వ ర్యాంకు సాధించింది. ఐడీపీఎల్‌లో నివసించే మియాపూర్ పోలీసు స్టేషన్ ఎస్సై మాణిక్యం, ఉమాదేవిల కుమార్తె మదం శ్రావ్య(24) మార్చి 29, 2025లో నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ వారు నిర్వహించిన ఎగ్జామ్ రాసింది. ఏప్రిల్ 25న వెలువడిన ఫలితాల్లో ఆమె దేశవ్యాప్తంగా 3వ ర్యాంకు సాధించింది. ఇప్పటికే ఆమె ఉస్మానియా మెడికల్ కాలేజీలో పీజీ గైనకాలజీ పూర్తి చేసింది. 'సాక్షి'తో డాక్టర్ స్రావ్య మాట్లాడగా గైనకాలజీ డిపార్ట్‌మెంట్ అంకాలజీలో ఉన్నతమైన పరిశోధన చేసే అవకాశం వచ్చిందని చెప్పారు. గైనిక్‌లో వచ్చే కేన్సర్‌పై పరిశోధనలు చేసి స్త్రీలకు సేవ చేస్తానని తెలిపారు. తమ కుమార్తె ఆలిండియా 3వ ర్యాంకు సాధించడం పట్ల తండ్రి మాణిక్యం, తల్లి ఉమాదేవి ఆనందాన్ని వ్యక్తం చేశారు.

మే 1 నుంచి ఓయూ హాస్టళ్ల మూసివేత

ఉస్మానియా యూనివర్సిటీ: మే ఒకటవ తేదీ నుంచి పీజీ కాలేజీల విద్యార్థులకు ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు వేసవి సెలవులను ప్రకటించారు. ఓయూ క్యాంపస్‌తోపాటు అనుబంధ కాలేజీల ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నెల రోజులపాటు వేసవి సెలవులు ప్రకటించడంతో హాస్టల్స్, భోజనశాలలను జూన్ 1వ తేదీ వరకు మూసివేయనున్నట్లు అధికారులు తెలిపారు. హాస్టల్ భవనాల మరమ్మతుల కారణంగా గదులను ఖాళీ చేయాలని అధికారులు సూచించారు.

నగరంలో నేడు

- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో క్విస్ట్ లైట్ పేరిట చిత్ర ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- రవీంద్రభారతి ఆడిటోరియంలో ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్ష ఫలితాలను మధ్యాహ్నం ఒంటి గంటకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేస్తారు.
- చర్లపల్లి రైల్వేస్టేషన్ ప్రారంభమైనా పట్టించుకోరా అంటూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ ధర్నా చేయనున్నారు.
- కేపీహెచ్‌బీ కాలనీలో లులు మాల్‌లో లులు బిగ్ చాకో దేస్ ఫెస్టివల్ ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు కోకో మిలన్ యాక్టివిటీస్, చిన్నారులకు పెయింటింగ్, డ్రాయింగ్, త్రీడీ యానిమేషన్ చిత్రాలు, వీడియోలతో ఇంగ్లిష్ పద్యాలు, పాటలపై శిక్షణ అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్‌లో ఫుడ్ ఇండియా ఎక్స్‌-2025 ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- మాదాపూర్‌లోని దుర్గం చెరువులో రాత్రి 7 నుంచి 10 గంటల వరకు మ్యూజికల్ వాటర్ ఫౌంటెన్ ప్రదర్శన ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

పండ్ల మండి.. కండ్ల నిండా దుమ్మండి!

ఎండకు ఎండి, వానకు తడుస్తున్న రైతులు, వ్యాపారులు

- గుంతలమయంగా అంతర్గత రహదారులు
- వాహనం వెళితే ఎగజిమ్ముతున్న దుమ్ము, ధూళి
- ఇదీ బాటసింగారం ఫ్రూట్ మార్కెట్ పరిస్థితి





సాక్షి, సిటీబ్యూరో: నిత్యం వందలాది వాహనాలు.. దేశ, విదేశాల నుంచి వచ్చే వేల టన్నుల పండ్లు.. రూ.కోట్లలో టర్నోవర్.. ఇది బాటసింగారం పండ్ల మార్కెట్ నాణేనికి ఒకవైపు.. నిలువ నీడ దొరకం కష్టం.. గుంతలమయంగా అంతర్గత రహదారులు.. దుమ్ము, దూళి, దుర్వాసనలకు నిలయం.. ఇది మరోవైపు. నాలుగేళ్ల క్రితం కొత్తపేట్ పండ్ల మార్కెట్‌ను కోహెడకు తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. శాశ్వత మార్కెట్ నిర్మాణానికి భూమిని కూడా సేకరించింది. నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు వ్యాపార లావాదేవీలకు ఇబ్బంది కలగకుండా తాత్కాలికంగా బాటసింగారంలో భూమిని అద్దెకు తీసుకుని పండ్ల మార్కెట్ నిర్వహిస్తున్నారు. తాత్కాలిక మార్కెట్ కావడంతో ఇక్కడ శాశ్వతంగా ఉపయోగపడే మౌలిక సదుపాయాలేవీ ఏర్పాటు చేయలేదు. రహదారులు గుంతలమయంగా ఉన్నాయి. వ్యాపారుల అవసరాలకు సరిపడా షెడ్లు లేవు. వ్యక్తిగత మరుగుదొడ్లు, డ్రైవర్లు, సహాయకులు, రైతులు, వ్యాపారులు సేదతీరేందుకు, అవసరమైతే రాత్రి బస చేసేందుకు డార్మిటరీ వంటి కనీస సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి.

ఎండలోనే అమ్మకాలు..

బాటసింగారం ఫ్రూట్ మార్కెట్‌లో ఏటా 4 లక్షల టన్నులకుపైగా పండ్లు అమ్మకాలు జరుగుతాయి. రోజుకు రైతులు, వ్యాపారులు, ఇతరులంతా కలసి సుమారు 15 వేల మంది వచ్చిపోతుంటారు. 28 రకాల పండ్లు ఇక్కడి నుంచి ఎగుమతి, దిగుమతుల లావాదేవీలు జరుగుతాయి. మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్, గుజరాత్, ఔరంగాబాద్, నాగ్‌పూర్, కేరళ, కశ్మీర్, సిమ్లా, మెదక్, నిజామాబాద్ తదితర ప్రాంతాల నుంచి వాహనాలు వచ్చిపోతుంటాయి. అయితే ఇలా వాహనాల్లో తెచ్చిన పండ్లను అమ్ముకోవడానికి షెడ్లు నిర్మించారు. పండ్ల రకాన్ని బట్టి స్థలాన్ని కేటాయించారు. యాపిల్, పుచ్చ, బొప్పాయి, నారింజ తదితర పండ్ల వార్డుల్లో సరిపడా షెడ్లు లేకపోవడంతో ఎండలోనే ఆరుబయట అమ్మకాలు, కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. మార్కెట్ యార్డులో ఖచ్చితంగా వాహన పార్కింగ్ కోసం స్థలం కేటాయించినా, వాహనాలు అడ్డదిడ్డంగా నిలిపివేస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. సీజన్ కావడంతో మామిడి యార్డులో స్థలాభావం కనిపిస్తోంది. కొందరు వ్యాపారులు తెచ్చుకున్న గొడుగు నీడలోనే పండ్లను అమ్ముకుంటున్నారు.

లారీ క్యాబిన్‌లోనే పడుకుంటున్నాం..

గుజరాత్ నుంచి మూడు రోజులు జర్నీ చేసి వచ్చాం. ఇక్కడి నుంచి మామిడి లోడ్ తీసుకుని వెళతాం. డార్మిటరీ ఉందన్న విషయం తెలియదు. లారీ క్యాబిన్‌లోనే పడుకుంటున్నాం. కాలకృత్యాలు తీర్చుకోవడానికి సరైన సదుపాయాలు లేవు.

– దేవ్ సింగ్, లారీ డ్రైవర్, గుజరాత్

గత ప్రభుత్వ నిర్వాకం వల్లే..



గత ప్రభుత్వం తాత్కాలిక పండ్ల మార్కెట్ పేరుతో రైతులు, వ్యాపారులను మోసం చేసింది. మేం వచ్చాక ఇప్పుడిప్పుడే కనీస మౌలిక వసతుల కల్పిస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం కోహెడలో అత్యాధునిక పండ్ల మార్కెట్ నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తోంది. అధికారులు డీపీఆర్ సిద్ధం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అనుమతితో త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

– చిలక మధుసూదన్‌రెడ్డి, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్





సెల్‌ఫోన్ల రికవరీలో సీఈఐఆర్ కీలకం

బాధితులకు 150 సెల్‌ఫోన్లు అందజేసిన ఎస్పీ చందనా దీప్తి



బాధితులకు సెల్‌ఫోన్లు అందజేస్తున్న రైల్వే ఎస్పీ చందనా దీప్తి

అడ్డగుట్ట: చోరీలకు గురైన సెల్‌ఫోన్లను గుర్తించేందుకు సీఈఐఆర్ పోర్టల్ చాలా ఉపయోగపడుతుందని రైల్వే ఎస్పీ చందనా దీప్తి అన్నారు. ఇటీవల రైల్వేస్టేషన్, రైళ్లలో ప్రయాణికులు పోగొట్టుకున్న, చోరీలకు గురైన సెల్‌ఫోన్లను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకొని వాటి యజమానులకు మంగళవారం అప్పగించారు. ఈ మేరకు లాలాగూడలోని రైల్వే ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. రైల్వే ప్రయాణికులు వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆదమరిస్తే చోరీలకు గురయ్యే అవకాశాలున్నాయని, రైల్వే పోలీసులు ప్రయాణికుల భద్రతకై అనేక జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రయాణికులు కూడా సహకరించి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఇటీవల చోరీలకు గురైన, ప్రయాణికులు పోగొట్టుకున్న రూ.15 లక్షల విలువ గల 150 సెల్‌ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తెలంగాణలో మాత్రమే కాకుండా ఇతర రాష్ట్రాలు కేరళ, ఉత్తర్ ప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్, బీహార్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లి చోరీ సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. సీఈఐఆర్ ద్వారా ఏప్రిల్ 19వ తేదీ 2023 సంవత్సరం నుంచి ఇప్పటివరకు మొత్తం రూ.99 లక్షల విలువ గల 990 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించినట్లు వెల్లడించారు. అందులో భాగంగా మంగళవారం ఎస్పీ కార్యాలయంలో 150 సెల్‌ఫోన్లు సంబంధిత యజమానులకు అప్పగించినట్లు తెలిపారు. సమావేశంలో రైల్వే డీఎస్పీలు ఎస్.ఎన్. జావెద్, కృపాకర్, ఇన్‌స్పెక్టర్లు సాయి ఈశ్వర్‌గౌడ్, ఆర్. ఎల్లప్ప, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌ను కలిసిన వర్రె వెంకటేశ్వర్లు

పంజగుట్ట: రాష్ట్ర పోలీస్ కంప్లెయింట్స్ అథారిటీ సభ్యుడిగా నియమితులైన డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే రాష్ట్ర పోలీస్ కంప్లెయింట్స్ అథారిటీ చైర్మన్‌ను నియమించిన విషయం తెలిసిందే. ఉమ్మడి నల్లగొండ జిల్లా మోత్కూర్ మండలం సదర్షాపూర్ గ్రామానికి చెందిన మాజీ సమాచార ప్రధాన కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లును ప్రభుత్వం ఈ అథారిటీలో సభ్యుడిగా నియమించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత అప్పగించినందుకు ముఖ్యమంత్రికి వెంకటేశ్వర్లు ధన్యవాదాలు తెలిపారు. మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని అన్నారు.



ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన వర్రె వెంకటేశ్వర్లు

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 'ప్రజావాణి' భరోసా



లక్డీకాపూల్: ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ముఖ్యమంత్రి ప్రజావాణి భరోసా కల్పించింది. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మైనారిటీ గురుకుల పాఠశాలల సొసైటీలోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్న సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ పరిష్కారానికి భరోసా కల్పించారు. అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో నోడల్ అధికారి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మొత్తం 308 దరఖాస్తులు వచ్చాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 104, విద్యుత్ శాఖకు 18, రెవెన్యూ శాఖకు 44, ఇందిరమ్మ ఇండ్ల కోసం 65 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 77 దరఖాస్తులు అందినట్లు ప్రజావాణి కోఆర్డినేటర్ రాకేష్‌రెడ్డి తెలిపారు. ప్రజావాణిలో స్టేట్ నోడల్ అధికారి దివ్య ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి వారి సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కారానికి కృషి చేశారు.

గన్‌పార్కు ఎదుట బీఆర్ఎస్ కార్పొరేటర్ల సంతాపం



గన్‌పార్కు ఎదుట నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు

నాంపల్లి: పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ గ్రేటర్ హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ కార్పొరేటర్లు మంగళవారం గన్‌పార్కు ఎదుట మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. ఈ దాడిని వారు తీవ్రంగా ఖండించారు. పాకిస్తాన్ దేశద్రోహులను తక్షణమే మట్టి కరిపించాలని కేంద్రాన్ని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఉగ్రదాడుల్లో మరణించిన వారి కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్ గౌడ్, రవీందర్, సింధుజ, జగన్, హేమ, సునీత తదితరులు పాల్గొన్నారు.

'ఆ కళాకారుల' త్యాగాలు వెలకట్టలేం



అమరుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పాశం యాదగిరి

అమరుల సంస్మరణ సభలో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి

హిమాయత్‌నగర్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొని అమరులైన కళాకారుల త్యాగం వెలకట్టలేమని సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి అన్నారు. మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో 'ప్రజా ఉద్యమ కళాకారుల సంస్మరణ సభ'సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు వేముల యాదగిరి, డోలక్ యాదగిరి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, గద్దర్ కుమారుడు సూర్యం, దరువు అంజన్న, టీయూజేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, సెక్రెటరీ జనరల్ తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి బత్తుల సోమన్న, టీజేఎఫ్ నాయకులు మోహన్ బైరాగి, కేసీఎస్ ప్రసాద్ మాట్లాడారు. ప్రజా ఉద్యమాలలో కళాకారుల పాత్ర మరువలేమని పాశం యాదగిరి అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నుంచి తొలి, మలి దశ ఉద్యమాలలో కళాకారుల పాత్ర ఎంతో గొప్పదని పేర్కొన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంతో ప్రజలు నిర్వాసితులు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వం వచ్చినా ప్రజల కోసం పని చేయాలన్నారు. కార్యక్రమంలో షేక్ షావలి, మార్వాడి సుదర్శన్, కోలా జనార్దన్, గంగి రాజు, బోగే పద్మా తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం పెరగాలి



మహిళా సదస్సులో మాట్లాడుతున్న మంత్రి సీతక్క



సదస్సులో పాల్గొన్న మహిళలు

– పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క

పోచారం: మహిళలు పలు రంగాల్లో రాణిస్తున్నప్పటికీ రాజకీయంగా వెనకబడి ఉన్నారని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం పోచారం మున్సిపాలిటీ పరిధిలోని కొర్రెముల్‌లో తెలంగాణ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రియదర్శిని రైజ్ టు లీడ్ – 2025 పేరుతో నిర్వహించిన మహిళా సదస్సులో సీతక్క మాట్లాడుతూ రాజకీయాల్లో మహిళలు 9 శాతమే ఉన్నారని, వారి సంఖ్య 43 శాతానికి పెరగాలన్నారు. మగవారికి దీటుగా ఎన్నో వృత్తుల్లో మహిళలు పోటీ పడుతున్నారన్నారు. మహిళలు రాజకీయాల్లోకి వస్తే చిన్నచూపు చూస్తారనే భావన నుంచి బయటపడాలని పేర్కొన్నారు. తాను కొంత కాలం న్యాయవాద వృత్తిలో కొనసాగానని, ఆ వృత్తితో పరిమిత పరిధిలో పనిచేయాల్సి వచ్చేదన్నారు. రాజకీయల్లోకి వస్తే విస్తృత పరిధిలో పనిచేసే అవకాశం ఉంటుందని, అందుకే రాజకీయ రంగ ప్రవేశం చేసి 20 ఏళ్లకు మంత్రి స్థాయికి ఎదిగానని చెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బాలికల చదువు, సంరక్షణ కార్యక్రమాన్ని అమలు చేయడాని కంటే ప్రచారానికే ఎక్కువ ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం మహిళలు కొట్లాడుకునేందుకు పనికొస్తుందని మాజీ సీఎం కేసీఆర్ విమర్శించడం సరి కాదన్నారు. చేతిలో డబ్బులు లేనప్పుడు అత్యవసర పరిస్థితుల్లో దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే ఉచిత బస్సు ప్రయాణం ఏవిధంగా ఉపయోగపడుతుందో గమనించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్‌భాను చిబ్, రాష్ట్ర అధ్యక్షుడు జక్కిరెడ్డి శివచరణ్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాత, సీనియర్ నాయకురాలు ఇందిరా శోభన్, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొమ్మక్ అజయ్ పాల్గొన్నారు.

ముగిసిన కురుక్షేత్ర-2025



కురుక్షేత్ర క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(జేఎన్ఐఏఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన కురుక్షేత్ర-2025 క్రీడా పోటీలు ముగిశాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఆర్కిటెక్ కాలేజీల నుంచి సుమారు 1,500 మందికిపైగా విద్యార్థులు ఈ క్రీడా పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. ఈ సందర్భంగా సోమవారం బహుమతులు ప్రదానోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ చంద్రిక, జర్నలిస్ట్ స్వప్న ముఖ్య అతిథులుగా పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా చోట్ల మైదానాలు లేవని, ఉన్నకొద్ది వాటిని కాపాడటంతోపాటు క్రీడల ప్రాముఖ్యతను భావితరాలకు తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. జేఎన్ఐఏఎస్ రిజిస్ట్రార్ డాక్టర్ డి.సురేష్ మాట్లాడుతూ తాము నిర్వహించిన కురుక్షేత్ర క్రీడాపోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారని భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలను నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో జెన్ఐఏఎస్ కాలేజీ ప్రిన్సిపాల్ షాలిని తదితరులు పాల్గొన్నారు.

'మనూ' ఉద్యోగుల కొవ్వొత్తుల ర్యాలీ

– పహల్గామ్ మృతులకు నివాళులు



కొవ్వొత్తుల ర్యాలీ అనంతరం నివాళులు అర్పిస్తున్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది

రాయదుర్గం: పహల్గామ్ మృతులకు నివాళిగా మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం(మనూ) అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది మంగళవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయం పరిపాలన భవనం నుంచి ప్రధాన ద్వారం వరకు కొవ్వొత్తులు, ప్లకార్డులు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. 'మనూ' ఎఫ్ఈడీసీయూటీఏ వి.పి అధ్యక్షురాలు డాక్టర్ షబానా కేసర్ మాట్లాడుతూ ఈ ఉగ్రదాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలన్నారు. 'మనూ' అధికారుల సంఘం కార్యదర్శి డాక్టర అస్లామ్ పర్వేజ్ మాట్లాడుతూ ఏ మతమూ ద్వేషాన్ని బోధించదని, ఏ ఉగ్రవాద చర్యలనూ సమర్థించలేమన్నారు. 'మనూ'ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ నవీద్ మాట్లాడుతూ పహల్గామ్ పర్యాటకులపైనే కాకుండా మొత్తం దేశంపై ఉగ్రవాదులు చేసిన దాడిగా అభివర్ణించారు. కార్యక్రమంలో డాక్టర్ జమీల్ అహ్మద్, ధరమ్‌జీత్, షానవాజ్ అలీ ఖురేషి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌తోపాటు 10 మందికి 'షోకాజ్'

- సికింద్రాబాద్ ఆర్డీవో, తహసీల్ ఆఫీస్‌ల్లో కలెక్టర్ అనుదీప్ తనిఖీ
- సకాలంలో విధులకు హాజరు కాని సిబ్బందిపై ఆగ్రహం



సికింద్రాబాద్ తహసీల్దార్ ఆఫీస్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ అనుదీప్

సాక్షి, సిటీబ్యూరో/రాంగోపాల్‌పేట: విధులకు సకాలంలో హాజరుకాని సికింద్రాబాద్ తహసీల్దార్‌తోపాటు 10 మంది సిబ్బందికి హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి షోకాజ్ నోటీసులు జారీశారు. మంగళవారం సికింద్రాబాద్ ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాలను ఆయన తనిఖీ చేశారు. తొలుత తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి హాజరు పట్టిక పరిశీలించారు. కలెక్టర్ వచ్చిన సమయంలో తహసీల్దార్ పాండునాయక్‌తో పాటు సర్వేయర్ కిరణ్ కుమార్, ఎంఆర్ఐ ప్రసన్న లక్ష్మి, స్పెషల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు తేజ్‌పాల్, షేక్ మోయినుద్దీన్, జూనియర్ అసిస్టెంట్‌లు జీ అనూష, రికార్డు అసిస్టెంట్లు ఎం మనీష్, ఎం ప్రమోద్, బీ రాజశేఖర్, ఆఫీస్ సబార్డినేట్ ఎం మాలతి, చైన్‌మెన్ సతీష్‌లు విధులకు హాజరు కాలేదు. హాజరు పట్టికను పరిశీలించిన కలెక్టర్ అప్పటి వరకు కార్యాలయానికి రాని ఉద్యోగుల గురించి ఆరా తీశారు. విధుల్లో ఉన్న వారిని ఒక్కొక్కరిని పిలిచి ధ్రువీకరించుకున్నారు. తహసీల్దార్ పాండునాయక్ ఆలస్యంగా విధులకు రావడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులకు ఆలస్యంగా వచ్చిన సిబ్బందికి రిజిస్టర్‌లో ఆబ్సెంట్ వేయడంతోపాటు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులకు మూడు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలని, విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. అనంతరం కార్యాలయంలోని అన్ని విభాగాలను పరిశీలించారు. కార్యాలయ నిర్వహణ, రికార్డులు సక్రమంగా ఉండాలన్నారు.

రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన

రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను తక్షణమే పరిశీలించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. తనిఖీలో భాగంగా రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను పరిశీలించి సికింద్రాబాద్ మండలంలో ఎంతమంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. 7,327 మంది నిరుద్యోగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని, అందులో ఇప్పటివరకు 2,572 దరఖాస్తులను పరిశీలించామని తహసీల్దార్ వెల్లడించారు. తక్షణమే అన్ని దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని, దరఖాస్తులను ఫిజికల్‌గా పరిశీలించి త్వరగా స్క్రూటినీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ రెవెన్యూ డివిజన్ అధికారి సాయిరాం, తహసీల్దార్ పాండునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మెహిదీపట్నంలో ఆక్రమణల కూల్చివేతలు



గోల్కొండ: మెహిదీపట్నం పాత ప్రిన్స్ హోటల్ వద్ద అక్రమంగా వెలిసిన డబ్బాలు, షెడ్‌లను బల్దియా టౌన్‌ప్లానింగ్ అధికారులు, హైడ్రా సిబ్బంది మంగళవారం కూల్చివేశారు. మెహిదీపట్నం ప్రిన్స్ హోటల్ వద్ద ఉన్న అపార్ట్‌మెంట్ వాసులు ఈ డబ్బాలు, షెడ్‌లపై హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం ఉదయం హైడ్రా ఏఈ సుజిత్, బల్దియా టౌన్‌ప్లానింగ్ ఏసీపీ కృష్ణమూర్తి అక్కడికి చేరుకొని అక్రమంగా వెలిసిన షెడ్‌లను, డబ్బాలను తొలగించారు. ఈ సందర్భంగా ఏసీపీ కృష్ణమూర్తి మాట్లాడుతూ టౌన్‌ప్లానింగ్ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఈ కూల్చివేతలు చేపట్టినట్లు చెప్పారు.



భాగ్యనగరంలో కళలకు పెరుగుతున్న ప్రాముఖ్యత

మారుతున్న చిత్రకళ చిరునామాలు, వేదికలు..

బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌ను దాటి విస్తరణ

సికింద్రాబాద్, గచ్చిబౌలి, నార్సింగిలోనూ పలు కొత్త గ్యాలరీలు

కార్పొరేట్ కంపెనీల విస్తరణ ఫలితమే ఈ మార్పు

నగరంలో ఆర్ట్ గ్యాలరీలు అనగానే వెంటనే గుర్తుకొచ్చే ప్రదేశాలు ఏవి? అంటే మాదాపూర్? జూబ్లీహిల్స్? బంజారా హిల్స్? అంతే.. ఇది ఒకప్పటి మాట. ప్రస్తుతం నగరంతో పాటు వీటి పరిధికూడా పెరుగుతోంది. భాగ్యనగరంలో కళకు, కళాకారులకు ఎంతో ప్రాధాన్యత ఉందని, అప్పటి తరానికే కాదు ఇప్పటి కొత్త తరానికీ అండగా పలు కంపెనీలు, గ్యాలరీలు నిలుస్తున్నాయని ప్రస్తుత పరిస్థితులు రుజువు చేస్తున్నాయి. గతంలో ఉన్న గాలరీలతోపాటు తాజాగా కొత్త పేర్లు జత అవుతున్నాయి. ముఖ్యంగా ప్రశాంతమైన పరిసరాలు ఉండే ప్రాంతాలకు ఇవి విస్తరిస్తుండడం విశేషం. - సాక్షి, సిటీబ్యూరో

కళల నగరం కలల సాగరం







కళాత్మక హృదయం ఉంటే.. సాధారణ గీతల్లో సైతం కళాకృతులు కనిపిస్తాయంటారు. అలాంటిది కళాత్మక హృదయం ఉన్న వ్యక్తి గీతలతో ఆడుతూ బొమ్మలేస్తే.. అవి ఎంత అద్భుతంగా ఉంటాయో మాటల్లో చెప్పలేము కదా..? అలాంటి అద్భుతమైన చిత్రాలకు నూతన వేదికలు నగరంలో కొలువుదీరుతున్నాయి. అయితే కళను, కళాత్మక ప్రక్రియలకు వేదికలు ఆర్ట్ గ్యాలరీలు. మన భారతీయ సంస్కృతిలో పూర్వీకులు చెప్పినట్లు 64 కళల ప్రదర్శనకు చక్కని వేదికలు ఈ గ్యాలరీలు. ఈ విషయాన్ని వివిధ శాస్త్ర గ్రంథాలలో వివిధ రకాలుగా వర్గీకరించారు. వీటిలో ముఖ్యంగా చెప్పుకోదగినవి ఏడు. ఇందులో చిత్రలేఖనము, వాస్తుశిల్పము, శిల్పకళ, సాహిత్యం, సంగీతం, నృత్యం, సినిమా ప్రస్తుతం ఎక్కువ ప్రాచుర్యం పొందుతున్నాయి. అయితే ఆర్ట్ గ్యాలరీలు కళను ప్రదర్శించడానికి, కళాఖండాలను అమ్మడానికి, కళాత్మక ప్రక్రియల పట్ల అవగాహన కల్పించడంలో ముఖ్యమైన భూమికను పోషిస్తుంటాయి. వివిధ వర్గాలకు చెందిన అభిమానులను, కళలను ఇష్టపడేవారిని ఒకే వేదికపైకి చేరుస్తాయి. ఇవి కళాకారులకు వారి పనిని ప్రదర్శించేందుకు ఒక వేదికను అందిస్తాయి. నవీన పోకడల్లో కొన్ని కొళలకు మాత్రమే అధిక ప్రాధాన్యత ఏర్పడుతోంది. ఈ క్రమంలో అటువంటి కళారూపాలకు ఒక ప్రదేశంగా ప్రస్తుత ఆర్ట్ గ్యాలరీలు చోటు దక్కించుకుంటున్నాయి.



కొండల్లో కొలువుదీరిన కళ..

నగరంలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ఒకప్పుడు ఎలాగైతే సంపన్న నివాస ప్రాంతాలుగా వర్ధిల్లాయో.. అదే విధంగా ఆయా ప్రదేశాల్లో ఆర్ట్ గ్యాలరీలు కూడా అదే ప్రాంతాల్లో ఎక్కువగా గుర్తింపు తెచ్చుకున్నాయని చెప్పొచ్చు. రవీంద్రభారతిలో ఐసీసీఆర్ గ్యాలరీ సహా చారిత్రక గ్యాలరీలను అలా ఉంచితే ప్రైవేట్‌గా గ్యాలరీల ఏర్పాటు మాత్రం పంజాగుట్టలో సీనియర్ చిత్రకారుడు సూర్యప్రకాశ్ ప్రారంభించారు. అనంతరం గ్యాలరీల పరంపరకు బంజారాహిల్స్ వేదికగా బీజం పడింది. బంజారాహిల్స్‌లో తొలుత గ్యాలరీ స్పేస్ మినాజ్, డైరా పేర్లతో ఒకే అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో 5 గ్యాలరీలు ఏర్పాటయ్యాయి. ఆ తర్వాత.రోడ్ నెం12లో ఐకానార్ట్ గ్యాలరీ, ఆ తర్వాత రోడ్ నెం.10లో కళాకృతి నెలకొల్పారు. ఈ గ్యాలరీ కళా ఉత్సవాలకు సంబంధించి ఓ కొత్త ట్రెండ్ తీసుకొచ్చింది అని చెప్పొచ్చు. కళావ్యాప్తి ద్వారా ఆ తర్వాత సృష్టి ఆర్ట్ గ్యాలరీ జూబ్లీహిల్స్‌కు విస్తరించింది. ప్రస్తుతం జూబ్లీహిల్స్‌లోనూ కదిరి ఆర్ట్ గ్యాలరీ సహా ఒక అరడజను దాకా గ్యాలరీలు ఉన్నాయి.

ఆర్ట్ కి.. హైటెక్ సిటీ..

కొన్ని దశాబ్దాల పాటు హిల్స్‌లోనే కొనసాగిన కళల సందడి.. నెమ్మదిగా మరిన్ని ప్రాంతాలకూ విస్తరించడం ప్రారంభమయ్యింది. కార్పొరేట్ ఐటీ కంపెనీలకు కేరాఫ్‌గా ఉన్న మాదాపూర్‌లో అలంకృత ఆర్ట్ గ్యాలరీ ఏర్పాటైంది. అంతకు ముందే ఏర్పాటైనా హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ 75 ఏళ్ల ఉత్సవాలతో స్టేట్ ఆర్ట్ గ్యాలరీకి ఊపునిచ్చింది. సికింద్రాబాద్‌లో సైతం దీ ఆర్ట్ స్పేస్ పేరుతో మరో గ్యాలరీ అందుబాటులోకి వచ్చింది. ఇటీవల నార్సింగి–కోకాపేట్‌లో అనంతం కళా ఆర్ట్ గ్యాలరీని సోదరీమణులు జ్యోత్స్న కుమార్, స్నిగ్ధ రెడ్డి స్థాపించారు. దాదాపు 3,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇది నెలకొల్పారు. నానక్‌రామ్ గూడ ప్రాంతానికి కూడా గ్యాలరీ స్పేస్ విస్తరించనుంది. కేఫ్స్, రెస్టారెంట్స్‌లలో సైతం చిత్రకళా ప్రదర్శనలు సర్వసాధారణంగా మారిపోయిన పరిస్థితుల్లో.. గ్యాలరీలు వెనుకబడిపోతున్నయేమో అనే ఆలోచనకు తావివ్వకుండా కొత్త కొత్త ప్రాంతాలకు విస్తరిస్తుండడం విశేషం. ఈ విస్తరణ ఇలాగే సాగితే నగరాన్ని నలుచెరగులా కళావైభవాలు వికసించేలా చేయడం తథ్యం.



తీవ్రవాద నిర్మూలన, శాంతి స్థాపనకు..

కవ్వొత్తులతో పీస్ వాక్..

సాక్షి, సిటీబ్యూరో: కాశ్మీర్ ఉగ్రదాడి నేపథ్యంలో, కంట్రీ క్లబ్ హాస్పిటాలిటీ అండ్ హాలిడేస్ లిమిటెడ్ (సీసీహెచ్ఎల్) 'గ్లోబల్ యూనిటీ అగైనెస్ట్ టెర్రరిజమ్' పేరిట వినూత్న రీతిలో సందేశాత్మక కార్యక్రమాన్ని నిర్వహించింది. బేగంపేటలోని క్లబ్ ప్రాంగణంలో కొవ్వొత్తులు చేత పట్టుకొని మోడల్స్ మంగళవారం ప్రదర్శన చేశారు. శాంతి, సామరస్యాన్ని ప్రోత్సహించే నినాదాలు ముద్రించిన ప్రత్యేక వస్త్రధారణలో మౌనంగా 'పీస్ వాక్' చేశారు. మృతి చెందిన పర్యాటకులకు నివాళిగా 26 కొవ్వొత్తుల ప్రదర్శనలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంట్రీ క్లబ్ సీఎండీ వై.రాజీవ్‌రెడ్డి మాట్లాడుతూ 'గతంలో వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై ఉగ్రవాద దాడులను ఖండిస్తూ నటుడు సునీల్ దత్ తో కలిసి 'గ్రౌండ్ జీరో' నిర్వహించామన్నారు. అలాగే శాంతి సామరస్యాల పట్ల తమ నిబద్ధతకు ప్రతీకగా లక్ష మంది సంతకం చేసిన చారిత్రాత్మక 'ఫ్రెండ్‌షిప్ బ్యాండ్'ని అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి ఆమోదించారన్నారు. అదే క్రమంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని, తీవ్రవాదం ప్రపంచ ముప్పుగా మారిన నేపథ్యంలో దీనిని ఎదుర్కోడానికి అంతర్జాతీయ సహకారంతో ముందుకెళ్లాలని కోరుకుంటున్నామన్నారు.





అమీర్‌పేటలో మ్యారీగోల్డ్‌లో సినీ నటి శ్రవంత సందడి

జీఎమ్ఆర్ ఎరీనాలో మే 23, 24, 25 తేదీల్లో నిర్వహణ

బీ2బీ జ్యువెలరీ ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరణ

అమీర్‌పేట : సినీ నటి శ్రవంతి, మోడల్స్‌తో కలిసి అమీర్‌పేటలో సందడి చేశారు. విభిన్న రకాల నగలు ధరించి హొయలొలికించారు. జీఎమ్ఆర్ ఎరీనాలో మే 23, 24, 25 తేదీలో జరగనున్న హైదరాబాద్ ఇంటర్నేషనల్ జ్యువెలరీ షో, సౌత్ ఇండియా లార్జెస్ట్ బీ 2 బీ జ్యువెలరీ ఎగ్జిబిషన్ సన్నాహక కార్యక్రమం అమీర్‌పేట గ్రీన్‌పార్క్ మ్యారీగోల్డ్ హోటల్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన నటి శ్రవంతి, మోడల్స్ హోల్‌సేల్ నగల తయారీ దారులు రూపొందించిన సరికొత్త డిజైనర్ ఆభరణాలను ధరించి ర్యాంప్‌పై క్యాట్‌వాక్ చేశారు. అనంతరం 2వ ఎడిషన్ గోడ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎగ్జిబిషన్‌లో దేశ వ్యాప్తంగా ఉన్న 250 ప్రముఖ కంపెనీలకు చెందిన తయారీ దారులు, 700 హోల్‌సేల్ నగల స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు యునైటెడ్ ఎగ్జిబిషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కెప్టెన్ వికె.మనోజ్ తెలిపారు.

రేపటి నుంచి శిల్పారామంలో వేసవి శిక్షణ

మాదాపూర్ : విద్యార్థులు వేసవి సెలవులను వృథా చేసుకోకుండా వారికి నచ్చిన రంగాల్లో ఆసక్తిని బట్టి శిక్షణ ఇస్తున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో ప్రతి సంవత్సరం నిర్వహించే సమ్మర్ ఆర్ట్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే మే 1వ తేదీ నుంచి 17వ తేదీ వరకూ సమ్మర్ క్యాంపులో కేవలం విద్యార్థులే కాకుండా మహిళలు సైతం హాజరుకావచ్చు. మట్టి కుండల తయారీ విధానం, పెన్సిల్ స్కెచ్, మధుబని పెయింటింగ్, ట్రైబల్ పెయింటింగ్, మండాలా పెయింటింగ్, యాక్రిలిక్ పెయింటింగ్, సీషెల్‌క్రాఫ్ట్, భగవద్గీత శ్లోకాలు, సంస్కృతంలో మాట్లాడడం వంటి శిక్షణా తరగతులను నిర్వహించనున్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ శిక్షణా తరగతులను నిర్వహించనున్నారు. ఆరు సంవత్సరాలు నుంచి 60 సంవత్సరాల లోపువారు ఎవరైన శిక్షణ పొందవచ్చు. మొత్తం తొమ్మిది అంశాల్లో శిక్షణ ఉంటుంది. ఆసక్తి గలవారు ఫోన్ 88866 52030, 88866 52004లో సంప్రదించవచ్చు.



కాగితాన్ని మడతపెట్టి కళా రూపాలు సృష్టించే 'ఒరిగామి' కళతో సుమారు 550 కిలోల బరువున్న అత్యద్భుత శ్రీ వేంకటేశ్వర స్వామి చిత్రాన్ని రూపొందించి కేంద్రీయ విద్యాలయ ఉపాధ్యాయుడు రవి కుమార్ తోలేటి అందరి ప్రశంసలు అందుకున్నారు. స్థానిక తిరుమలగిరిలోని కేంద్రీయ విద్యాలయ ప్రాంగణంలో ఆవిష్కరించిన ఈ చిత్రపటం 12 అడుగుల ఎత్తు, 7.5 అడుగుల వెడల్పుతో.. మొత్తం 40,500 కాగితపు మడతలతో రూపొందించారు. ఈ ఫొటో ఫ్రేమ్ బరువు దాదాపు 550 కిలోలు. ఈ సందర్భంగా రవికుమార్‌ను పీజీటీ కెమిస్ట్రీ ఫ్యాకల్టీ లలిత కళ సుశీంద్రన్ సత్కరించారు. - బొల్లారం



గిన్నిస్ రికార్డుదారుడి నాలుగేళ్ల శ్రమకు సత్కారం

తిరుమలగిరి కేంద్రీయ విద్యాలయంలో ఆవిష్కరణ

ఒరిగామి కళతో శ్రీ వేంకటేశ్వర స్వామి కళారూపం

ఒరిగామిపై 1988లో ఆసక్తి పెంచుకున్న రవి కుమార్ విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహించేలా ఈ కళ ఉపకరిస్తుందని గుర్తించారు. 'ఒరిగామి ద్వారా గణితం – రవికుమార్ తోలేటి' పేరుతో యూట్యూబ్ ఛానెల్ ప్రారంభించారు. కోవిడ్ సమయంలో విద్యార్థుల కోసం డీఐవై మోడల్స్ వీడియోలుగా అందించడంతో పాటు, శాస్త్రవేత్తల స్థాయిలో ప్రాజెక్టులు రూపొందించేందుకు ప్రేరణనిచ్చారు.

పలు అవార్డులు..

గతంలో రవి కుమార్‌కు ఎన్‌సీఈఆర్‌టీ ఇన్నోవేషన్ అవార్డు (2002), రాష్ట్రపతి పురస్కారంగా 'నేషనల్ టీచర్స్ అవార్డు' (2005), కేవీఎస్ నేషనల్ ఇన్నోవేషన్ అవార్డులు (2012, 2019) లభించాయి. అలాగే 2022లో ప్రపంచంలో అతి పెద్ద ఒరిగామి నెమలిని రూపొందించి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించారు.

నాలుగేళ్లు పట్టింది..

"ఒరిగామి కళతో ఈ చిత్రపటాన్ని రూపొందించడానికి సుమారు నాలుగేళ్ల సమయం పట్టింది. ఉపాధ్యాయుడిగా విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు ఒరిగామిని వినియోగిస్తున్నా. ఇది ప్రాచీన జపాన్ కళ కాగా, ప్రస్తుతం పలు రంగాల్లో విస్తరిస్తోంది. ఇది కేవలం కళ కాదు, సృజనాత్మకత, ఆవిష్కరణల సమ్మేళనం.

– రవి కుమార్ తోలేటి, ఒరిగామి కళాకారుడు

ఆకట్టుకున్న నృత్య సమ్మేళనం

- 56 డ్యాన్స్ అకాడమీలు, 430 మంది కళాకారుల ప్రదర్శన

సుందరయ్య విజ్ఞాన కేంద్రం : తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సకల కళల నృత్య సమ్మేళనాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సమ్మేళనంలో సుమారు 56 డ్యాన్స్ అకాడమీల నుంచి 430 మంది కళాకారులు పాల్గొని నృత్య ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ నృత్యం అంటే సకల కళలను అభినయిస్తూ చేయడమే అన్నారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలు, కళలు ప్రపంచానికే తలమానికం అన్నారు. పిల్లల్లో సృజనాత్మకతను పెంచడానికి బాలోత్సవం చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా కళాకారులు చేసిన నృత్యాలు సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రముఖ విద్యావేత్త సువర్ణలత, నృత్య కళాకారిణి ఇందిరా పరాశరం, బాలోత్సవ అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఎస్ సోమయ్య, వైస్ ప్రెసిడెంట్ సుజావతి, కోశాధికారి బుచ్చిరెడ్డి, ఎస్ వినయ్‌కుమార్, రిటైర్డ్ జడ్జీ మాల్యాద్రి, ఓలేటి రంగమణి, మాధవిశర్మ పాల్గొన్నారు.



అధిక లాభాల ఆశజూపి.. రూ.4.76 కోట్ల లూటీ

సాక్షి, హైదరాబాద్: తాము ఐసీఐసీఐ సెక్యూరిటీ ఎక్స్ఛేంజ్‌లమని వాట్సాప్ ద్వారా పరిచయం చేసుకున్న సైబర్ నేరగాళ్లు నగరవాసికి అధిక లాభాలు ఆశజూపి బ్లాక్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెట్టించారు. ఇలా పలు దఫాల్లో మొత్తం రూ.4,76,50,000 కొల్లగొట్టారు. చివరకు తాను బ్లాక్ ట్రేడింగ్‌లో పొందిన లాభాలు విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా మరింత ట్యాక్స్‌లు చెల్లిస్తేనే డబ్బులు డ్రా చేసుకునే వీలుంటుందని, లేదంటే మొత్తం డబ్బులు రావు అని అవతలి వ్యక్తులు తేల్చి చెప్పారు. చివరకు తాను మోసపోయినట్టు గ్రహించిన నగరంలోని మణికొండ వాసి ఈనెల 28న టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన టీజీసీఎస్‌బీ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

ప్రతిష్టాత్మకంగా 'మిస్ వరల్డ్'

ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

- అందాల పోటీల నిర్వహణలో లోటుపాట్లు ఉండొద్దని స్పష్టీకరణ
- అదనపు డీజీ ర్యాంకు అధికారి ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లు
- పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తం
- 2017లో ఇవాంకా ట్రంప్ హైదరాబాద్ పర్యటనలో విధులు చేపట్టిన వారి సేవలూ వినియోగం



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి జూపల్లి, ఉన్నతాధికారులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ వేదికగా మే 10 నుంచి జరగనున్న ప్రపంచ సుందరి (మిస్ వరల్డ్-2025) అందాల పోటీలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని.. లోటుపాట్లులేకుండా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆయన ప్రపంచ సుందరి పోటీలపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పోటీల్లో పాల్గొనేందుకు విదేశాల నుంచి వచ్చే సుందరీమణులు, అంతర్జాతీయ మీడియా ప్రతినిధులకు ఇబ్బందిలేని రీతిలో ఏర్పాట్లు ఉండాలని సీఎం ఆదేశించారు. విమానాశ్రయం, పోటీలు జరిగే వేదికలు, ప్రతినిధులు బస చేసే హోటళ్ల వద్ద కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలు, చారిత్రక కట్టడాలను వారు సందర్శించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమాల పర్యవేక్షణకు విభాగాలవారీగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. వచ్చే నెల 4న మరోసారి సమీక్షిస్తానని.. ఆలోగా పనులన్నీ పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్, డీజీపీ జితేందర్‌తోపాటు హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనర్లు, సీఎం ముఖ్యకార్యదర్శి శేషాద్రి, మరికొందరు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మూడంచెల భద్రతా ఏర్పాట్లు!

మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొననున్న మొత్తం 120 దేశాల ప్రతినిధులు మే 6, 7 తేదీల్లో హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. వారు ఎయిర్‌పోర్టులో దిగినప్పటి నుంచి బస చేసే హోటళ్లు, పోటీల వేదిక ప్రాంతం వరకు ప్రభుత్వం మూడంచెల భద్రత కల్పించనున్నట్లు తెలిసింది. మొత్తం భద్రతా ఏర్పాట్ల పర్యవేక్షణను అదనపు డీజీ ర్యాంకులో ఉన్న ఓ సీనియర్ ఐపీఎస్ అధికారికి అప్పగించారు. ఆయన నేతృత్వంలో ఇప్పటికే భద్రతా ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. పహల్గాంలో ఉగ్ర దాడి నేపథ్యంలో విదేశీ అతిథుల భద్రత విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గతంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకా ట్రంప్ 2017లో హైదరాబాద్ పర్యటన సందర్భంగా భద్రతా విధులు నిర్వహించిన, అంతర్జాతీయ సదస్సులకు భద్రతా విధులు చేపట్టిన అనుభవంగల అధికారులు, సిబ్బందిని మిస్ వరల్డ్-2025 భద్రతా ఏర్పాట్లలో భాగస్వాములను చేస్తున్నట్లు సమాచారం. కాగా, మే 31న జరిగే ఫైనల్స్‌లో విజేతలుగా నిలిచిన వారు రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ప్రత్యేకంగా భేటీ కానున్నారు.

కొడుకు మృతదేహంతో మూడురోజులు

- చనిపోలేదని.. పడుకున్నాడని తండ్రి సమాధానం
- మతిస్థిమితం లేని తండ్రి ఆస్పత్రికి తరలింపు



అచేతన స్థితిలో వెంకట్‌రెడ్డి



లక్ష్మీనారాయణ

మంచిర్యాల క్రైం: మతిస్థిమితం కోల్పోయిన ఒక తండ్రి.. చనిపోయిన కుమారుడి శవం పక్కనే మూడు రోజుల పాటు ఉన్న ఘటన వెలుగు చూసింది. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని అశోక్‌రోడ్‌లో జరిగిన ఈ ఘటనపై స్థానికులు, ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాలివి. గూడెల్లి వెంకట్‌రెడ్డి అశోక్‌రోడ్డులో నివసిస్తున్నారు. ఈయనకు కుమారుడు లక్ష్మీనారాయణ ఉన్నాడు. వెంకట్‌రెడ్డి సింగరేణిలో పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. మూడేళ్ల క్రితం భార్య రాధమ్మ అనారోగ్యంతో చనిపోయాక వెంకట్‌రెడ్డి మతిస్థిమితం కోల్పోయారు. తండ్రీ కొడుకులు ఇద్దరే ఇంట్లో ఉంటున్నారు. ఎస్టీపీపీలో కాంట్రాక్ట్ వర్కర్‌గా పనిచేస్తున్న కొడుకు లక్ష్మీనారాయణ.. తండ్రి బాగోగులు చూసుకునేవారు. ఇటీవల మద్యానికి బానిసైన లక్ష్మీనారాయణ.. ఆదివారం కూడా తాగి ఇంట్లోని సోఫాలో పడుకున్నారు. అప్పటి నుంచి బయటకు రాలేదు. మంగళవారం ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో.. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా.. సోఫాలో లక్ష్మీనారాయణ (30) శవమై కనిపించాడు. మరోవైపు వెంకట్‌రెడ్డి అచేతన స్థితిలో పడుకుని ఉన్నాడు. 'నీ కొడుక్కి ఏమైంది..' అని ప్రశ్నిస్తే.. 'పడుకున్నాడు'.. అంటూ సమాధానం చెప్పారు. పోలీసులు లక్ష్మీనారాయణ మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, వెంకట్‌రెడ్డిని వైద్యం నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించారు. వెంకట్‌రెడ్డి బంధువు గూడెల్లి శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

సాయి కుటుంబానికి అండగా ఉంటాం

- సాయి పరిస్థితిపై స్పందించిన సీఎంఓ



సాయి కుటుంబ పరిస్థితిపై 'ఎక్స్'లో సీఎం రేవంత్‌రెడ్డి పోస్ట్

సాక్షి ఎఫెక్ట్

జనగామ: జనగామ పట్టణం 21వ వార్డు కుర్మవాడకు చెందిన పర్శ మల్లయ్య, లక్ష్మి దంపతుల కుమారుడు సాయికి మెరుగైన వైద్య పరీక్షలతో పాటు కుటుంబానికి అండగా ఉంటామని ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) భరోసా కల్పించింది. 'నా కొడుకును సంపేయండి' అంటూ ఈనెల 29న సాక్షిలో ప్రచురితమైన కథనం మేరకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. సీఎంఓ ఆదేశాల మేరకు కలెక్టర్ రిజ్వాన్ బాషా ఉత్తర్వులను అనుసరించి జనగామ ఆర్డీఓ గోపీరామ్, మున్సిపల్ కమిషనర్ సాయి తల్లిదండ్రులు ఉంటున్న నివాసం, ఆర్థిక పరిస్థితులపై కలెక్టర్‌కు రిపోర్టు చేశారు. మానసిక, శారీరక వైకల్యంతో బాధపడుతున్న సాయిని నిమ్స్‌కు తరలించి, మెరుగైన వైద్య పరీక్షలు అందించే విధంగా చూడాలని కలెక్టర్‌కు సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా బాధితుడికి ఉన్న స్థలంలోనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేలా నివేదిక తయారు చేసి అందించాలని ఆదేశించారు. రాజీవ్ యువవికాసం పథకం ద్వారా బాధిత కుటుంబానికి జీవనోపాధి కల్పించే విధంగా చూస్తామన్నారు. 'సాక్షి' చొరవతో బాధిత కుటుంబానికి న్యాయం జరుగుతుండటంతో కాలనీ వాసులు అభినందించారు. కాగా, సాయి తల్లిదండ్రులకు అండగా ఉంటామని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి హామీఇచ్చారు. అలాగే సాయి ఆరోగ్య పరిస్థితులపై జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరాతీశారు. సాయి తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడారు. జీరో కరెంటు, సొంతింటి కలను సాకారం చేస్తామన్నారు.

కిమ్స్ నుంచి శ్రీతేజ డిశ్చార్జ్

- సంధ్య థియేటర్ ఘటనలో గాయపడ్డ బాలుడు
- ఆస్పత్రి నుంచి రిహాబిలిటేషన్‌కు తరలింపు

రాంగోపాల్‌పేట్: ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సంధ్య థియేటర్‌లో పుష్ప-2 సినిమా బెనిఫిట్ షో చూసేందుకు వచ్చి గాయపడి సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజను డిశ్చార్జ్ చేశారు. మంగళవారం అతన్ని కిమ్స్ ఆస్పత్రి నుంచి ప్యారడైజ్ ప్రాంతంలోని రిహాబిలిటేషన్ సెంటర్‌కు తరలించారు. గత డిసెంబర్ 4వ తేదీన జరిగిన ఈ ఘటనలో శ్రీతేజ తల్లి రేవతి మరణించగా తొమ్మిదేళ్ల శ్రీతేజ తీవ్ర గాయాలపాలవ్వడం తెలిసిందే. శ్రీతేజ 4 నెలల 25 రోజుల పాటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వచ్చాడు. అయితే ప్రస్తుతం బాలుడు వెంటిలేటర్ సహాయం లేకుండా శ్వాస తీసుకుంటున్నాడు. పైపు ద్వారా ఆహారాన్ని కూడా అందిస్తున్నారు. అయితే కళ్లు తెరచి చూస్తున్నా ఎవరినీ గుర్తు పట్టడం లేదు. మెదడుకు ఆక్సిజన్ అందకపోవడంతో సుమారు 70 శాతం సెల్స్ డ్యామేజ్ అయ్యాయి. ఆస్పత్రిలో ఉంచి చికిత్స అందిస్తుండటంతో ఇన్‌ఫెక్షన్లు సోకుతున్నాయని, తదుపరి కోలుకునేందుకు రిహాబిలిటేషన్ సెంటర్‌లో ఫిజియో థెరపీ అవసరం ఉంటుందని వైద్యులు సలహా ఇచ్చినట్లు శ్రీతేజ తండ్రి భాస్కర్ తెలిపారు. ఆస్పత్రి యాజమాన్యం చికిత్స కోసం ఎలాంటి ఫీజు తీసుకోలేదని చెప్పారు. తమకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పుష్ప-2 సినిమా టీమ్‌కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఆఖరి వరకు హామీలు అమలు చేయరా?

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ కాలం చివరి ఆరు నెలల్లో.. తన పాలనపై చర్చ జరుగుతుందని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడం హాస్యాస్పదమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ విమర్శించారు. అప్పటి వరకు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేస్తారా? అని ప్రశ్నించారు. కేపీ వివేకానంద్ తెలంగాణ భవన్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని ఎల్కతుర్తిలో జరిగిన రజతోత్సవ సభ వేదికగా కేసీఆర్ డిమాండ్ చేసిన వెంటనే.. జానారెడ్డి వద్దకు సీఎం రేవంత్ పరుగెత్తుకెళ్లారని ఎద్దేవా చేశారు. నక్సలైట్ ఉద్యమం నుంచి వచ్చిన సీతక్క... ఆపరేషన్ కగార్ నిలిపివేతపై కేసీఆర్ చేసిన ప్రకటనను స్వాగతించకుండా విమర్శిస్తున్నారన్నారు.

1.91 క్వింటాళ్ల సన్నబియ్యం పట్టివేత

- 11 మంది రేషన్ కార్డులు రద్దు



నిందితుడి ఇంట్లో నుంచి అధికారులు స్వాధీనం చేసుకుంటున్న రేషన్ బియ్యం


తాండూర్: మంచిర్యాల తాండూర్ మండలం అచ్చులాపూర్ గ్రామంలో మంగళవారం 1.91 క్వింటాళ్ల సన్న బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ తెలిపిన వివరాలివి. గ్రామానికి చెందిన కుంకుమొట్టి మహేశ్ ఇంట్లో సోదాలు చేయగా.. 1.91 క్వింటాళ్ల సన్న బియ్యం పట్టుబడ్డాయి. వీటిని గ్రామంలోని 11 మంది రేషన్‌కార్డుదారుల నుంచి కిలో రూ.16 చొప్పున కొనుగోలు చేసినట్లు తేలింది. అక్రమంగా కొనుగోలు చేసి నిల్వ చేయడంపై కలెక్టర్, పౌరసరఫరాల శాఖ అధికారులకు నివేదిక పంపించగా.. సన్న బియ్యం విక్రయించిన 11మంది లబ్ధిదారుల రేషన్‌కార్డులను రద్దు చేసినట్లు తహసీల్దార్ ప్రకటించారు. మహేశ్‌పై చట్టరీత్యా చర్యలకు తాండూర్ ఎస్‌ఐకి లేఖ రాశారు. సోదాల్లో ఎంపీడీవో శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎజాజుద్దీన్ పాల్గొన్నారు.


సీఎం కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డికి దక్షిణ కొరియా సదస్సుకు ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: దక్షిణ కొరియాలో జరగనున్న అంతర్జాతీయ సదస్సులో పాల్గొనాల్సిందిగా సీఎం కార్యదర్శి, సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారి గొప్పిడి చంద్రశేఖర్ రెడ్డికి ఆహ్వానం అందింది. జూన్ 9 నుంచి కొరియా బొటానిక్ గార్డెన్స్ కన్జర్వేషన్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఎడ్యుకేషన్ ఫర్ చేంజ్ బొటానిక్ గార్డెన్' సదస్సులో పాల్గొనాల్సిందిగా నిర్వాహకులు కోరారు. ఈ సదస్సులో 'కనెక్ట్ కల్చర్ విత్ నేచర్ బొటానికల్ గార్డెన్స్' అంశంపై ప్రసంగించాల్సిందిగా పేర్కొన్నారు. ఇటీవల కొండాపూర్ బొటానికల్ గార్డెన్స్‌లో 75 థీమ్‌పార్కులను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. స్టేట్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) వైస్‌చైర్మన్, ఎండీగా చంద్రశేఖర్‌రెడ్డి చొరవతో 2 వేల రకాల మొక్కలతో 75 థీమ్‌పార్కులను ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా.. రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ (సీఐసీ)గా జి.చంద్రశేఖర్‌రెడ్డి నియమితులు కానున్నట్టు ప్రభుత్వవర్గాల సమాచారం.

భారత విమానాశ్రయాలు చాలావరకు భద్రమైనవి. అయితే ఆ భద్రతకు ఊహించని విధంగా పక్షులు, ఇతర వన్యప్రాణుల మూలంగా తరచూ ముప్పు వాటిల్లుతోంది. పక్షులు ఢీకొనటం; జింకలు, నక్కలు, కుక్కలు వంటి జంతువులు తగలటం వల్ల రన్‌వే పైన విమాన ప్రమాదాలు జరుగుతున్నాయి. అంతేకాదు, గత అక్టోబర్ లో భువనేశ్వర్ విమానాశ్రయం సమీపంలో అడవి పిల్లి సంచరిస్తూ కనిపించటం, ఈ ఏడాది మార్చిలో డయ్యూ ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలో సింహం ప్రత్యక్షమవటం భవిష్యత్తులో జరగనున్న విమాన ప్రమాదాలకు సంకేతంగా గుర్తించి, అధికారులు అప్రమత్తం అవుతున్నారు.

- సాక్షి, స్పెషల్ డెస్క్





రన్‌వేపై రెక్కల ముక్కలు

లోహ విహంగాలను ఢీకొడుతున్న పక్షులు

వన్యప్రాణులతోనూ ప్రమాదాల ముప్పు..

టేకాఫ్, ల్యాండింగ్ సమయాల్లోనే ఎక్కువ

2018-2023 మధ్య ఢిల్లీ రన్‌వేపైనే 700 ఘటనలు.. మూగ జీవాల రక్షణకు డీజీసీఏ సూచనలు

పక్షులు తగిలితే ఎందుకు కూలిపోతాయి?



→ నిజానికి పక్షుల తగిలినంత మాత్రానే విమానాలు కూలిపోవు. కొన్ని సందర్భాలలో ఇంజిన్ లేదా ఇతర భాగాలకు నష్టం వాటిల్లుతుంది. విమానాలు చాలా వేగంగా టేకాఫ్ అవుతాయి. పక్షులు, ముఖ్యంగా పెద్ద పక్షులు; ఇంజిన్ లేదా విండ్‌షీల్డ్‌లోకి ప్రవేశించే పక్షి సమూహాలు ఢీకొనడం వల్ల మాత్రం పెద్ద ముప్పే వాటిల్లవచ్చు. టేకాఫ్ దశలో ఇంజిన్ చాలా వేగంతో తిరుగుతున్నప్పుడు, విమానం తక్కువ ఎత్తులో ఉండగానే పక్షి ఢీకొన్నప్పుడు ఇంజిన్ ఫ్యాన్ బ్లేడ్‌లకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. దీంతో ఇంజిన్ విఫలమై ప్రమాదం సంభవించవచ్చు. పక్షి ఢీకొట్టగానే పైలట్ దృష్టి చెదిరి ప్రమాదాలు జరుగుతుంటాయి.

..: అడ్డొచ్చి తగులుతుంటాయి :..

ఏప్రిల్ 14న హిసార్–అయోధ్యల మధ్య విమానాన్ని ప్రారంభించటానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ వచ్చే ముందు హర్యానాలోని మహారాజా అగ్రసేన్ విమానాశ్రయం అధికారులు డెహ్రాడూన్‌లోని 'వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా'నుంచి నిపుణులను రప్పించి మరీ ఆ దరిదాపుల్లోకి 'నీల్‌గై'భారీ జింకలు రాకుండా చూసుకున్నారు. అగ్రసేన్ ఎయిర్‌పోర్ట్ ఉన్న ప్రదేశం చాలాకాలంగా నీల్‌గైలకు నివాసంగా ఉంటోంది! ఇక కోల్‌కతాలోని రన్‌వేల మీద ఇటీవల నక్కలు పరుగులు తీశాయి. సంతతి కోసం విమానాశ్రయంలో అవి తవ్వుకున్న బొరియల్ని సైతం అధికారులు గుర్తించారు. వాటిని పట్టుకునేందుకు ప్రాంగణంలో రహస్యంగా ముప్పెకి పైగా బోన్లు ఏర్పాటు చేశారు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా రన్‌వేలపై విమానాలు టేకాఫ్ అవుతున్నప్పుడు లేదా ల్యాండ్ అవుతున్నప్పుడు పక్షులు, వన్యప్రాణులు వచ్చి తగిలే అవకాశం ఉండటంపై అధికారులూ, ప్రయాణికులూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇటీవలే అతి పెద్ద ప్రమాదం!

రన్‌వేపై పక్షులు ఢీకొనడం, జంతువులు వచ్చి వేగంగా వెళ్తున్న విమానానికి తగలటం చాలాసార్లు ప్రాణాంతకం కాకపోయినా కొన్నిసార్లు ఘోర ప్రమాదానికి కారణం అవుతుంటాయి. ఇందుకు ఉదాహరణ.. ఇటీవల పక్షి ఢీకొని దక్షిణ కొరియాలో సంభవించిన జెజు ఎయిర్ క్రాష్‌లో విమానంలోని 179 మందీ మరణించటం! (దీనిపై ఇంకా విచారణ సాగుతోంది). భారత్‌లో చివరిసారిగా 2015లో ఇలాంటి ప్రమాదం జరిగింది. కత్రా నుండి వైష్ణోదేవి ఆలయానికి వెళుతున్న హెలికాప్టర్.. రాబందు ఢీకొనటంతో పల్టీలు కొట్టి, మంటలు చెలరేగి పైలట్‌తో సహా ఏడుగురు చనిపోయారు.

ఢిల్లీ రన్‌వేపై 700సార్లు!

పక్షులు ఢీకొన్న సంఘటనల్లో ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం అగ్రస్థానంలో ఉంది. 2018–2023 మధ్య ఆ రన్‌వేలపై 700 కేసులు నమోదయ్యాయి. ఈ సంఖ్యపై ఆందోళన వ్యక్తం చేసిన ఢిల్లీ హైకోర్టు... జంతు సంక్షేమ కార్యకర్త గౌరీ మౌలేఖి దాఖలు చేసిన పిటిషన్‌కు ప్రతిస్పందనగా 'డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్', 'ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా'సంస్థలకు నోటీసులు జారీ చేసింది. విమానాశ్రయం పరిసరాల్లో కబేళాలు, మాంసం దుకాణాలు, పాడి పరిశ్రమలు ఉండటం విమానయాన భద్రతా నిబంధనల ఉల్లంఘన కిందికి వస్తుందని మౌలేఖీ తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

39 ఫ్లెమింగోల మృత్యువాత..

2023 డిసెంబర్ 18న రాజ్యసభలో పౌర విమానయాన మంత్రిత్వశాఖ ఇచ్చిన సమాధానం ప్రకారం... భారతదేశంలో అత్యంత రద్దీగా ఉండే విమానాశ్రయాలు వన్యప్రాణులు, ప్రధానంగా పక్షుల బెడదతో అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఉన్నాయని తెలుస్తోంది. గత ఏడాది ఎమిరేట్స్ విమానం ముంబైలో ఫ్లెమింగోల గుంపును ఢీకొట్టడంతో 39 పక్షులు చనిపోయాయి. ఈ ఘటన వన్యప్రాణుల ప్రేమికులను ఎంతగానో కలవరపరిచింది.

పక్షులను చెదరగొట్టే మార్గాలు

→ ప్రమాదాలు జరిగి అటు వన్యప్రాణులు, పక్షులు గానీ, ఇటు విమానాలు, ప్రయాణికులు గానీ నష్టపోకుండా / ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రత్యక్షంగా చేపట్టాల్సినవి, అప్రమత్తం చేసే ధ్వని పరికరాలు, రాప్టర్ కైట్స్, బెలూన్లు, రిఫ్లెక్టింగ్ టేప్ వంటివి వాడాలి. ఇక పరోక్షంగా.. నీటి వనరుల మూసివేత, వ్యర్థాల తొలగింపు, పచ్చిక ఉన్న ప్రదేశాలలో చీడపురుగుల ఏరివేత, గూళ్లు పెట్టకుండా గడ్డిని కత్తిరించడం, ఎలుకల నియంత్రణ వంటివి చేపట్టాలని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ యావియేషన్ సూచించింది. అంతిమంగా మనమంతా.. పక్షులు మన స్థలంలోకి రావటం లేదు, వాటి స్థలంలోకే మనం వెళ్లి అభివృద్ధి పేరిట అనేక కార్యక్రమాలు చేస్తున్నాం అని గుర్తించి వన్యప్రాణి హితమైన చర్యలు మాత్రమే తీసుకోవాలి.

అన్ని పక్షులూ ముప్పుకాదు..



→ 1966–1989 మధ్య కాలంలో తీవ్రమైన విమాన నష్టానికి కారణమైన పక్షుల జాబితాలో రాబందులు ఒకప్పుడు అగ్రస్థానంలో ఉండేవి. వాటి సంఖ్య గణనీయంగా తగ్గిపోవటంతో వాటి వల్ల ముప్పు తగ్గుముఖం పట్టింది. నేడు ప్రధానంగా బ్లాక్ కైట్స్ (డేగ జాతి), గబ్బిలాలు, ల్యాప్‌విగ్ పక్షులు ప్రమాదం కలిగించే జాబితాలోకి చేరాయి. 2020 జూన్‌లో 'డిఫెన్స్ లైఫ్'సైన్స్ జర్నల్ లో 'భారతదేశంలో విమానాలకు వన్యప్రాణుల తాకిడి'అనే శీర్షికతో ప్రచురితమైన అధ్యయన పత్రం ప్రకారం.. ఈ మూడు జాతుల పక్షులే ఇప్పుడు ప్రధానంగా రన్‌వేపై విమాన ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. 2012–2018 మధ్య భారతదేశంలో 3,665 వన్యప్రాణు తాకిళ్లు సంభవించినట్లు ఈ పత్రం పేర్కొంది. వీటిల్లో 385 ఘటనలు విమాన నష్టానికి కారణం అయ్యాయి. 2005–2018 మధ్య మూడు సైనిక విమానాలు కూలిపోవటానికి బ్లాక్ కైట్స్ పక్షులు కారణమయ్యాయి.

విధి నిర్వహించాలి.. ఫలితం ఆశించకూడదు

'ఎక్స్'లో స్మిత సబర్వాల్ గీతోపదేశం



సాక్షి, హైదరాబాద్: 'పర్యాటక శాఖలో పనిచేసిన 4 నెలల్లో నావల్ల అయిందంతా చేశా. రాష్ట్ర పర్యాటక విధానం 2025– 30 తీసుకువచ్చాం. శాఖ పనితీరును ప్రక్షాళన చేసి జవాబుదారీతనాన్ని పెంచా. ప్రపంచ స్థాయి (విశ్వ సుందరి పోటీలు) కార్యక్రమం నిర్వహణకు అవసరమైన ప్రణాళికలు, ఏర్పాట్లు చేశా. భవిష్యత్తులో మరిన్ని ఇలాంటి కార్యక్రమాలకు ఇది నాంది పలకనుంది..' అని సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ పేర్కొన్నారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మంగళవారం ఈ మేరకు పోస్టు చేశారు. 'కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన' అనే భగవద్గీతలోని శ్లోకాన్ని ఈ సందర్భంగా ఆమె ఉటంకించారు. 'విధి నిర్వహించాలి. కానీ దాని ఫలాలను ఆశించరాదు..' అని దాని సారాంశం. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆమెను పర్యాటక శాఖ కార్యదర్శి పోస్టు నుంచి రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్య కార్యదర్శి పోస్టుకి బదిలీ చేసింది. హెచ్‌సీయూ భూములు, తదితర అంశాల్లో ప్రభుత్వ వ్యతిరేక వైఖరి కారణంగానే.. ప్రాధాన్యత లేని పోస్టుకు బదిలీ చేశారనే అభిప్రాయం వ్యక్తమైంది.

రాష్ట్రమంతా సమస్యలుంటే ఇంట్లోనే ఎందుకున్నావు?

కేసీఆర్‌కు జగ్గారెడ్డి ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రమంతటా సమస్యలే ఉన్నాయని ఎల్కతుర్తి సభలో అంటున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరి ఇన్ని రోజులు ఇంట్లోనే ఎందుకు ఉన్నాడని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఉచిత బస్సుల్లో మహిళలు కొట్లాడుకుంటున్నారని కేసీఆర్ చెప్తున్నాడంటేనే ఆ పథకం సక్సెస్ అయినట్టని, అందుకే ఉచిత ప్రయాణం వేస్ట్ అని సభలో చెప్పాడని ఎద్దేవా చేశారు. మంగళవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్ కౌశిక్ యాదవ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. రైతు రుణమాఫీ గురించి కేసీఆర్‌కు సవాల్ చేస్తున్నానని, ఏ ఊరు పోవాలంటే ఆ ఊరికి వస్తామని, అక్కడే చర్చిద్దామన్నారు. సన్నబియ్యం పథకంతో సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలను ప్రజలు శభాష్ అంటున్నారని తెలిపారు.

బీఆర్ఎస్ సభను చూసి లాగులు తడుపుకుంటున్నారు

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వచ్చిన స్పందన చూసిన కాంగ్రెస్ నేతలు లాగులు తడుపుకుంటున్నారని మాజీమంత్రి గుంతకండ్ల జగదీశ్‌రెడ్డి విమర్శించారు. మాజీ ఎంపీ లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, భాస్కర్‌రావు, గాదరి కిషోర్, రవీంద్రకుమార్, భూపాల్‌రెడ్డితో కలిసి మంగళవారం తెలంగాణభవన్‌లో జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాలకు ఏ సమయంలో హాజరు కావాలో కేసీఆర్‌కు తెలుసని స్పష్టం చేశారు.

'కాళేశ్వరం' బాధ్యుల్ని వదిలిపెట్టం

నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- అతిపెద్ద మానవ నిర్మిత వైపరీత్యం కాళేశ్వరం ప్రాజెక్టు అని ఎన్డీఎస్‌ఏ తేల్చింది
- ఎన్డీఎస్‌ఏ నివేదికపై త్వరలో కేబినెట్‌లో చర్చిస్తాం.. నివేదికలోని సిఫారసుల ఆధారంగా బరాజ్‌ల పునరుద్ధరణ
- త్వరలోతుమ్మడిహెట్టి వద్ద బరాజ్ పనులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తమ్. చిత్రంలో పొన్నం ప్రభాకర్, షబ్బీర్ అలీ, జగ్గారెడ్డి

సాక్షి, హైదరాబాద్: భారత దేశ చరిత్రలోనే అతిపెద్ద మానవ నిర్మిత వైపరీత్యం కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌లని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ తేల్చిందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. త్వరలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహించి ఎన్డీఎస్‌ఏ నివేదికపై చర్చిస్తామని, తదుపరి చర్యలు తీసుకుంటామని, బాధ్యులైన అధికారులతో పాటు వారికి ఆదేశాలిచ్చిన వారిని కూడా వదిలిపెట్టబోమని అన్నారు. ఆదేశాలిచ్చిన వారెవరని విలేకరులు ప్రశ్నించగా, అప్పుడు సీఎం (కేసీఆర్)గా ఎవరున్నారు? నీటిపారుదల శాఖ మంత్రిగా తొలి ఐదేళ్లు (కేసీఆర్), ఆ తర్వాత ఎవరు (హరీశ్‌రావు) ఉన్నారు? అని మంత్రి ఎదురు ప్రశ్నించారు. ఎన్డీఎస్‌ఏ నివేదికలోని సిఫారసుల ఆధారంగా బరాజ్‌ల పునరుద్ధరణకు చర్యలు చేపడతామని తెలిపారు. ఎన్డీఎస్‌ఏ నిపుణుల కమిటీ సమర్పించిన తుది నివేదికలోని అంశాలను.. మంగళవారం సచివాలయంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయన విలేకరులకు వివరించారు.

ప్రమాదంలోనే 3 బరాజ్‌లు

'కాళేశ్వరం మూడు బరాజ్‌లు కుప్పకూలే ప్రమాదంలో ఉన్నాయని ఎన్డీఎస్‌ఏ నివేదిక తేల్చింది. మేడిగడ్డ బరాజ్ పునాదుల కింద ఇసుక కొట్టుకుపోయి భారీ బుంగ ఏర్పడడంతోనే కుంగిపోయినట్లుగా నిర్ధారించింది. అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో సైతం ఈ తరహా బుంగలే ఏర్పడిన నేపథ్యంలో అవీ ప్రమాదంలో ఉన్నాయని నివేదించింది. సరైన జియో టెక్నికల్, జియో ఫిజికల్ పరీక్షలు, భౌగోళిక పరీక్షలు జరపకుండానే బరాజ్‌లు నిర్మించారు. నిర్మించిన తర్వాత నిర్వహణ, పర్యవేక్షణను గాలికి వదిలేశారు. కట్టిన తొలి ఏడాదే ఈ బరాజ్‌లలో లోపాలు బయటపడితే మరమ్మతులు నిర్వహించకుండా నిర్లక్ష్యం చేయడంతోనే మేడిగడ్డ బరాజ్ కుంగిపోయింది. మిగిలిన రెండు బరాజ్‌లూ దెబ్బతిన్నాయి. బరాజ్‌లను ఖాళీ చేసి మరమ్మతులు నిర్వహించడానికి ఇంజనీర్లు అనుమతి కోరితే, గత ప్రభుత్వంలోని పెద్ద మనిషి (కేసీఆర్) అనుమతి ఇవ్వకపోవడంతోనే ఈ పరిస్థితి ఉత్పన్నమైంది..' అని ఉత్తమ్ వివరించారు.

పరీక్షలు ఒకచోట..నిర్మాణాలు మరోచోట

'అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను డీపీఆర్ ప్రకారం నిర్మించాల్సిన ప్రాంతాల్లో కాకుండా నాటి సీఎం ఆదేశాలతో వేరే ప్రాంతాల్లో నిర్మించారు. దీంతో పరీక్షలు ఓ చోట జరిపి మరోచోట బరాజ్‌లను నిర్మించినట్టు ఎన్డీఎస్‌ఏ తేల్చింది. మేడిగడ్డ వద్ద బరాజ్ నిర్మించవద్దని రిటైర్డ్ సీఈల కమిటీ చెప్పినా గత ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. డీపీఆర్ ప్రకారం బరాజ్ పునాదుల కింద షీట్ పైల్స్ నిర్మించాల్సి ఉండగా, సికెంట్ పైల్స్ నిర్మించారు. ఓ పెద్ద మనిషి చెప్పినట్టు మార్పులు చేశారు..' అని మంత్రి పేర్కొన్నారు.

మసకబారిన రాష్ట్ర ప్రతిష్ట

'ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకి బదులుగా కాళేశ్వరం నిర్మించడం భారీ తప్పిదం. ఈ ప్రాజెక్టు ద్వారా రూ.లక్ష కోట్ల నష్టం జరిగింది. తెలంగాణ రాష్ట్రానికి, రైతాంగానికి, ఆర్థిక వ్యవస్థకు తీరని నష్టం చేశారు. రాష్ట్ర ప్రతిష్ట సైతం మసకబారింది. ఇంత నష్టం చేసిన వాళ్లు మా ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. ప్రాజెక్టులకు సంబంధించి దేశంలో ఎన్డీఎస్‌ఏ నిపుణులకు మించిన వారు ఎవరూ ఉండరు. వారిని సైతం కించపరిచే విధంగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారు. తుమ్మిడిహెట్టి వద్ద నీళ్లు లేనవి బీఆర్ఎస్ వాళ్లు చెప్పడం పచ్చి అబద్ధం. అక్కడ 165 టీఎంసీల లభ్యత ఉన్నట్టుగా నివేదికలున్నాయి. తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ నిర్మాణంపై అధ్యయనం బాధ్యతలను నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్‌కి అప్పగించాం. త్వరలో పనులు ప్రారంభిస్తాం..' అని ఉత్తమ్ వివరించారు. విలేకరుల సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, ఎంపీ బలరామ్ నాయక్, కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటమేదీ?


రాష్ట్ర నాయకుల తీరుపై సునీల్ బన్సల్ అసంతృప్తి



సాక్షి, హైదరాబాద్: కేవలం వర్క్‌షాప్‌లు..ఇండోర్ మీటింగ్‌లు పెట్టుకుంటే సరిపోదని.. ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో ఎందుకు పోరాడటం లేదని పార్టీ నేతలను బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జ్ సునీల్ బన్సల్ ప్రశ్నించారు. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులపై చర్చ సందర్భంగా.. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, వైఫల్యాలపై ఇప్పటి వరకు చేపట్టిన నిరసనలు, ఆందోళనలపై ఆరా తీశారు. పార్టీ నాయకులు ఏసీ గదుల్లో కూర్చుంటే పనులు కావని, ఫీల్డ్‌లోకి వెళ్లాలని గట్టిగా సూచించినట్టు తెలిసింది. పార్టీపరంగా చేపడుతున్న కార్యక్రమాల్లోనూ నాయకులు, కార్యకర్తలు మొక్కు బడిగా నిర్వహిస్తున్నారనే సమాచారం కూడా తన వద్ద ఉందని ఆయన పేర్కొన్నట్టు సమాచారం. 36 జిల్లాల కొత్త అధ్యక్షులు ఏం చేస్తున్నారంటూ ప్రశ్నించినట్టు తెలిసింది. మంగళవారం బీజేపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షుల సమావేశానికి బన్సల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పార్టీ ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ తివారీ (సంస్థాగత), గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, డి.ప్రదీప్‌కుమార్, కాసం వెంకటేశ్వర్లు, పొంగులేటి సుధాకరరెడ్డి, గరికపాటి మోహన్‌రావు, మర్రి శశిధర్‌రెడ్డి, ఎన్.రామచంద్రరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పహల్గాం మృతులకు సంతాప సూచకంగా రెండునిమిషాలు మౌనం పాటించారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ద్వారా మజ్లిస్‌ను ఎదుర్కొనే సత్తా బీజేపీకే ఉందనే స్పష్టమైన సంకేతం రాష్ట్ర ప్రజలకు వెళ్లిందన్నారు.

సైనికులు ఆత్మస్థైర్యం కోల్పోయేలా కాంగ్రెస్ తీరు

కేసీఆర్ తలాతోక లేని మాటలు మాట్లాడుతున్నారు: కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ పార్టీ సైనికులు ఆత్మస్థైర్యం కోల్పోయేలా వ్యవహరిస్తోందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రాంతాలకు అతీతంగా సైన్యానికి అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానిని అవమానిస్తూ బాధ్యతారహితంగా వ్యవహరించడం కాంగ్రెస్ పార్టీ సిగ్గుమాలిన చర్య అని దుయ్యబట్టారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ నక్సలైట్లు తుపాకులు వదిలి పెట్టి ప్రజల్లోకి వస్తే బాగుంటుందన్నారు. కాళేశ్వరం డ్యాం నిర్మాణంలో అవకతవకలు జరిగాయా? లేదా? అనేది ముఖ్యం తప్ప దీనిపై రిపోర్ట్ ఎవరిచ్చారనేది ప్రధానం కాదన్నారు. ఎన్డీఎస్‌ఏ చట్టబద్ధమైన సంస్థ, సలహాలు, సూచనలిచ్చే ఆ సంస్థ తన బాధ్యత నిర్వహిస్తోందని కిషన్‌రెడ్డి తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ తలాతోక లేని మాటలు మాట్లాడుతున్నారని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు.

రాజకీయ ప్రేరేపిత చర్య

- ఎన్డీఎస్‌ఏ నివేదికను అడ్డుపెట్టుకుని ఉత్తమ్ రాజకీయం చేస్తున్నారు
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజం



మంగళవారం తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ) నివేదికను అడ్డు పెట్టుకుని రాజకీయం చేస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఎన్డీఎస్‌ఏ నివేదిక రాజకీయ ప్రేరేపిత చర్య. 2024 మే 1 వరకు ఎన్డీఎస్‌ఏ సిఫారసులు ఇవ్వకపోవడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉంది. రిపోర్టు ఇచ్చిన తర్వాత మరమ్మతులు చేయకపోవడం మరో కుట్ర. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మేడిగడ్డ ప్రాజెక్టును కూల్చివేసే కుట్ర చేశాయి. కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కై ఎన్డీఎస్‌ఏ నివేదికను ఈడీ, సీబీఐ తరహాలో వాడుతున్నారు..' అని ఆయన ధ్వజమెత్తారు. గతంలో ఎన్డీఎస్‌ఏ బిల్లును లోక్‌సభలో కాంగ్రెస్ తరపున ఉత్తమ్ వ్యతిరేకించారని చెప్పారు. గతంలో ఆయనకు ఎన్డీఎస్‌ఏ తప్పుగా కన్పించిందని, ఇప్పుడు అదే ఎన్డీఎస్‌ఏ ఇచ్చిన నివేదిక..ఆయనకు భగవద్గీతలా కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. భారత్ సమ్మిట్, రైతు మహోత్సవాలు, ఎన్డీఎస్‌ఏ తుది నివేదిక పేరిట బీఆర్ఎస్ రజతోత్సవ సభ నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు కాంగ్రెస్ ప్రయత్నించిందని, అయినా కేసీఆర్ గర్జనతో కాంగ్రెస్ కకావికలం అయిందని అన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్డీఎస్‌ఏ నివేదికను ప్రశ్నిస్తూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. 'ఎన్డీఎస్‌ఏ నిర్మించిన పోలవరం డయాఫ్రమ్ వాల్ కుప్పకూలినా నాలుగేళ్లుగా ఎందుకు సందర్శించ లేదు..' అని నిలదీశారు.

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నివేదిక తప్పుబట్టింది

'బీఆర్ఎస్‌పై విమర్శలు చేయాలనే తొందరపాటులో మంత్రి ఉత్తమ్ కనీసం ఎన్డీఎస్‌ఏ నివేదికను కూడా అధ్యయనం చేయలేదు. మేడిగడ్డ నిర్మాణంలో అవినీతి జరిగిందని నివేదికలో చెప్పకున్నా.. బురద చల్లేందుకు ఉత్తమ్ ఆపసోపాలు పడ్డారు. బ్లాక్ 7ను తిరిగి నిర్మించడం ద్వారా మేడిగడ్డను తిరిగి ఉపయోగంలోకి తీసుకురావచ్చని ఎన్డీఎస్‌ఏ నివేదిక చెప్పడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తప్పుపట్టింది.

లక్ష కోట్లు వృధా అయితే నీళ్లెలా వస్తున్నాయి?

మహారాష్ట్రతో అంతర్ రాష్ట్ర ఒప్పందం లేకుండానే తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు టెండర్లు పిలిచి కాంగ్రెస్ నేతలకు కమీషన్లు దోచిపెట్టారు. అనుమతులు తేవడంలో విఫలం కావడం వల్లే సీడబ్ల్యూసీ, వాప్కోస్ సూచన మేరకు నీటి లభ్యత ఉన్న మేడిగడ్డ వద్ద బరాజ్ నిర్మించాం. నీటి నిల్వ సామర్థ్యం 16 టీఎంసీల నుంచి 141 టీఎంసీలకు పెంచడం వల్లే ప్రాజెక్టు వ్యయం పెరిగింది. నిపుణుల సూచనల మేరకే అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల లొకేషన్ మారింది. కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల రూపాయల వృధా జరిగితే నీళ్లు ఎలా వస్తున్నాయి?..' అని హరీశ్‌రావు ప్రశ్నించారు. మేడిగడ్డ బరాజ్‌కు వెంటనే మరమ్మతు చేసి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీత లక్ష్మారెడ్డి, చింత ప్రభాకర్, ముఠా గోపాల్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్, పార్టీ నేత ఎర్రోల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రికార్డులు మార్చి భూదాన్ భూమి విక్రయం

- ఫోర్జరీ పత్రాలతో నిషేధిత జాబితా నుంచి తొలగించి ప్రైవేటు పార్టీలకు అమ్మారు
- నిందితుల ఇళ్లలో 45 కార్లు, రూ.23 లక్షల నగదు, 12,000 యూఏఈ దిర్హామ్‌లు స్వాధీనం
- భూదాన్ భూముల కేసులో సోదాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రకటన

సాక్షి, హైదరాబాద్: మహేశ్వరం మండలం నాగారం గ్రామంలోని భూదాన్ భూముల రెవెన్యూ రికార్డులను నిందితులు ఫోర్జరీ పత్రాలతో మోసపూరితంగా మార్చి ప్రభుత్వ భూమిని ప్రైవేటు పార్టీలకు విక్రయించారని ఈడీ అధికారులు వెల్లడించారు. దీనికి సంబంధించి నిందితుల ఇళ్లలో సోమవారం సోదాలు చేసినట్టు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మొత్తం ఐదు ప్రాంతాల్లో సోదాలు చేపట్టినట్టు తెలిపారు. ప్రభుత్వ భూమిని అక్రమంగా విక్రయించడం, పత్రాలను ఫోర్జరీ చేయడం, ప్రభుత్వ రెవెన్యూ రికార్డులను తారుమారు చేయడం వంటి ఆరోపణలపై ప్రైవేట్ వ్యక్తులు, ప్రభుత్వ అధికారులపై తెలంగాణ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. 'మహేశ్వరం మండలం నాగారంలో ఉన్న భూదాన్ భూమిని ఖదీరున్నిసా తన పూర్వీకుల ఆస్తిగా అక్రమంగా క్లెయిమ్ చేసుకున్నారు. రెవెన్యూ రికార్డులను మార్చి భూమిని మధ్య వర్తులతో కలిసి విక్రయించినట్టు దర్యాప్తులో తేలింది. ఈ మధ్యవర్తులు, ప్రభుత్వ అధికారులతో కలిసి నకిలీ పత్రాలతో ఆ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించి కొన్ని ప్రైవేట్ పార్టీలకు విక్రయించారు. ఖదీరున్నిసా, మునావర్ ఖాన్, మొహమ్మద్ లతీఫ్ షర్ఫాన్, మొహమ్మద్ అక్తర్ షర్ఫాన్, మొహమ్మద్ సుకూర్ నివాసాలు, ఫామ్‌హౌస్‌లలో సోమవారం సోదాలు నిర్వహించాం. ఈ అక్రమాలకు సంబంధించి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నాం. ఈ సోదాల్లో రూ.23 లక్షల భారతీయ కరెన్సీ, 12,000 యూఏఈ దిర్హామ్‌లు దొరికాయి. మొహమ్మద్ మునావర్ ఖాన్ ఫామ్‌హౌస్‌లో వింటేజ్ కార్లు సహా 45 కార్లు స్వాధీనం చేసుకున్నాం. దర్యాప్తు కొనసాగుతోంది'అని ఈడీ అధికారులు ప్రకటించారు.

'భూదాన్'పై సింగిల్ జడ్జి ఉత్తర్వులు రద్దు చేయండి

- హైకోర్టులో ఐపీఎస్‌ల అప్పీల్
- ఒకట్రెండు రోజుల్లో ద్విసభ్య ధర్మాసనం విచారణ



సాక్షి, హైదరాబాద్: భూదాన్ భూముల వ్యవహారంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ పలువురు ఐపీఎస్‌లు హైకోర్టును ఆశ్రయించారు. మహేశ్ పిటిషన్‌లో కోరని విధంగా సింగిల్ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ ఉత్తర్వులు చట్ట విరుద్ధమని పేర్కొంటూ ఐపీఎస్ అధికారులు రవిగుప్తా, తరుణ్‌జోషి, మహేశ్ భగవత్, సౌమ్యమిశ్రా, స్వాతి లక్రా, జితేందర్‌కుమార్ గోయల్ భార్య రేణుగోయల్, ఉమేశ్ షరీఫ్ భార్య రేఖా షరీఫ్‌తోపాటు వ్యాపారవేత్త వి.గౌతమ్‌రెడ్డి వేర్వేరుగా అప్పీళ్లు దాఖలు చేశారు. ఈ అప్పీళ్లపై ఒకట్రెండు రోజుల్లో ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టనుంది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం సర్వే నంబర్లు 181, 194, 195లో భారీ భూకబ్జాలపై ఫిబ్రవరి 16న, మార్చి 8న సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ అంబర్‌పేట్‌కు చెందిన బిర్లా మహేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్‌లు స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై నకిలీ రికార్డు సృష్టించి కోట్లాది రూపాయల విలువైన భూమిని కాజేసే చర్యలు చేపట్టారన్నారు. కొందరు ఇప్పటికే అనధికారికంగా భూములను బదిలీ కూడా చేయించుకున్నారు. 26 మంది ఉన్నతాధికారులు భూ కబ్జాలో ఉన్నందున ఈ అంశంపై సీబీఐ, ఈడీతో విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. భూదాన్ భూముల కబ్జా, అక్రమాలపై దర్యాప్తు చేసి నిజాలు నిగ్గు తేల్చడానికి సీబీఐ విచారణకు ఆదేశించాలని నిర్ణయించారు. అయితే ఈ మేరకు సన్నద్ధంగా ఉన్నారా? లేరా? అనేది తెలియజేయాలని కేంద్ర దర్యాప్తు సంస్థకు నోటీసులు జారీ చేశారు. పిటిషన్‌లో తీర్పునిచ్చే వరకు నాగారం గ్రామంలోని 181, 182, 194, 195 సర్వే నంబర్లలోని భూములను నిషేధిత జాబితాలో చేర్చాలని అధికారులకు స్పష్టం చేశారు. ఆ భూములను విక్రయించడం, బదిలీ చేయడం సహా ఎలాంటి మార్పులు చేయవద్దని ప్రతివాదులైన అధికారులకు చెప్పారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఐపీఎస్‌లు అప్పీల్ వేశారు.

'వంక'లు లేవు వాగులు లేవు... చెప్పడానికి సాకులు లేవు.
వేసవి సెలవులు వచ్చేశాయి.
సోషల్ మీడియా బందీఖానా నుంచి పిల్లలను ఇప్పుడు రిలీజ్ చేయాలి.
పుస్తకాలకు దగ్గరగా తీసుకురావాలి.
విక్రమార్కుడి సింహాసనం ఎక్కిస్తే కథల దర్బారులోకి వారే ప్రవేశిస్తారు.
వేసవి సెలవుల్లో ఉన్న 50 రోజుల్లో
పిల్లలు పుస్తకాలు ఎందుకు చదవాలి, ఏవి చదవాలి?
వేసవి శీర్షిక 'వేసవి కాలమ్'లో మొదటి కథనం.



సెలవులొచ్చాయి

ఆడించండి... చదివించండి..





పిల్లలకు బడి గంట ఇష్టమే. కాని స్కూల్ మొదలయ్యేప్పుడు కొట్టే గంట కంటే స్కూల్ వదిలేప్పుడు కొట్టే గంట ఎక్కువ ఇష్టం. ఆ గంట వినపడగానే పుస్తకాలు తీసుకుని క్లాస్ నుంచి పరిగెత్తుతారు. కొందరు ప్లేగ్రౌండ్‌కు వెళతారు. కొందరు ఇంటికి చేరి వెంటనే చుట్టుపక్కల ఫ్రెండ్స్‌ను పోగేస్తారు. ఎందుకు? ఇంకెందుకు... ఆటలు ఆడటానికి.

ఇంట్లో నుంచి అమ్మ పిలుస్తున్నా... ఏదైనా తిని వెళ్లమని అరుస్తున్నా పిల్లలు లెక్క చేయరు. ఆడుతుంటారు. ఆడుతూ అరుస్తూ ఉంటారు. నవ్వుతూ ఉంటారు. పేచీ పెడుతూ ఉంటారు. ఓడుతూ ఉంటారు. గెలుస్తూ ఉంటారు. ఇవన్నీ చేస్తూ చెమట చిందిస్తూ ఉంటారు.

పిల్లలూ చెమటా కవలలు.

నేడు... పిల్లలకు చెమటే లేదు. ఎందుకు? ఎందుకంటే వాళ్లు ఆడటం లేదు కాబట్టి. ఆడే బదులు ఓ.టి.టి.లో, కంప్యూటర్లో, సోషల్ మీడియానో తమ బాల్యంతో ఆటలాడుకోవడానికి వీలు కల్పిస్తున్నారు కాబట్టి.

దొంగ... పోలీస్

'దొంగ పోలీస్' ఆట అందరికీ తెలుసు. ఇవాళ దొంగ పోలీస్ ఆట ఎంతమంది పిల్లలకు తెలుసు? ఎంత సింపుల్ ఆట ఇది! ఐదారు మంది పిల్లలు కలిసి పంటలు వేసి గెలుస్తారు. ఆఖరున మిగిలినవాడు పోలీస్ అయ్యి గోడ వైపు తిరిగి వంద లెక్కబెడతాడు. ఈ లోపు పిల్లలు దాక్కుంటారు. ఆ దాక్కున్న వాళ్లను పోలీస్ కనిపెట్టాలి. కనిపెట్టలేకపోతే పోలీస్ ఓడిపోతాడు. ఈ ఆట ఆషామాషీ ఆటనా? పిల్లల మెదడుకు తర్ఫీదు ఇస్తుంది. మున్ముందు జీవితంలో తారసపడబోయే వారిలో ఎవరు దొంగ.. ఎలాంటి దొంగ... వాడి వ్యవహార శైలి ఎలా ఉంటుంది... ఎవరు ఏ మేరకు తప్పించుకోలరు... అదొక్కటేనా? మన వ్యక్తిత్వంలో దొంగ పనులు ఎలా చోటు చేసుకుంటున్నాయి... వాటిని వెతికి పట్టుకొని జైలుకు పంపితే ఎంత మంచి విద్యార్థులం కాగలం... అసలు దొంగలా దాక్కునే బతుకు ఎంత నీచమైనది.... ఇవన్నీ పైకి చెప్పకనే నేర్పిస్తుంది.

ఇవాళ్టి పిల్లలకు కామిక్ హీరో, యూట్యూబ్ గేమర్ తెలుసుకాని దొంగ పోలీస్ తెలీదు. పైగా పిల్లలు ఆ ఆట ఆడుతూ కనిపిస్తే పెద్దలే నవ్వి, జోకులేసి 'మరీ ఈ ఆటలా' అని ఆపించేలా ఉన్నారు.

ఆట లేకుంటే ఆందోళన

పిల్లలు ఆడేందుకు పుట్టారు. ఆడి ఆడి వారు పెద్దవాళ్లవ్వాలి. ఆటకు దూరమయ్యి కాదు. 'పిల్లల చైల్డ్‌హుడ్ యాంగ్జయిటీకి వారు ఆటలకు దూరం కావడమే కారణం' అంటారు జోనాథన్ హైడ్ అనే సోషల్ సైకాలజిస్టు. ఆటకు బదులు టీవీ, కంప్యూటర్, సోషల్ మీడియాకు బానిసైన ఏ పిల్లవాడైనా దృష్టి చెడి, నిద్ర చెడి, కల్మషం నింపే కలకలం రేపే కంటెంట్‌ను చూసి ఆందోళనకు గురవుతాడు. కదలిక లేని మెదలిక లేని కుర్చీలో కూలబడి కేవలం మెదడుకు ఒత్తిడి ఇవ్వడం ద్వారా మెదడుతో పాటు శరీరం కూడా శుష్కమయ్యి మెదడకు తగిన శక్తి ఇవ్వడంలో వెనుకబడుతుంది.

వివాదాల ఇల్లు

అయితే తల్లిదండ్రులు చాలా నియమాలు పెట్టాలని చూస్తారు. టీవీ ఆఫ్ చేస్తారు. రౌటర్ కట్ చేస్తారు. ఓటీటీ రెన్యువల్ చేయరు. ఈ తల్లిదండ్రులే కోవిడ్ కాలంలో ఇవన్నీ అలవాటు చేశారు. ఇప్పుడు వద్దంటే పిల్లలు మానుతారా? ఆటలు ఆడి శ్రమ చేయడానికి ఇష్టపడకపోగా కుర్చీలో కూలబడి పొందే వినోదం కోసం తల్లిదండ్రులతో ఘర్షణ పడుతూ ఉంటారు. దాంతో ఇంట్లో అశాంతి నిండిపోతుంది. అందుకే జోనాథన్ హైడ్ ఏమంటారంటే ముందు పిల్లలకు పుస్తకాలు అలవాటు చేయండి. తర్వాత ఆటల్లోకి తీసుకురండి అని.

కట్టెల మోపు కథ

చనిపోయే ముందు ఒక తండ్రి తన నలుగురు కొడుకులకు ఒక్కొక్క కట్టె ఇచ్చి విరవమంటాడు. వాళ్లు విరుస్తారు. ఇప్పుడు నలుగురి చేతుల్లో ఉన్న కట్టెలను మోపుగా కట్టి విరవమంటాడు. కొడుకులు విరవలేకపోతారు. 'కలిసి ఉంటే ఇలా బలంగా ఉంటారు' అని చనిపోతాడు తండ్రి. కొడుకులు ఆ ఐకమత్యాన్ని పాటిస్తారు. కథలు ఎన్నో విషయాలు చెబుతాయి. నేర్పుతాయి. సూక్ష్మబుద్ధిని చూపుతాయి. సమస్యలు ఎదురైతే తెనాలి రామలింగడిలా దొంగల చేతే బావిలోని నీళ్లన్నీ చేదించి పాదులు తడుపుకునే తెలివితేటలను ఇస్తాయి. భారతదేశంలో నుంచి ప్రపంచం కథలను తీసుకుంటే మన పిల్లలకు మనం కథలను దూరం చేస్తున్నాం. పిల్లల నిపుణులు ఏమంటారంటే బొమ్మలున్న కథల పుస్తకాలు చిన్న పిల్లలకు కామిక్స్, గ్రాఫిక్ నవలలు టీనేజర్లకు ఇచ్చి వారికి పుస్తకాలు అలవాటు చేయమని. పుస్తకం చదివిన పిల్లలు ఆ కథను తోటి పిల్లలతో పంచుకోవాలనుకుంటారు. నలుగురు పిల్లలూ కథలు చెప్పుకోవడానికి కూడతారు. ఆ తర్వాత? ఆడుకుంటారు. ఇదీ ఆరోగ్యకరమైన బాల్యం అంటే.

క్లాసులు... స్పెషల్ క్లాసులు...

ఆటల బదులు మార్కులు, సాటి పిల్లలకు బదులు ట్యూషన్ క్లాసులు చుట్టుముట్టి పిల్లలను ఆందోళనలోకి నెడుతున్నాయి. కాలూ చేయీ కదపని దేహం బుద్ధిని ఎలా కదుపుతుంది? ఫిట్‌గా లేని శరీరం ర్యాంకులు ఎలా తెస్తుంది? ఆటలో పడి లేస్తారు పిల్లలు. అది అలవాటైతే చదువులో పడినా లేవడం తెలుసుకుంటారు. లేదా లేవడానికి కథల్లో చదివిన ఒక ఉదాత్త నాయకుడిని తోడు తెచ్చుకుంటారు. ఆటపాటలు లేకపోవడం వల్లే నేడు పిల్లలు ర్యాంకు రాకపోయినా ఫెయిల్ అయినా చాలా దూరం పోతున్నారు.

సెలవులొచ్చాయి.
ఆడించండి. చదివించండి.

– కె.

బ్యూటిప్స్

మూడు టేబుల్ స్పూన్స్ మేర సగ్గు బియ్యం తీసుకోవాలి. అంతకు ముందే వాటిని ఓ కప్పు నీటిలో ఉడకబెట్టాలి. అయితే.. ఫేస్ మాస్క్ తయారీ కోసం వీటిని ఆ నీటితో పాటు వాడాలి. ఈ మాస్క్ లో అన్నం కూడా కలపాలి. రెండు మూడు టేబుల్ స్పూన్స్ అన్నాన్ని తీసుకోవాలి. ఆ తరవాత ఓ టేబుల్ స్పూన్ శనగపిండి, ఓ టేబుల్ స్పూన్ బంక మట్టి, ఓ టేబుల్ స్పూన్ తేనె అందుబాటులో ఉంచుకోవాలి. చివరగా మూడు నుంచి నాలుగు టేబుల్ స్పూన్స్ రోజ్ వాటర్ నీ తీసుకోవాలి. వీటన్నింటినీ ఓ మిక్సీ జార్ లో వేసి గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి మాస్క్ లా వేసుకుని ఆరిన తర్వాత గోరువెచ్చటి నీటితో కడిగేసుకోవాలి. ఇలా వారానికి రెండు లేదా మూడు సార్లు చేస్తూ ఉంటే ముఖం మిలమిలలాడుతుంది.



● పర్యావరణ హిత

ఈ చిత్రాన్ని మీకు సమర్పిస్తున్న వారు...



నోరు లేని మూగజీవాలు, విలువైన ప్రకృతి గురించి చెప్పడానికి ఎన్నో కథలు ఉన్నాయి. వాటికి చిత్రరూపం ఇవ్వడానికి, మహిళలలోని సృజనాత్మకతను ప్రోత్సహించడానికి, వారిని డైరెక్టర్‌లుగా తీర్చిదిద్దడానికి 'రౌండ్‌గ్లాస్ సస్టెయిన్' అనే స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తోంది.

కోల్‌కత్తాకు చెందిన అశ్వికాకపూర్ బీబీసి నేచురల్ హిస్టరీ యూనిట్ డైరెక్టర్. పశ్చిమబెంగాల్ అడవుల్లో 'వణ్యప్రాణుల వేట' పేరుతో ఉత్సవాలు చేస్తారు, ఇందులో పిల్లలు కూడా పాల్గొంటారు. దీనిపై ఆమె 'క్యాటపల్ట్స్ టు కెమెరాస్' చిత్రాన్ని తీసింది. ఈ చిత్రం న్యూయార్క్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఉత్తమ స్ఫూర్తిదాయక చిత్రంగా అవార్డు గెలుచుకుంది.

అశ్వికాలాంటి ఎంతోమంది మహిళా దర్శకుల విజయానికి 'రౌండ్‌గ్లాస్ సస్టెయిన్' దారి చూపింది.



'రౌండ్‌గ్లాస్ సస్టెయిన్ ద్వారా వణ్యప్రాణుల గురించి వీలైనంత ఎక్కువగా తెలుసుకునే అవకాశం వచ్చింది. ఎప్పుడూ వినని అరుదైన జీవులు గురించి కూడా తెలుసుకున్నాను. వైల్డ్‌లైఫ్ ఫిల్మ్‌మేకర్‌గా ఇది నాకు ఎంతో ఉపయోగపడుతుంది' అంటుంది అశ్వికాకపూర్.

పిల్లల జీవితాలను మార్చింది

వైల్డ్ లైఫ్ ఫోటోగ్రఫీ, చిత్రాల ద్వారా వేటకు వెళ్లే పిల్లల మనస్తత్వాలను మార్చాం. ఇప్పుడు వారు అడవి జంతువులను 'వేట కోసం' అన్నట్లుగా చూడడం లేదు. సంరక్షించుకోవాల్సిన అందమైన జీవులుగా చూస్తున్నారు. మా చిత్రనిర్మాణ ప్రక్రియ వన్యప్రాణులను కాపాడడమే కాదు పిల్లల జీవితాలను కూడా మార్చింది. తమ చుట్టూ ఉన్న సహజ ప్రపంచంతో కనెక్ట్ కావడానికి వారికి ఇది కొత్త మార్గాన్ని చూపించింది.

– నేహా దీక్షిత్, ఫిల్మ్‌మేకర్

'రౌండ్‌గ్లాస్ సస్టెయిన్' సంస్థను సియాటిల్‌కు చెందిన పారిశ్రామికవేత్త, దాత గుర్‌ప్రీత్ సన్నీసింగ్ స్థాపించారు. వణ్యప్రాణులపై విలువైన కథలు వెండితెరపై చెప్పడానికి వీలుగా ఇది మహిళా కథకులకు ఒక వేదికగా ఉపయోగపడుతుంది.

'రౌండ్‌గ్లాస్ సస్టెయిన్ ఫిల్మ్స్ దేశవ్యాప్తంగా ఉన్న మహిళా ఫిల్మ్‌మేకర్స్‌తో కలిసి పని చేస్తోంది. ఫండింగ్ నుంచి దర్శకులకు మార్గనిర్దేశం చేయడం వరకు రౌండ్‌గ్లాస్ సస్టెయిన్ ఎన్నో చేస్తుంది' అంటుంది రౌండ్‌గ్లాస్ సస్టెయిన్ ఫిల్మ్స్ క్రియేటివ్ డైరెక్టర్, ఫిల్మ్‌మేకర్ సమ్రీన్ ఫారూఖీ.

'రౌండ్‌గ్లాస్ సస్టెయిన్' నిర్మాణ సంస్థ తన వెబ్‌సైట్ ద్వారా సినిమాలను విడుదల చేస్తుంది.

వారే నిజమైె హీరోలు

భూగోళ సంక్షోభం గురించి నిరాశపడడం కంటే కార్యాచరణ అనేది ముఖ్యం. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది సంరక్షకులు, శాస్త్రవేత్తలు, రేంజర్ల రూపంలో ఆశ కనిపిస్తుంది. వారు నిజమైన హీరోలు. ఈ హీరోలు మన భూగోళాన్ని సురక్షితంగా ఉంచడానికి అవిశ్రాంతంగా పనిచేస్తున్నారు. వారి అంకితభావం మన ఆశావాదానికి బలాన్ని ఇస్తుంది. ఆ ఆశావాదాన్ని దశదిశలా వ్యాప్తి చేయడం ఫిల్మ్‌మేకర్‌గా నా బాధ్యత.

– అశ్వికా కపూర్, ఫిల్మ్‌మేకర్

సినిమాలను ప్రమోట్ చేయడానికి టీమ్ విస్తృతంగా మార్కెటింగ్ కూడా చేస్తుంది.

దేశవ్యాప్తంగా పలు భాషల్లో ఆన్‌లైన్ స్క్రీనింగ్‌లు నిర్వహిస్తారు.



'విస్మరించబడిన కథలను వెలుగులోకి తీసుకురావాలనుకుంటుంది. పెద్దగా ఎవరికీ తెలియని ఆవాసాలు, పర్యావరణ వ్యవస్థలు, జాతులకు ప్రాధాన్యత ఇస్తోంది. దీనికి తోడు లోకల్ ఫిల్మ్‌మేకర్స్‌పై దృష్టి పెట్టింది. సహజ ప్రపంచం గురించి మాట్లాడడానికి మల్టీ మీడియా విధానాన్ని ఉపయోగిస్తోంది. ఫోటో స్టోరీలు, ఇన్ఫోగ్రాఫిక్స్, వ్యాసాలు, కార్టూన్లు ఇందులో ఉంటాయి. కథలను సంచలనం కోసం చెప్పాలనుకోవడం లేదు. స్పష్టంగా చెప్పాలనుకుంటుంది' అని రౌండ్‌గ్లాస్ సస్టెయిన్ గురించి చెబుతోంది సమ్రీన్.

లీగల్

ష్యూరిటీ ఇచ్చేముందే జాగ్రత్త పడాలి

నా స్నేహితుడు ఒక ప్రైవేటు చిట్‌ఫండ్ కంపెనీలో డబ్బు తీసుకునేటప్పుడు నేను హామీ (ష్యూరిటీ) ఇచ్చాను. ఇప్పుడు అతను పరారీలో ఉన్నాడు. చిట్‌ఫండ్ వారు నాపై కేసు వేశారు. ఆ మొత్తం నేను కట్టవలసిందేనా?

– రాహుల్, ఖమ్మం

ష్యూరిటీ ఇమ్మని మిమ్మల్ని ఎవరూ బలవంతం చేయలేదు కదా! ష్యూరిటీ ఇచ్చిన తర్వాత మీరు ఎంత మొత్తానికి హామీ ఇచ్చారో అంత మొత్తం మీ వద్ద నుండి వసూలు చేస్తారు. వాయిదా పద్ధతుల్లో చెల్లించవచ్చు. మీ స్నేహితుడికి ఏవైనా ఆస్తులు ఉంటే అవి జప్తు చేయవలసినదిగా కోరవచ్చు. అలాంటివి ఏమైనా ఉన్నాయేమో చూడండి. ష్యూరిటీ ఇచ్చేముందు జాగ్రత్త వహించడం మంచిది. నమ్మకస్తులకి, డబ్బు తిరిగి చెల్లించే స్థితి ఉన్న వారికి మాత్రమే ష్యూరిటీ ఇవ్వడం మంచిది.

నేను ఒక ప్రైవేటు సంస్థలో చిట్టీ కట్టాను. మొత్తం 50 నెలలు కట్టాలి కానీ నా పరిస్థితులు బాగుండక 15 నెలలు మాత్రమే కట్టాను. చిట్టీ ఎత్తలేదు. నేను కట్టిన డబ్బు నాకు తిరిగి రావాలంటే ఏం చేయాలి?

– సుందర్, హైదరాబాద్

చిట్టీ కట్టడాన్ని మధ్యలోనే ఆపేయడం తరచుగానే చూస్తుంటాం. మంచి సంస్థలలో అయితే లిఖితపూర్వక హామీపత్రాలు (అగ్రిమెంట్) ఉంటాయి కాబట్టి, అందులోని ఒప్పందం ప్రకారం కొంత జరిమానా విధించి మీరు అప్పటివరకు కట్టిన మొత్తాన్ని తిరిగి చెల్లిస్తుంటారు. కొన్ని సంస్థలు అయితే చిట్టీ గడువు పూర్తిగా ముగిశాక లేదా మీ బదులు ఇంకెవరైనా మీ గ్రూపు చిట్టీలో కలిస్తే కొంత కమీషన్ తీసుకొని డబ్బు తిరిగి ఇస్తుంటారు. ఏది ఏమైనా, మీరు కట్టినన్ని డబ్బులు మీకు రావు కానీ పూర్తి నష్టం మాత్రం ఉండదు. మీరు చిట్టీ కట్టిన సంస్థని సంప్రదించి క్యాన్సిలేషన్ అడగండి. వారి నిబంధనల మేరకు వారికి రావలసిన మొత్తాన్ని మినహాయించుకుని మిగిలినది ఇస్తారు.



- శ్రీకాంత్ చింతల
హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

* జెండర్ ఈక్వాలిటీ

ప్లంబర్లుగా మహిళా శక్తి!



లింగ సమానత్వం కార్పొరేట్ రంగాల్లో కాదు శ్రామిక శక్తిలో చూపాలి అని నిరూపిస్తోంది జోర్డాన్ మహిళ. జోర్డాన్‌లో వందలాది మహిళలు ప్లంబర్లుగా విధులను నిర్వహిస్తున్నారు. మొదట్లో దీనిని అవమానకరంగా భావిస్తూ వీరి పనులపై గతంలో నిషేధం విధించారు. అక్కడి సామాజిక, సాంస్కృతిక నిబంధనల కారణంగా మహిళలు శ్రామిక శక్తిలోకి ప్రవేశించడం ఒక సవాల్‌గా ఉంది. ఇప్పుడు ఆ అనిశ్చితి తొలగి, జోర్డాన్‌లో మహిళా ప్లంబర్లపై ప్రభుత్వం నిషేధాన్ని తొలగించింది. 2006లో మొట్టమొదటి లైసెన్స్ పొందిన మహిళా ప్లంబర్ ఖవ్లా షేక్ ఈ పనిలోకి ఎక్కువ మంది మహిళలు వచ్చేలా ప్రోత్సహిస్తుండగా, 2014లో ఏర్పడిన వైజ్ ఉమెన్ ప్లంబర్స్ కో ఆపరేటివ్ ఈ రంగంలో లింగసమానత్వం సాధించడానికి కృషి చేస్తోంది. జోర్డాన్ సంప్రదాయ కట్టుబాట్ల కంచెను తొలగించుకుంటూ అక్కడి మహిళ తన ఉనికికోసం చేస్తున్న కృషి ప్రపంచం దృష్టిని ఆకట్టుకునేలా చేస్తోంది.

'స్త్రీ ఉద్యోగం చేయకూడదు, అది కుటుంబానికే అవమానం. అటువంటిది మరీ చోద్యం కాకపోతే పురుషులకు దీటుగా చేసే ఆ పనులేంటి..!?' తహానీ ఆల్ షాతి, యుస్రా మోహమ్మద్ న్మోర్.. వంటి వాళ్లు ప్లంబర్లుగా శిక్షణ ప్రారంభించినప్పుడు ఇలాంటి ఎన్నో మాటలు తమ సాటి వారి నుంచి వచ్చినవే. జోర్డాన్‌లో సామాజిక, సాంస్కృతిక నిబంధనల కారణంగా జీతంతో కూడిన పనిలో మహిళల నిష్పత్తి ప్రపంచంలోనే అత్యల్పంగా ఉంది. శ్రామిక శక్తిలోకి ప్రవేశించడం ఇప్పటికీ చాలామంది మహిళలకు అతిపెద్ద సవాల్.

సమర్థతే సరైన ఔషధం

ప్లంబర్లుగా శిక్షణ తీసుకుంటున్న తొలి రోజులను అల్‌షాతి గుర్తుచేసుకుంది. శిక్షణ తీసుకుంటున్న ఇతర మహిళలు వీధిలో నీళ్ల లీక్ అవుతున్న పైపును చూశారు. లీకేజీని ఆపడానికి తమ వద్ద గల ఉపకరణాలను బయటకు తీశారు. దారిన పోతున్న ఒక మహిళ వారిని చూసి 'మీరేంటి ఈ పనులు చేయడమేంటి?' అని తిట్టడం మొదలుపెట్టింది. దాంతో అక్కడ ఇంకొంతమంది పోగయ్యారు. వాళ్లు కూడా అవే మాటలు.. అవేమీ ఈ శిక్షణ తీసుకుంటున్న బృందం పట్టించుకోలేదు. నీళ్ల లీకేజీని ఆపాలనుకున్న పనిని సమర్థంగా పూర్తిచేశారు. నీటినష్టాన్ని నివారించారు. దీంతో అక్కడున్న వారి నోళ్లు మూతపడ్డాయి. తమలో తాము గొణుక్కుంటూ అక్కడినుంచి వెళ్లిపోయారు. ఇప్పుడు అక్కడ అల్ షాతి, న్మోర్ లాంటి వందలాది మహిళా సర్టిఫైడ్ ప్లంబర్లు ఉన్నారు.

రాజధాని నగరమైన అమ్మాన్‌లోని ఈ మహిళలంతా 'ఈ అసాధారణ కెరీర్ మా జీవితాలనే మార్చిందని, ఆత్మవిశ్వాసం, స్వాతంత్ర్యాన్ని అందించిందని, ఇతర మహిళలకు శిక్షణ ఇస్తూ తమ దేశాన్ని పర్యటించే అవకాశాలను కల్పించిందని' ముక్త కంఠంతో అంటున్నారు. 'నా భర్త, పిల్లలు నన్ను చూసి చాలా గర్వపడుతుంటారు. నా పొరుగువారు నన్ను చూసి అసూయపడుతున్నారు' అని న్మోర్ చెబుతుంది.

భిన్నమైన సేవ

జోర్డాన్‌లో నీటి కొరత పెద్ద సమస్య. ఇందుకు భౌగోళిక, పర్యావరణ పరమైన కారణాలు మొదటివి కాగా, నీటిని దొంగిలించడం అనేది మరో ముఖ్యమైన కారణం.

అందుకే జోర్డాన్‌లో మహిళల కోసం అనేక ప్రాజెక్టులను ప్రారంభించారు. ఇందులో భాగంగా నీటి పొదుపు కోసం రకరకాల ఉపకరణాలను బిగించడంలో మహిళలకు శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టారు. నీటి వనరుల నిర్వహణలో మహిళలను పాల్గొనేలా చేయడం మంచి నిర్ణయమని నీటి, పారిశుధ్య సలహాదారు హింద్ అల్లైఫాత్ పేర్కొన్నారు. ఎందుకంటే నీటి ప్రాముఖ్యత గురించి వారికే ఎక్కువ తెలుసు. ఈ మేరకు వారు యువత, వృద్ధులలో అవగాహనను తీసుకు రాగలరు. ఈ కోణంలో చూసినపుడు వారు తల్లులే కాదు, టీచర్లు కూడా!

ఆర్థిక భద్రత

అల్ షాతి, న్మోర్ తో సహా కొంతమంది మహిళా ప్లంబర్లు 2014లో వైజ్ ఉమెన్ ప్లంబర్స్ కో ఆపరేటివ్ కార్యక్రమంలో చేరారు. కలిసి పనిచేయడం వల్ల భద్రత, ఆర్థిక స్థిరత్వం, అలాగే పెద్ద ప్రాజెక్టులను లీడ్ చేసే అవకాశాలు లభిస్తాయనేది వీరి ఆలోచన. ఇందులోని సభ్యులు తమ చుట్టుపక్కల ఇళ్లకు వెళ్లి ఉచిత సర్వీస్ అందిస్తున్నారు.

మొదటిసారి 2004లో 15 మంది మహిళలతో కలిసి శిక్షణ తీసుకున్నప్పుడు 'సంస్కృతికే అవమానం' అనే కారణంగా ఇతరులెవరూ దానిని ఆమోదించలేదు. కానీ, ''నేడు ఈ పని రాని వారు కూడా సాధారణ మరమ్మతులు చేయడం నేర్చుకుంటే ఇండ్లలో తమ ప్లంబర్ పనిని తామే చేసుకోవచ్చు' అని వివరిస్తూ తోటి మహిళలనూ ప్రోత్సహిస్తున్నారు. ఇలా ప్లంబర్ పనిచేసే ఈ మహిళలంతా చాలా కాలంగా తమ సమాజంలోని నిబంధనలను సవాల్ చేస్తూ తమ ఉనికిని చాటుతున్నారు. లింగ సమానత్వాన్ని కాపాడుకున్నారు.

ఇంటిప్స్

కిచెన్ నైఫ్ పదును పోయిందా...

అప్పుడప్పుడు వంటగది చాకులు పదును లేకుండా కూరగాయలు కోయడానికి విసిగిస్తూ ఉంటాయి. ఈ సమస్యను అధిగమించేందుకు చిన్న చిట్కాలున్నాయి.



- పదును పెట్టే రాయి.. పదును పెట్టే రాయిని ఒక్కసారి కొనేసుకుంటే అది ఎప్పటికీ పనిచేస్తుంది. కత్తులు, చాకులు ఇలా వేటినైనా ఈజీగా పదును పెట్టచ్చు. మనీ సేవ్ చేయడమే కాదు. సమయం కూడా వృథా కాదు.
- నైఫ్ షార్ప్‌నర్.. ఎలక్ట్రిక్, మాన్యువల్ కత్తి షార్ప్‌నర్లు సౌకర్యవంతంగా ఉంటాయి. మరీ ఎక్కువ పదును లేకుండా చూసుకుంటూ పదును పెట్టాలి.
- చాకుల్ని పొడిగా ఉంచాలి.. తేమ తుప్పు పట్టేలా చేస్తుంది. కూరగాయలు కోయడం అయిపోయాకా కత్తుల్ని కాగితం, తువ్వాళ్లలో కట్టి ఆరనీయాలి.
- చాపింగ్ బోర్డ్.. గాజు, గ్రానైట్ లేదా సిరామిక్ ప్లేట్లలో కూరగాయలు, ఇతర ఆహార పదార్థాలను కట్ చేయడం వల్ల చాకులు ఇట్టే పదును పోతాయి. ఈ పదును ఎక్కువ కాలం ఉండాలంటే చెక్క వస్తువు మీదనే కట్ చేసేలా చూడాలి.
- కటింగ్ టెక్నిక్.. చాకు మీద ఒత్తిడి తగ్గించి సరైన కటింగ్ మెథడ్స్ పాటిస్తూ కట్ చేయడం వల్ల పదును తగ్గే అవకాశాలు తక్కువగా ఉంటాయి.



మళ్లీ ఓడిన భారత బ్యాడ్మింటన్ జట్టు

ప్రతిష్టాత్మక సుదిర్మన్ కప్ ప్రపంచ మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత జట్టు కథ ముగిసింది. చైనాలో జరుగుతున్న ఈ మెగా ఈవెంట్‌లో భారత జట్టు వరుసగా రెండో పరాజయాన్ని చవిచూసి నాకౌట్ దశకు చేరుకునే అవకాశాన్ని కోల్పోయింది. డెన్మార్క్‌తో జరిగిన గ్రూప్ 'డి' తొలి లీగ్ మ్యాచ్‌లో 1–4తో ఓడిన భారత్... ఇండోనేసియా జట్టుతో మంగళవారం జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లోనూ 1–4తో ఓడిపోయింది. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో నెగ్గిన డెన్మార్క్, ఇండోనేసియా జట్లు గ్రూప్ 'డి' నుంచి నాకౌట్ దశకు అర్హత పొందాయి. ఇండోనేసియాతో జరిగిన పోటీలో మిక్స్‌డ్ డబుల్స్ తొలి మ్యాచ్‌లో ధ్రువ్–తనీషా క్రాస్టో 10–21, 21–18, 21–19తో రెహాన్–గ్లోరియాలపై గెలిచి భారత్‌కు 1–0తో ఆధిక్యం అందించారు. అయితే రెండో మ్యాచ్‌లో స్టార్ షట్లర్ పీవీ సింధు 12–21, 13–21తో పుత్రి కుసుమ వర్ధిని చేతిలో ఓడిపోయింది. మూడో మ్యాచ్‌లో ప్రణయ్ 21–19, 14–21, 12–21తో జొనాథన్ క్రిస్టీ చేతిలో ఓటమి చెందాడు. నాలుగో మ్యాచ్‌లో శ్రుతి మిశ్రా–ప్రియా ద్వయం 10–21, 9–21తో ల్యానీ ట్రియా–సితి ఫాదియా జంట చేతిలో ఓడిపోయింది. చివరిదైన ఐదో మ్యాచ్‌లో హరిహరన్–రూబన్ 20–22, 18–21తో షోహిబుల్–డానియల్ మార్టిన్ చేతిలో పరాజయం పాలయ్యారు.

నైట్‌రైడర్స్ గెలుపు బాట

ఐపీఎల్‌లో 'ప్లే ఆఫ్స్' అవకాశాలకు పూర్తిగా తెర పడిపోకుండా కోల్‌కతా నైట్‌రైడర్స్ తమ ఆశలు సజీవంగా ఉంచుకుంది. గత మూడు మ్యాచ్‌లలో రెండు పరాజయాలు, ఒక మ్యాచ్ రద్దు తర్వాత ఎట్టకేలకు ఆ జట్టు గెలుపు రుచి చూసింది. సమష్టి బ్యాటింగ్‌తో 200 పరుగుల స్కోరు దాటిన టీమ్... ఢిల్లీని వారి వేదికపై కట్టడి చేయడంలో సఫలమైంది. ముఖ్యంగా మ్యాచ్ చేజారుతున్న దశలో నరైన్ 7 బంతుల వ్యవధిలో 3 వికెట్లు తీసి ఆటను మలుపు తిప్పాడు.


నరైన్

కోల్‌కతాకు కీలక విజయం
- నరైన్ ఆల్‌రౌండ్ ప్రదర్శన
- 14 పరుగులతో ఓడిన ఢిల్లీ

న్యూఢిల్లీ: డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు ఐపీఎల్ 18వ సీజన్‌లో కీలక విజయం దక్కింది. గెలిస్తేనే నిలిచే స్థితిలో మంగళవారం బరిలోకి దిగిన కేకేఆర్ 14 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 204 పరుగులు చేసింది. అంగ్‌క్రిష్ రఘువంశీ (32 బంతుల్లో 44; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), రింకూ సింగ్ (25 బంతుల్లో 36; 3 ఫోర్లు, 1 సిక్స్) కీలక ఇన్నింగ్స్‌లు ఆడగా, స్టార్క్ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఢిల్లీ 20 ఓవర్లలో 9 వికెట్లకు 190 పరుగులే చేయగలిగింది. ఫాఫ్ డుప్లెసిస్ (45 బంతుల్లో 62; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), అక్షర్ పటేల్ (23 బంతుల్లో 43; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), విప్‌రాజ్ నిగమ్ (19 బంతుల్లో 38; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సునీల్ నరైన్ (3/29) మూడు ప్రధాన వికెట్లతో ఢిల్లీని దెబ్బ తీశాడు.

పవర్‌ప్లేలో కోల్‌కతా ఇన్నింగ్స్ జోరుగా సాగింది. చమీరా ఓవర్లో సునీల్ నరైన్ (16 బంతుల్లో 27; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) 2 ఫోర్లు, 2 సిక్స్‌లు కొట్టగా...స్టార్క్ ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్ బాదిన రహ్మానుల్లా గుర్బాజ్ (12 బంతుల్లో 26; 5 ఫోర్లు, 1 సిక్స్) అదే ఓవర్లో అవుటయ్యాడు. తొలి 6 ఓవర్లలో మొత్తం 79 పరుగులు వచ్చాయి. ఆ తర్వాత తక్కువ వ్యవధిలో నరైన్, అజింక్య రహానే (14 బంతుల్లో 26; 4 ఫోర్లు, 1 సిక్స్), వెంకటేశ్ అయ్యర్ (7) వికెట్లను కేకేఆర్ కోల్పోయింది. ఈ స్థితిలో రఘువంశీ, రింకూ ఐదో వికెట్‌కు 46 బంతుల్లో 61 పరుగులు జోడించి ఆదుకున్నారు. చివర్లో కోల్‌కతా కట్టడి చేయడంలో ఢిల్లీ సఫలమైంది. 3 పరుగుల వ్యవధిలో రఘు, రింకూ వెనుదిరగ్గా... స్టార్క్ వేసిన చివరి ఓవర్లో వరుస బంతుల్లో 3 వికెట్లు పడ్డాయి.

రాణించిన డుప్లెసిస్

ఛేదనలో ఢిల్లీకి సరైన ఆరంభం లభించలేదు. పొరేల్ (4), కరుణ్ నాయర్ (15), కేఎల్ రాహుల్ (7) తక్కువ వ్యవధిలో వెనుదిరిగారు. అయితే డుప్లెసిస్, అక్షర్ భాగస్వామ్యంతో ఢిల్లీ గెలుపుపై ఆశలు రేగాయి. నాలుగో వికెట్‌కు డుప్లెసిస్, అక్షర్ 42 బంతుల్లోనే 76 పరుగులు జత చేశారు. 41 బంతుల్లో 69 పరుగులు చేయాల్సిన సమయంలో అక్షర్‌ను నరైన్ అవుట్ చేయడంతో ఆట మలుపు తిరిగింది. అదే ఓవర్లో స్టబ్స్ (1) కూడా వెనుదిరగ్గా... నరైన్ తన తర్వాతి ఓవర్లో డుప్లెసిస్‌ను కూడా వెనక్కి పంపించాడు. 10 పరుగుల వ్యవధిలో ఈ 3 వికెట్లు పడ్డాయి.

స్కోరు వివరాలు

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి) పొరేల్ (బి) స్టార్క్ 26; నరైన్ (ఎల్బీ) (బి) విప్‌రాజ్ 27; రహానే (ఎల్బీ) (బి) అక్షర్ 26; రఘువంశీ (సి) నాయర్ (బి) చమీరా 44; వెంకటేశ్ (సి) విప్‌రాజ్ (బి) అక్షర్ 7; రింకూ (సి) స్టార్క్ (బి) విప్‌రాజ్ 36; రసెల్ (రనౌట్) 17; పావెల్ (ఎల్బీ) (బి) స్టార్క్ 5; అనుకూల్ (సి) చమీరా (బి) స్టార్క్ 0; హర్షిత్ (నాటౌట్) 0; వరుణ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 204. వికెట్ల పతనం**: 1–48, 2–85, 3–91, 4–113, 5–174, 6–177, 7–203, 8–203, 9–203. **బౌలింగ్:** స్టార్క్ 4–0–43–3, చమీరా 3–0–46–1, ముకేశ్ 2–0–17–0, విప్‌రాజ్ 4–0–41–2, అక్షర్ పటేల్ 4–0–27–2, కుల్దీప్ 3–0–27–0.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: పొరేల్ (సి) రసెల్ (బి) అనుకూల్ 4; డుప్లెసిస్ (సి) రింకూ (బి) నరైన్ 62; కరుణ్ నాయర్ (ఎల్బీ) (బి) అరోరా 15; రాహుల్ (రనౌట్) 7; అక్షర్ (సి) హర్షిత్ (బి) నరైన్ 43; స్టబ్స్ (బి) నరైన్ 1; విప్‌రాజ్ (బి) రసెల్ 38; అశుతోష్ (సి) నరైన్ (బి) వరుణ్ 7; స్టార్క్ (సి) గుర్బాజ్ (బి) వరుణ్ 0; చమీరా (నాటౌట్) 2; కుల్దీప్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 190. వికెట్ల పతనం:** 1–4, 2–43, 3–60, 4–136, 5–138, 6–146, 7–160, 8–160, 9–189. **బౌలింగ్:** అనుకూల్ రాయ్ 4–0–27–1, వైభవ్ అరోరా 2–0–19–2, హర్షిత్ రాణా 4–0–49–0, వరుణ్ చక్రవర్తి 4–0–39–2, నరైన్ 4–0–29–3, రసెల్ 2–0–22–1.

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
బెంగళూరు	10	7	3	0	14	0.521
ముంబై	10	6	4	0	12	0.889
గుజరాత్	9	6	3	0	12	0.748
ఢిల్లీ	10	6	4	0	12	0.362
పంజాబ్	9	5	3	1	11	0.177
లక్నో	10	5	5	0	10	-0.325
కోల్‌కతా	10	4	5	1	9	0.271
రాజస్తాన్	10	3	7	0	6	-0.349
హైదరాబాద్	9	3	6	0	6	-1.103
చెన్నై	9	2	7	0	4	-1.302

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, పా-పాయింట్లు, ర.రే- రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు
చెన్నై × పంజాబ్
వేదిక: చెన్నై
రాత్రి 7:30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఈ 'వైభవం' కొనసాగాలంటే!
వైభవ్ సూర్యవంశీపై ప్రత్యేక కథనం
మరిన్ని క్రీడా వార్తలు | సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

స్నేహ్ మాయాజాలం


'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్నేహ్ రాణా

భారత ఆఫ్‌స్పిన్నర్ స్నేహ్ రాణా 5 వికెట్ల ప్రదర్శన... వీటిలో ఒకే ఓవర్లో తీసిన 3 వికెట్లు... ప్రతీక రావల్ మరో అర్ధసెంచరీతో అద్భుత ఫామ్ కొనసాగింపు... తజ్‌మీన్ బ్రిట్స్ వీరోచిత సెంచరీ వృథా... భారత్, దక్షిణాఫ్రికా మధ్య జరిగిన వన్డే మ్యాచ్‌లో హైలైట్స్ ఇవి. ముక్కోణపు టోర్నీలో భాగంగా ఆడిన రెండో మ్యాచ్‌లోనూ గెలిచిన హర్మన్ బృందం తమ అగ్రస్థానాన్ని పటిష్టం చేసుకుంది.

ఒకే ఓవర్లో 3 వికెట్లు తీసిన భారత స్పిన్నర్
- రెండో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై 15 పరుగులతో నెగ్గిన భారత్
- ప్రతీక రావల్ అర్ధసెంచరీ

కొలంబో: ముక్కోణపు వన్డే టోర్నీలో భారత మహిళలు మరో విజయాన్ని అందుకున్నారు. మంగళవారం జరిగిన పోరులో భారత్ 15 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా మహిళల జట్టును ఓడించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 276 పరుగులు చేసింది. ప్రతీక రావల్ (91 బంతుల్లో 78; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ సాధించగా... జెమీమా రోడ్రిగ్స్ (32 బంతుల్లో 41; 4 ఫోర్లు), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (48 బంతుల్లో 41 నాటౌట్; 4 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. అనంతరం దక్షిణాఫ్రికా 49.2 ఓవర్లలో 261 పరుగులకు ఆలౌటైంది. తజ్‌మీన్ బ్రిట్స్ (107 బంతుల్లో 109; 13 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ చేయగా, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్నేహ్ రాణా (5/43) ఐదు వికెట్ల ప్రదర్శనతో సఫారీ టీమ్‌ను పడగొట్టడంలో ప్రధాన పాత్ర పోషించింది.

కీలక భాగస్వామ్యాలు...

భారత్‌కు ప్రతీక, స్మృతి మంధాన (54 బంతుల్లో 36; 5 ఫోర్లు) శుభారంభం అందించారు. తొలి వికెట్‌కు వీరిద్దరు 18.3 ఓవర్లలో 83 పరుగులు జోడించారు. స్మృతి వెనుదిరిగిన తర్వాత ప్రతీకకు హర్లీన్ డియోల్ (47 బంతుల్లో 29; 4 ఫోర్లు) సహకారం అందించింది. 58 బంతుల్లో ప్రతీక అర్ధ సెంచరీ పూర్తయింది. ప్రతీక, హర్లీన్ మూడు పరుగుల వ్యవధిలో వెనుదిరగ్గా... హర్మన్, జెమీమా 59 పరుగుల భాగస్వామ్యంతో ఇన్నింగ్స్‌ను నడిపించారు. చివర్లో రిచా ఘోష్ (14 బంతుల్లో 24; 3 ఫోర్లు, 1 సిక్స్) దూకుడైన ఆటను ప్రదర్శించగా...ఆఖరి 10 ఓవర్లలో భారత్ 82 పరుగులు సాధించింది.

బ్రిట్స్ సెంచరీ వృథా...

బ్రిట్స్ వరుస బౌండరీలతో చెలరేగిపోవడంతో ఛేదనలో దక్షిణాఫ్రికాకు మరింత ఘనమైన ఆరంభం దక్కింది. బ్రిట్స్‌తో తొలి వికెట్‌కు 140 పరుగులు జోడించిన తర్వాత కెప్టెన్ లౌరా వాల్‌వార్ట్ (75 బంతుల్లో 43; 3 ఫోర్లు) అవుట్ కాగా, ఆ తర్వాత 103 బంతుల్లో బ్రిట్స్ శతకం పూర్తయింది. ఆ తర్వాత తీవ్ర వేడి కారణంగా బ్రిట్స్ రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరగ్గా... ఇక్కడే మ్యాచ్ మలుపు తిరిగింది. 80 పరుగుల వ్యవధిలో జట్టు చివరి 8 వికెట్లు కోల్పోయి ఓటమి పాలైంది. ఐదు వికెట్లతో చివరి 3 ఓవర్లలో 28 పరుగులు చేయాల్సి ఉండగా... 48వ ఓవర్ వేసిన స్నేహ్ రాణా 3 వికెట్లు పడగొట్టింది. తిరిగి మైదానంలోకి వచ్చి ఆదుకునే ప్రయత్నం చేసిన బ్రిట్స్ కూడా ఇదే ఓవర్లో అవుట్ కావడంతో జట్టు ఆశలు కోల్పోయింది.


ప్రతీక


బ్రిట్స్

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: ప్రతీక (బి) ఎమ్‌లాబా 78; స్మృతి (సి) మెసో (బి) డెర్క్‌సన్ 36; హర్లీన్ (బి) ఎమ్‌లాబా 29; హర్మన్‌ప్రీత్ (నాటౌట్) 41; జెమీమా (సి) ఖాకా (బి) క్లాస్ 41; రిచా (సి) లూస్ (బి) ఖాకా 24; దీప్తి (సి) ట్రియాన్ (బి) డిక్లెర్క్ 9; కాశ్వీ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (50 ఓవర్లలో 6 వికెట్లకు) 276. వికెట్ల పతనం:** 1–83, 2–151, 3–154, 4–213, 5–247, 6–259. **బౌలింగ్:** ఖాకా 8–1– 42–1, క్లాస్ 9–1–43–1, లూస్ 4–0–24–0, డిక్లెర్క్ 9–1–39–1, ఎమ్‌లాబా 10–0–55–2, డెర్క్‌సన్ 3–0–40–1, ట్రియాన్ 7–0–33–0.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: వోల్‌వార్ట్ (ఎల్బీ) (బి) దీప్తి 43; బ్రిట్స్ (సి అండ్ బి) స్నేహ్ రాణా 109, గుడాల్ (బి) స్నేహ్ రాణా 9; మెసో (బి) అరుంధతి రెడ్డి 7; లూస్ (సి) (సబ్) అమన్‌జోత్ (బి) శ్రీచరణి 28; ట్రియాన్ (సి) (సబ్) అమన్‌జోత్ (బి) స్నేహ్ రాణా 18; డెర్క్‌సన్ (సి) హర్లీన్ (బి) స్నేహ్ రాణా 30; డిక్లెర్క్ (బి) స్నేహ్ రాణా 0; క్లాస్ (రనౌట్) 2; ఎమ్‌లాబా (రనౌట్) 8; ఖాకా (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (49.2 ఓవర్లలో ఆలౌట్) 261. వికెట్ల పతనం:** 1–140, 2–151, 3–181, 4–207, 5–240, 6–250, 7–251, 8–252, 9–253, 10–261. **బౌలింగ్:** కాశ్వీ గౌతమ్ 7.2–0–47–0, అరుంధతి రెడ్డి 9–0–59–1, స్నేహ్ రాణా 10–0–43–5, శ్రీచరణి 10–0–51–1, దీప్తి శర్మ 10–0–40–1, ప్రతీక 3–0–17–0.

సాక్షి సినిమా


ఎన్టీఆర్

జూన్‌లో ఫిక్స్

ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎన్టీఆర్ నీల్' (వర్కింగ్ టైటిల్) గురించి కీలక అప్‌డేట్ ఇచ్చింది చిత్రయూనిట్. ఈ సినిమాని 2026 జూన్ 25న రిలీజ్ చేయనున్నట్లు మంగళవారం ప్రకటించారు మేకర్స్. 'ఆర్ఆర్ఆర్, దేవర' వంటి వరుస విజయాల తర్వాత హీరో ఎన్టీఆర్, 'కేజీఎఫ్, సలార్' వంటి హిట్స్ తర్వాత డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న పాన్ ఇండియా మూవీ 'ఎన్టీఆర్ నీల్'. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్స్‌పై కల్యాణ్ రామ్ నందమూరి, నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్నారు. ఈ సినిమాని సంక్రాంతి కానుకగా 2026 జనవరి 9న విడుదల చేయనున్నట్లు తొలుత ప్రకటించింది యూనిట్. అయితే తాజాగా ఆ తేదీకి కాకుండా 2026 జూన్ 25న రిలీజ్ చేయనున్నట్లు కొత్త తేదీని ప్రకటించారు. ''ఈ చిత్రంలో ఎన్టీఆర్ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఆయన్ని ప్రశాంత్ నీల్ ఎలా చూపిస్తారో అనే ఆసక్తి అందరిలో నెలకొంది. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా మా సినిమా అందర్నీ అలరించేలా ఉంటుంది'' అని చిత్రబృందం పేర్కొంది. ''ఇద్దరు డైనమిక్ వ్యక్తుల కాంబినేషన్‌లో బాక్సాఫీస్ విధ్వంసమయ్యే అనుభూతికి సిద్ధంకండి. 2026 జూన్ 25న థియేటర్లు దద్దరిల్లే సౌండ్స్ మీరు వింటారు. మాస్‌లకే మాస్ అయిన ఎన్టీఆర్ పుట్టినరోజున (మే 20) ప్రత్యేక గ్లింప్స్‌తో వస్తాం'' అంటూ మైత్రీ మూవీ మేకర్స్ ప్రకటించారు. కాగా ఈ సినిమాకి 'డ్రాగన్' అనే టైటిల్ పరిశీలనలో ఉందని టాక్. ఈ చిత్రానికి కెమేరా: భువన్ గౌడ, సంగీతం: రవి బస్రూర్.

ఏడాదిలో ఎనిమిది!


నవీన్ చంద్ర

నవీన్ చంద్ర హీరోగా నటించిన తెలుగు, తమిళ చిత్రం 'లెవెన్'. లోకేశ్ అజ్ల్స్ దర్శకత్వం వహించారు. రేయా హరి కథానాయికగా నటించిన ఈ మూవీలో అభిరామి, రవి వర్మ కీలక పాత్రలు చేశారు. ఏఆర్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై అజ్మల్ ఖాన్, రేయా హరి నిర్మించిన ఈ సినిమా మే 16న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని నటుడు కమల్‌హాసన్ విడుదల చేశారు. 'వైజాగ్‌లో లాస్ట్ వన్ ఇయర్‌లో ఎనిమిది హత్యలు జరిగాయి.. సీరియల్ కిల్లింగ్స్' అంటూ పోలీస్ ఆఫీసర్‌గా నవీన్ చంద్ర చెప్పే డైలాగుతో ట్రైలర్ ఆరంభమైంది. రుచిర ఎంటర్‌టైన్మెంట్స్ అధినేత ఎన్. సుధాకర్ రెడ్డి ఈ సినిమా థియేట్రికల్ హక్కులు సొంతం చేసుకున్నారు. ఈ చిత్రానికి సంగీతం: డి. ఇమ్మాన్, కెమేరా: కార్తీక్ అశోకన్.

కిష్కింధపురి మిస్టరీ


బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ జంటగా నటించిన చిత్రం 'కిష్కింధపురి'. కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వం వహించారు. అర్చన సమర్పణలో షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మించిన ఈ చిత్రం ఫస్ట్ గ్లింప్స్‌ని మంగళవారం విడుదల చేశారు మేకర్స్. ''సాయి శ్రీనివాస్ కెరీర్‌లో భారీ ఎత్తున రూపొందుతోన్న చిత్రం 'కిష్కింధపురి'. ఈ చిత్రం ప్రేక్షకులకు అద్భుతమైన హారర్, మిస్టరీ ఎక్స్‌పీరియన్స్‌ని అందిస్తుంది. కౌశిక్ పెగల్లపాటి గ్రిప్పింగ్ కథనం, చిన్మయ్ సలాస్కర్ కెమేరా వర్క్, సామ్ సీఎస్ సంగీతం ఆకట్టుకుంటాయి. ఇటీవల విడుదలైన మా సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌కి మంచి స్పందన వచ్చింది. త్వరలో సినిమాని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు మేకర్స్.

దీక్ష పూర్తి


ప్రతాని రామకృష్ణ, అక్సా ఖాన్

కిరణ్, అలేఖ్య రెడ్డి జోడీగా, అక్సా ఖాన్, తులసి, అనూష ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'దీక్ష'. ఆర్‌కే ఫిలిమ్స్ పతాకంపై ప్రతాని రామకృష్ణ గౌడ్ స్వీయ దర్శకత్వంలో పి. అశోక్ కుమార్‌తో కలిసి నిర్మించారు. ఈ సినిమా షూటింగ్ పూర్తయిన విషయాన్ని చిత్రయూనిట్ మంగళవారం ప్రకటించింది. ఈ సందర్భంగా దర్శక–నిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ– ''ఒక వ్యక్తి పట్టుదల, దీక్షతో కృషి చేస్తే ఏదైనా సాధించవచ్చు అనే పాయింట్‌ను ఇతివృత్తంగా తీసుకుని లవ్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా 'దీక్ష'ని తెరకెక్కించాం. ఈ చిత్రంలో భీముడు పాత్రలో హీరో కిరణ్ అద్భుతమైన నటన కనబరిచారు. అక్సా ఖాన్ స్పెషల్ సాంగ్‌లో డ్యాన్స్ అదరగొట్టారు. మే నెలలో సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు.


చిరంజీవి

వాటర్‌లో వార్

వెండితెర నీటిమయం కానుంది. ఎందుకంటే నీటిలో వీరోచిత యాక్షన్ సన్నివేశాలు చేస్తున్నారు కొందరు తెలుగు హీరోలు. కొందరు నీటి పై... మరి కొందరు నీటి లోపల వాటర్ సీక్వెన్స్ చేస్తున్నారు. ఇలా ప్రత్యర్థులతో 'వాటర్‌లో వార్' చేస్తున్న హీరోల గురించి తెలుసుకుందాం.


ఎన్టీఆర్


మహేశ్‌బాబు

బురదలో ఫైట్

వాటర్‌లో ఫైట్ సీక్వెన్స్‌లను చాలా సినిమాల్లో చేశారు చిరంజీవి. కానీ... తొలిసారిగా కాస్త బురద ఉండే వాటర్ ఫైట్ సీక్వెన్స్‌ను 'విశ్వంభర' సినిమా కోసం చేశారాయన. ఈ సోషియో ఫ్యాంటసీ అడ్వెంచరస్ యాక్షన్ సినిమాకు 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో ఓ వాటర్ యాక్షన్ సీక్వెన్స్ ఉందని, ఈ ఫైట్‌ను ప్రేక్షకులు ఆశ్చర్యపోయేలా డిజైన్ చేశారని సమాచారం. ఈ చిత్రంలో ఆంజనేయ స్వామి భక్తుడు భీమవరం దొరబాబు పాత్రను చిరంజీవి పోషిస్తున్నారని తెలిసింది. త్రిష, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. వంశీ, ప్రమోద్, విక్రమ్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం ఒక పాట మినహా పూర్తయిందట. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్, వీఎఫ్ఎక్స్ వర్క్స్ జరుగుతున్నాయి. ఈ ఏడాది జూన్ లేదా ఆగస్టులో 'విశ్వంభర' విడుదల కానుందనే టాక్ వినిపిస్తోంది.

పడవలో ఫైట్


పవన్ కల్యాణ్

పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న చారిత్రాత్మక చిత్రం 'హరిహర వీరమల్లు'. ఈ సినిమాకు క్రిష్ జాగర్లమూడి, జ్యోతికృష్ణ దర్శకులు. మొఘల్ సామ్రాజ్యం కాలం నాటి 17వ శతాబ్దం నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో పవన్ కల్యాణ్ టైటిల్ రోల్ చేస్తుండగా, హీరోయిన్‌గా పంచమి అనే పాత్రలో నిధీ అగర్వాల్ నటిస్తున్నారు. ఔరంగజేబు పాత్రలో బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ కనిపిస్తారు. ఈ సినిమాలో ఓ అండర్ వాటర్ యాక్షన్ సీక్వెన్స్ ఉందని తెలిసింది. ఈ సీన్ సినిమా ఆరంభంలోనే వస్తుందట. ఏఎమ్ రత్నం సమర్పణలో ఎ. దయాకర్ రావు నిర్మిస్తున్న 'హరిహర వీరమల్లు' రెండు భాగాలుగా రూపొందుతోంది. తొలి భాగం 'హరిహర వీరమల్లు: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' చిత్రం త్వరలో విడుదల కానుంది.

పడవల్లో గొడవ

పడవ ప్రయాణంలో ప్రత్యర్థులతో గొడవ పడుతున్నారట మహేశ్‌బాబు. ఇది ఏ రేంజ్ గొడవ అనేది థియేటర్స్‌లో చూడాలి. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం కోసం ఇటీవల హైదరాబాద్‌లో ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించారట రాజమౌళి. ఈ చిత్రంలో ప్రధాన తారాగణమైన మహేశ్‌బాబు, ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ఈ భారీ యాక్షన్ సీక్వెన్స్‌లో పాల్గొనగా, వీరితో పాటు దాదాపు మూడువేల మంది జూనియర్ ఆర్టిస్టులు పాల్గొన్నారని సమాచారం. ఈ వాటర్ యాక్షన్ సీక్వెన్స్‌ను ఓ భారీ సెట్‌లో చిత్రీకరించారట. ఈ బోట్ యాక్షన్ సీక్వెన్స్‌ని హాలీవుడ్ స్టంట్ కొరియోగ్రాఫర్స్ డిజైన్ చేశారని భోగట్టా. కేఎల్ నారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రం 2027లో విడుదల కానుందని సమాచారం.

సముద్రంలో దేవర

తండ్రీకొడుకులుగా ఎన్టీఆర్ నటించిన తాజా చిత్రం 'దేవర'. ఈ చిత్రంలో తండ్రి దేవరగా, కొడుకు వరగా ఎన్టీఆర్ నటన ప్రేక్షకులను మెప్పించింది. కొరటాల శివ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. 'దేవర' తొలి భాగంలో సముద్రంలో జరిగే యాక్షన్ సీక్వెన్స్‌లను చూశాం. అలాగే 'దేవర 2'లోనూ ఆ తరహా వాటర్ యాక్షన్ ఎపిసోడ్స్ ఉంటాయని తెలిసింది. తొలి భాగంలో సముద్రం అడుగు భాగాన కొన్ని అస్థిపంజరాలు ఉన్నట్లుగా చూపించారు. వీటి వెనక దాగి ఉన్న యాక్షన్ ఎపిసోడ్ 'దేవర 2'లో ఉంటుందని తెలుస్తోంది. ఇంకా రెండో భాగం షూటింగ్ ఆరంభం కాలేదు. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించనున్న ఈ సినిమాలో ప్రకాశ్‌రాజ్, శ్రీకాంత్, షైన్ టామ్ చాకో ఇతర కీలక పాత్రల్లో కనిపిస్తారు. కల్యాణ్‌రామ్, మిక్కిలినేని సుధాకర్, కె. హరికృష్ణ 'దేవర' చిత్రాన్ని నిర్మించారు. ఈ నిర్మాతలే 'దేవర 2'ని కూడా నిర్మిస్తారని ఊహించవచ్చు. ప్రస్తుతం ప్రశాంత్ నీల్ 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్)తో బిజీగా ఉన్నారు ఎన్టీఆర్. ఈ సినిమా చిత్రీకరణ ఓ కొలిక్కి వచ్చాక 'దేవర 2' షూట్‌లో పాల్గొంటారని తెలుస్తోంది.


తేజ సజ్జా

సాహసాల సూపర్ యోధ

సూపర్ యోధగా సాహసాలు చేస్తున్నారు తేజ సజ్జా. ఈ సాహసాల విజువల్స్ ఆగస్టులో థియేటర్స్‌లో చూడొచ్చు. తేజ సజ్జా హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో 'మిరాయ్' అనే ఫ్యాంటసీ యాక్షన్ అడ్వెంచరస్ ఫిల్మ్ రూపొందుతోంది. ఈ సినిమాలో ఓ వాటర్ యాక్షన్ సీక్వెన్స్ ఉందని భోగట్టా. యాక్షన్‌తో పాటు ఆధ్యాత్మిక అంశాలు కూడా మిళితమై ఉన్న ఈ సినిమాకు చెందిన ఓ లాంగ్ షెడ్యూల్ చిత్రీకరణ శ్రీలంకలో జరిగింది. ఆ షెడ్యూల్‌లో ఓ వాటర్ యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు ఓ ట్రైన్ యాక్షన్ ఎపిసోడ్ కూడా తీశారని సమాచారం. ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా ఆగస్టు 1న విడుదల కానుంది.

ఇలా వాటర్‌లో జరిగే యాక్షన్ ఎపిసోడ్స్‌తో మరికొన్ని చిత్రాలు రానున్నాయి.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034.
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
బుధవారం । 30-4-2025

ఆహా ఏమి రుచి

'ఆహా ఏమి రుచి' అంటూ విందారగించాలంటే అందుకు తగిన విధంగా వంటలు ఉండాల్సిందే. విందు అంటే ఎవరికైనా పసందే. షడ్రషోపేతంగా పంచభక్ష పరమాన్నాలను చూసిన మానవులు ఎవరికైనా జిహ్వా చాపల్యం పుడుతుంది. ఆధునికతను వంట పట్టించుకున్న నేటి మానవునికి గత కాలపు ఘుమఘుమలు అందని ద్రాక్షే. కాగా, రోజుకో కొత్తరూపు సంతరించుకుంటున్న సమాజంలో తరతరాలుగా వస్తున్న సంప్రదాయ వంటలను మాత్రం సజీవంగా నిలుపుతున్నారు మంథనివాసులు.

- మంథని

- నలభీములకు మారుపేరు మంత్రపురి వంటవారు
- దేశవిదేశాల్లో మంథని రుచులు
- గుమ్మడికాయ బరడా.. చల్ల పులుసుకు పుట్టినిల్లు



మంథనిలో బ్రాహ్మణులు తమ పాక శాస్త్ర నైపుణ్యాన్ని పలు దిశలా చాటారు. ఇప్పటి వరకు ఏ ప్రాంతంలో చేయని వంటలు కొన్ని ఇక్కడ తయారవుతాయి. మంథనికే ప్రత్యేకమైన గుమ్మడికాయతో చేసే బరడా, పెరుగుతో చేసే చల్లపులుసు, పాలకూర ఉప్పుడు పిండి, సొజ్జ భక్ష్యాలు వంటి వంటలు ఏ ప్రాంతంలోనూ లభించవు. మంథనిలో నలభీముల పుట్టుకపై శాస్త్రీయమైన ఆధారాలు లేనప్పటికీ 1950–70 ప్రాంతాల్లో మారుపాక నాగన్న, రంగి సీతారాం, రాంపల్లి బాల కిష్టయ్యను ప్రథములుగా పేర్కొంటారు. ఇక్కడ చేతినిండా పని దొరక్క ఆర్థిక ఇబ్బందులు ఉండేవని, అయితే ఉపాధి కోసం నాగ్‌పూర్‌కు వెళ్లినట్లు ఈ తరం వారు చెబుతుంటారు. నాగ్‌పూర్ సిటీ మేయర్ ఇంట్లో వీరు వంటలు చేసి జీవనోపాధి పొందారు. తర్వాత మంథని నుంచి అనేక మంది దేశంలోని పలు ప్రాంతాలకు వెళ్లి తమ పాకశాస్త్ర ప్రావీణ్యాన్ని చాటినవారే. 1907–85 కాలానికి చెందిన ముద్దు రాధాకిష్టయ్య 1944లో లండన్‌లోని రెస్టారెంట్‌లో పార్ట్‌టైమ్ వెయిటర్‌గా పనిచేశారు. మంథని బ్రాహ్మణులకు వంటల కోసం ప్రవాసం వెళ్లడం కొత్తేమీ కాదు.

దేశ.. విదేశాల్లో మంథని రుచులు

మహారాష్ట్ర ప్రభావం

మంథనిపై మహారాష్ట్ర ప్రభావం అధికంగా ఉండటంతో ఆ రాష్ట్రానికి సంబంధించిన వంటలు ఎక్కువ శాతం కనిపిస్తాయి. మంథని నుంచి నాగ్‌పూర్, బరోడా, వార్ధా, పూనద్, పర్భని, జలగాం, గోబర్‌గాం మొదలగు ప్రాంతాలకు వంటలు చేయడానికి ప్రవాసం వెళ్లేవారు. మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావు పదవీకాలంలో మంథనికి చెందిన రంగి కిశోర్‌కుమార్ (కిట్టు) ప్రధాని ఇంట్లో పర్సనల్ కుక్‌గా పనిచేశారు. 1990–92 కాలంలో గట్టు భాస్కర్ దక్షిణాఫ్రికాలోని ప్రైవేటు కంపెనీలో వంటలు వండారు. ప్రస్తుతం యువతరం ప్రవాసాలకు వెళ్లనప్పటికీ స్థానికంగానే పలు శుభ, అశుభ కార్యక్రమాలకు వంటలు చేస్తూ కనిపిస్తారు. మంథనిలో కేవలం పురుషులే కాకుండా మహిళలు కూడా వందల సంఖ్యల్లో ఉన్న జనానికి వండి వార్చేవారు. వంటలు చేసే మహిళల్లో వేణమ్మ గురించి మొదటగా చెప్పుకోవాలి. ఆ కాలంలో వేణమ్మ వంట అంటే తిరుగుండేది కాదు. కేవలం శాకాహారానికే పరిమితమైన బ్రాహ్మణుల వంట శాస్త్రబద్ధంగా చేయడం విశేషం. మారుపాక సీతారాం, కాచే రాంబాబు, జక్కి లక్ష్మణ్, వొజ్జల కిష్టయ్య, మారుపాక ప్రకాశ్, కొండల కిష్టయ్య, నల్లగొండ అంతయ్య, సువర్ణ సత్యనారాయణ, పల్లి నారాయణ, గట్టు చిన్న నారాయణ, కొమ్మెరల శ్యాంసుందర్‌ను రెండో తరానికి చెందినవారిగా చెప్పవచ్చు. గట్టు లక్ష్మి నర్సయ్య, రంగి కిశోర్, బొబ్బిలి శ్రీకాంత్, గట్టు శ్రీకాంత్, సువర్ణ గణపతి, ముద్దు హరీశ్, గట్టు శ్రీనివాస్, గట్టు హరి, రాహుల్ వంటి యువకులు తమ హస్త రుచిని అందించటంలో ఎప్పుడూ ముందుంటారు. మంథని ఖ్యాతిని విదేశాలకు చాటిన ఘనత కలిగినవారు కూడా జన్మస్థల రుచిని మాత్రం వదిలి పెట్టలేరు. ఈ ప్రాంతంలో ఏ కార్యం జరిగినా లొట్టలు వేసుకు తినేవారు కోకొల్లలు.



ఆరగించడంలోనూ ప్రత్యేకత

మంథని బ్రాహ్మణులు వంటలు చేయడంలోనే కాదు వాటిని ఆరగించడంలోనూ ప్రత్యేకతను ప్రదర్శిస్తారు. మంథనికి చెందిన అవధానుల మురళి (లడ్డూల మురళి) 40 ఏళ్ల వయసులో ఒక సహపంక్తి భోజనంలో పోటీపడి 45 లడ్డూలను అవలీలగా ఆరగించాడు. ఆ కాలంలో భోజనాల వద్ద పోటీపడి తినే పద్ధతి ఉండేది. ఎవరెక్కువ తింటే అంత గొప్పగా చెప్పుకునేవారు. ప్రస్తుతం వంట చేయడం ఒక వృత్తిగా మారిపోయింది. ఏది కావాలన్నా క్షణాల్లో తయారు చేసి మన ముందుండే పరిస్థితి వచ్చింది. కానీ, మంథని వంటవాళ్లు మాత్రం సంప్రదాయానికే పెద్దపీట వేస్తారు. ఈ విధంగా మంథని వంటలకు ఈ ప్రాంతంతో పాటు కరీంనగర్, హైదరాబాద్, నాగ్‌పూర్ తదితర ప్రదేశాల్లో ఎంతో పేరుంది.

గుమ్మడి బరడాతో లాభాలు

గుమ్మడికాయ బరడాలో అనేక మినరల్, ఖనిజాలు, పోషక పదార్థాలు ఉంటాయి. గుమ్మడికాయ బరడా తినడం వల్లే మంథని వాసులకు మేధాశక్తి ఎక్కువగా ఉందనే నానుడి ఉంది. అనేక మంది మేధావులు దేశ విదేశాల్లో ఇక్కడి నుంచి ఉద్యోగ, ఉన్నత చదువుల్లో ఉన్నారు. వేసవిలో తినడం వల్ల ఆరోగ్యం చల్లగా ఉంటుంది.

ఎలా తయారు చేస్తారు?

గుమ్మడికాయ ముక్కలకు సరిపడా నూనె వేయాలి. నూనె వేడి అయిన తర్వాత దానిలో కొన్ని ఎండు మిర్చి విని యోగించాలి. తర్వాత ఆవాలు, ఇంగువ, మెంతిపొడి, పచ్చి మిరపకాయలు, కరివేపాకు, జిలకర, నూనెలో వేగాలి. అనంతరం గుమ్మడి కాయ ముక్కలు పోనిలో వేయాలి. కూరకు సరిపడా పరిమాణంలో దొడ్డు ఉప్పు, పసుపు, కారం, దనియాల పొడి వేసి ముక్కలను కలపాలి. గిన్నెపై మూత ఉంచి ఒకటి రెండు వాపిలు వచ్చినంక, కూర ఉడకడానికి సరిపడా నీటిని పట్టించాలి, ఉడికినంక పొయ్యిని సిమ్‌లో ఉంచి బరడాలో నిమ్మ ఉప్పు కలపాలి. కూర ఉడికాక దించాలి. తర్వాత కొంచెం నూనె తీసుకొని పోని తయారు చేసుకొని ఆకూరలో మీద నుంచి కోతిమీర వేస్తే రుచికరంగా ఉంటుంది.

పాతాల్‌బాజి.. భలే రుచి

తోట కూర, శనిగపప్పు, పల్లీలు, ముల్లంగి గడ్డలను శుభ్రంగా కడిగి ఉడకపెట్టాలి. గంపలో వాల్చాలి. తర్వాత తగినంత నూనె, ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి, ఇంగువ, మెంతిపొడర్, కరివేపాకు వేయాలి. ఉడికించిన వస్తువులను నూనెలో వేసి నిమిషం పాటు కలియపెట్టాలి. పసుపు, కారం, ధనియాల పొడి, ఉప్పు వేయాలి. రెండు గ్లాసుల నీరు, 50 గ్రాములు చింతపండు గుజ్జు, 50 గ్రాముల బెల్లం వేయాలి. అవి ఉడికాక 50 గ్రాముల శనగ పిండిని జారుడుగా కలిపి (ఉండలు కట్టకుండా స్పూన్‌తో కలుపుతూ) వేయాలి. మరీ జారీయకుండా, గట్టిగా లేకుండా శనగపిండిని మోతాదులో కలిపి వేయాలి. మరోసారి పై నుంచి పోపు వేసి తిప్పుకోవాలి.

పీవీ ఇంట్లో పర్సనల్ కుక్‌గా పనిచేశా



ప్రధానిగా పీవీ నరసింహారావు పనిచేసిన కాలంలో ఆయన ఇంట్లో పర్సనల్ కుక్‌గా రెండేళ్లు పనిచేశా. మంథని వంటలంటే పీవీకి, ఆయన కుటుంబానికి బాగా ఇష్టముండేది. మేం చేసే వంటలను మెచ్చుకునేవారు.

– రంగి కిశోర్ కుమార్ (కిట్టు), పాకశాస్త్ర ప్రావీణ్యుడు, మంథని

చేతినిండా ఉపాధి



వంటల తయారీకి నిత్యం పని ఉంటుంది. మంథనిలో శుభ, అశుభ కార్యక్రమాలు జరిగినా గుమ్మడి, దోసకాయ బరడా వండిపిస్తుండటంతో వంటలకు మంచి గిరాకీ ఉంటుంది. మంచి ముహూర్తాల్లో కాస్త బిజీగా ఉంటున్నా, రోజూ ఏదో ఒక ఫంక్షన్ వంట దొరుకుతూనే ఉంది.

– గట్టు హరి, పాకశాస్త్ర ప్రావీణ్యుడు, మంథని

ఎన్ఎఫ్‌హెచ్‌సీ.. సేవల్లో భేష్

- సైంటిస్టు మూడావత్ మోహన్ ఆలోచనతో ఎన్ఎఫ్‌హెచ్‌సీ ఫౌండేషన్ ఏర్పాటు
- 15 ఏళ్లుగా పలు జిల్లాల్లోని మారుమూల గ్రామాల్లో సేవలు
- పేద విద్యార్థులకు తోడ్పాటునందిస్తూ, పలు సేవా కార్యక్రమాలు
- పలు రంగాల నిపుణులతో నాలెడ్జ్ నెట్‌వర్క్ టీం ఏర్పాటు
- సహకారం అందిస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు



8వ తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ మెటీరియల్ అందజేస్తున్న సైంటిస్ట్ మోహన్

కేసముద్రం: రాష్ట్రంలోని పలు జిల్లాల్లోని మారుమూల ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు చేయూతనిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది నేషన్స్ ఫస్ట్ హ్యూమన్ చైన్ ఫౌండేషన్ (ఎన్ఎఫ్‌హెచ్‌సీ). ఫీజులు చెల్లించలేని విద్యార్థులకు ఆర్థికసాయం చేయడంతో పాటు వేసవికాలంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేస్తూ, మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య శిబిరాలు, తాగునీటి ప్రాజెక్టుల ఏర్పాటు వంటి పలు సేవాకార్యక్రమాలతో ముందుకు వెళ్తూ అందరితో భేష్ అనిపించుకుంటోంది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తావుర్యా తండాకు చెందిన గిరిజన విద్యాకుసుమం, సైంటిస్ట్ మూడావత్ మోహన్‌కు వచ్చిన మంచి ఆలోచనతో ఏర్పాటైన ఎన్ఎఫ్‌హెచ్‌సీ ఫౌండేషన్ ద్వారా తన తండా, చదువుకున్న గురుకుల పాఠశాల నుంచి మొదలుకుని, రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లోని మారుమూల గ్రామాల వరకు సేవాకార్యక్రమాలను విస్తరించి, అందరి మన్ననలను పొందుతు ఆదర్శంగా నిలుస్తున్నారు.

తండా నుంచి సైంటిస్ట్‌గా..

తావుర్యాతండాకు చెందిన మూడావత్ భద్రునాయక్, శాంతి దంపతులకు కుమారుడు మోహన్, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. మొదటి నుంచి ఆ దంపతులు వ్యవసాయం చేస్తూ పిల్లల్ని చదివిస్తూ వచ్చారు. మోహన్ చిన్నప్పటి నుంచే చదువులో ప్రతిభ కనబరుస్తూ వచ్చాడు. ఈ క్రమంలో జిల్లాలోని గూడూరు మండలం దామరవంచ ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో పదో తరగతి వరకు చదివాడు. అక్కడి గణిత ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్‌రావు ప్రోత్సాహంతో చదువు పట్ల శ్రద్ధ వహించి, పదిలో 550 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. తన గురువు సహకారంతో విజయవాడలోని ఓ విద్యాసంస్థలో మోహన్ ఇంటర్‌తోపాటు (ఎంపీసీ), ఐఐటీ కోచింగ్ తీసుకున్నాడు. ఇంటర్‌లో 963 మార్కులు సాధించాడు. ఈ క్రమంలో ఏఐఈఈఈలో ఉత్తమ ర్యాంకు సాధించి నిట్ వరంగల్‌లో ఈసీఈ బ్రాంచ్‌లో అడ్మిషన్ పొందాడు. ఐఐటీ క్వాలీఫై అయినప్పటికీ, తాను కోరుకున్న బ్రాంచ్ రాకపోవడంతో నిట్‌లో చేరాడు. 2012లో బీటెక్ పూర్తి చేసి, క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ప్రముఖ కేంద్ర ప్రభుత్వ సంస్థ సీడాట్‌లో రీసెర్చ్ ఇంజనీర్‌గా ఉద్యోగం పొందాడు. ప్రస్తుతం బెంగళూరులో సీడాట్ కంపెనీలో 4జీ, 5జీ టెక్నాలజీతోపాటు, మిగతా సాంకేతిక ప్రాజెక్టుల అభివృద్ధిపై సైంటిస్టుగా పనిచేస్తున్నాడు.

సేవచేయాలనే తపనతో..

తన తండ్రి, గురువు అందించిన ప్రోత్సాహంతో మోహన్ చదువులో రాణిస్తూ వచ్చాడు. తన మాదిరిగానే చదువు పట్ల శ్రద్ధ ఉన్న నిరుపేద పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవద్దనే మంచి ఆలోచన విద్యార్థి దశలోనే తనకు వచ్చింది. తాను బీటెక్ చదువుతున్న సమయంలో 2010లో నేషన్స్ ఫస్ట్ హ్యూమన్ చైన్ ఫౌండేషన్ (ఎన్ఎఫ్‌హెచ్‌సీ) అనే సేవాసంస్థను ఏర్పాటు చేశాడు. ఆ టీంలో సివిల్ సర్వెంట్స్, ఎన్ఐటీ, ఐఐటీ తదితర ప్రముఖ విద్యాసంస్థల నుంచి ఎదిగిన వారితోపాటు, ప్రముఖ వైద్యులు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలకు చెందిన నిపుణులతో కలిసి నాలెడ్జ్ నెట్‌వర్క్ టీంను ఏర్పాటు చేశాడు. ఎప్పటికప్పుడు ఆ టీం సలహాలు, సూచనలు తీసుకుంటూ, అనేక మంది సహకారంతో పేద విద్యార్థులకు విద్య, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పిస్తూ, వారికి అవసరమైన సాయం అందిస్తూ వస్తున్నారు. ఇప్పటి వరకు ఫౌండేషన్‌లో 100 మంది సభ్యులు ఉన్నారు.

సేవా కార్యక్రమాలు ఇవే..

రాష్ట్రంలోని మహబూబాబాద్, వరంగల్, మెదక్, నారాయణపేట, నల్లగొండ జిల్లాల్లోని మారుమూల గ్రామాల్లో 40 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రేరణ సదస్సులు నిర్వహించారు. ప్రవేశ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్స్‌ను అందించారు. 8వ తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ మెటీరియల్, పదో తరగతి పిల్లలకు ఆల్‌ఇన్‌వన్, పాలిటెక్నిక్ మెటీరియల్ అందజేశారు. పాఠశాలల్లోని గ్రంథాలయానికి బుక్స్ అందజేశారు. అలాగే స్పోర్ట్స్ కిట్‌లు అందించారు. ఈ ఏడాది ఇనుగుర్తి మండలం చీన్యాతండాలో వేసవి శిక్షణ శిబిరాన్ని ఇటీవల ప్రారంభించారు. ఈ శిబిరంలో పిల్లలకు స్పోకెన్ ఇంగ్లిష్‌తోపాటు, ఆటపాటలు నేర్పించడం, పది పిల్లలకు పాలిటెక్నిక్ కోచింగ్ ఇస్తున్నారు. అలాగే ఆయా గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించి, వైద్యపరీక్షల అనంతరం రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తావుర్యాతండాలో ప్రజల దాహార్తి తీర్చేందుకు వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఉన్నత చదువులు చదివే పలువురు నిరుపేద విద్యార్థులకు ఆర్థికసాయం అందిస్తున్నారు.

మా నాన్న, గురువు స్ఫూర్తితో ఎన్ఎఫ్‌హెచ్‌సీ ఏర్పాటు

మా నాన్న భద్రునాయక్, మ్యాథ్స్ టీచర్ జి.వెంకటేశ్వర్‌రావు ప్రోత్సాహంతో ఎన్ఎఫ్‌హెచ్‌సీ ఏర్పాటు చేశా. ఎలాంటి ఇబ్బందులు వచ్చినా అండగా నిలిచి ధైర్యం చెప్పేవారు. మా నాన్న, గురువు ప్రోత్సాహంతో చదువులో రాణించి, ప్రస్తుతం బెంగళూరులోని టెలికాం డిపార్ట్‌మెంట్ అయిన సీడాట్ కంపెనీలో 4జీ, 5జీ టెక్నాలజీతోపాటు, సాంకేతిక ప్రాజెక్టుల అభివృద్ధిపై సైంటిస్టుగా పనిచేస్తున్నాను. ఎంతో మంది నిపుణులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులతో కలిసి పేద విద్యార్థులకు తోడ్పాటునందిస్తూ, ఆర్థిక సాయం అందజేస్తున్నాం.

– మూడావత్ మోహన్, ఎన్ఎఫ్‌హెచ్‌సీ వ్యవస్థాపకుడు, తావుర్యాతండాజీపీ, కేసముద్రం మండలం

సేవ చేయడంలోనే నిజమైన సంతృప్తి

చిన్నతనం నుంచి కష్టపడి చదువుకున్నా. చదువుకునే రోజుల్లోనే పేద విద్యార్థులకు సాయం అందించాలనే ఆలోచన ఉండేది. ఆ విధంగా నా వంతుగా ఎంతోమందికి సాయం చేస్తూ వచ్చా. ఆ తర్వాత 2019లో ఎన్ఎఫ్‌హెచ్‌సీ ఫౌండేషన్‌లో సభ్యుడిగా చేరి, ఎన్నో సేవాకార్యక్రమాలు చేశాం. ప్రస్తుతం జనరల్ సెక్రటరీగా పనిచేస్తున్నా. మా తండాలో ఈ వేసవిలో శిక్షణ శిబిరం ఏర్పాటు చేశాం. విద్యార్థులకు పాలిటెక్నిక్ కోచింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, ఆటలు ఆడించడం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– జాటోత్ జయకృష్ణ, ఎన్ఎఫ్‌హెచ్‌సీ జనరల్ సెక్రటరీ, చీన్యాతండా, ఇనుగుర్తి మండలం

కోచింగ్ ఉపయోగపడుతుంది

మా తండాలోని ప్రాథమిక పాఠశాలలో ఎన్ఎఫ్‌హెచ్‌సీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో పాలిటెక్నిక్ కోచింగ్ ఇస్తున్నారు. ఈ కోచింగ్ తమకు ఎంతగానో ఉపయోగపడుతుంది. మాకు వచ్చే అనుమానాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకుంటున్నాం. పైగా స్పోకెన్ ఇంగ్లిష్ కోచింగ్ ఎంతగానో ఉపయోగపడుతుంది.

– గుగులోత్ శైలజ, విద్యార్థిని, చీన్యాతండా జీపీ, ఇనుగుర్తి మండలం

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపేయాలి

- కేంద్రానికి మంత్రి సీతక్క విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: ఆదివాసీల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వానికి పంచాయతీరాజ్, మహిళా సంక్షేమ శాఖమంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. ఆపరేషన్ కగార్‌తో ఆదివాసీలు తీవ్ర భయాందోళనతో ఉన్నారని, మావోయిస్టుల శాంతి చర్చల ప్రతిపాదనకు కేంద్రం సానుకూలంగా స్పందించాలని కోరారు. రెండువైపులా ప్రాణనష్ట నివారణకు శాంతి చర్చలు మార్గం చూపుతాయన్నారు. నక్సల్స్ సమస్యకు బల ప్రయోగంతో కాకుండా, చర్చల ద్వారా పరిష్కారం జరిగేలా వ్యవహరించాలని ఆదివాసీ బిడ్డగా కోరుతున్నట్టు తెలిపారు. మంగళవారం ప్రజాభవన్‌లో మంత్రి సీతక్కతో భారత్ బచావో సంస్థ ప్రతినిధులు గాదె ఇన్నయ్య, ఎమ్ఎఫ్ గోపీనాథ్, జంజర్ల రమేశ్‌బాబు సమావేశమయ్యారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసేలా ప్రయత్నించాలని మంత్రికి వారు వినతిపత్రం అందించారు. తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దు కర్రిగుట్టల్లో నెలకొన్న ఉద్రిక్త వాతావరణాన్ని నిలువరించేలా చొరవ చూపాలన్నారు. దేశంలోని అయిదారు రాష్ట్రాల్లో పోలీసులు–నక్సల్స్ మధ్య కాల్పుల విరమణ కొనసాగుతున్న విధంగానే దేశమంతా కూడా అదే పద్ధతి కొనసాగించేలా చూడాలని కోరారు. కాగా ప్రతినిధులు చేసిన విజ్ఞప్తిపై సీతక్క సానుకూలంగా స్పందించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్‌కౌంటర్లు జరగలేదని శాంతియుత వాతావరణం నెలకొల్పడమే ప్రభుత్వాల లక్ష్యంగా ఉండాలని సూచించారు.

బీఆర్‌ఎస్ పిల్లలకు బూస్టు, హార్లిక్సు

- తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ ఫహీం ఎద్దేవా

సాక్షి, హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పినట్టు.. అసెంబ్లీకి వచ్చే బీఆర్‌ఎస్ పిల్లలకు తెలంగాణ ఫుడ్స్ పక్షాన బూస్టు, హార్లిక్స్, సెరెలాక్‌లు, ట్విట్టర్ టిల్లు కేటీఆర్‌కు డైపర్‌లు పంపిస్తామని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.ఎ.ఫహీం చెప్పారు. అసలు ఆ పిల్లలకు అసెంబ్లీలో సీఎం రేవంత్‌ను చూస్తేనే.. ప్యాంట్లు తడుస్తాయని వ్యాఖ్యానించారు. ఆయన మంగళవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పిల్లలు అసెంబ్లీకి ఎప్పుడు వస్తారో తెలంగాణ ఫుడ్స్‌కు సమాచారమివ్వాలని కోరారు. రజతోత్సవం పేరుతో ఎల్కతుర్తిలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో.. కేసీఆర్ తనకు కాంగ్రెస్ పార్టీపై ఉన్న అక్కసునంతా వెళ్లగక్కారని విమర్శించారు. అధికారం కోల్పోయి 15 నెలలయ్యేసరికి కేసీఆర్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.

అధ్యక్షుడి కోసం.. నిరీక్షణ తప్పదా?

- రాష్ట్ర బీజేపీ సారథి ఎంపికకు మరికొన్ని రోజులు పట్టే చాన్స్
- కశ్మీర్‌లో ఉగ్రదాడితో పార్టీ అగ్ర నాయకత్వం దృష్టంతా అటే..
- జాతీయ అధ్యక్షుడి ఎన్నిక కూడా పెండింగ్‌లోనే..

సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఎంపికకు ఇంకా కొన్నిరోజులు సమయం పట్టే సూచనలు కనిపిస్తున్నాయి. తెలంగాణ అధ్యక్షుడితో పాటు ఏపీ తదితర రాష్ట్రాల అధ్యక్షులు అలాగే, జాతీయ అధ్యక్షుడి ఎన్నిక జరగాల్సి ఉండగా..ఎప్పటికప్పుడు వాయిదా పడుతోంది. తాజాగా కశ్మీర్‌లో ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో ఈ ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమౌతోంది. పహల్గాంలో 28 మంది పర్యాటకులు చనిపోవడం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని.. పాలనా పరంగా, రాజకీయంగానూ కుదిపేసింది. ప్రభుత్వంలో, పార్టీలో కీలకమైన ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పూర్తిగా..పహల్గాం ఉగ్రదాడి తదనంతరం పరిణామాలపై దృష్టి సారించాల్సిన అవశ్యకత ఏర్పడింది. ఈ నేపథ్యంలో పార్టీ సంస్థాగత అంశాలు, రాజకీయపరమైన విషయాలను ఇప్పట్లో పట్టించుకునే అవకాశం లేదని, కొత్త జాతీయ అధ్యక్షుడి విషయంలో మరి కొంతకాలం వేచిచూడక తప్పదని బీజేపీ నేతలు అంటున్నారు. జాతీయ అధ్యక్షుడి ఎన్నికతో తెలంగాణ అధ్యక్షుడి ఎన్నిక కూడా ముడిపడి ఉన్నందున, రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక కూడా ఆలస్యం అవుతుందని చెబుతున్నారు.



కొత్త అధ్యక్షుడికి అన్నీ సవాళ్లే..!

రాష్ట్ర అధ్యక్షుడిగా ఎవరు నియమితులైనా సంస్థాగతంగా, రాజకీయంగానూ కొన్ని సమస్యలను ఎదుర్కోక తప్పదనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తమౌతోంది. ఈ బాధ్యతలు చేపట్టగానే స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. దీంతో ఎన్నికల ప్రక్రియపైనే పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించాల్సి ఉంటుందని అంటున్నారు. పార్టీలో గ్రూపులు పెరగడంతో.. సొంత ముద్రతో క్యాడర్‌ను తమ వైపు తిప్పుకోవడమూ సవాళ్లతో కూడుకున్నదేననే చెబుతున్నారు. మరోవైపు వచ్చే అసెంబ్లీ ఎన్నికల కల్లా (2028) పార్టీని సంస్థాగతంగా, రాజకీయంగా బలోపేతం చేసి ఎట్టి పరిస్థితుల్లోనూ అధికారాన్ని కైవసం చేసుకోవాలని బీజేపీ అగ్ర నాయకత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలను సాధించడం ద్వారా పార్టీ బలాన్ని చాటడం కొత్త అధ్యక్షుడికి పెద్ద సవాల్‌గానే నిలుస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కేడర్‌లో నిరాసక్తత!

రాష్ట్ర పార్టీ అధ్యక్షుడి ఎన్నిక జరగకపోవడం, పార్టీ కార్యక్రమాలు పెద్దగా లేకపోవడంతో.. పైకి బాగానే కనిపిస్తున్నా కేడర్‌లో లోలోపల నిరాసక్తత, నిర్లిప్తత చోటు చేసుకుందని అంటున్నారు. నిరుద్యోగ యువత, మహిళలు, రైతులు ఇతర వర్గాల సమస్యలపై అడపాదడపా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా.. రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేసేలా పెద్దగా కార్యాచరణ ఏదీ లేదని పార్టీ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. 8 మంది ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలు ఉన్నా.. రాజకీయ కార్యకలాపాలు జోరుగా సాగడం లేదనే అభిప్రాయం వ్యక్తమౌతోంది. ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు ఎవరికి వారు తమ సొంత ఇమేజీని పెంచుకోవడంపైనే దృష్టి పెడుతున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి.



గూడులేని గువ్వలు.. ఎవరికి పట్టని బతుకులు

చెట్టు నీడే ఆశ్రయం. ఎండా వాన చలితో నిరంతర సహవాసం. కాళ్లకి చక్రాలు కట్టుకుని వీధివీధి తిరిగి ఏరుకొచ్చిన కాగితాలు, ఇనప ముక్కలే వారికి కాసింత కూడు పెట్టేది. నెల్లూరు పొర్లుకట్ట సమీపంలో ఓ చెట్టుకింద జీవనం సాగిస్తున్న ఈ కుటుంబం రోడ్లపై తిరుగుతూ కాగితాలు, ఇనపముక్కలు ఏరుకుని వచ్చి వాటిని అమ్మి జీవిస్తోంది. తండ్రి తెచ్చిన సామగ్రిని వేరుచేయడంలో చిన్నారులు ఇలా సహకరిస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

ఆనందమానందమాయె..



చిటారు కొమ్మకి ఊయల కట్టి రివ్వున అలా దూసుకుపోతే ఆ ఆనందమే వేరు. వేసవి సెలవులు కావడంతో నెల్లూరు డీఎం అండ్‌హెచ్‌వో కార్యాలయం సమీపంలో నివసించే చిన్నారులు చెట్టుకి ఇలా ఊయలలు కట్టుకుని స్నేహితులతో కలిసి ఆనందంగా ఊగుతున్న దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



నేడు సింహగిరీశుని చందనోత్సవం

సింహాచలంలో కొలువైన శ్రీ వరాహలక్ష్మీనరసింహ స్వామి వారి చందనోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరగనుంది. స్వామి వారి నిజరూప దర్శనానికి లక్షలాది భక్తులు సింహగిరికి తరలివస్తారు. ఇందుకోసం అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీప కాంతులతో సుందరంగా అలంకరించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖ

డాల్ఫిన్.. నాట్ ఫైన్!

దేశంలోని నదుల్లో 6,327 డాల్ఫిన్లు గుర్తింపు

వాటి రక్షణపై ఆందోళనలు

దేశంలో నదీ డాల్ఫిన్ల సంఖ్య ఒక పక్క పెరుగుతున్నా, మరోవైపు వాటి మనుగడ సైతం ప్రశ్నార్థకమవుతోంది. ఉత్తర భారతంలోని గంగా, బ్రహ్మపుత్ర నదీ వ్యవస్థలే ప్రధానంగా వీటికి ఆవాసంగా ఉన్నాయి. తాజా సర్వే ప్రకారం, దేశీయ నదుల్లో 6,327 డాల్ఫిన్లను గుర్తించారు. వీటిల్లో రెండు రకాలు- గంగాటిక్ , సింధు డాల్ఫిన్లుగా పరిగణిస్తున్నారు. ఈ జాతులను ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్) అంతరించిపోతున్న జాతులుగా వర్గీకరించడం ఆందోళన కలిగిస్తోంది.

– సాక్షి, అమరావతి





నదుల్లోకి ఎలా?

మిలియన్ ఏళ్ల క్రితం ఇవి సముద్ర డాల్ఫిన్ల నుంచి ఉద్భవించినట్టు భావిస్తున్నారు. ఒకప్పుడు దక్షిణాసియాలో లోతట్టు ప్రాంతాలను సముద్రాలు ముంచెత్తినప్పుడు, ఈ డాల్ఫిన్లు నదుల్లోకి చేరుకున్నట్టు అంచనా. సముద్రంలో నివసించే డాల్ఫిన్ల నుంచి తమకు తాము వేరుచేసుకుని నివసించగలిగే లక్షణాలను అభివృద్ధి చేసుకున్నట్టు తెలుస్తోంది. సముద్రంలోని డాల్ఫిన్లకు గంగా నది డాల్ఫిన్లకు కొన్ని అంశాల్లో వ్యత్యాసాలు కనిపిస్తాయి. నది డాల్ఫిన్లు నీటిలో ఎగసి దూకలేవు. నిటారుగా కూడా ఈత కొట్టలేవు. పక్కకు ఈదుతాయి. ఎక్కువసేపు నీటి అడుగు భాగానే ఉంటాయి. పొడవైన ముక్కు కలిగి, దాదాపు దృష్టి సామర్థ్యం తక్కువతో మనుగడ సాగిస్తాయి.

జాతీయ జల జంతువుకు సమస్యలు..

- ఆనకట్టల నిర్మాణం.
- డాల్ఫిన్లను వాటి మాంసం, బ్లబ్బర్ (మందపాటి కొవ్వు పొర) కోసం వేటాడుతున్నారు. వాటి నుంచి నూనెలు తీసి చేపలు పట్టడానికి ఎరగా ఉపయోగిస్తున్నారు.
- చేపల వేట తీగల్లో చిక్కుకుని కొన్ని మృత్యువాత పడుతున్నాయి.
- గత దశాబ్దంగా పుంజుకుంటున్న నది క్రూయిజ్ పర్యాటకం. క్రూయిజ్‌ల నుంచి వచ్చే శబ్దాలను తట్టుకుని డాల్ఫిన్లు మనుగడ సాగించడం కష్టంగా మారుతోంది. చైనాలోని యాంగ్జీ నదిలో బైజీ డాల్ఫిన్ల విషయంలో ఇదే జరిగింది.
- దృష్టి సామర్థ్యం సరిగా లేకపోవడంతో ఈ డాల్ఫిన్లు నెమ్మదిగా ఈత కొడతాయి. ఫలితంగా పడవలను ఢీకొనే అవకాశం ఎక్కువగా ఉంటోంది.
- దేశ వన్యప్రాణుల చట్ట ప్రకారం డాల్ఫిన్లకు హాని తలపెడితే కఠిన శిక్షలు విధిస్తారు. ఫలితంగా వీటి మరణాలపై జాలరులకు సమాచారం తెలిసినప్పటికీ, కేసులకు భయపడి రిపోర్టు చేయడం లేదు.
- పునరుత్పత్తి చక్రం నెమ్మదిగానే ఉంటోంది. ఇవి 6–10 సంవత్సరాలకు మధ్య పరిపక్వం చెందుతున్నాయి. ప్రతి రెండు నుంచి మూడేళ్లకు ఒక జీవికి మాత్రమే జన్మనిస్తాయి.

ఊరటనిచ్చే అంశమే అయినా...

2009లో గంగా నది డాల్ఫిన్‌ల పరిరక్షణ ధ్యేయంగా కేంద్రం దీనిని జాతీయ జల జంతువుగా ప్రకటించింది. 2020లో సర్వే కార్యాచరణ ప్రణాళిక, 2024లో ప్రత్యేక పరిశోధనా కేంద్రం ఏర్పాటు వంటి చర్యలతో వాటి సంఖ్యను పునరుద్ధరించడంలో అడుగులు పడ్డాయి. ఒకప్పుడు 10 వేలు ఉండే డాల్ఫిన్ల సంఖ్య గత శతాబ్దంలో 2 వేలకు పడిపోయింది. అయితే వాటి ప్రస్తుత సంఖ్య కొంత ఊరటనిస్తోంది. వాటి మనుగడ ప్రశ్నార్థకమే ఇప్పుడు సమస్య.

2021 నుంచి 10 రాష్ట్రాల్లో 8,507 కిలోమీటర్ల పొడవున 28 నదుల్లో పడవల ద్వారా, 30 నదుల్లో రోడ్డుమార్గం ద్వారా చేపట్టిన సర్వే వివరాలు రాష్ట్రాల వారీగా డాల్ఫిన్ల సంఖ్య

ఉత్తరప్రదేశ్	పంజాబ్	పశ్చిమ బెంగాల్
2,397	3	815
బిహార్	**అసోం**	**జార్ఖండ్**
2,220	635	162

రాజస్థాన్, మధ్యప్రదేశ్ **95**

2న చెన్నై-కోల్‌కతా హైవేపై ట్రాఫిక్ ఆంక్షలు

ప్రధాని పర్యటన నేపథ్యంలో పలు మార్గాల్లోకి వాహనాలు మళ్లింపు

సాక్షి, అమరావతి: ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన సందర్భంగా మే 2వ తేదీన చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై పోలీస్ శాఖ ట్రాఫిక్ ఆంక్షలు విధించింది. 2వ తేదీ ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

- చెన్నై నుంచి విజయవాడ మీదుగా విశాఖ, హైదరాబాద్ వెళ్లే వాహనాలను ప్రకాశం జిల్లా త్రోవగుంట నుంచి చీరాల, బాపట్ల, రేపల్లె, అవనిగడ్డ, గుడివాడ, హనుమాన్ జంక్షన్ మీదుగా మళ్లిస్తారు. విశాఖ నుంచి చెన్నై వైపు వెళ్లే వాహనాలను కూడా అదే మార్గంలో అనుమతిస్తారు.
- చిలకలూరిపేట నుంచి విశాఖ వైపు వెళ్లే వాహనాలను పెదనందిపాడు బ్రిడ్జి మీదుగా అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ వైపు మళ్లిస్తారు.
- గుంటూరు నుంచి విశాఖ వెళ్లే వాహనాలను బుడంపాడు క్రాస్ నుంచి తెనాలి, వేమూరు, కొల్లూరు, వెల్లటూరు జంక్షన్, పెనుమూడి బ్రిడ్జి, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ మీదుగా అనుమతిస్తారు.
- గన్నవరం నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలను ఆగిరిపల్లి, శోభనాపురం, గణపవరం, మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మీదుగా మళ్లిస్తారు.
- విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలను హనుమాన్ జంక్షన్ నుంచి నూజివీడు, మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మీదుగా అనుమతిస్తారు.
- మల్టీ యాక్సిల్ వాహనాలను 2వ తేదీ ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అనుమతించరు. చిలకలూరిపేట, ఒంగోలు, నెల్లూరు, హనుమాన్ జంక్షన్, పొట్టిపాడు టోల్‌గేట్ వద్ద నిలిపివేస్తారు. ఆ వాహనాలను మే 2వ తేదీ రాత్రి 9 గంటల తర్వాతే అనుమతించనున్నారు.

ప్రధాని పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి నారాయణ

తాడికొండ: ప్రధాని మోదీ అమరావతి పర్యటన ఏర్పాట్లను మంత్రి నారాయణ మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయి రాజధాని కట్టాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారని.. సింగపూర్ సహకారంతో మాస్టర్ ప్లాన్ రూపొందించామని తెలిపారు. మే 2వ తేదీ సాయంత్రం 3:20 గంటలకు ప్రధాని మోదీ అమరావతికి వస్తారని చెప్పారు. రాజధాని పునఃప్రారంభంతో పాటు రూ.43 వేల కోట్ల పనులను ప్రధాని ప్రారంభిస్తారని వెల్లడించారు. కాగా, ప్రధాని పర్యటన మార్గాలను రకరకాల పూల మొక్కలతో ముస్తాబు చేస్తున్నట్లు అమరావతి అభివృద్ధి సంస్థ అధికారులు తెలిపారు.



శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 65,904 మంది స్వామివారిని దర్శించుకోగా 24,487 మంది తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ. 3.53 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలలో వెళ్లాలని, కేటాయించిన సమయాన్ని కంటే ముందే వెళ్లిన భక్తులను క్యూలలో అనుమతించరని టీటీడీ స్పష్టం చేసింది.

గణనాథుని సేవలో శ్రీలంక మాజీ అధ్యక్షుడు

కాణిపాకం: శ్రీలంక మాజీ అధ్యక్షుడు గోటబయ రాజపక్స మంగళవారం చిత్తూరు జిల్లా కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. స్వామి వారి ప్రత్యేక దర్శనం చేయించారు. ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనాలు చేశారు. ఆలయ ఏఈవో రవీంద్ర ఆయన చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

మద్దిలో విశేష పూజలు

జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెంలోని మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. విశేష అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానానికి సేవలు, విరాళాల రూపంలో రూ.1,73,139 సమకూరినట్టు ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు.

ఉర్సా కంపెనీకి భూ కేటాయింపు రద్దు చేయాలి



విశాఖ రూరల్ తహశీల్దారు కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఆరిలోవ (విశాఖ): ఉర్సా కంపెనీకి కూటమి ప్రభుత్వం చేసిన భూ కేటాయింపుల్ని వెంటనే రద్దు చేయాలని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్ డిమాండ్ చేశారు. ఉర్సా కంపెనీకి కూటమి ప్రభుత్వం ఎకరా 99 పైసలు చొప్పున 59.6 ఎకరాలు భూమిని కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఎం మద్దిలపాలెం జోన్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేపట్టారు. ఆ భూ కేటాయింపు రద్దు చేయాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దారు రాజేష్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం కుమార్ మీడియాతో మాట్లాడుతూ..ఉర్సా అనేది కూటమి నాయకులకు బినామీ కంపెనీ అని తెలిపారు. విశాఖలో ఉన్న నిరు పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించడానికి భూములు లేవని చెబుతున్న కూటమి ప్రభుత్వం ఇలాంటి బోగస్ కంపెనీకి కాపులుప్పాడ ప్రాంతంలో రూ.వేల కోట్లు విలువచేసే 59.6 ఎకరాల భూమి కేటాయించడం ఆక్షేపణీయమన్నారు. ఆ భూములను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాలు ప్రారంభం

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటై 60 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా రెండు రోజులపాటు నిర్వహించనున్న వజ్రోత్సవాలను మంగళవారం ప్రారంభించారు. గుంటూరు శివారులోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలోని వర్సిటీలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు వజ్రోత్సవ పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఎన్జీరంగా విగ్రహావిష్కరణ చేశారు. విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వర్సిటీ రైతుల కోసం మరిన్ని వంగడాలను తయారు చేయాలని సూచించారు. ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మిదేవి సాంకేతిక సదస్సును ప్రారంభించి విశ్వవిద్యాలయ ప్రగతిని వివరించారు. కేంద్ర



వర్సిటీ వజ్రోత్సవ పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కె.అచ్చెన్నాయుడు

ప్రభుత్వ ప్రతినిధి ప్రొఫెసర్ విజయ్‌పాల్‌శర్మ, రైతు సాధికార సంస్థ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్, అగ్రిమిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాస్ నూతన వంగడాలు, పరిశోధనలపై చర్చించారు. సాంకేతిక నిపుణులు పలు అంశాలపై ప్రసంగించారు. మాజీ ఉపకులపతి డాక్టర్ పి.రాఘవరెడ్డి మాట్లాడుతూ 1964 నుంచి నేటి వరకూ విశ్వవిద్యాలయం సాధించిన అభివృద్ధి, కృషిని అభినందించారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు, పరిశోధన సంచాలకుడు డాక్టర్ పీవి సత్యనారాయణ, విస్తరణ సంచాలకుడు డాక్టర్ జి. శివన్నారాయణ అతిథులను శాలువాలతో సత్కరించారు. విశ్వవిద్యాలయం 60 ఏళ్ళలో సాధించిన ప్రగతికి నిదర్శనంగా ఏర్పాటు చేసిన 150 పరిశోధన, వంగడాలు, ఇతర స్టాళ్లు రైతులు, సందర్శకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే బి.రామాంజనేయులు, రైతులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, పాలక మండలి సభ్యులు, శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.




మే నెలలో అరుదుగా పుష్పించే మే పుష్పం ముందుగానే వికసించి కనువిందు చేస్తోంది. **పశ్చిమగోదావరి జిల్లా** భీమవరంలోని శివరావుపేటలో **నిమ్మలూరి శ్రీనివాస్ ఇంట్లో ఉన్న మొక్కకు** మే పుష్పాలు ముందే వికసించి ఆకట్టుకుంటున్నాయి. - భీమవరం



మల్టీ వర్పస్ క్లీనింగ్‌కు ఉపయోగించే రూ.25 లక్షల విలువైన రైడ్ ఆన్ **స్వీపర్ మెషీన్ మంగళవారం టీటీడీకి** విరాళంగా అందింది. శ్రీవారి **ఆలయం ముందు అదనపు ఈవో** సి.హెచ్.వెంకయ్య చౌదరికి రోస్సరి ప్రొఫెషనల్ కంపెనీ ప్రతినిధులు దీన్ని అందజేశారు. - తిరుమల

మహిళా వర్సిటీలో ఎన్ఎస్ఎస్ అవార్డుల ప్రదానం

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్‌లో ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లకు, ప్రోగ్రాం ఆఫీసర్లకు మంగళవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్ రజని చేతుల మీదుగా అవార్డులను, పశంసాపత్రాలను అందజేశారు. బెస్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ అవార్డు డాక్టర్.యువ, డాక్టర్ పద్మ, బెస్ట్ యూనిట్ అవార్డు డాక్టర్ వజీహాభాను, డాక్టర్ కే.రుక్మిణి, బెస్ట్ పీఓ సెకండ్ రన్నరప్‌గా డాక్టర్ హేమావతి, డాక్టర్ భారతి, అప్రిషియేషన్ అవార్డును డాక్టర్ అనిత అందుకున్నారు. అలాగే యూనివర్సిటీ బెస్ట్ వలంటీర్‌గా ఎం.రమ్యకు, 22మంది వలంటీర్లకు అప్రిసియేషన్ అవార్డులు అందజేశారు.



క్యాంపస్ డ్రైవ్‌లో 65 మందికి ఉద్యోగాలు

తిరుపతి సిటీ : ఎస్వీ వెటర్నరీ కళాశాలలో నాలుగు రోజులుగా నిర్వహించిన స్పెషల్ క్యాంపస్ డ్రైవ్‌లో 65 మంది విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చినట్లు అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతిరామయ్య తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మన రాష్ట్రంతోపాటు బెంగళూరు, తమిళనాడుకు చెందిన పలు డెయిరీ, పౌల్ట్రీ, పెట్ క్లినిక్, అంబులేటరీ క్లినిక్, మీట్ ఇండస్ట్రీస్ కంపెనీల ప్రతినిధులు క్యాంపస్ డ్రైవ్‌కు వచ్చినట్లు వెల్లడించారు. 135 ఉద్యోగాల కోసం నిర్వహించిన ప్రాంగణ ఎంపిక నిర్వహించినట్లు వివరించారు.

రేపటి నుంచి పీజీ కళాశాలలకు సెలవులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ, పద్మావతి మహిళా వర్సిటీ పీజీ కళాశాలలకు గురువారం నుంచి జూన్ 15వరకు సమ్మర్ సెలవులను ప్రకటిస్తూ మంగళవారం అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 16న యధావిధిగా కళాశాలలు ప్రారంభమవుతాయని తెలిపారు.

సాగుబడి

భరణి కార్తె: 27 నుంచి

పాత పంట
రక్తశాలి

రక్తశాలి అద్భుతమైన అధిక పోషక, ఔషధ గుణాలున్న పురాతన వరి వంగడం. పేరుకు తగ్గట్టే ముదురు ఎరుపు రంగులో ఉంటుంది రక్తశాలి బియ్యపు గింజ. అంతేకాదు, రక్తహీనతను పారదోలటంతో పాటు రక్తం తగ్గిపోకుండా స్థిరీకరించగలిగిన అద్భుత గుణం రక్తశాలి సొంతం. రక్తహీనతకు గురయ్యే మహిళలకు ఇది చక్కటి ఆరోగ్యవంతమైన పరిష్కారం. ముడి రక్తశాలి బియ్యం తింటే రక్తంలో చక్కెర స్థాయి నియంత్రణలో ఉంటుంది. చాలా రకాల వరి బియ్యంలో ఉన్నట్లు ఇందులో గ్లుటెన్ లేదు. గ్లుటెన్ ఇన్‌టాలరెన్స్ / సెలియక్ వంటి ఆరోగ్య సమస్యలున్న వారికి ఇది వరం.

మరో విశేషం ఏమిటంటే...
ఇది కండగల ఎర్ర నేలల్లో వర్షాధారంగా, సేంద్రియంగా సాగుకు అనువైనది. అయితే, దిగుబడి తక్కువ. కేవలం మహిళల ఆరోగ్యం కోసమైనా దీన్ని తిరిగి మన పంట పొలాల్లోకి, మన వంటిళ్లలోకి, పళ్లాలోకి తెచ్చుకోవటం అత్యవసరం.

దిగుబడి పెంచే పరిశోధనలు చేపట్టాలి. అయితే, ఔషధ గుణాలు పోకుండా చూడాలి. రక్తశాలి సాగును ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయ పథకాల ద్వారా ప్రత్యేక ప్రోత్సాహాలు ఇచ్చి ప్రోత్సహించాలి. ప్రత్యేక బ్రాండ్‌ను క్రియేట్ చేసి రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, సహకార సంఘాల ద్వారా నేరుగా దేశంలో మహిళలందరికీ అందేలా చెయ్యాలి!



రక్తశాలి బియ్యం దాని ప్రత్యేకమైన ఎరుపు రంగు, గొప్ప పోషక లక్షణాలకు ప్రసిద్ధి చెందింది. ఆరోగ్యాభిలాషులైన వినియోగదారులకు దీని విలువ తెలుసు. సాంప్రదాయకంగా దీన్ని కేరళలోని వయనాడ్ జిల్లాలోని సహజమైన, జీవవైవిధ్య వాతావరణంలో పెంచుతారు. ఇది తరచుగా ఈ ప్రాంతపు వ్యవసాయ వారసత్వానికి చిహ్నంగా చెబుతుంటారు. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో కూడా కొందరు ప్రకృతి వ్యవసాయదారులు పండిస్తున్నారు. రక్తశాలి అనే పేరు సంస్కృత పదం నుంచి వచ్చింది. 'రక్త' అంటే రక్తం. 'శాలి' అంటే బియ్యం. రక్తశాలి జిగురు లేనిది. గ్లూటెన్ సెన్సిటివ్ వ్యక్తులకు అనుకూలంగా ఉంటుంది. దాని అధిక పోషక, ఔషధ లక్షణాల కారణంగా ఆరోగ్య ప్రయోజనాభిలాషులకు ఇది చాలా విలువైనది.

విశేష పోషకాలు

రక్తశాలి పోషకాలతో కూడిన ఆహారం. వంద గ్రాముల ముడి బియ్యం.. 363.49 కిలో కేలరీల శక్తిని అందిస్తుంది. ప్రోటీన్ (8.96 గ్రా.), పిండి పదార్థం (71.18 గ్రా.), కొవ్వు (4.77 గ్రా.), జింక్ 15.75 మి.గ్రా., ఐరన్ (0.99 మి.గ్రా.) కలిగి ఉంటుంది. ఈ బియ్యాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఈ కింది ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయని కేరళ వ్యవసాయ విశ్వవిద్యాల నిపుణులు చెబుతున్నారు.

రక్తశాలి బియ్యాన్ని పాలిష్ చేయకుండా ముడి బియ్యం వండుకొని తింటారు. ఇది ముఖ్యంగా రక్తహీనత ఉన్న మహిళలకు ఎంతో ఉపయోగకరం. ఎందుకంటే ఇది రక్త కణాల ఉత్పత్తికి సహాయపడుతుంది. దీన్ని ఆహారంగా తీసుకుంటుంటే రక్తం హెచ్చుతగ్గులను స్థిరంగా ఉంచుకోవడానికి సహాయపడుతుంది. బలమైన రోగనిరోధక వ్యవస్థకు దోహదం చేస్తుంది.

అంకితభావంతో కూడిన సేంద్రియ/ప్రకృతి రైతుల సంరక్షణలో సాగవుతున్న అరుదైన రకాల్లో ఇదొకటి. ఆయుర్వేదంలో శరీర త్రిదోషాల(వాత, పిత్త, కఫ) సమతుల్యం చేయగలదన్న గుర్తింపు పొందింది. కాలేయం, మూత్రపిండాలు, నాడీ రుగ్మతలతో సహా వివిధ ఆరోగ్య సమస్యలను పరిష్కరిస్తుందని, క్యాన్సర్ నిరోధక లక్షణాలను కలిగి ఉంటుందని నమ్ముతారు. అంతేకాదు, ఇది రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచడానికి ఆరోగ్య సంరక్షణ నిపుణులు దీన్ని సిఫార్సు చేస్తున్నారు.

110 రోజుల ఖరీఫ్ పంట

రక్తశాలి వరి పంట ప్రధానంగా కేరళలో వర్షాధార వ్యవసాయంలో సాగవుతోంది. సేంద్రియ పద్ధతుల్లో, పర్యావరణహిత పద్ధతుల్లో సాగు చేస్తున్నారు. జూన్/జూలై నుండి నవంబర్/డిసెంబర్ వరకు 'శాలి' సీజన్‌లో పండిస్తారు. దాదాపు 110 రోజుల పంట. జాగ్రత్తగా నీటి నిర్వహణ అవసరం. అయితే, అననుకూల వాతావరణ పరిస్థితులను తట్టుకొని దిగుబడినిస్తుంది. సారవంతమైన ఎర్ర ఒండ్రు నేలల్లో రక్తశాలి వరి బాగా పెరుగుతుంది. తగినంత వర్షపాతంతో కూడిన ఉష్ణమండల తేమ వాతావరణం దీనికి అనువైనది. అధిక నాణ్యత గల స్థానికంగా సాగయ్యే రక్తశాలి విత్తనాలను ఎంచుకుంటే మంచి దిగుబడి రావటంతో పాటు తెగుళ్ళు, పురుగుల బెడద ఉండదు.

ఔషధ విలువలు, పోషకాల కారణంగా రక్తశాలి బియ్యానికి మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉంటుంది. అయినప్పటికీ, దీని సాగు విస్తృతం కాకపోవటానికి అనేక సవాళ్లు ఆటకంగా ఉన్నాయి.

రక్తశాలి సాగు, వినియోగం పెరగడానికి ఎదురవుతున్న సవాళ్లు...

- ఈ సవాళ్లలో నాణ్యమైన విత్తనాల లభ్యత ఒకటి. విత్తన బ్యాంకులు లేదా కమ్యూనిటీ విత్తన నిధుల ఏర్పాటు ద్వారా రక్తశాలి వంటి అపురూప దేశీ విత్తనాల లభ్యతను పెంచవచ్చు.
- ఖర్చులు తగ్గించడానికి, నాణ్యమైన విత్తనాలను అందించేందుకు రైతుల విత్తన సహకార సంఘాలను ప్రోత్సహించాలి.
- రక్తశాలి దిగుబడి ఇతర రకాలతో పోల్చితే తక్కువ. ఈ కారణంగా, సేంద్రియ వ్యవసాయంలో అధిక శ్రమ వల్ల సాగు ఖర్చులు పెరుగుతున్నాయి.
- ఈ సమస్యలను అధిగమించడానికి పోషక, ఔషధ గుణాలు పోకుండా చూసుకుంటూనే దిగుబడి పెంచేందుకు పరిశోధనలు చేపట్టాలి.
- సేంద్రియ బియ్యం నుంచి విలువ ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించడం, స్థానిక రైతులతో బృందాలను ఏర్పాటు చేయడం ద్వారా రైతుల ఆదాయం పెంచే ప్రయత్నం చెయ్యాలి.
- ఎక్కువ మంది రైతులు రక్తశాలి బియ్యాన్ని సాగు చేసి విక్రయించేలా ప్రోత్సాహకాలు లేదా సబ్సిడీలను అందించాలి. కొత్త సాగుదారులకు ఉత్తమ పద్ధతులపై శిక్షణ ఇవ్వాలి.
- పంట ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్ పనులను సహకార సంఘాలు లేదా రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేయడం లేదా అనుసంధానించడం ద్వారా సాగును విస్తరింపచేయవచ్చు.
- రక్తశాలి బియ్యంతో లభించే ఆరోగ్య ప్రయోజనాలు సాధారణ ప్రజలకు బాగా తెలియకపోవటం లేదా అర్థం చేసుకోకపోవటం వల్ల వినియోగం తక్కువగా ఉంది. సోషల్ మీడియా, స్థానిక ఆరోగ్య నిపుణులు లేదా పోషకాహార నిపుణులను ఉపయోగించి ఔషధ, పోషక ప్రయోజనాలను హైలైట్ చేస్తూ అవగాహన ప్రచారం ప్రారంభించడం అవసరం.
- వర్క్‌షాప్‌లు, సెమినార్లు లేదా స్థానిక సంతలు నిర్వహించాలి. స్వచ్ఛంద సంస్థలను ఈ దిశగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇవ్వాలి.
- స్థానిక వంటకాల్లో రక్తశాలి బియ్యాన్ని వాడేలా ప్రోత్సహించేలా వంటల ఉత్సవాలు నిర్వహించాలి. ఈ బియ్యంతో తయారు చేసిన సాంప్రదాయ వంటకాలను ప్రదర్శించే ఆహార ఉత్సవాలను నిర్వహించాలి.
- మార్కెటింగ్ గొలుసులను, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లను అన్వేషించడం ద్వారా మార్కెటింగ్‌ను మెరుగుపరచవచ్చు.
- రక్తశాలి బియ్యానికి సేంద్రియ ధృవీకరణ కల్పిస్తే సాగుదారులు ప్రీమియం మార్కెట్లలో అధిక ధర పొందేందుకు సహాయపడుతుంది.

ముగింపు

రక్తశాలి అనేది స్వదేశీ వరి రకం. ఔషధగుణాలు, పోషకాంశాలు సమృద్ధిగా ఉంటాయి. ఇది ఇప్పటికీ సాధారణ ప్రజలకు అంతగా తెలియదు. అందువల్ల ఆరోగ్య ప్రయోజనాలను ప్రచారం చేయాలి. రైతులు, పరిశోధకులు, విధాన రూపకర్తలు ఉమ్మడిగా పనిచేసి దీన్ని మళ్లీ వెలుగులోకి తేవాల్సిన అవసరం ఉంది.

ఆరోగ్య ప్రయోజనాలెన్నో

విటమిన్లు: మంచి ఆరోగ్యానికి అవసరమైన విటమిన్లు (బి విటమిన్లు వంటివి), ఖనిజాలు (ఇనుము, కాల్షియం, మెగ్నీషియం వంటివి) రక్తశాలి బియ్యంలో ఉన్నాయి.

అధిక ఫైబర్: రక్తశాలి బియ్యంలో పీచుపదార్థం సమృద్ధిగా ఉంటుంది. జీర్ణక్రియకు సహాయపడుతుంది. మలబద్ధకాన్ని నివారించడంలో తోడ్పడుతుంది. కడుపు నిండిన భావనను కలిగించటం ద్వారా శరీర బరువు నిర్వహణలో సహాయపడుతుంది.

యాంటీఆక్సిడెంట్లు: అధిక సాంద్రతలో ఎరుపు రంగు యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి. శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడిని, వాపును ఎదుర్కోవడంలో సహాయపడుతుంది.

తక్కువ గ్లైసెమిక్ సూచిక: ఇది తెల్ల బియ్యం కంటే తక్కువ గ్లైసెమిక్ సూచికను కలిగి ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించడానికి ఉపయోగపడుతుంది. డయాబెటిస్ లేదా ఇన్సులిన్ నిరోధకత ఉన్న వారికి ఇది ప్రయోజనకరంగా ఉంటుంది.

గుండె ఆరోగ్యం: ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడం, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడం ద్వారా గుండె ఆరోగ్యానికి దోహదం చేస్తాయి.

గ్లూటెన్-ఫ్రీ: గ్లూటెన్ అసహనం లేదా సెలియాక్ వ్యాధి ఉన్న వ్యక్తులకు ఇది ఒక గొప్ప వరం. సురక్షితమైన, పోషకాలతో కూడిన బియ్యం. యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు చర్మ ఆరోగ్యానికి దోహదం చేస్తాయి. వృద్ధాప్యపు ఛాయలు కనపడకుండా సహాయపడతాయి.

రోగనిరోధక శక్తి: రక్తశాలి బియ్యంలోని పోషకాలు రోగనిరోధక శక్తిని పెంచి వ్యాధులతో పోరాడే శక్తిని శరీరానికి ఇస్తాయి.

రక్త వృద్ధి: రక్తశాలి బియ్యం రక్త వృద్ధిని మెరుగుపరుస్తుంది. రక్తహీనత ఉన్న మహిళలకు వరప్రసాదం వంటిది. రక్తం స్థాయిని స్థిరీకరించడానికి లేదా నిలుపుకోవడానికి కూడా సహాయపడుతుంది. రక్తశాలి బియ్యం రక్తంలో చక్కెరను నిర్వహించడానికి సహాయపడుతుంది. బరువు తగ్గడానికి సహాయపడుతుంది.

జీవామృత కేంద్రానికి రూ. లక్ష

● బిఆర్‌సిల ఏర్పాటుపై మార్గదర్శకాలను విడుదల చేసిన కేంద్రం

ప్రకృతి వ్యవసాయానికి ఉపయోగపడే సేంద్రియ ఎరువులు, ద్రావణాలు, కషాయాలను ఏ రైతుకు ఆ రైతు స్వయంగా తయారు చేసుకోవటం చాలా కష్టసాధ్యమైన పని. నిన్నటి వరకు రసాయనిక వ్యవసాయంలో వాడే ఎరువులు, పురుగుమందులు వంటి ఉత్పాదకాల న్నిటినీ కొని వినియోగించడానికి అలవాటు పడిన రైతులు ఇప్పుడు అన్నీ ఎవరికి వారు తయారు చేసుకోవటం కష్టమే. ఈ ఇబ్బందిని అధిగమించకుండా ప్రకృతి సేద్యం విస్తరించడం అంత తేలిక కాదు. అందుకే ప్రకృతి సేద్యంలో వాడే ఘనజీవామృతం, జీవామృతం వంటి అన్ని రకాల ఉత్పాదకాలను తయారు చేసి విక్రయించేందుకు కేంద్ర ప్రభుత్వం బయో-ఇన్‌పుట్ రిసోర్స్ సెంటర్స్ (బిఆర్‌సిలు) ఏర్పాటు చేయిస్తోంది. వీటిని సులువుగా ఉండటం కోసం 'జీవామృత కేంద్రాలు' అని చెప్పుకుందాం. తొలి విడద దేశవ్యాప్తంగా 10 వేల బిఆర్‌సిలు ఏర్పాటు చేయాలని 2023-24 బడ్జెట్‌లోనే పేర్కొన్నారు. అయితే, వీటిని ఏర్పాటు చేయటానికి మార్గదర్శకాలను తాజాగా (ఏప్రిల్ 23న) విడుదల చేసింది. ఆ వివరాలు:

ప్రతి బిఆర్‌సి ఏర్పాటుకు రూ. లక్ష చొప్పున (రూ. 50 వేల చొప్పున రెండు విడతలుగా) ఆర్థిక సహాయం అందించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఈ మార్గదర్శకాల్లో పేర్కొంది. ఉత్పాదకాలను తయారు చేసి రైతులకు అందుబాటులోకి తేవటంతో పాటు వాటిని ఎలా ఉపయోగించాలో, ఎంత మోతాదులో వాడాలో కూడా ఈ జీవామృత కేంద్రాల నిర్వాహకులే రైతులకు తెలియజెప్పాల్సి ఉంటుంది.

బయో-ఇన్‌పుట్ రిసోర్స్ సెంటర్(బిఆర్‌సి) లను నెలకొల్పే వ్యక్తులు / సంస్థలు / బృందాలు మొదట తాము ప్రకృతి వ్యవసాయం చేస్తూ, ఈ ఉత్పాదకాలను వారు వాడుతున్న అనుభవం కలిగి ఉండాలి.

స్థానిక రైతుల అవసరాలకు, స్థానిక భూములకు తగిన, స్థానికంగా సాగయ్యే పంటల సరళికి అవసరమైన రీతిలో ద్రావణాలు, కషాయాలను తయారు చెయ్యాలి.

వీటి ధరలు స్థానిక చిన్న, సన్నకారు రైతులకు సైతం అందుబాటులో ఉండేలా చూసే బాధ్యత రాష్ట్ర స్థాయి ప్రకృతి సేద్య విభాగం, జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీలపై ఉంది.

బిఆర్‌సి ఏర్పాటు కోసం రూ. లక్షతో భూమిని, షెడ్డును, డ్రమ్ములు, ఇతరత్రా యంత్ర పరికరాలను సమకూర్చుకోవటం ఎలా సాధ్యమని నిపుణులు ప్రశ్నిస్తున్నారు.

తూతూ మంత్రంగా కాకుండా.. దీర్ఘకాలంపాటు బిఆర్‌సిలకు వెన్నుదన్నుగా ఉండేలా ప్రభుత్వం ఆలోచించినప్పుడే ఆశించిన ప్రయోజనం నెరవేరుతుందని నిపుణులు సూచిస్తున్నారు.



చిన్న బయోచార్ యూనిట్‌ను రూపొందించిన సిఐఎఇ

భూసారాన్ని పెంపొందించడంతో పాటు దీర్ఘకాలం పాటు ప్రభావం చూపటం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించటంలో ఉపయోగపడే బయోచార్ (కట్టెబొగ్గు) ఇటీవల కాలంలో బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. పత్తి కట్టె, కంది కట్టె, వరి పొట్టు వంటి పంట వ్యర్థాలతో ఒక ప్రత్యేక పద్ధతిలో దగ్ధం చేయటం ద్వారా బయోచార్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. అందుకు ఇప్పటికే అనేక రకాల యంత్ర పరికరాలు అందుబాటులో ఉన్నాయి. అయినా, చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగకరంగా ఉండే రొటేటింగ్ డ్రమ్ ఆటోథర్మల్ బయోచార్ యూనిట్‌ను భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలికి అనుబంధ సంస్థ, భోపాల్‌లోని కేంద్రీయ వ్యవసాయ ఇంజనీరింగ్ సంస్థ (ఐసిఎఆర్- సిఐఎఇ) రూపొందించింది. పేటెంట్ పొందిన ఈ యూనిట్ పంట వ్యర్థాలను బయోచార్‌గా మారుస్తుంది. వంద కిలోల కట్టెను వాడితే 20-35% కట్టె బొగ్గును అందించే సామర్థ్యంతో పనిచేస్తుంది. చిన్నది. ఎక్కడికైనా సులభంగా తీసుకెళ్లవచ్చు.

బయోచార్‌ను తయారు చేసే ప్రక్రియను పైరోలిసిస్ అంటారు. పైరోలిసిస్ ఛాంబర్‌తో పాటు రెండు సర్క్యులర్ బీమ్‌లు రెండు వైపులా ఉంటాయి. రొటేటింగ్ హేండిల్, చిమ్నీతోకూడిన గ్యాస్ అవుట్‌లెట్, మూతతో పాటు లోడింగ్ పోర్టు, వీటన్నిటినీ మోసే ఫ్రేమ్ ఉంటాయి.

ఈ బయోచార్ ఉత్పత్తి యూనిట్‌ను ఆరుబయట ఉంచి, దాంట్లో పైన ఉండే మూత తీసి పంట వ్యర్థాలను లోపల వెయ్యాలి. ఆ తర్వాత నిప్పంటించాలి. మంట చిన్నగా రగులుకుంటున్నప్పుడు ఎయిర్ బ్లోయర్ ద్వారా గాలిని సరఫరా చెయ్యాలి. ఈ ఛాంబర్ పైభాగాన ఉన్న గ్యాస్ అవుట్‌లెట్ ద్వారా మంట, పొగ బయటకు వస్తాయి.

బాగా ఎండబెట్టిన (తేమ సుమారు 10-15% ఉండే) పంట వ్యర్థాలను రియాక్టర్‌లోకి వెయ్యాలి. పూర్తిగా నింపెయ్యకుండా 80% వరకు వెయ్యాలి. రియాక్టర్ యూనిట్‌ను 3-4 సార్లు తిప్పటం ద్వారా మంట కట్టెకు అన్ని వైపులా పూర్తిగా మంట వ్యాపించేలా చెయ్యాలి. బయోచార్ 20 శాతం నుంచి 30% మధ్యలో లభిస్తుంది.

సామర్థ్యం: 1.2 క్యూబిక్ మీటర్లు (సుమారు 150 కిలోల పంట వ్యర్థాల ముక్కలు)

ధర: రూ. లక్ష + 18% జిఎస్‌టి.



వివరాలకు:
డాక్టర్ సందీప్ మండల్,
సీనియర్ సైంటిస్ట్,
ఐసిఎఆర్- సిఐఎఇ, భోపాల్,
భారత్.
మొబైల్: 97203 23421

మళ్లీ ఐపీవోల సందడి..!



- ప్రాస్పెక్టస్ దాఖలు చేసిన మరో 4 సంస్థలు
- లిస్టులో అర్బన్ కంపెనీ, కెనరా రోబెకో
- రూ. 1,700 కోట్ల సమీకరణలో ప్రెస్టిజ్ హాస్పిటాలిటీ

న్యూఢిల్లీ: టారిఫ్‌లపరమైన అనిశ్చితితో ఈక్విటీ మార్కెట్లలో ఒడిదుడుకులు నెలకొన్నప్పటికీ మరిన్ని కంపెనీలు పబ్లిక్ ఇష్యూ సన్నాహాలు చేసుకుంటున్నాయి. తాజాగా రియల్టీ దిగ్గజం ప్రెస్టీజ్ ఎస్టేట్స్ ప్రాజెక్ట్స్‌లో భాగమైన ప్రెస్టీజ్ హాస్పిటాలిటీ వెంచర్స్, కెనరా రోబెకో అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ, కెనరా హెచ్‌ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్, అర్బన్ కంపెనీ తమ ముసాయిదా పత్రాలను (డీఆర్‌హెచ్‌పీ) మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి సమర్పించాయి. డీఆర్‌హెచ్‌పీ ప్రకారం ప్రెస్టీజ్ హాస్పిటాలిటీ వెంచర్స్, పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ. 1,700 కోట్లు సమీకరించనుంది. ఇందులో రూ. 1,000 కోట్ల వరకు విలువ చేసే షేర్లను ఆఫర్ ఫర్ సేల్ విధానంలో ప్రమోటర్ సెల్లింగ్ షేర్‌హోల్డరయిన ప్రెస్టీజ్ ఎస్టేట్స్ ప్రాజెక్ట్స్ విక్రయించనుంది. దేశీయంగా దిగ్గజ రియల్ ఎస్టేట్ డెవలపర్లలో ఒకటైన ప్రెస్టీజ్ ఎస్టేట్స్ .. బెంగళూరు కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. హౌసింగ్, ఆఫీస్, రిటైల్, హోటల్ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తోంది. 2024 డిసెంబర్ 31 నాటికి కంపెనీ పోర్ట్‌ఫోలియోలో 1,445 గదులతో ఏడు హోటల్స్ ఉన్నాయి. వీటిలో 1,255 గదుల ప్రాజెక్టులు ఇప్పటికే నిర్వహణలో ఉండగా, 190 గదుల ప్రాపర్టీ ప్రస్తుతం రెనోవేషన్‌లో ఉంది. అదనంగా 951 గదులకు సంబంధించి మూడు హాస్పిటాలిటీ అసెట్స్ నిర్మాణం కొనసాగుతోంది.

ఓఎఫ్‌ఎస్‌గా కెనరా రోబెకో..

కెనరా రోబెకో అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ కూడా ఐపీవోకి సంబంధించి ప్రాస్పెక్టస్‌ను సెబీకి సమర్పించింది. ఇది పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్) రూపంలో ఉండనుంది. ప్రమోటర్ సంస్థలు కెనరా బ్యాంక్, ఓరిక్స్ కార్పొరేషన్ (గతంలో రోబెకో గ్రూప్ ఎన్‌వీ) వరుసగా 2.59 కోట్లు, 2.39 కోట్ల షేర్లను విక్రయించనున్నాయి. ఇందులో కెనరా బ్యాంకునకు 51 శాతం వాటాలు ఉండగా, మిగతావి ఓరిక్స్ కార్పొరేషన్‌కి ఉన్నాయి. పూర్తిగా ఓఎఫ్‌ఎస్ రూపంలో ఉండటం వల్ల ఇష్యూ ద్వారా సమీకరించే నిధులేవీ కంపెనీకి దక్కవు. కెనరా రోబెకో అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ 1993లో ఏర్పాటైంది. ప్రధానంగా మ్యుచువల్ ఫండ్స్ నిర్వహణ, దేశీ ఈక్విటీలకు సంబంధించి పెట్టుబడుల సలహాల సేవలు అందిస్తోంది. గతేడాది డిసెంబర్ 31 నాటికి 12 ఈక్విటీ స్కీములు, 10 డెట్ పథకాలు, మూడు హైబ్రిడ్ స్కీములు కలిపి మొత్తం 25 స్కీములను నిర్వహిస్తోంది. ఈ ఇష్యూకి ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్, యాక్సిస్ క్యాపిటల్, జేఎం ఫైనాన్షియల్ సంస్థలు బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నాయి.

కెనరా హెచ్‌ఎస్‌బీసీ లైఫ్ లిస్టింగ్ బాట

కెనరా హెచ్‌ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. ఇటీవలే కెనరా రొబెకో అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ(ఏఎంసీ) ఐపీవో చేపట్టేందుకు సెబీకి దరఖాస్తు చేసిన సంగతి తెలిసిందే. కెనరా రొబెకో ఏఎంసీ తరహాలోనే కెనరా హెచ్‌ఎస్‌బీసీ లైఫ్ సైతం ఆఫర్ ఫర్ సేల్ ద్వారా ప్రమోటర్లు, ప్రస్తుత ఇన్వెస్టర్ 23.75 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. వీటిలో కెనరా బ్యాంక్ 13.77 కోట్ల షేర్లు, హెచ్‌ఎస్‌బీసీ ఇన్సూరెన్స్(ఆసియా పసిఫిక్) హోల్డింగ్స్ 47.5 లక్షల షేర్లు చొప్పున ఆఫర్ చేస్తున్నాయి. ఈ బాటలో పీఎస్‌యూ పంజాబ్ నేషనల్ బ్యాంక్ 9.5 కోట్ల షేర్లు విక్రయించనుంది. కెనరా హెచ్‌ఎస్‌బీసీ లైఫ్‌ను 51 శాతం వాటాతో కెనరా బ్యాంక్, 26 శాతం వాటాతో హెచ్‌ఎస్‌బీసీ ఇన్సూరెన్స్(ఆసియా పసిఫిక్) హోల్డింగ్స్ భాగస్వామ్య సంస్థ(జేవీ)గా 2007లో ఏర్పాటు చేశాయి.

అర్బన్ కంపెనీ.. రూ. 1,900 కోట్లు

యాప్ ఆధారిత బ్యూటీ, హోమ్ కేర్ సర్వీసుల సంస్థ అర్బన్ కంపెనీ తాజాగా పబ్లిక్ ఇష్యూకి రానుంది. ఇందుకు సంబంధించి మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) దాఖలు చేసింది. ఈ ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 1,900 కోట్లు సమీకరించనుంది. ఇందులో భాగంగా రూ. 429 కోట్ల విలువ చేసే షేర్లను తాజాగా జారీ చేయనుండగా, ఆఫర్ ఫర్ సేల్ విధానంలో ప్రస్తుత ఇన్వెస్టర్లు రూ. 1,471 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించనున్నారు. ఇందులో యాక్సెల్ ఇండియా, ఎలివేషన్ క్యాపిటల్, బెస్సీమర్ ఇండియా క్యాపిటల్ హోల్డింగ్స్ టూ, ఇంటర్నెట్ ఫండ్ ఫైవ్, వీవైసీ11 మొదలైనవి ఉన్నాయి. ఐపీవో ద్వారా సమీకరించే నిధుల్లో రూ. 190 కోట్లను కొత్త టెక్నాలజీ, క్లౌడ్ మౌలిక సదుపాయాలపై, రూ. 70 కోట్ల మొత్తాన్ని ఆఫీసుల లీజుల చెల్లింపుల కోసం, రూ. 80 కోట్లు మార్కెటింగ్ కార్యకలాపాల కోసం, మిగతాది కార్పొరేట్ అవసరాల కోసం కంపెనీ వినియోగించుకోనుంది.

ట్రావెల్ ఫుడ్.. రూ. 2,000 కోట్ల సమీకరణకు రెడీ



క్విక్ సర్వీసు రెస్టారెంట్లు(క్యూఎస్‌ఆర్), వివిధ విమానాశ్రయాలలో లాంజ్ బిజినెస్ నిర్వహించే ట్రావెల్ ఫుడ్ సర్వీసెస్ పబ్లిక్ ఇష్యూకి రానుంది. ఇందుకు తాజాగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఐపీవోలో భాగంగా కంపెనీ రూ. 2,000 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్ కపూర్ కుటుంబ ట్రస్ట్ విక్రయానికి ఉంచనుంది. వెరసి ఐపీవో ద్వారా కంపెనీకి ఎలాంటి నిధులు లభించబోవు. వీటిని ప్రమోటర్లు అందుకోనున్నారు. కాగా.. 2024 డిసెంబర్‌లో ట్రావెల్ ఫుడ్ సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. 2009లో తొలి క్యూఎస్‌ఆర్ ఔట్‌లెట్ ప్రారంభించిన కంపెనీ ప్రస్తుతం దేశీయంగా హైదరాబాద్, ముంబై, కోల్‌కతాసహా 14 ఎయిర్‌పోర్టులలో విస్తరించింది. మలేసియాలోనూ మూడు విమానాశ్రయాలలో సర్వీసులు అందిస్తోంది. సొంత బ్రాండ్లతోపాటు.. దేశ, విదేశీ బ్రాండ్లతో విభిన్న పోర్ట్‌ఫోలియోను కలిగి ఉంది. లండన్‌లో లిస్టయిన ఎస్‌ఎస్‌పీ గ్రూప్, కపూర్ కుటుంబ ట్రస్ట్ కంపెనీని ఏర్పాటు చేశాయి.

ఫాక్స్‌కాన్ ఇండియా ఆదాయం రూ. 1.7 లక్షల కోట్లు



80 వేలకు ఉద్యోగుల సంఖ్య

న్యూఢిల్లీ: తైవాన్‌కి చెందిన ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఫాక్స్‌కాన్ భారత విభాగం ఆదాయం గత ఆర్థిక సంవత్సరంలో రెట్టింపై 20 బిలియన్ డాలర్లకు (సుమారు రూ. 1.7 లక్షల కోట్లు) చేరినట్లు సమాచారం. ఐఫోన్ విక్రయాలు గణనీయంగా పెరగడం ఇందుకు కారణమని సంబంధిత వర్గాలు తెలిపాయి. అలాగే, ఉద్యోగుల సంఖ్య కూడా 65 శాతం పెరిగి సుమారు 80,000కు చేరినట్లు పరిశ్రమ, ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. చైనాపై టారిఫ్‌ల కారణంగా అమెరికా మార్కెట్ కోసం ఐఫోన్లన్నింటినీ భారత్‌లోనే తయారు చేయించుకోవాలని యాపిల్ భావిస్తున్న నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఫాక్స్‌కాన్ ఆదాయం అనేక రెట్లు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నాయి. ఐఫోన్లను అత్యధికంగా తయారు చేసే ఫాక్స్‌కాన్, చైనాకు వెలుపల రెండో అతి పెద్ద ప్లాంటును బెంగళూరులో సుమారు రూ. 25,000 కోట్లతో ఏర్పాటు చేసే ప్రయత్నాల్లో ఉంది.

అక్షయ తృతీయ.. రూ.16,000 కోట్ల అమ్మకాలు

- జ్యుయలర్ల అసోసియేషన్ అంచనా
- మిశ్రమ ధోరణి ఉండొచ్చన్న సీఏఐటీ



న్యూఢిల్లీ: అక్షయ తృతీయ రోజున (నేడు) దేశవ్యాప్తంగా రూ.16,000 కోట్ల విలువైన ఆభరణాల అమ్మకాలు నమోదు కావొచ్చని ఆల్ ఇండియా జ్యుయలర్స్ అండ్ గోల్డ్‌స్మిత్ ఫెడరేషన్ అంచనా వేస్తోంది. ధరలు గణనీయంగా పెరిగిపోయిన నేపథ్యంలో బంగారం, వెండి కొనుగోళ్లలో మిశ్రమ ధోరణి ఉంటుందని అఖిల భారత రిటైల్ వర్తకుల సమాఖ్య (సీఏఐటీ) అంచనా వేసింది. ప్రస్తుతం బంగారం ధర 10 గ్రాములకు రూ.లక్ష స్థాయిలో ఉండగా, వెండి ధర సైతం కిలోకి రూ.లక్ష సమీపంలో ఉండడం గమనార్హం. గతేడాది అక్షయ తృతీయ నుంచి బంగారం ధర చెప్పుకోతగ్గ స్థాయిలో పెరిగిపోవడం తెలిసిందే. ''సాధారణంగా అక్షయ తృతీయ రోజున కొనుగోళ్లు పెరుగుతుంటాయి. ధరలు పెరిగిపోవడం ఈ ఏడాది వినియోగ డిమాండ్‌పై ప్రభావం చూపించొచ్చు. అక్షయ తృతీయ రోజున 12 టన్నుల బంగారం (రూ.12,000 కోట్లు), 400 టన్నుల వెండి (రూ.4,000 కోట్లు) కలిపి మొత్తం మీద రూ.16,000 కోట్ల అమ్మకాలు ఉండొచ్చని అంచనా''అని ఆల్ ఇండియా జ్యుయలర్స్ అండ్ గోల్డ్‌స్మిత్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ పంకజ్ అరోరా తెలిపారు. కస్టమర్ల కొనుగోళ్ల సెంటిమెంట్ కొంత తగ్గొచ్చన్నారు. అంతర్జాతీయంగా భౌగోళిక, వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో సురక్షిత సాధనంగా బంగారంలో పెట్టుబడులు పెరిగిపోవడం ధరల ర్యాలీకి కారణమని తెలిసిందే. ప్రస్తుతం వివాహాల సీజన్ నడుస్తుండడం జ్యుయలరీ డిమాండ్ పడిపోకుండా సాయపడుతున్నట్టు సీఏఐటీ నేషనల్ ప్రెసిడెంట్ బీసీ భార్తియా తెలిపారు. అక్షయ తృతీయ సందర్భంగా అమ్మకాలు పెంచుకునేందుకు ప్రముఖ జ్యుయలరీ సంస్థలు ధరలో, తయారీ చార్జీల్లో తగ్గింపును ఇప్పటికే ప్రకటించాయి.

మెరుగైన స్థితిలో భారత్

- ఇన్వెస్టర్లు దీర్ఘకాలంపాటు పెట్టుబడులు కొనసాగించాలి
- సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే



ముంబై: అంతర్జాతీయంగా ప్రతికూల పవనాలు వీస్తున్నప్పటికీ భారత్ కాస్త పటిష్టమైన స్థితిలోనే ఉందని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే తెలిపారు. మార్కెట్ ఒడిదుడుకులపై ఆందోళన చెందకుండా, ఇన్వెస్టర్లు దీర్ఘకాలంపాటు తమ పెట్టుబడులను కొనసాగించడం శ్రేయస్కరమని ఆయన సూచించారు. టారిఫ్‌ల యుద్ధం మార్కెట్లపై ప్రభావాలు చూపడం మొదలైనప్పటి నుంచి కూడా భారత్ దీటుగా ఎదురు నిలుస్తోందని పాండే చెప్పారు. స్థిరమైన ఆర్థిక వృద్ధి, తక్కువ స్థాయిలో ద్రవ్య లోటు, సముచిత స్థాయిలో విదేశీ రుణభారం, కరెంటు అకౌంటు లోటు అదుపులోనే ఉండటం మొదలైనవి దేశానికి సానుకూల అంశాలని ఆయన పేర్కొన్నారు. భారత్ పలు ద్వైపాక్షిక ఒప్పందాలపై కూడా చర్చలు జరుపుతోందని వివరించారు. ఇటీవల పెట్టుబడులు పెట్టిన చాలా మంది రిటైల్ ఇన్వెస్టర్లకు మార్కెట్ల పతనం గురించి పెద్దగా తెలియదు కాబట్టి, ప్రస్తుత పరిస్థితులను ఒక పాఠంగా భావించి, పెట్టుబడులను కొనసాగిస్తే దీర్ఘకాలంలో ప్రయోజనకరంగా ఉంటుందని పాండే చెప్పారు. రిటైల్ ఇన్వెస్టర్లు అన్ని వివరాలను తెలుసుకుని, పూర్తి అవగాహనతోనే ఇన్వెస్ట్ చేయాలని సూచించారు. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ట్రేడింగ్‌లో భారీ నష్టాలను ఉటంకిస్తూ.. మార్కెట్‌ను కేసినోగా భావించరాదని చెప్పారు. అధిక రాబడులు వస్తాయనే తప్పుడు హామీల వైపు ఆకర్షితులు కాకుండా వివేకవంతంగా వ్యవహరించాలని సూచించారు.

పెట్టుబడులు, వాణిజ్య అవకాశాలపై దృష్టి

భారత్-యూకే సీఈవోల సమావేశంలో గోయల్



లండన్: లండన్‌లో జరిగిన భారత్-యూకే బిజినెస్ రౌండ్‌టేబుల్ సమావేశంలో కేంద్ర వాణిజ్య మంత్రి గోయల్ పాల్గొన్నారు. రెండు రోజుల పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. భారత్‌లోని వివిధ రంగాల్లో ఉన్న పెట్టుబడుల అవకాశాలు, ఆవిష్కరణల ఆధారిత వృద్ధి, భారత్–బ్రిటన్ మధ్య మరింత విస్తృతమైన ద్వైపాక్షిక వాణిజ్య అవకాశాలనుఈ సందర్భంగా తెలియజేసినట్టు మంత్రి గోయల్ సమావేశం అనంతరం ప్రకటించారు. యూకే బిజినెస్, వాణిజ్య సెక్రటరీ జోనాథన్ రేనాల్డ్స్‌తోనూ మంత్రి సమావేశమై స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చించారు. భారత ఫిన్‌టెక్ రంగంలోని అవకాశాలు, ఆవిష్కరణలు, వృద్ధికి వీలుగా అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్యాలకు ఉన్న ప్రాధాన్యంపై అభిప్రాయాలను పంచుకున్నట్టు ఫిన్‌టెక్ దిగ్గజం రివోల్ట్ చైర్మన్ మార్టిన్ గిల్బర్ట్‌తో భేటీ తర్వాత గోయల్ పోస్ట్ చేశారు.

ప్యాసింజర్ వాహనాలు 50@ లక్షలు



- వృద్ధి నెమ్మదించినా వరుసగా నాలుగో ఏడాదీ రికార్డు అమ్మకాలు
- గ్రామీణ రికవరీతో ఎంట్రీ కార్లకు డిమాండ్
- 2025–26పై క్రిసిల్ రేటింగ్స్ అంచనాలు

న్యూఢిల్లీ: వార్షిక ప్రాతిపదికన వృద్ధి 2–4 శాతానికి పరిమితమైనా.. దేశీ, విదేశీ మార్కెట్లలో అమ్మకాల దన్నుతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్యాసింజర్ల వాహనాల విక్రయాలు 50 లక్షల మార్కును తాకే అవకాశం ఉందని క్రిసిల్ రేటింగ్స్ ఒక నివేదికలో వెల్లడించింది. తద్వారా వరుసగా నాలుగో ఏడాదీ రికార్డు అమ్మకాలు సాధించినట్లవుతుందని పేర్కొంది. సాధారణం కన్నా మెరుగైన వర్షపాతం ఉంటుందనే అంచనాలతో గ్రామీణ ప్రాంతాలు కోలుకుంటే ఎంట్రీ–స్థాయి కార్లకు డిమాండ్ మెరుగుపడొచ్చని వివరించింది. 'ప్యాసింజర్ వాహనాల వృద్ధి ఈ ఆర్థిక సంవత్సరం 2–4 శాతానికి పరిమితం కావచ్చు. కానీ, కొత్త ఉత్పత్తులతో యుటిలిటీ వాహనాల (యూవీ) వృద్ధి 10 శాతం స్థాయిలో దూసుకెళ్తుంది. మొత్తం అమ్మకాల పరిమాణంలోను, కొత్తగా వచ్చే మోడల్స్‌లోనూ యూవీల వాటా 68–70 శాతంగా ఉండనుంది' అని క్రిసిల్ రేటింగ్స్ సీనియర్ డైరెక్టర్ అనుజ్ సేథి తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం ప్యాసింజర్ వాహనాల అమ్మకాల్లో దేశీ మార్కెట్ వాటా 85 శాతంగా ఉండగా, మిగతా వాటా ఎగుమతులది ఉంది.

ఈవీల వృద్ధి 3.5 శాతానికి పరిమితం..

- కొత్త మోడల్స్ ప్రవేశపెట్టినా, బ్యాటరీ ఖరీదు తగ్గినా అధిక రేట్లు, ఒక మోస్తరు చార్జింగ్ మౌలిక సదుపాయాలు, రేంజ్ (మైలేజీ) పరమైన అనుమానాల కారణంగా ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) అమ్మకాల వృద్ధి 3–3.5 శాతానికి పరిమితం కావచ్చు. పట్టణ ప్రాంత యూజర్లు దీన్ని రెండో కారు కింద ఒక ఆప్షన్‌గా మాత్రమే పరిగణించవచ్చు. లో బేస్ కారణంగా గతేడాది ఈవీ సెగ్మెంట్ రెట్టింపయినప్పటికీ ఆ తర్వాత వృద్ధి నెమ్మదించింది.
- టెస్లా సహా గ్లోబల్ ఈవీ మోడల్స్ రావడం వల్ల ప్రీమియం సెగ్మెంట్లో పోటీ తీవ్రతరమవుతుంది. కస్టమర్ల అంచనాలు పెరిగిపోతాయి కాబట్టి దేశీ తయారీ సంస్థలు వేగవంతంగా కొత్త టెక్నాలజీలకు అప్‌గ్రేడ్ కావాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అయితే, ప్రస్తుతం భారీ టారిఫ్‌లు ఉన్నందున దిగుమతులు వెల్లువెత్తకపోవచ్చు.
- రాబోయే రోజుల్లో వడ్డీ రేట్ల తగ్గింపు వేగం, ఈవీల వినియోగం, సరఫరావ్యవస్థపరమైన షాక్‌లు మొదలైనవి చిప్‌లు, బ్యాటరీ సెల్స్ లభ్యతపై ప్రభావం చూపే అవకాశం ఉంది.
- అంతర్జాతీయంగా ప్రతికూల పరిస్థితుల కారణంగా ఎగుమతులు 5–7 శాతానికి నెమ్మదించవచ్చు. మొత్తం ప్యాసింజర్ వాహనాల అమ్మకాల్లో అమెరికా వాటా సుమారు 1 శాతమే కాబట్టి జూన్ నుంచి అమలయ్యే 25 శాతం టారిఫ్‌ల ప్రభావం పరిశ్రమపై పెద్దగా ఉండకపోవచ్చు. భౌగోళికరాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో వాహనాల కంపెనీలు ప్రత్యామ్నాయంగా మెక్సికో, గల్ఫ్ దేశాలు, దక్షిణాఫ్రికా, తూర్పు ఆసియా మార్కెట్లపై దృష్టి పెట్టొచ్చు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

30-4-2025

విశాఖ	435-00
చిత్తూరు	493-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	425-00
విజయవాడ	440-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	425-00
వరంగల్	427-00
రిటైల్ ధర	4.85

నిఫ్టీ 50 — టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TRENT	5,510.00	5.77
BEL	317.15	3.97
TECHM	1,495.00	2.29
RELIANCE	1,398.90	2.2
ETERNAL	231.16	1.74

నిఫ్టీ 50 — టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SUNPHARMA	1,800.20	-2.25
ULTRACEMCO	11,850.00	-2.18
COALINDIA	388.7	-2.13
ONGC	245.65	-1.98
DRREDDY	1,176.20	-1.88

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	7,652
ఎన్‌ఎస్‌ఈ	1,02,697
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	1,47,403
ఎఫ్‌ఐఐ	+ 2,386
డీఐఐ	+ 1,369

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	60.41 (రాత్రి 11.30కు)	$ 62.05 (క్రితం ముగింపు)
బ్రెంట్	63.28 (రాత్రి 11.30కు)	$ 64.79 (క్రితం ముగింపు)

మార్చి త్రైమాసిక ఫలితాలు

బీపీసీఎల్ లాభం నేలచూపు

- క్యూ4లో రూ. 3,214 కోట్లు
- షేరుకి రూ. 5 డివిడెండ్



న్యూఢిల్లీ: ఇంధన రంగ ప్రభుత్వ దిగ్గజం భారత్ పెట్రోలియం కార్పొరేషన్(బీపీసీఎల్) గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో స్టాండెలోన్ నికర లాభం 24 శాతం క్షీణించి రూ. 3,214 కోట్లకు పరిమితమైంది. ఎల్‌పీజీ విక్రయాలపై నష్టాలు, రిఫైనింగ్ మార్జిన్లు నీరసించడం ప్రభావం చూపింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 4,224 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 1.26 లక్షల కోట్లుగా నమోదైంది. వాటాదారులకు షేరుకి రూ. 5 చొప్పున డివిడెండ్ ప్రకటించింది.మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి బీపీసీఎల్ నికర లాభం సగానికి తగ్గి రూ. 13,275 కోట్లకు పరిమితమైంది. మొత్తం ఆదాయం రూ. 5 లక్షల కోట్లుగా నమోదైంది. ప్రతీ బ్యారల్ చమురు శుద్ధిపై 6.82 డాలర్లు ఆర్జించింది. క్యూ4లో 10.58 మిలియన్ టన్నులు(ఎంటీ), పూర్తి ఏడాదిలో 40.51 మిలియన్ టన్నుల చమురును ప్రాసెస్ చేసింది.

ఫలితాల నేపథ్యంలో బీపీసీఎల్ షేరు బీఎస్‌ఈలో 0.5 శాతం లాభంతో రూ. 312 వద్ద ముగిసింది.

అంబుజా సిమెంట్స్ లాభం ఓకే

- క్యూ4లో రూ. 1,282 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం అంబుజా సిమెంట్స్ గతేడాది(2024–25) చివరి త్రైమాసిక ఫలితాలు విడుదల చేసింది. జనవరి–మార్చి(క్యూ4)లో రూ. 1,282 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 1,521 కోట్ల లాభం సాధించింది. అదానీ గ్రూప్ కంపెనీ మొత్తం ఆదాయం సైతం రూ. 9,802 కోట్లను అధిగమించింది. 2023–24లో రూ. 8,785 కోట్ల ఆదాయం నమోదైంది. హైదరాబాద్ సంస్థ పెన్నా సిమెంట్ ఇండస్ట్రీస్, తమిళనాడులోని మైహోమ్ ఇండస్ట్రీస్‌సహా వివిధ కంపెనీల కొనుగోళ్ల నేపథ్యంలో ఫలితాలు పోల్చతగదని కంపెనీ పేర్కొంది. మొత్తం వ్యయాలు రూ. 8,822 కోట్లకు చేరాయి. ఇతర ఆదాయంతోపాటు మొత్తం టర్నోవర్ రూ. 10,462 కోట్లకు చేరింది. ఈ కాలంలో ఒక క్వార్టర్‌కు కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా 18.7 మిలియన్ టన్నుల అమ్మకాలు నమోదయ్యాయి. ఇక స్టాండెలోన్ నికర లాభం రూ. 929 కోట్లను తాకగా.. మొత్తం ఆదాయం రూ. 6,123 కోట్లను అధిగమించింది.

ఫలితాల నేపథ్యంలో అంబుజా షేరు బీఎస్‌ఈలో 2 శాతం క్షీణించి రూ. 534 వద్ద ముగిసింది.

బజాజ్ ఫిన్‌సర్వ్ లాభం అప్

- క్యూ4లో రూ. 2,417 కోట్లు
- షేరుకి రూ. 1 డివిడెండ్



న్యూఢిల్లీ: బజాజ్ గ్రూప్ ఫైనాన్షియల్ సర్వీసుల హోల్డింగ్ కంపెనీ బజాజ్ ఫిన్‌సర్వ్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 14 శాతం ఎగసి రూ. 2,417 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 2,119 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 32,042 కోట్ల నుంచి రూ. 35,596 కోట్లకు జంప్ చేసింది. వాటాదారులకు రూ. 1 ముఖ విలువగల ఒక్కో షేరుకి రూ. 1 చొప్పున డివిడెండ్ చెల్లించనుంది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 9 శాతం పుంజుకుని రూ. 8,872 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం రూ. 1,10,383 కోట్ల నుంచి రూ. 1,33,822 కోట్లకు బలపడింది.

ఫలితాల నేపథ్యంలో బజాజ్ ఫిన్‌సర్వ్ షేరు బీఎస్‌ఈలో 0.8% లాభంతో రూ. 2,065 వద్ద ముగిసింది.

సియట్ డివిడెండ్ రూ. 30

- క్యూ4 లాభం రూ. 99 కోట్లు




న్యూఢిల్లీ: టైర్ల తయారీ దిగ్గజం సియట్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 3 శాతం క్షీణించి రూ. 99 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 102 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 2,992 కోట్ల నుంచి రూ. 3,421 కోట్లకు బలపడింది. వాటాదారులకు షేరుకి రూ. 30 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి సియట్ నికర లాభం 26 శాతం క్షీణించి రూ. 471 కోట్లకు పరిమితమైంది. 2023–24లో రూ. 635 కోట్ల లాభం ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం రూ. 11,943 కోట్ల నుంచి రూ. 13,218 కోట్లకు ఎగసింది. వృద్ధికి వీలుగా ఈ కాలంలో సామర్థ్య విస్తరణపై రూ. 946 కోట్ల పెట్టుబడులు వెచ్చించింది.

ఫలితాల నేపథ్యంలో సియట్ షేరు బీఎస్‌ఈలో 0.5% లాభంతో రూ. 3,061 వద్ద ముగిసింది.

టాటా ట్రెంట్ నిరుత్సాహకర ఫలితాలు

- నికరలాభం 56% క్షీణత



ముంబై: టాటా గ్రూప్ రిటైల్ సంస్థ ట్రెంట్ గత ఆర్థిక సంవత్సరం(2024–25) మార్చి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలను నమోదు చేసింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన క్యూ4లో రూ. 311.60 కోట్లుగా నమోదైంది. 2023-24 చివరి త్రైమాసికంలో ప్రకటించిన రూ.712.09 కోట్లతో పోలిస్తే ఇది 56% తక్కువ. నిర్వహణ ఆదాయం రూ.3,298 కోట్ల నుంచి రూ.4,217 కోట్లకు బలపడింది. మొత్తం వ్యయాలు 26% వృద్ధి చెంది రూ.3,874 కోట్లకు చేరాయి. ఇతర ఆదాయాలతో కలిపి మొత్తం ఆదాయం 27% వృద్ధి చెంది రూ.4,291 కోట్లకు ఎగసింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం రూ. 1,477 కోట్ల నుంచి రూ. 1,534 కోట్లకు ఎగసింది. మొత్తం ఆదాయం 37% వృద్ధి చెంది రూ.17,353 కోట్లకు చేరింది.

ఫలితాల ప్రకటన నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 3% పెరిగి రూ. 5,380 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 6% దూసుకెళ్లి రూ.5,510 వద్ద గరిష్టాన్ని తాకింది.

అదానీ గ్రీన్ ఎనర్జీ లాభం అప్

- క్యూ4లో రూ. 383 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం అదానీ గ్రీన్ ఎనర్జీ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 26 శాతం జంప్‌చేసి రూ. 383 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 310 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2,841 కోట్ల నుంచి రూ. 3,278 కోట్లకు బలపడింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం రూ. 1,260 కోట్ల నుంచి రూ. 2,001 కోట్లకు ఎగసింది. మొత్తం ఆదాయం రూ. 10,521 కోట్ల నుంచి రూ. 12,422 కోట్లకు పుంజుకుంది. 2025 జులై 10 నుంచి వినీత్ ఎస్.జైన్‌ను ఎండీగా మరోసారి ఐదేళ్లపాటు బాధ్యతలు నిర్వర్తించేందుకు బోర్డు అనుమతించినట్లు కంపెనీ పేర్కొంది. రమీందర్ సింగ్ గుజ్రాల్‌ను రెండోసారి స్వతంత్ర డైరెక్టర్‌గా ఎంపిక చేసినట్లు వెల్లడించింది. 2025 జులై 10 నుంచి మూడేళ్లపాటు విధులు నిర్వర్తించనున్నట్లు తెలియజేసింది.

ఫలితాల నేపథ్యంలో అదానీ గ్రీన్ షేరు బీఎస్‌ఈలో 3 శాతం ఎగసి రూ. 940 వద్ద ముగిసింది.

కేపీఐటీ టెక్ లాభం హైజంప్

- క్యూ4లో రూ. 245 కోట్లు



న్యూఢిల్లీ: ఆటోమొబైల్ సంబంధ ఐటీ సేవల కంపెనీ కేపీఐటీ టెక్నాలజీస్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 49 శాతం జంప్‌చేసి రూ. 245 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 164 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 16 శాతం పుంజుకుని రూ. 1,528 కోట్లను దాటింది. అంతక్రితం క్యూ4లో రూ. 1,318 కోట్ల టర్నోవర్ సాధించింది. ఈ కాలంలో 28 కోట్ల డాలర్ల(రూ. 2,381 కోట్లు) విలువైన డీల్స్ కుదుర్చుకుంది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 41 శాతం ఎగసి రూ. 840 కోట్లను తాకింది. 2023–24లో కేవలం రూ. 595 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం 20 శాతం బలపడి రూ. 5,842 కోట్లను అధిగమించింది.

కేపీఐటీ టెక్ షేరు బీఎస్‌ఈలో 0.8 % లాభంతో రూ. 1,230 వద్ద ముగిసింది.

క్రికెట్ బ్యాట్ పట్టడం కూడా తెలియని వ్యక్తి నుంచి మొదలుకొని... ఆటలో తలపండిన మేధావుల వరకు ఎక్కడ చూసినా ఒకటే చర్చ! ఊరు, వాడా, పట్టణం, నగరం అనే తేడా లేకుండా ఎవరి నోట విన్నా ఒకే పేరు! 'ఏం కొట్టాడ్రా బాబు' అని సాధారణ అభిమానులు కొనియాడుతుంటే... ఫ్లిక్, లాఫ్ట్, పుల్ అంటూ విశ్లేషకులు అతడి షాట్లను వర్ణిస్తున్నారు. ఒక్క ఇన్నింగ్స్‌తో యావత్ ప్రపంచాన్ని తనవైపు తిప్పుకున్న ఆ కుర్రాడే... బిహార్‌కు చెందిన 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ. అంతర్జాతీయ స్థాయి క్రికెట్‌తో సరిసమానంగా ఒత్తిడి ఉండే ఐపీఎల్‌లో అతడు బాదిన బాదుడు క్రీడాలోకాన్ని నివ్వెరపరిచింది. అతని దూకుడుకు అపార అనుభవం ఉన్న బౌలర్లు సైతం స్కూలు కుర్రాళ్లలా కనిపించారనడంలో రవ్వంత అతిశయోక్తి లేదు. ఐపీఎల్‌లో ఎదుర్కొన్న తొలి బంతికే సిక్స్... మూడో ఇన్నింగ్స్‌లోనే రికార్డు సెంచరీ... మరో సచిన్ టెండూల్కర్ దొరికాడు అనే ప్రశంసలతో ఆ పాలబుగ్గల పసివాడు ప్రస్తుతానికి శిఖరమంత ఎత్తులో ఉన్నాడు!

ఇదంతా నాణేనికి ఒకవైపే! మన దేశంలో ఇలా ఒక్క ఇన్నింగ్స్‌తో సంచలనాలు రేకెత్తించిన వాళ్లు కోకొల్లలు. దేశవాళీ, అంతర్జాతీయ, ఐపీఎల్ వేదికలపై తళుక్కున మెరిసి... అంతే త్వరగా కనుమరుగై పోయిన వారికి కొదవే లేదు. అంచనాలకు మించి వచ్చే పేరు ప్రతిష్టలు... అవసరానికి మించి వచ్చి పడే డబ్బు ప్రవాహం... అప్పనంగా వచ్చే ప్రచార ఆర్భాటం ఇలా ఆటగాళ్ల దృష్టి మరల్చేవి ఎన్నో. పిన్న వయసులోనే విశేష గుర్తింపు తెచ్చుకొని ఆ తర్వాత సోదిలోనే లేకుండా పోయిన వాళ్లు ఎందరో! సదానంద్ విశ్వనాథ్, వినోద్ కాంబ్లీ, పృథ్వీ షా ఈ కోవలోకే వస్తారు. ప్రతిభకు క్రమశిక్షణ తోడైతేనే సుదీర్ఘ కాలం కెరీర్ కొనసాగించ గలం అని మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ నిరూపిస్తే... ఒక్కసారిగా వచ్చిన గుర్తింపుతో ఉక్కిరిబిక్కిరై కెరీర్‌ను నాశనం చేసుకున్న వాళ్లూ ఉన్నారు. వైభవ్ సూర్యవంశీ కూడా ఇలా 'ఏక్ దిన్ కా సుల్తాన్' కాకుండా ఉండాలంటే నిరంతర సాధన ముఖ్యమని మాజీలు సూచిస్తున్నారు. -సాక్షి క్రీడావిభాగం



ఈ 'వైభవం' కొనసాగాలి!

వైభవ్ సూర్యవంశీపై ప్రశంసల వర్షం

- క్రమశిక్షణ ముఖ్యమంటున్న విశ్లేషకులు
- ప్రతిభ ఒక్కటే సరిపోదని వ్యాఖ్యలు

వయసుకు మించిన పరిణతితో అతడు బంతిని బాదుతుంటే... యావత్ ప్రపంచం విస్మయానికి గురైంది! బౌలర్‌తో సంబంధం లేకుండా అతడు విరుచుకుపడుతుంటే... అభిమాన గణం మైమరిచి పోయింది! ముఖంపై పసితనపు ఛాయలు కూడా పోని ఆ చిన్నోడు చిందేస్తుంటే... క్రీడా లోకం తన్మయత్వానికి లోనైంది! ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్‌లో భాగంగా సోమవారం గుజరాత్ టైటాన్స్‌తో జైపూర్‌లో జరిగిన పోరులో రాజస్తాన్ రాయల్స్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ 35 బంతుల్లోనే సెంచరీ సాధించి రికార్డులు తిరగ రాశాడు. ఐపీఎల్‌లో అత్యంత వేగవంతమైన సెంచరీ చేసిన భారతీయుడిగా... ఓవరాల్‌గా టి20ల్లో ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన అత్యంత పిన్న వయస్కుడిగా చరిత్ర పుటల్లోకెక్కాడు. మొహమ్మద్ సిరాజ్, ఇషాంత్ శర్మ, ప్రసిధ్ కృష్ణ, వాషింగ్టన్ సుందర్ ఈ నలుగురు టీమిండియాకు ప్రాతినిధ్యం వహించిన వారే. ఇక టి20 లీగ్‌ల్లో రికార్డులు తిరగరాసే అఫ్గానిస్తాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ సరేసరి. ఇలాంటి బౌలర్లను ఎదుర్కొంటూ వైభవ్ సాగించిన ఊచకోత మాటలకందనిది! క్లాస్, మాస్, ఊరమాస్ ఇలా అతడి ఇన్నింగ్స్‌ను వర్ణించడానికి విశేషణాలు వెతుక్కోవాల్సిన పరిస్థితి. అతడి బాదుడుకు జైపూర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ స్టేడియం హోరెత్తింది. డగౌట్‌లో కూర్చున్న ప్రతి ఆటగాడు ఊగిపోతుంటే... మ్యాచ్ చూస్తున్న అభిమానులు బ్యాటింగ్ చేసేది తామే అన్నంతగా లీనమై పోయి ఆ 'బుడ్డోడి' ప్రతిభకు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు.

రాహుల్ ద్రవిడ్ చొరవతో...

ఐపీఎల్ ప్రారంభమైన మూడేళ్ల తర్వాత బిహార్‌లోని సమస్తీపూర్‌లో జన్మించిన వైభవ్... కఠోర సాధన, పట్టువదలని తత్వంతో అంచెలంచెలుగా ఎదుగుతూ ఈ స్థాయికి చేరుకున్నాడు. సహచరుడి తప్పిదం వల్ల రనౌట్ అయి బెంచ్‌మీద కూర్చొని వెక్కి వెక్కి ఏడుస్తున్న వైభవ్‌ను చూసిన వీవీఎస్ లక్ష్మణ్... అతడిలో ఆత్మవిశ్వాసం నింపి రాహుల్ ద్రవిడ్ దృష్టికి తీసుకెళ్లడంతో వైభవ్ దశ తిరిగింది. ప్రతిభాన్వేషణ సమయంలో బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్, రాజస్తాన్ టీమ్ మేనేజర్ రోమి... వైభవ్ షాట్ల ఎంపికకు ముగ్ధులయ్యారు. దీంతో వారు వైభవ్‌ను ద్రవిడ్‌కు పరిచయం చేయడంతో అతడి జీవితం మారిపోయింది. ప్రతిభను ప్రోత్సహించడంలో ముందుండే రాజస్తాన్ రాయల్స్ యాజమాన్యం గతేడాది ఐపీఎల్ వేలంలో రూ. 1 కోటీ 10 లక్షలకు వైభవ్‌ను కొనుగోలు చేసుకుంది. ద్రవిడ్ పర్యవేక్షణలో మరింత రాటుదేలిన వైభవ్... దాన్నే మైదానంలో చాటాడు. అప్పటికే భారత అండర్–19 జట్టుకు ఎంపికైన వైభవ్... గతేడాది జనవరిలోనే ముంబై జట్టుపై ఫస్ట్‌క్లాస్ అరంగేట్రం చేశాడు. నెట్స్‌లో తీవ్రంగా శ్రమించడం, కోచ్ చెప్పిన అంశాలను ఆచరణలో పెట్టడం. ఎంత కష్టాన్నైనా ఓర్చుకోవడం వంటి సానుకూల లక్షణాలు అతడిని మూడో మ్యాచ్‌లోనే సెంచరీ హీరోగా నిలిపాయి.



పొలం అమ్ముకున్న తండ్రి..

వైభవ్ విజయం వెనక... తాను సాధించలేకపోయిన దాన్ని కుమారుడైనా అందుకోవాలని తపన పడ్డ ఓ మధ్యతరగతి తండ్రి ఆశయం ఉంది. కుమారుడికి మెరుగైన శిక్షణ అందించేందుకు ఉన్న కాస్త పొలం అమ్ముకున్న ఆ తండ్రి ఇప్పుడు అత్యంత ఆనంద క్షణాలు అనుభవిస్తున్నాడు. గతంలో రాజస్తాన్ రాయల్స్ ఆటగాడు యూసుఫ్ పఠాన్ 37 బంతుల్లో సెంచరీ చేయగా... ఇప్పుడు ఈ ఎడంచేతి వాటం బ్యాటర్ 35 బంతుల్లోనే మూడంకెల స్కోరు చేసి కొత్త చరిత్ర లిఖించాడు. దీని వెనక రాయల్స్ యాజమాన్య ప్రోత్సాహం ఉందని వైభవ్ తండ్రి సంజీవ్ సూర్యవంశీ పేర్కొన్నాడు. 'వైభవ్ మెరుపుల వెనక బిహార్ క్రికెట్ సంఘం చీఫ్ రాకేశ్ తివారీ, రాజస్తాన్ రాయల్స్ జట్టు కృషి ఎంతో ఉంది. ఇక రాయల్స్ కోచ్ రాహుల్ ద్రవిడ్ గత మూడు, నాలుగు నెలలుగా పడ్డ కష్టానికి దక్కిన ఫలితమిది. వారికి జీవితాంతం రుణపడి ఉంటాం' అని సంజీవ్ అన్నాడు. అయితే ఈ మెరుపులు కేవలం ఒకటీ అరా మ్యాచ్‌లకు మాత్రమే పరిమితం కాకుండా ఉండాలంటే... ఇదే సాధన కొనసాగించాలని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పేరు, డబ్బు తలకెక్కనివ్వకుండా క్రమశిక్షణతో ముందుకు సాగితే దేశానికి సుదీర్ఘ కాలం ప్రాతినిధ్యం వహించ గల ప్రతిభావంతుడు లభించినట్లే!



అమ్మ, నాన్న కృషి వల్లే...

తొలి బంతికి సిక్స్ కొట్టడం నాకు పెద్ద విషయం కాదన్న వైభవ్... అమ్మానాన్న కృషి వల్లే ఈ స్థాయికి చేరుకున్నానని పేర్కొన్నాడు. 'నేను ఇప్పటికే భారత అండర్–19 జట్టుకు ప్రాతినిధ్యం వహించా. దేశవాళీల్లో తొలి బంతికి చాలాసార్లు సిక్స్ కొట్టా. మొదటి 10 బంతులు ఎదుర్కొనేటప్పుడు ఎలాంటి ఒత్తిడికి గురికాను. బంతి నా పరిధిలో ఉంటే దాన్ని బలంగా కొట్టాలనే చూస్తా. తల్లిదండ్రుల సహకారం లేకుంటే నేను లేను. నా కోసం వాళ్లు ఎంతగానో కష్టపడ్డారు. తెల్లవారుజామును 3 గంటలకే నిద్రలేచే మా అమ్మ... మళ్లీ నేను పడుకున్న తర్వాత ఏ 11 గంటలకో గానీ నిద్రపోదు. వారు అలా నా కోసం అన్నీ వదిలేసుకొని శ్రమించడం వల్లే నేను ఆటపై దృష్టి సారించగలిగా. నాన్న నా వెంట ఉండటం వల్లే మరింత స్వేచ్ఛగా ఆడుతున్నా. కష్టానికి ఫలితం ఉంటుందని రుజువైంది. వారి కష్టానికి ప్రతిఫలమే ఇది' అని వైభవ్ పేర్కొన్నాడు. మరో ఒకటీ రెండేళ్లలో వైభవ్ భారత టి20 జట్టులో చోటు దక్కించుకుంటాడని అతడి చిన్ననాటి కోచ్ మనీశ్ ఓఝా ఆశాభావం వ్యక్తం చేశాడు. 'కోచ్‌గా వైభవ్‌ను చూస్తే గర్వంగా ఉంది. బిహార్‌లో ఆటలకు పెద్దగా ఆదరణ ఉండదు. అలాంటి చోట నుంచి వచ్చి క్రికెట్‌పై తనదైన ముద్ర వేశాడు. ఇప్పుడు వైభవ్ ఎందరికో స్ఫూర్తి' అని మనీశ్ ఓఝా అన్నాడు.

రూ. 10 లక్షల నజరానా

ఐపీఎల్‌లో సెంచరీతో రికార్డు సృష్టించిన వైభవ్ సూర్యవంశీకి బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ భారీ నజరానా ప్రకటించారు. 14 ఏళ్ల వైభవ్‌కు రూ. 10 లక్షల నగదు బహుమతి ప్రకటించారు. 'గతేడాది వైభవ్‌తో మాట్లాడా. అతడిలో అపార ప్రతిభ ఉంది. తీవ్ర పోటీ ఉండే ఐపీఎల్‌లో 35 బంతుల్లో సెంచరీ చేయడం మామూలు విషయం కాదు. ఫోన్ ద్వారా అతడిని అభినందించా. రాష్ట్ర ప్రభుత్వం తరఫున వైభవ్ సూర్యవంశీకి రూ. 10 లక్షల నజరానా అందిస్తాం. భవిష్యత్తులోనూ అతడు ఇదే ఆటతీరు కొనసాగించాలని కోరుకుంటున్నాం. వైభవ్ దేశం తరఫున కూడా రాణించి పేరు ప్రఖ్యాతలు తీసుకొస్తాడని ఆశిస్తున్నాం' అని నితీశ్ ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు.

“

వైభవ్ ఆటతీరు చూస్తుంటే ముచ్చటేస్తోంది. అతడిలో భయం ఏ కోశాన కనిపించడం లేదు. బ్యాట్ వేగం, బంతిని అంచనా వేసే తీరు చాలా బాగున్నాయి. 38 బంతుల్లో 101 పరుగులు చేసిన వైభవ్ ఇన్నింగ్స్ ఆసాంతం అలరించింది.
-సచిన్ టెండూల్కర్

14 ఏళ్ల వయసులో మీరేం చేశారో గుర్తు చేసుకోండి. ఈ కుర్రాడు మాత్రం అంతర్జాతీయ బౌలర్ల భరతం పట్టాడు. భయమన్నదే లేకుండా బౌలర్లకు నిద్రలేని రాత్రి మిగిల్చాడు. భవిష్యత్తుపై మరింత భరోసా పెంచుతున్న ఇలాంటి ప్లేయర్లను చూస్తే గర్వంగా ఉంది. -యువరాజ్ సింగ్



షాద్‌మన్ సెంచరీ

బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్ 291/7

చట్టోగ్రామ్: ఓపెనింగ్ బ్యాటర్ షాద్‌మన్ ఇస్లామ్ (120; 16 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో కదం తొక్కాడు. ఫలితంగా జింబాబ్వేతో జరుగుతున్న రెండో టెస్టులో మంగళవారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి బంగ్లాదేశ్ జట్టు 87 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 291 పరుగులు చేసింది. షాద్‌మన్ కెరీర్‌లో అత్యుత్తమ స్కోరు నమోదు చేయగా... ముష్ఫికర్ రహీం (40; 4 ఫోర్లు, 1 సిక్స్), అనాముల్ హక్ (39; 4 ఫోర్లు), మోమినుల్ హక్ (33; 2 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ నజ్ముల్ షంటో (23; 3 ఫోర్లు, 1 సిక్స్) తలా కొన్ని పరుగులు చేశారు. జింబాబ్వే బౌలర్లలో వెస్సెంట్ మసెకెసా 3 వికెట్లు పడగొట్టగా... బ్లెస్సింగ్ ముజరబానీ, మసకద్జ, బెనెట్ తలా ఒక వికెట్ తీశారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 227/9తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన జింబాబ్వే... అదే స్కోరు వద్ద కేవలం ఒక్క బంతి మాత్రమే ఎదుర్కొని ఆలౌటైంది. బంగ్లా బౌలర్లలో తైజుల్ ఇస్లామ్ 6 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. ప్రస్తుతం చేతిలో 3 వికెట్లు ఉన్న బంగ్లాదేశ్ జట్టు 64 పరుగుల ఆధిక్యంలో ఉంది. మెహదీ హసన్ మిరాజ్ (16 బ్యాటింగ్), తైజుల్ ఇస్లామ్ (5 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

ఇంగ్లండ్ మహిళల జట్టు కొత్త కెప్టెన్‌గా సీవర్ బ్రంట్

లండన్: ఇంగ్లండ్ మహిళల క్రికెట్ జట్టుకు కొత్త సారథిగా ఆల్‌రౌండర్ నాట్ సీవర్ బ్రంట్ ఎంపికైంది. ఇటీవలి కాలంలో ఇంగ్లండ్ జట్టు స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోవడంతో నాయకత్వ మార్పు అనివార్యమైంది. తొమ్మిదేళ్లుగా హీథర్ నైట్ ఇంగ్లండ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తుండగా... గతేడాది టి20 ప్రపంచకప్‌లో ఆ జట్టు గ్రూప్ దశలోనే ఇంటిదారి పట్టింది. ఇక ఆస్ట్రేలియాతో మూడు ఫార్మాట్లలో కలిపి 16 మ్యాచ్‌లాడి ఒక్క దాంట్లోనూ విజయం సాధించలేకపోయింది. దీంతో ఇంగ్లండ్ వేల్స్ క్రికెట్ బోర్డు హీథర్ నైట్ స్థానంలో... మూడేళ్లుగా జట్టుకు వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న సీవర్ బ్రంట్‌కు పగ్గాలు అప్పగించింది. మూడు ఫార్మాట్లలోనూ బ్రంట్ జట్టును నడిపించనుంది. 'ఇంగ్లండ్ మహిళల క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా ఎంపికవడం గర్వంగా భావిస్తున్నా. జట్టును విజయవంతంగా నడిపించేందుకు నావంతు కృషి చేస్తా. మెరుగైన ప్రదర్శనతో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తాం' అని 32 ఏళ్ల బ్రంట్ పేర్కొంది. 2013లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన బ్రంట్... ఇంగ్లండ్ జాతీయ జట్టు తరఫున మూడు ఫార్మాట్లలో కలిపి 259 మ్యాచ్‌లాడింది. 2017లో ప్రపంచకప్ గెలిచిన జట్టులోనూ భాగంగా ఉంది. టెస్టుల్లో 46.47, వన్డేల్లో 45.91, టి20ల్లో 28.45 సగటుతో పరుగులు చేసిన బ్రంట్... మూడు ఫార్మాట్లలో కలిపి 181 వికెట్లు సైతం పడగొట్టింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి మహిళల వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో బ్రంట్ 3వ స్థానంలో ఉంది. మే 21 నుంచి వెస్టిండీస్‌తో ఇంగ్లండ్ జట్టు పరిమిత ఓవర్ల సిరీస్‌లు ఆడనుంది.



చరిత్రకెక్కిన లండన్ మారథాన్





లండన్: అందరు అనుకున్నట్లే లండన్ మారథాన్ పరుగు రికార్డు పుటలకెక్కింది. 42.195 కిలోమీటర్ల సుదీర్ఘ పరుగు దూరాన్ని మొత్తం 56,640 మంది రన్నర్లు పూర్తి చేశారు. తద్వారా గతేడాది న్యూయార్క్ మారథాన్ రికార్డు ఆరు నెలల్లోపే అటకెక్కింది. అయితే విశ్వఖ్యాతికెక్కిన ఈ రెండు మారథాన్‌లకు భారత టెక్ దిగ్గజ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) స్పాన్సర్‌గా వ్యవహరించింది. మారథాన్ ఏర్పాట్లు మొదలైనప్పటి నుంచి కనీసం 56,600 మంది ఫినిషింగ్ లైన్‌ను దాటేస్తారనే నిర్వాహకులు లెక్కలేశారు. ఆర్గనైజర్లు అనుకున్నట్లుగానే ఈ సంఖ్యను మించే మరో 40 మంది మారథాన్‌ను పూర్తి చేయడం విశేషం. న్యూయార్క్ సిటీలో జరిగిన ప్రతిష్టాత్మక మారథాన్‌లో పరుగుపెట్టిన వారిలో 55,646 మంది దిగ్విజయంగా పోటీని పూర్తిచేశారు. అప్పట్లో ఈ రికార్డు చరిత్రకెక్కింది. కానీ ఆరునెలల వ్యవధిలోనే ఈ చరిత్ర చెరిగిపోయింది.




2026 ఆసియా క్రీడల్లో మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్

న్యూఢిల్లీ: మనకు బాగా పరిచయమున్న మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ (ఎంఎంఏ) త్వరలోనే అంతర్జాతీయ క్రీడా వేదిక పోటీల్లో కనిపించనుంది. ఆసియా క్రీడల్లో ఎంఎంఏ నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. దీంతో ఇదివరకే ఏషియాడ్‌లో క్రీడాంశమైన క్రికెట్‌తో పాటు మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ కూడా పతకాల బరిలో ఉండనుంది. కోవిడ్ మహమ్మారి వల్ల ఏడాది ఆలస్యంగా 2023లో జరిగిన హాంగ్జౌ ఆసియా క్రీడల్లో భారత క్రికెట్ జట్లు మహిళల, పురుషుల విభాగాల్లో విజేతలుగా నిలిచాయి. వచ్చే ఏడాది జరిగే ఆసియా క్రీడలకు జపాన్ ఆతిథ్యమివ్వనుంది. నగోయా నగరంలో 2026 సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు ఈ పోటీలు జరుగుతాయి. క్రికెట్‌ను కొనసాగించడంతో పాటు ఎంఎంఏ అరంగేట్రానికి ఆసియా ఒలింపిక్ కౌన్సిల్ (ఓసీఏ) ఆమోద ముద్ర వేసింది. కాంబాట్ స్పోర్ట్స్ కేటగిరీలో తీసుకొచ్చిన మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ ఆరు విభాగాల్లో నిర్వహిస్తామని ఓసీఏ వర్గాలు తెలిపాయి. ఆసియా దేశాల సమరంలో సుమారు 15 వేల మంది అథ్లెట్లు పోటీపడతారని ఓసీఏ అంచనా వేసింది.

డిప్యూటీ కమాండెంట్‌గా ఐఎం విజయన్



తిరువనంతపురం: కేరళకు చెందిన భారత ఫుట్‌బాల్ దిగ్గజం ఐఎం విజయన్‌కు డిప్యూటీ కమాండెంట్‌గా పదోన్నతి లభించింది. రాష్ట్ర, జాతీయ జట్టుకు విజయన్ అందించిన విశేష సేవలకు గుర్తింపుగా కేరళ ప్రభుత్వం సూపర్ న్యూమరీ పోస్ట్‌ను సృష్టించి మరీ పదోన్నతి ఇచ్చింది. మలబార్ స్పెషల్ పోలీస్ బెటాలియన్‌కు ప్రస్తుతం అసిస్టెంట్ కమాండెంట్‌గా ఉన్న విజయన్ ఇకపై డిప్యూటీ కమాండెంట్‌గా ఉంటారు. 56 ఏళ్ల విజయన్ 1992 నుంచి 2003 వరకు భారత జట్టు తరఫున 88 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి 39 గోల్స్ చేశారు. 1987 నుంచి 2006 వరకు ప్రొఫెషనల్ లీగ్‌లలో 338 మ్యాచ్‌లు ఆడి 250 గోల్స్ సాధించారు.


జమ్మూ కశ్మీర్‌లో ఇటీవల ఉగ్రదాడి జరిగిన పహల్గాంలో మంగళవారం ఇలా పర్యాటకుల సందడితో కళకళలాడింది

చుట్టుముట్టి చంపేశారు

రెండు వైపులా దిగ్బంధం చేసి దారుణంగా దాడి చేసిన వైనాన్ని వివరించిన ప్రత్యక్ష సాక్షులు

శ్రీనగర్: తాజాగా మరికొంత మంది ప్రత్యక్ష సాక్షుల కథనాలతో పహల్గాంలోని బైసారన్‌లో ముష్కరుల కిరాతకకాండపై జాతీయ దర్యాప్తు సంస్థకు మరింత స్పష్టత వస్తోంది. అమాయకులను ముష్కరులు చుట్టుముట్టి చంపేశారని తెలుస్తోంది. ప్రత్యక్ష సాక్షుల కథనాల ప్రకారం.. బైసారన్ గడ్డి మైదానం లోపలికి వెళ్లడానికి, బయటకు రావడానికి ఒక ఎంట్రీ మార్గంతోపాటు ఒక ఎగ్జిట్ దారి ఉంది. ఈ రెండు చోట్లా ఉగ్రవాదులు నిలబడి మైదాన ప్రాంతం నుంచి ఎవరూ బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. సుదూరంగా ఉన్న వాళ్లు కళ్లుగప్పి, ఫెన్సింగ్ దాటి ఎలాగోలా తప్పించుకున్నా మిగతా వాళ్లు మధ్యలోనే చిక్కుకుపోయి ఉగ్రతూటాలకు బలయ్యారని తెలుస్తోంది. ఎగ్జిట్ గేట్ వద్ద ఒక ఉగ్రవాది నిలబడి కాల్పులు మొదలెట్టాడు. దీంతో జనం భయపడి ఎంట్రీ గేట్ వైపు పరుగులు పెట్టారు. అయితే అప్పటికే ఎంట్రీ గేట్ వద్ద ఇద్దరు ఉగ్రవాదులు ఉన్నారు. మరో ఉగ్రవాది చెట్లలో దాక్కున్నట్లు తెలుస్తోంది. కాల్పులు జరుపుతున్న ఈ ముగ్గురు ఉగ్రవాదులకు ఏమైనా జరిగితే రంగంలోకి దిగేందుకు సిద్ధంగా ఉన్నాడని అర్థమవుతోంది. ఈ ముగ్గురు మాత్రమే పర్యాటకుల ప్రాణాలుతీశారు. వీరిలో ఇద్దరు భారత సైనిక యూనిఫామ్‌లో, ఒకడు కశ్మీరీ స్థానిక దుస్తుల్లో ఉన్నాడు. ఎగ్జిట్ గేట్ వద్ద తుపాకీ మోతతో ఎంట్రీ గేట్ వైపు పరుగెత్తుకొచ్చిన వాళ్లందర్నీ అక్కడి ఇద్దరు ఉగ్రవాదులు నిలువరించి మహిళలు వేరుగా నిలబడాలని ఆదేశించారు. భయపడుతున్నా ఎవ్వరూ వేరు వేరుగా నిలబడలేదు. దీంతో హిందూ, ముస్లింలుగా వేర్వేరుగా నిలబడాలని మరోసారి ఆదేశించారు. దీంతో ఇస్లామ్‌పై విశ్వాసం ఉందని ప్రకటించే 'కల్మా'ను పఠించాలని ఆదేశించారు. ఈ క్రమంలోనే ఎంట్రీ గేట్ నుంచి వచ్చిన యువ నేవీ అధికారి, లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ ఉగ్రతూటాలకు బలయ్యారని సాక్షులు తెలిపారు.

రెండు వారాల ముందే రెక్కీ?

ఉగ్రవాదులు సమీప హోటళ్లలో పర్యాటకులతో నిండిపోయాయా లేదా? అనే వివరాలను తెల్సుకున్నారని, ఇందుకోసం రెండు వారాల ముందే రెక్కీ నిర్వహించారని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ విషయాన్ని నిర్ధారించుకునేందుకు సమీప హోటళ్లు, రహదారి వెంట అమర్చిన సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

జిప్‌లైన్ ఆపరేటర్‌కు ఎన్‌ఐఏ సమన్లు

రిషీ భట్ అనే పర్యాటకుడు జిప్‌లైన్ ఎక్కి బైసారన్ ఏరియల్ వ్యూను తన కెమెరాలో బంధించిన సందర్భంగా జిప్‌లైన్ ఆపరేటర్ వ్యవహారశైలి అనుమానాస్పదంగా ఉండటం ఆ వీడియోలో రికార్డయింది. అల్లా హు అక్బర్ అని పదేపదే అతను పలకడం అందులో రికార్డయింది. పర్యాటకుడిని జిప్‌లైన్‌లో ముందుకు తోస్తూ అలా పలకాల్సిన అవసరం ఏమొచ్చిందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో దాడి విషయం ముందే తెలుసా? అనే కోణంలో వివరణ కోరుతూ ఎన్‌ఐఏ ఇతనికి సమన్లు జారీచేసింది.

రెండ్రోజుల క్రితమే హతమార్చేవారా?

ఏప్రిల్ 22వ తేదీన ఈ దాడి జరిగింది. వాస్తవానికి రెండు రోజుల ముందే ఉగ్రవాదులు దాడికి ప్రయత్నించారని తెలుస్తోంది. అయితే ఆ ముందు రెండు రోజులు అంటే 20, 21వ తేదీల్లో అక్కడ వర్షం పడటంతో బైసారన్ గడ్డిమైదానం అంతా బురదమయంగా ఉండటంతో పర్యాటకులు హోటళ్లను వదిలి బయటకు రాలేదని, సందడి లేకపోవడంతో ఉగ్రవాదులు తమ ప్రయత్నాన్ని వాయిదావేసుకున్నారని తెలుస్తోంది. 22వ తేదీన చక్కటి ఎండ కాయడంతో జనం పెద్ద సంఖ్యలో వచ్చారు. ఘటన జరిగిన రోజున బైసారన్, సమీప ప్రాంతాల్లో ఏకంగా 5,000 మంది స్థానిక, స్థానికేతరులు ఉన్నారని 'పోనీ ఆపరేటర్'రాఫ్ వానీ చెప్పారు. ఆ విషయం ఉగ్రవాదులు తెల్సుకుని తెగబడ్డారని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. అక్కడి ఫుడ్‌స్టాళ్ల వెనక వైపు చాలా సేపు ఇద్దరు ఉగ్రవాదులు ఊరకనే కూర్చుని మధ్యాహ్నం 2.30 గంటలకు జనం ఎక్కువైన తర్వాతే ముందువైపుకొచ్చి దాడి చేసినట్లు తెలుస్తోంది. ముందుగా ఇద్దరు ఉగ్రవాదులు నలుగురిని తలపై గురిచూసి చంపేశాకే అక్కడి జిప్‌లైన్ వెనుక నుంచి మరో ఇద్దరు వచ్చారని ఇంకొందరు ప్రత్యక్ష సాక్షులు చెప్పారు.

హసీం మూసాకు పాకిస్తాన్‌లో శిక్షణ!

పారా-కమాండో ట్రైనింగ్ ఇచ్చిన స్పెషల్ సర్వీసెస్ గ్రూప్

- ఏడాది కాలంగా జమ్మూకశ్మీర్‌లో దాడులు
- రూ.20 లక్షల రివార్డు ప్రకటించిన పోలీసులు

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి వెనుక మాస్టర్ మైండ్‌గా వ్యవహరించిన హషీం మూసా గురించి కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. మూసా పాకిస్తాన్‌లో పారా-కమాండో శిక్షణ పొందాడని దర్యాప్తు సంస్థలు గుర్తించినట్లు తెలిసింది. ఈ శిక్షణతో రాటుదేలిన మూసా భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించి, ఏడాది కాలంగా దాడులకు పాల్పడుతున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. హషీం మూసా వయసు 20 నుంచి 30 ఏళ్ల లోపు ఉంటుంది. పాకిస్తాన్ సైన్యంలో కొంత కాలం పనిచేశాడు. లష్కరే తోయిబా సిద్ధాంతాల పట్ల ఆకర్షితుడయ్యాడు. భారత్ పట్ల విపరీతమైన ద్వేషం పెంచుకున్నాడు. కథువా, సాంబా సెక్టార్ల గుండా జమ్మూకశ్మీర్‌లోకి చొరబడ్డాడు. రాజౌరి-పూంచ్‌లోని డేరాకీ గలీ ప్రాంతంలో చురుగ్గా ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహించాడు. లష్కరే తోయిబా తరఫున ఉగ్రవాద దాడుల్లో పాల్గొన్నాడు. పహల్గాంలో 26 మంది పర్యాటకులను బలితీసుకున్న ముష్కరుల ముఠాకు నేతృత్వం వహించాడు. వారిని ముందుండి నడిపించాడు. మూసా ఆచూకీ చెబితే రూ.20 లక్షల రివార్డు ఇస్తామంటూ జమ్మూకశ్మీర్ పోలీసులు ప్రకటన విడుదల చేశారు.

అది కఠినమైన శిక్షణ

పాకిస్తానీ పారా-కమాండ్ శిక్షణ కఠినంగా ఉంటుంది. పాక్ సైన్యానికి చెందిన స్పెషల్ సర్వీసెస్ గ్రూప్(ఎస్ఎస్‌జీ) ఈ శిక్షణ ఇస్తుంది. సంప్రదాయతేర యుద్ధతంత్రం, శత్రువులకు చిక్కకుండా తప్పించుకోవడం, కొండ ప్రాంతాల్లో పోరాడడంలో మెరికలుగా తీర్చిదిద్దుతారు. ఆధునిక యుద్ధ విద్యలు సైతం నేర్పిస్తారు. ప్రధానంగా దాడులు చేసి, వెంటనే తప్పించుకోవడం ఎలాగన్నది తర్ఫీదు ఇస్తారు. హసీం మూసా చేపట్టిన ఆపరేషన్లు ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. జమ్మూకశ్మీర్‌లో గత ఏడాది కాలంగా జరిగిన ఉగ్రవాద దాడుల్లో ముష్కరులు ఇంకా పట్టుబడలేదు. వారు ఎక్కడున్నారో ఆచూకీ దొరకలేదు. గతంలో జమ్మూకశ్మీర్‌లోకి చొరబడిన ఉగ్రవాదులు స్థానికుల వద్ద ఆశ్రయం పొందేవారు. దాంతో వారిని కనిపెట్టి మట్టుబెట్టడం సులువుగా ఉండేది. అందుకే ఉగ్రవాదులు వ్యూహంమార్చేసినట్లు స్పష్టమవుతోంది. దాడి తర్వాత ఉగ్రవాదులు స్థానికులతో ఎలాంటి సంబంధాలు పెట్టుకోవడం లేదు. కొండలు, అడవుల్లోనే తలదాచుకుంటున్నారు. ఒకేచోట స్థిరంగా ఉండకుండా తరచుగా మకాం మారుస్తున్నారు. జనంలోకి వచ్చి దాడి చేసి, వెంటనే మాయమవుతున్నారు. పాకిస్తాన్ పారా-కమాండో శిక్షణలో ఇలాంటి వ్యూహాలు నేర్పిస్తుంటారు. పహల్గాం దాడిలో ఎం4 కార్బైన్స్ వంటి ఆధునిక ఆయుధాలతో విరుచుకుపడ్డారు. ఇలాంటి ఆయుధాలు ఉపయోగించాలంటే ప్రత్యేక మిలటరీ శిక్షణ, నైపుణ్యాలు అవసరం . పహల్గాంలో దాడికి పాల్పడిన ఉగ్రవాదులు ఆయుధాల వినియోగంలో సైనిక శిక్షణ పొందినట్లు దీన్నిబట్టి తెలుస్తోంది.

ఒకే ప్రసంగంపై వివిధ రాష్ట్రాల్లో

కేసులు పెట్టొచ్చా?

షర్జీల్ ఇమామ్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ: ఒకే ప్రసంగం చేసినందుకు జేఎన్‌యూ మాజీ విద్యార్థి షర్జీల్ ఇమామ్‌పై దేశద్రోహం వంటి నేరాల కింద వివిధ రాష్ట్రాల్లో కేసు నమోదు చేయవచ్చా?అని సుప్రీంకోర్టు మంగళవారం ప్రశ్నించింది. పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)కి వ్యతిరేకంగా జరిగిన నిరసనల సమయంలో రెచ్చగొట్టేలా ప్రసంగించిన ఆరోపణలతో తనపై ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్, అస్సాం, మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్‌లలో నమోదైన కేసులన్నిటినీ కలిపి విచారణ చేపట్టాలంటూ ఇమామ్ 2020లో వేసిన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. ఒకే ఒక్క ప్రసంగానికిగాను పలు రాష్ట్రాల్లో విచారణ జరపవద్దంటూ సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే చేసిన వినతిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం పై విధంగా స్పందించింది. ఢిల్లీ పోలీసుల తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజు మాత్రం..ఇమామ్ బిహార్, యూపీ, ఢిల్లీల్లో వేర్వేరు సమూహాలను రెచ్చగొట్టాడు. ఆరోపణలు సైతం వేర్వేరుగా ఉన్నాయని వాదించారు. స్పందించిన ధర్మాసనం.. 'ఇమామ్ చేసిన ప్రసంగం ఒక్కటే. పాఠమూ ఒక్కటే. ఆ ప్రసంగం యూట్యూబ్ వంటి వేదికల ద్వారా దేశవ్యాప్తంగా చూసే వీలుంది. ప్రభావం కూడా ఒకేలా ఉంటుంది'అని అభిప్రాయపడింది. రాష్ట్రాల్లో కేసులను వేర్వేరుగా విచారించిన పక్షంలో ఇమామ్‌కు ఎక్కువ అపాయముంటుందని వ్యాఖ్యానించిన ధర్మాసనం..కేసులన్నిటినీ ఢిల్లీకి బదలాయించాలంది. అయితే, ఢిల్లీ తరఫున మాత్రమే అభిప్రాయం చెప్పానని, మిగతా రాష్ట్రాల విషయం గానీ, కేసుల్ని కలపడం గానీ తనకు తెలీదని అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజు పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఇమామ్‌పై నమోదైన కేసులను ఢిల్లీకి బదిలీ చేయడంలో అభిప్రాయం తెలపాల్సిందిగా యూపీ తదితర ఐదు రాష్ట్రాలను 2020లో సుప్రీంకోర్టు కోరగా, ఢిల్లీ మాత్రం ఇప్పటివరకు సమాధానమివ్వలేదు.

భార్య, కుమారుడిని కాల్చి చంపి..

టెక్ సీఈఓ ఆత్మహత్య

మైసూరు: అమెరికాలో మైసూరుకు చెందిన టెక్ కంపెనీ యజమాని తన భార్య, కొడుకును తుపాకీతో కాల్చిచంపి, ఆత్మహత్య చేసుకున్నారు. వాషింగ్టన్‌లోని న్యూక్యాజిల్ ప్రాంతంలోని నివాసంలో 24వ తేదీ రాత్రి ఈ ఘోరం జరిగింది. ఘటనలో హర్షవర్ధన్ కిక్కేరి (57), భార్య శ్వేత పాన్యం (44), 14 ఏళ్ల ధ్రువ కిక్కేరి ప్రాణాలు కోల్పోయారు. హర్షవర్ధన్ మరో 7 ఏళ్ల కుమారుడు ప్రమాదం నుంచి బయటపడ్డాడు. మైసూరులోని బంధువులకు ఈ మేరకు ఆలస్యంగా సమాచారం అందింది. హర్ష కిక్కేరి స్వస్థలం మండ్య జిల్లా కిక్కేరి కాగా మైసూరులో బీటెక్ పూర్తి చేశారు. మైక్రోసాఫ్ట్ సంస్థలో ఉద్యోగంలో చేరి అమెరికాకు వెళ్లిపోయారు. భార్య శ్వేతతో కలిసి 2018లో హోలో వరల్డ్ అనే రోబోటిక్ స్టార్టప్‌ని మైసూరులో స్థాపించారు. రోబోటిక్స్‌లో నూతన సాంకేతికతను ఈ సంస్థ రూపొందించేది. కంపెనీ ఉత్పత్తులకు బాగా డిమాండు కూడా ఉంది. ఇటీవల మైసూరులో జరిగిన ఓ సదస్సులో హర్ష రోబోటిక్ టెక్నాలజీపై ఉపన్యసించారు కూడా. ఇంతలోనే విషాదం చోటుచేసుకుంది. కారణాలు తెలియాల్సి ఉంది.

ఎవరెస్ట్ అధిరోహకులకు

నేపాల్ కఠిన నిబంధన

7 వేల మీటర్ల శిఖరాలను ఎక్కిన వారికే అవకాశం

కఠ్మాండు: ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన హిమాలయాల్లోని ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించాలనుకునే వారికి నేపాల్ ప్రభుత్వం త్వరలో మరో కఠిన షరతును విధించనుంది. ఏడు వేల మీటర్లు పైగా ఎత్తున పర్వతాల్లో కనీసం ఒక్కదానినైనా ఎక్కిన వారినే ఎవరెస్ట్ పైకి అనుమతించనుంది. నేపాలీలు సాగరమాతగా పిలుచుకునే ఈ శిఖరాగ్రంపై అత్యంత ఎత్తులో ఆకస్మికంగా సంభవించే అధిరోహకుల మరణాలను తగ్గించడమే ప్రభుత్వ ఉద్దేశమని మీడియా తెలిపింది. న్యూజిలాండ్ వాసి ఎడ్మండ్ హిల్లరీ, నేపాల్ షెర్పా టెన్జింగ్ నార్గేలు 1953 మే 29వ తేదీన 8,849 మీటర్ల ఎత్తైన ఎవరెస్ట్ శిఖరంపై మొట్టమొదటిసారిగా జెండా ఎగురవేశారు. అప్పటి నుంచి ప్రపంచవ్యాప్తంగా పర్వతారోహకులను ఈ శిఖరాగ్రం ఆకర్షిస్తోంది. ఇప్పటి వరకు సుమారు 9 వేల మంది ఎవరెస్ట్‌ను అధిరోహించగా వివిధ ప్రాంతాల్లో 300మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. విషాద ఘటనలను నివారించే ఉద్దేశంతో 'ఇంటిగ్రేటెడ్ టూరిజమ్'బిల్లును ప్రభుత్వం రూపొందించింది. 'దీని ప్రకారం అధిరోహకులు ముందుగా తమను తాము నిరూపించుకోవాలి. ఇందులో భాగంగా వారు ఏడువేల మీటర్లకు మించి ఎత్తున్న కనీసం ఒక్క పర్వతాన్నయినా ఎక్కి ఉండాలి'అని కఠ్మాండు మీడియా తెలిపింది. 'ఈ సీజన్‌లో 400 మంది ఔత్సాహికులకు ప్రభుత్వం అనుమతించింది. ఈ సంఖ్య త్వరలోనే 500కు చేరుకుంది. ఆర్థికంగా దేశానికి ఇది లాభదాయకమే అయినప్పటికీ చీకటి కోణాలు సైతం ఉన్నాయి. పర్వత శిఖరంపై తరచూ రద్దీ పెరుగుతోంది. మరణాలూ ఎక్కువవుతున్నాయి. ఉదాహరణకు 2023లో 17 మంది, 2024లో 8 మంది చనిపోయారు. అంతేకాదు, ప్రపంచంలోనే అత్యంత ఎత్తులో ఉన్న చెత్త కూపంగా అప్రతిష్ట మూటగట్టుకుంది'అని ఆ కథనంలో నిజాలను వెల్లడించింది. అత్యంత ఎక్కువ ఎత్తులో మరణించిన వారిని కిందికి తీసుకువచ్చేందుకు కూడా భారీగా, 20 వేల డాలర్ల మొదలు 2 లక్షల డాలర్ల దాకా ఖర్చవుతోందని తెలిపింది.

కోట్ల చెట్ల కార్బన్ లెక్కలు తేల్చనున్న శాటిలైట్

నింగిలోకి దూసుకెళ్లిన బయోమాస్ ఉపగ్రహం

- వెగా సి-రాకెట్ ద్వారా ప్రయోగించిన యురోపియన్ స్పేస్ ఏజెన్సీ



శిలాజ ఇంధనాల విచ్చలవిడి వినియోగం, మానవ కార్యకలాపాలతో భూగోళంపై కర్బన ఉద్గారాల వెల్లువ ఊహించనంతగా పెరిగిపోయింది. దీంతో భూతాపోన్నతి ఎక్కువైంది. పరిస్థితి కట్టుతప్పకుండా భూమాత తన విశ్వవ్యాప్త వృక్షాల ద్వారా ఈ కర్బన ఉద్గారాలను ఒడిసిపడుతూ మళ్లీ వాతావరణాన్ని చల్లబరుస్తోంది. వృక్షసంపద కారణంగా ఎంతో మేలు జరుగుతుందని శాస్త్రవేత్తలు ఏనాడో గుర్తించారు. కానీ ఎంత పరిమాణంలో మనకు మేలు జరుగుతోంది అనేది ఇంత వరకు ఎవరూ చెప్పలేకపోయారు. ఎందుకంటే భూమిపై విస్తరించిన వృక్షసంపద సామర్థ్యం ఎంత అనేది ఎవరికీ తెలీదు. ఈ బృహత్తర క్రతువును పూర్తిచేసేందుకు యురోపియన్ స్పేస్ ఏజెన్సీ(ఈఎస్ఏ) ముందుకొచ్చింది. భూమి మీద ఉన్న మొత్తం సతతహరిత అరణ్యాల కార్బన్ సంగ్రహణ సామర్థ్యాన్ని గణించడమే లక్ష్యంగా ఈఎస్ఏ మంగళవారం వెగా-సి రాకెట్ ద్వారా బయోమాస్ శాటిలైట్‌ను నింగిలోకి ప్రయోగించింది. ఫ్రెంచ్ గయానాలోని కౌరూ అంతరిక్ష ప్రయోగకేంద్రం నుంచి దీనిని ప్రయోగించారు. ఇది తొలుత అమెజాన్ అడువుల లెక్క తేల్చనుంది.

1.2 టన్నుల బరువు..

ఏకంగా 1.2 టన్నుల బరువైన ఈ శాటిలైట్‌లో తొలిసారిగా పీ-బ్యాండ్ సింథటిక్ అపర్చర్ రాడార్‌ను అమర్చారు. దీనిని వాడటం ఇదే తొలిసారి. ఇది 70 సెంటీమీటర్ల తరంగ దైర్ఘ్యంతో పనిచేస్తుంది. అంటే ఇతర శాటిలైట్లు ధృవాల ఫొటోలను తీస్తే మంచు దిబ్బల పైపై ఫొటోలను మాత్రమే తీయగలవు. కానీ ఈ శాటిలైట్ దట్టమైన అడవిలోనూ చెట్టు కాండం, కొమ్మల చుట్టు కొలతలనూ ఇది లెక్కిస్తుంది. భూమి మీద ఉన్న 1.5 ట్రిలియన్ల వృక్షాల సమస్త సమాచారాన్ని ఇది గుప్పిటపట్టనుంది. చెట్టును బట్టి అది ఎంతస్థాయి కాలుష్య కర్బన ఉద్గారాలను సంగ్రహించగలదు అనేది తేటతెల్లమవనుంది. సతతహరిత అరణ్యాల్లోని చెట్ల ఎత్తు, వాటిలోని కలప, మొత్తం చెట్ల విస్తీర్ణం.. ఇలా ప్రతి సమాచారాన్ని సేకరించనుంది. తర్వాత భవిష్యత్‌లో అడవుల నరికివేత కారణంగా ఏ స్థాయిలో కర్బన ఉద్గారాల సంగ్రహణ సామర్థ్యం తగ్గిపోతుందో తెలియనుంది. వాతావరణ మార్పులను వృక్షసంపద ఏమేరకు నిలువరిస్తోంది?. భవిష్యత్తులో అడవులు తగ్గిపోతే జరిగే విపరిణామాల స్థాయి ఎంత? అనేవి స్పష్టంకానుంది. ఈ శాటిలైట్‌కు 'అంతరిక్ష గొడుగు'గా పిల్చుకునే 12 మీటర్ల వ్యాసమున్న భారీ యాంటెన్నాను అమర్చారు. ఇది ఎప్పటికప్పుడు సిగ్నళ్లను భూమి మీది కేంద్రానికి చేరవేస్తుంది. ''మేం ఈ అడవులను ఇంటరాగేషన్ చేయబోతున్నాం. ఈ అడవుల శక్తిసామర్థ్యాలను వెలికితీయబోతున్నాం. కర్బన ఉద్గారాలను శోషిస్తున్న అమెజాన్, కాంగో, ఇండోనేసియా అడవుల గొప్పతనం త్వరలో అందరికీ తెలియనుంది''అని ది నేషనల్ సెంటర్ ఫర్ ఎర్త్ అబ్జర్వేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ జాన్ రెమిడియోస్ అన్నారు. ''భారీ శాటిలైట్‌కు అడవులను సీటీ-స్కాన్ చేసే సత్తా ఉంది''అని ఎయిర్‌బస్ జియోసైన్సెస్ సారథి డాక్టర్ రాల్ఫ్ కార్డీ అన్నారు. ''ఇన్నాళ్లూ శాస్త్రవేత్తలు విడివిడిగా చెట్లను అంచనావేశారుగానీ ఇలా ఒకేసారి మొత్తాన్ని లెక్కించలేదు''అని లండన్ యూనివర్సిటీ కాలేజీలోని రిమోట్ సెన్సింగ్ విభాగ ప్రొఫెసర్ మ్యాట్ డిస్నీ వెల్లడించారు. యూరప్, అమెరికాలోని పలువురు ప్రముఖ శాస్త్రవేత్తలు, 50కిపైగా కంపెనీలు సంయుక్తంగా ఈ శాటిలైట్‌కు తుది రూపునిచ్చారు. శాటిలైట్ పని మొదలుపెట్టిన తొలి ఆరు నెలల్లోపు ప్రాథమిక మ్యాప్‌లు సిద్ధంచేస్తారు. తర్వాత ఐదు సంవత్సరాల్లోపు సమగ్ర స్థాయి మ్యాప్‌లు రూపొందిస్తారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

రూ.500 కోట్ల యుద్ధవిమానం

సముద్రంపాలు

వాషింగ్టన్: సాధారణ సన్నాహకాల్లో భాగంగా ల్యాండ్ అయిన అత్యంత అధునాతన యుద్ధవిమానం అనుకోకుండా సముద్రంలో పడిపోయింది. అమెరికాకు చెందిన భారీ యుద్ధవిమాన వాహకనౌక 'యూఎస్ఎస్ హ్యారీ ఎస్.ట్రూమన్'పై సోమవారం ఈ ఘటన జరిగింది. దాదాపు రూ.511 కోట్ల విలువైన ఎఫ్/ఏ18ఈ సూపర్ హార్నెట్ యుద్ధవిమానం సముద్రంలో పడిపోవడంతో ఈ ఘటనపై అమెరికా ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. 'స్ట్రైక్ ఫైటర్ స్క్వాడ్రాన్-136' బృందంలో ఒకటైన ఎఫ్/ఏ18ఈ యుద్ధవిమానం తొలుత ఎగిరి తర్వాత ఎర్ర సముద్రజలాల్లో నిలిపిఉంచిన యుద్ధవిమాన వాహకనౌకపై ల్యాండ్ అయి అత్యంత చిన్న రన్‌వే పైన ఆగింది. దానిని దూరంగా 'హ్యాంగర్ బే'లో నిలిపి ఉంచేందుకు నేవీ సిబ్బంది ట్రాక్టర్‌తో లాగుతుండగా అది అదుపుతప్పింది. అది జారిపోయి సముద్రజలాల్లో పడిపోయింది. ట్రాక్టర్ సైతం సముద్రంలో పడిపోయింది. ఫైటర్‌జెట్, ట్రాక్టర్ సముద్రంలో పడేలోపే కాక్‌పిట్‌లోని పైలట్, ట్రాక్టర్ డ్రైవర్ సురక్షితంగా తప్పించుకున్నారు'' అని అమెరికా నేవీ తెలిపింది. అదే సమయంలో హౌతీలు ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణి దూసుకురావడంతో ఫైటర్‌జెట్‌ను రక్షించేందుకు వేగంగా యుద్ధనౌక దిశను తిప్పుతూనే ఫైటర్‌జెట్‌ను ట్రాక్టర్‌తో లాగడంతో ఈ ప్రమాదం సంభవించినట్లు తెలుస్తోంది.

ఈ కన్నీటికి సరిహద్దే సాక్షి


పాకిస్తాన్‌కు వెళ్లిపోతున్న తల్లిని వీడలేక రోదిస్తున్న చిన్నారి. ఈరుమ్ పాక్ మహిళ కాగా ఆమె కుమారునికి భారత పౌరసత్వముంది


అటారీ సరిహద్దుకు వెళ్లే క్రమంలో భారత పౌరసత్వమున్న తన కుమారుడిని హత్తుకుని రోదిస్తున్న పాక్ పౌరురాలు


భారత పౌరసత్వమున్న భర్తను వీడి పాక్ తిరిగివెళ్తున్న మహిళ. ఎడబాటును తలచుకుని దంపతులిద్దరూ ఇలా రోదించారు


పాక్ పౌరులైన తన అన్నావదినలకు వీడ్కోలు పలుకుతూ భావోద్వేగానికి లోనైన కోమల్ అనే రాజస్తానీ యువతి

షరియా కోర్టులకు చట్టబద్ధత లేదు: సుప్రీం

న్యూఢిల్లీ: దేశంలోని షరియా కోర్టులన్నిటికీ ఎటువంటి చట్టబద్ధత లేదని సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది. కాజీ కోర్టులు, దారుల్ ఖాజా, కాజియాయత్ కోర్టులు.. వంటి వాటిని భారతీయ చట్టం గుర్తించదని పేర్కొంది. ఇవి జారీ చేసే మార్గదర్శకాలు, నిర్ణయాలకు కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదని, వీటిని చట్టబద్ధ విధానాల ద్వారా అమలు చేయలేమని తెలిపింది. తనకు భరణాన్ని నిరాకరిస్తూ కుటుంబ న్యాయస్థానం ఇచ్చిన తీర్పును అలహాబాద్ హైకోర్టు సమర్థించడాన్ని సవాల్ చేస్తూ ఓ మహిళ వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ సుధాన్షు ధులియా, జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లాల ధర్మాసనం ఇటీవల పై వ్యాఖ్యలు చేసింది. 2014లో విశ్వ లోచన్ మదన్ వర్సెస్ భారత ప్రభుత్వం కేసులో షరియా కోర్టులు, ఫత్వాలను భారత చట్టాలు గుర్తించడం లేదంటూ సుప్రీంకోర్టు వెలువరించిన రూలింగ్‌ను గుర్తు చేసింది. 'షరియా కోర్టులకు చట్టపరమైన హోదా లేదు. వీటి నిర్ణయాలను సంబంధిత వర్గాలు స్వచ్ఛందంగా అంగీకరించాలి. ఇవి చట్టానికి లోబడి ఉండాలి. లేకుంటే వీటిని అమలు చేయలేం'అని అత్యున్నత న్యాయస్థానం పునరుద్ఘాటించింది. భోపాల్‌లోని కాజీ కోర్టులో సెటిల్‌మెంట్‌ను ప్రాతిపదికగా తీసుకున్న కుటుంబ న్యాయస్థానం పిటిషనర్‌కు భరణాన్ని నిరాకరిస్తూ తీర్పు ఇవ్వడాన్ని ధర్మాసనం తప్పుబట్టింది. ఫ్యామిలీ కోర్టులో ఆమె పిటిషన్ వేసిన తేదీ నుంచి నెలకు రూ.4 వేల చొప్పున భరణం చెల్లించాలంటూ భర్తను ఆదేశిస్తూ తీర్పు వెలువరించింది.

మోదీ లక్ష్యంగా కాంగ్రెస్ పోస్టర్

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడితో తలెత్తిన సంక్షోభాన్ని పరిష్కరించలేకపోయారని ప్రధాని మోదీని నిందిస్తూ కాంగ్రెస్ 'ఎక్స్'లో పోస్ట్ చేసిన చిత్రం తీవ్ర దుమారం రేపుతోంది. కాషాయ రంగు కుర్తా, తెల్లటి చుడీదార్ ధరించిన తల, చేతులు లేని ఓ వ్యక్తి చిత్రాన్ని, దానిపైన 'కనిపించుట లేదు'అనే వ్యాఖ్యను జోడించి కాంగ్రెస్ పోస్ట్ చేసింది. ముస్లింలను సంతృప్తి పర్చడమే కాంగ్రెస్ లక్ష్యమని బీజేపీ ఐటీ విభాగం చీఫ్ అమిత్ మాలవీయ వ్యాఖ్యానించారు. 'కాంగ్రెస్ పార్టీ గతంలోనూ ఇలాంటి విన్యాసాలు చేసింది. ఆ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ కూడా ప్రధాని మోదీ లక్ష్యంగా హింసను ప్రేరేపించారు. సమర్థించారు. ఇలాంటి కుయుక్తులతో కాంగ్రెస్ విజయం సాధించడం కల్ల. కోట్లాది మంది ప్రజల ఆశీస్సులు ప్రధానికి ఎప్పుడూ వెన్నంటే ఉంటాయి'అని మాలవీయ పేర్కొన్నారు. 'తెగిన మెడ ఎవరికైనా ఉందంటే అది కాంగ్రెస్‌కు మాత్రమే. ఇప్పుడు తలలేని హైడ్రా మాదిరిగా, దిక్కుతోచని స్థితిలో ఆ పార్టీ తిరుగుతోంది' అని వ్యాఖ్యానించారు. పాకిస్తాన్ నుంచి అందిన ఉత్తర్వుల ప్రకారమే కాంగ్రెస్ నడుచుకుంటోందని బీజేపీ జాతీయ ప్రతినిధి ప్రదీప్ భండారి పేర్కొన్నారు.

వచ్చేనెల 29న ఐఎస్ఎస్‌కు శుభాన్షు శుక్లా

చరిత్ర సృష్టించబోతున్న భారత వైమానిక దళం గ్రూప్ కెప్టెన్

న్యూఢిల్లీ: భారత వైమానిక దళానికి(ఐఏఎఫ్) చెందిన గ్రూప్ కెప్టెన్, వ్యోమగామి శుభాన్షు శుక్లా చరిత్ర సృష్టించబోతున్నాడు. మే 29వ తేదీన అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి(ఐఎస్ఎస్) పయనం కాబోతున్నాడు. అమెరికాలోని ఫ్లోరిడాలో కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి నాసా వ్యోమగామి పెగ్గీ విట్సన్‌తోపాటు పోలాండ్, హంగేరీకి చెందిన మరో ఇద్దరు వ్యోమగాములతో కలిసి శుభాన్షు శుక్లా అంతరిక్ష ప్రయాణం ప్రారంభిస్తాడు. యాక్సియోమ్ స్పేస్ ఈ సంస్థ మంగళవారం ఈ విషయం వెల్లడించింది. యాక్సియోమ్ మిషన్-4(ఏఎక్స్-4)లో భాగంగా మొత్తం నలుగురు వ్యోమగాములు స్పేస్‌ఎక్స్ సంస్థ అభివృద్ధి చేసిన డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్‌లో వీరు ఐఎస్ఎస్‌కు చేరుకుంటారు. 14 రోజులు అక్కడ గడిపిన అనంతరం భూమిపైకి తిరిగి వస్తారు. ఐఎస్ఎస్‌కు చేరుకున్న తొలి భారతీయుగా శుభాన్షు శుక్లా రికార్డుకెక్కుతాడు. నాలుగు దశాబ్దాల క్రితం.. 1984లో భారత వ్యోమగామి రాకేశ్ శర్మ రష్యాకు చెందిన సోయజ్ స్పేస్‌క్రాఫ్ట్‌లో అంతరిక్షంలోకి వెళ్లి వచ్చిన సంగతి తెలిసిందే. అంతరిక్ష ప్రయాణం చేసిన తొలి భారతీయుడిగా ఆయన రికార్డు సృష్టించారు.

భారతీయ లౌకికతత్వం ఎలాంటిది?

లౌకికతత్వం – ప్రపంచశాంతి – భారతదేశం

'లౌకిక' అంటే మతంతో సంబంధం లేనిది అని అర్థం. 'లౌకికతత్వం' అంటే మతంతో ప్రమేయం లేని చింతన లేదా తత్వం. లౌకిక తత్వాన్ని అనుసరించే దేశం ప్రజల మత సంబంధమైన విషయాల్లో జోక్యం చేసుకోదు. భారతదేశం వివిధ మతాలకు పుట్టినిల్లు. హిందూ, బౌద్ధం, జైనం, ఇస్లాం, క్రైస్తవం, పార్శీ మతాలు మనదేశంలో ఉన్నాయి. భారతదేశం ఒక లౌకిక రాజ్యం. క్రీస్తు పూర్వం నుంచి మతాలను పరిశీలిస్తే అశోకుడు మొదట హిందువు. తర్వాత ఉపగుప్తుడనే బౌద్ధ మతాచార్యుని బోధనలతో బౌద్ధాన్ని స్వీకరించాడు. ఆ కాలంలోనే పరమత సహనాన్ని పాటించిన చక్రవర్తి అశోకుడు. హర్షుడు, చంద్రగుప్త విక్రమా దిత్యుడు కూడా లౌకికతత్వాన్ని అనుసరించారు. ఇక మధ్యయుగంలో తొలి లౌకిక చక్రవర్తి అక్బర్. దిన్-ఇ-ఇలాహీ అనే నూతన మతానికి అక్బర్ శ్రీకారం చుట్టాడు. అంతేకాకుండా ఇబాదత్ ఖానా అనే ప్రార్థన మందిరంలో సర్వమతాల వారు ప్రార్థనలు చేసుకొనే అవకాశం కల్పించాడు. ప్రస్తు తం మనదేశంలో హిందువులు, క్రిస్టియన్లు, ముస్లింలు, సిక్కులు, జైనులు, బౌద్ధులు మొదలైన వారు తమ మతాలు నిర్ణయించిన ఆచార వ్యవహా రాలను పాటిస్తూ శాంతియుతంగా జీవిస్తున్నారు. 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా లౌకిక అనే పదాన్ని భారత రాజ్యాంగ పీఠికలో ప్రవేశ పెట్టారు. భారతీయ లౌకికవాదం ఉదారమైంది. ప్రేమ, సహనం, సర్వ మత సమానత్వం అనే సూ త్రాలకు ప్రాముఖ్యత ఇస్తుంది. మతవాదానికి బదులు మానవతావాదాన్ని పౌరులు అలవరుచు కోవాలి. మతం పేరుతో ఇతరులపై దాడులు చేస్తే ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతుంది. తద్వారా అల్ప సంఖ్యాకుల్లో భయాందోళనలను తొలగిస్తుంది.

ప్రపంచ శాంతి

యుద్ధ భయం మానవాళిని అనాదిగా వేధిస్తోంది. మానవుల శాంతియుత సహజీవనానికి యుద్ధాలు తీవ్రమైన అంతరాయం కలిగిస్తున్నాయి. వీటివల్ల ఎంతో నష్టం కలుగుతుంది. 20వ శతాబ్దంలో సంభవించిన రెండు ప్రపంచ యుద్ధాలు ప్రపంచవ్యాప్తంగా పెను విధ్వంసాన్ని సృష్టించాయి. మొదటి ప్రపంచ యుద్ధం 1914–18 మధ్య కాలంలో జరిగింది. రెండో ప్రపంచ యుద్ధ కాలం 1939–45. మొదటి ప్రపంచ యుద్ధంలో అమెరికా తటస్థంగా ఉంది. మళ్లీ ప్రపంచ యుద్ధమే సంభవిస్తే ప్రపంచం మొత్తం కొద్ది క్షణాల్లో ధ్వంసం అవుతుందని అంచనా. అందుకే ప్రపంచ శాంతి నెలకొల్పడం ఎంతో అవసరమని వివిధ దేశాలు



గుర్తించాయి. ఈ లక్ష్యసాధన కోసం మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత నానాజాతి సమితి, రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఐక్యరాజ్య సమితి ఏర్పడ్డాయి. నానాజాతి సమితి 1920లో జెనీవా ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. 1945, అక్టోబర్ 24న న్యూయార్క్ కేంద్రంగా ఐక్యరాజ్య సమితి ఏర్పడింది.

భారతదేశం పాత్ర

ప్రపంచ శాంతి నెలకొల్పడానికి, కొన్ని దేశాలు గణనీయమైన కృషి చేస్తున్నాయి. వాటిలో భారత దేశం ఒకటి. ప్రపంచ శాంతిని కాపాడటం భారత విదేశాంగ విధాన ముఖ్య లక్ష్యాల్లో ఒకటి. జాతీయ ప్రయోజనాలను రక్షించుకోవడానికి ఇతర దేశాలతో సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక సం

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
పాలిటీ

బంధాల విషయంలో రూపొందించిన విధా నాన్ని విదేశాంగ విధానం అంటారు. భారత విదేశాంగ విధానానికి మొదటి ప్రధాని నెహ్రూ రూపకల్పన చేశారు.

పంచశీల సూత్రాలు: టిబెట్ విషయంపై భారత దేశం, చైనా చేసుకున్న ఒడంబడికలో శాంతియుత సహజీవన సూత్రాలను పేర్కొన్నారు. వీటినే పంచశీల సూత్రాలు అంటారు. 1954 జూన్ 28న భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, చైనా ప్రధాని చౌ-ఎన్-లై ఈ ఒప్పందాన్ని ఆమోదించారు.

అలీనోద్యమం (నామ్): భారత మొదటి ప్రధాని నెహ్రూ, యుగోస్లావియా అధ్యక్షుడు మార్షల్ టిటో, ఈజిప్టు అధ్యక్షుడు కమాలుద్దీన్ నాజర్ అలీనోద్యమానికి మూల పురుషులు. వీరికి ప్రపంచ శాంతి, సహజీవనం, సామరస్యం, సహకారం వంటి అంశాలపై నమ్మకం అపార నమ్మ కం ఉంది. అటు అమెరికా ఆధ్వర్యంలోని పెట్టుబడి దారి దేశాల కూటమి, ఇటు రష్యా నాయకత్వంలోని సామ్యవాద దేశాల కూటమిలో చేరని దేశాలను అలీన దేశాలు అంటారు. నామ్ 1961లో ఏర్పడింది. మొదటి సదస్సులో 25 దేశాలు పాల్గొన్నాయి. ప్రస్తుతం నామ్‌లో సభ్య దేశాల సంఖ్య–107. నామ్ ఏడో సదస్సు 1983లో న్యూఢిల్లీలో జరిగింది. ఈ సమావేశానికి నాటి భారత ప్రధాని ఇందిరాగాంధీ అధ్యక్షత వహించారు. భారత్ నామ్ ద్వారా ప్రపంచ శాంతి పరిరక్షణకు విశేష కృషి చేస్తోంది. క్యూబా సమస్య విషయంలో 1962లో అమెరికా–రష్యాల మధ్య రాజీని కుదర్చడంలో భారతదేశం ముఖ్యపాత్రను పోషించింది. అంతేకాకుండా శాంతిస్థాపన దిశగా 1983, 1985, 1988లలో పాకిస్థాన్‌తో ఒప్పందాలను కుదుర్చుకుంది.

మాదిరి ప్రశ్నలు

1. మనదేశంలో సంపూర్ణ అక్షరాస్యతా సంవత్సరంగా ఎప్పుడు ప్రకటించారు?
   1) 1992 2) 1991
   3) 1990 4) 1989
2. స్త్రీలలో అక్షరాస్యత అతి తక్కువ ఉన్న రాష్ట్రం?
   1) మేఘాలయ 2) రాజస్థాన్
   3) ఒడిశా 4) బీహార్
3. జీవించే హక్కును ఏ నిబంధన ద్వారా ప్రసాదించారు?
   1) 22 2) 20 3) 21 4) 24
4. స్త్రీలకు ఆస్తిలో సమాన హక్కును ఎప్పుడు చట్టబద్ధం చేశారు?
   1) 1985 2) 1989 3) 1984 4) 1983
5. మొట్టమొదటిసారిగా షెడ్యూల్డ్ కులాలు అనే పదాన్ని ఏ సంవత్సరంలో ఉపయోగించారు?
   1) 1940 2) 1945
   3) 1947 4) 1935
6. అస్పృశ్యతను ఒక పాపంగా అభివర్ణించినవారు?
   1) గౌతమబుద్ధుడు
   2) జవహర్‌లాల్ నెహ్రూ
   3) గాంధీజీ 4) అంబేద్కర్
7. దేశంలో భాష ప్రాతిపదికగా ఏర్పడిన మొదటి రాష్ట్రం?
   1) ఆంధ్రప్రదేశ్ 2) కర్నాటక
   3) కేరళ 4) తమిళనాడు
8. ఒక జాతికి ఉండే లక్షణాలు?
   1) సంఘీభావం 2) ఐకమత్యం
   3) భాష, మాండలికాలు
   4) సార్వభౌమాధికారం
9. రాజ్యాంగంలోని ఏ విభాగం నిర్బంధ ప్రాథమిక విద్య గురించి వివరిస్తుంది?
   1) ప్రవేశిక 2) ప్రాథమిక విధులు
   3) ఆదేశ సూత్రాలు 4) పౌరహక్కులు
10. హెబియస్ కార్పస్ రిట్ అంటే ఏమిటి?
    1) ఇది అన్యాయమైన అరెస్టును నిరోధిస్తుంది
    2) అధికారిని పనిచేయమని
    3) నీ పని నీవు చేయమని
    4) ప్రతిషేధం
11. Sons of soi (భూమిపుత్రుల) సిద్ధాంతం ఎవరిది?
    1) శివసేన 2) బీహార్
    3) తెలంగాణ 4) విదర్భ
12. భారత రాజ్యాంగ ప్రవేశికలో లౌకిక అనే పదాన్ని ఏ సంవత్సరంలో చేర్చారు?
    1) 1978 2) 1972
    3) 1976 4) 1970
13. ఐక్యరాజ్యసమితి ఏ నగరంలో ఉంది?
    1) చికాగో 2) న్యూయార్క్
    3) జెనీవా 4) శాన్‌ఫ్రాన్సిస్కో
14. దిన్-ఇ- ఇలాహీ అనే మతాన్ని ప్రవే శపెట్టిన వారు ఎవరు?
    1) బాబర్ 2) షాజహాన్
    3) ఔరంగజేబు 4) అక్బర్
15. భారతీయ లౌకికతత్వం ఎలాంటిది?
    1) సామాజికమైంది 2) నైతికమైంది
    3) ఉదారమైంది 4) ఏదీకాదు
16. రెండో ప్రపంచ యుద్ధంలో దారుణంగా ధ్వంసమైన నగరం?
    1) పెకింగ్ 2) నాగసాకి
    3) టోక్యో 4) తైవాన్
17. ఆసియా రాజ్యాల మొదటి మహాసభ జరిగిన నగరం ఏది?
    1) బాగ్దాద్ 2) నాగసాకి
    3) పెకింగ్ 4) ఢిల్లీ
18. భారత్-చైనాల మధ్య శాంతి ఒప్పందం ఏ సంవత్సరంలో జరిగింది?
    1) 1987 2) 1988
    3) 1985 4) 1983
19. అలీనవిధానం పితామహుడు ఎవరు?
    1) చౌ-ఎన్-లై 2) భుట్టో
    3) నెహ్రూ 4) గాంధీజీ
20. బాండుంగ్ సమావేశం జరిగిన సంవత్సరం?
    1) 1947 2) 1949
    3) 1950 4) 1955
21. మొదటి అలీనదేశాల సదస్సుకి హాజరైన సభ్య దేశాల సంఖ్య?
    1) 45 2) 35 3) 25 4) 55
22. పంచశీల ఎవరి ఒప్పందాల ఫలితం?
    1) రాజీవ్‌గాంధీ- బెనజీర్ భుట్టో
    2) ఇందిరాగాంధీ- జుల్ఫికర్ అలీభుట్టో
    3) నెహ్రూ-చౌ-ఎన్-లై
    4) సుకర్నో-టిటో
23. మారణాయుధాల సంఖ్య పెరగడానికి కారణం?
    1) మిత్రదేశాలు ఉచితంగా ఇవ్వడం
    2) శాస్త్రీయ విజ్ఞానాభివృద్ధి
    3) ఖర్చు తగ్గడం
    4) శాస్త్రీయ విజ్ఞాన లోపం
24. వియత్నాం విప్లవాన్ని బలపరిచిన సమావేశం జరిగిన నగరం?
    1) అల్జీర్స్ 2) జకార్తా
    3) హవానా 4) హరారే
25. ఏ లక్ష్యసాధన కోసం ఐక్యరాజ్య సమితిని ఏర్పాటు చేశారు?
    1) ఏకీయత 2) జాతీయత
    3) శాంతి 4) మత సహనం
26. ఏ సంవత్సరంలో చైనా- ఇండియాల మధ్య యుద్ధం జరిగింది?
    1) 1965 2) 1948
    3) 1962 4) 1971
27. ఇండియా తొలిసారిగా అణు విస్ఫోటన పరీక్ష జరిపిన సంవత్సరం?
    1) 1974 2) 1970
    3) 1968 4) 1975
28. సార్క్ ఆవిర్భావం ఎక్కడ జరిగింది?
    1) సిలోన్ 2) ఢాకా
    3) ఢిల్లీ 4) ఖాట్మాండు
29. బ్రిటీషువారు పరిపాలించిన వలస రాజ్యాల కూటమిని ఏమని వ్యవహరిస్తారు?
    1) కామన్‌వెల్త్
    2) బ్రిటీష్ సమాఖ్య
    3) యూరోపియన్ దేశాల కూటమి
    4) నాటో

సమాధానాలు

1) 3; 2) 2; 3) 3; 4) 1; 5) 4; 6) 3; 7) 1; 8) 3; 9) 3; 10) 1; 11) 1; 12) 3; 13) 4; 14) 4; 15) 3; 16) 2; 17) 4; 18) 1; 19) 3; 20) 4; 21) 3; 22) 3; 23) 2; 24) 1; 25) 3; 26) 3; 27) 1; 28) 2; 29) 1.

'బలిమెల' రిజర్వాయర్ ఎక్కడ ఉంది?

భారతదేశం – విద్యుచ్ఛక్తి

జల విద్యుచ్ఛక్తి

ఆధునిక కాలంలో ఆర్థికాభివృద్ధిలో జల విద్యుచ్ఛక్తి ప్రముఖ పాత్రను పోషిస్తోంది. స్వాతంత్ర్యానంతరం దీని అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. జల విద్యుచ్ఛక్తినే 'తెల్ల బొగ్గు' (జల శక్తి) అని కూడా అంటారు. ఎంతగా ఉపయోగించినా తరగని శక్తి కావడం దీని ప్రత్యేకత. అంతేకాకుండా దీన్ని ఒక్కసారి అభివృద్ధి పరిస్తే శతాబ్దాల పాటు ఉత్పత్తి చేయవచ్చు. కానీ దీన్ని అన్ని ప్రదేశాల్లో ఉత్పత్తి చేయలేం.

జలవిద్యుచ్ఛక్తిని కొన్ని అనుకూల పరిస్థితుల్లో మాత్రమే ఉత్పత్తి చేయగలుగుతాం. అవి:

1. వేసవిలోనూ నిరాటంకంగా నీటిని సరఫరా చేయగలిగే నది లేదా పెద్ద జలాశయం ఉండాలి.
2. ఎత్తు నుంచి నీరు జాలువారడానికి వీలైన నిమ్నోన్నతాలు అవసరం.
3. నదీ జలం ఘనీభవించడానికి వీలులేని కవోష్ణ శీతోష్ణస్థితి ఉండాలి.
4. జీవ నదులు లేని ప్రాంతాల్లో జలాశయాల్లో ఎక్కువ నీటిని నిల్వ చేసే అనుకూలతలు ఉండాలి.

మనదేశంలో సహజమైన జలపాతాలు ఉన్న ప్రదేశాలు చాలా తక్కువ. అందువల్ల ఎక్కువగా నదులకు ఆనకట్టలను నిర్మించి, జల విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేస్తున్నారు. భారతదేశంలో జల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఒకే విధంగా లేదు.

ప్రాంతం – జల విద్యుత్ సామర్థ్యం

1. ఈశాన్య ప్రాంతం.. ముఖ్యంగా అసోం, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, త్రిపుర ప్రాంతాల నదుల వల్ల – 30.4 శాతం.
2. ద్వీపకల్పంలో తూర్పు దిశగా ప్రవహించే నదుల వల్ల – 20.9 శాతం.
3. పశ్చిమ కనుమల్లోని నదుల ద్వారా –10.5 శాతం
4. గంగా బేసిన్ ద్వారా – 11.6 శాతం.
5. సింధూ బేసిన్‌తో – 16 శాతం.
6. మధ్య భారతదేశ నదుల వల్ల – 10.5 శాతం.

★ భారతదేశంలో మొదటిసారిగా 1897లో డార్జిలింగ్ ప్రాంతానికి జల విద్యుత్ సరఫరా చేశారు.
★ 1902లో కర్ణాటకలోని శివ సముద్రం వద్ద శరావతి నదిపై మొదటి జల విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

ముఖ్యమైన జల విద్యుచ్ఛక్తి ఉత్పత్తి కేంద్రాలు:

1. **కర్ణాటక**
★ **మైసూర్ జల విద్యుచ్ఛక్తి కేంద్రం:** కావేరి నదిపై శివ సముద్రం వద్ద నిర్మించారు.
★ **క్రిష్ణ రాజసాగర్ పథకం:** మైసూర్ జిల్లాలో కావేరి నదిపై క్రిష్ణ రాజనగర్ వద్ద ఉంది.
★ **శింసా జల విద్యుచ్ఛక్తి కేంద్రం:** శింసా నదిపై నిర్మించారు.
★ **జోగ్ లేదా మహాత్మాగాంధీ విద్యుచ్ఛక్తి ఉత్పత్తి కేంద్రం:** – శరావతి లోయ పథకంలో భాగంగా శరావతి నదిపై ఏర్పాటు చేశారు. ఇది షిమోగా జిల్లాలో ఉంది.
★ **కాళి జల విద్యుచ్ఛక్తి పథకం:** కెనరా జిల్లాలో కాళి నదిపై ఉంది.
★ **మలప్రభ పథకం:** మలప్రభ నదిపై ఉంది.

2. **తమిళనాడు**
★ **పైకారా విద్యుత్ పథకం:** నీలగిరి వద్ద పైకారా నదిపై ఉంది.
★ **కుందా విద్యుత్ పథకం:** నీలగిరి వద్ద కుందా నదిపై ఉంది.
★ **నోమార్ పథకం:** నోమార్ నదిపై నీలగిరి వద్ద నిర్మించారు.
★ **మెట్టూరు జల విద్యుత్ పథకం:** మెట్టూరు వద్ద కావేరి నదిపై ఉంది.
★ **పాపనాశనం విద్యుత్ పథకం:** పాపనాశనం వద్ద 'తామ్రపాని' నదిపై ఉంది.
★ **పెరియార్ పథకం:** కొడయార్ నదిపై కన్యాకుమారి జిల్లాలో ఉంది.

3. **కేరళ**
★ **పల్లివసల్ విద్యుచ్ఛక్తి పథకం:** ట్రావెంకూర్‌లో ఉంది.
★ **ఇడుక్కి పథకం:** పెరియార్ నదిపై ఇడుక్కి వద్ద ఎర్నాకులంలో ఉంది.
★ **షోలయార్ విద్యుత్ పథకం:** చలకూడి నదిపై త్రిచూర్ జిల్లాలో ఉంది.
★ **కుట్టియాడి పథకం:** కుట్టియాడి నదిపై కోజికోడ్ జిల్లాలో ఉంది.
★ నేరి మంగళం పథకం ★ పొరింగల్ కుట్టు పథకం

4. **మహారాష్ట్ర**
★ **టాటా జల విద్యుత్ వ్యవస్థ:** లోనావాలా, ఆంధ్రాలోయ, నీలముల పథకాలతో కూడి ఉంది.
గిర్నా పథకం
★ **వైతరణి పథకం:** వైతరణి నదిపై నాసిక్ జిల్లాలో ఉంది.


5. **గుజరాత్**
★ **ఉకాయ్ పథకం:** తపది నదిపై ఉకాయ్ వద్ద ఉంది.
★ **కాక్రపార పథకం:** తపతి నదిపై ఉంది.
★ **కదనా పథకం:** మహి నదిపై ఉంది.

6. **ఒడిశా**
★ **హీరాకుడ్ జల విద్యుత్ పథకం:** మహానదిపై హీరాకుడ్ వద్ద ఉంది.
★ **టికార్ పథకం:** మహానదిపై టికార్ వద్ద నిర్మించారు.
★ **నారజ్ జల విద్యుత్ పథకం:** మహానదిపై నారజ్ వద్ద ఉంది.
★ **బలిమెల పథకం:** సీలేరు నదిపై కోరాపుట్ జిల్లాలో ఉంది.

7. **బీహార్**
★ **కోసి విద్యుత్ పథకం:** కోసి నదిపై ఉంది.

8. **జార్ఖండ్**
★ **సువర్ణరేఖ జల విద్యుత్ పథకం:** సువర్ణ రేఖ నదిపై ఉంది.
★ మైథాన్ జల విద్యుత్ పథకం
★ పంచట్ జల విద్యుత్ పథకం
★ తిలయ్యా జల విద్యుత్ పథకం
మైథాన్, పంచట్, తిలయ్యా ఈ మూడు దామోదర్ వ్యాలీ కార్పొరేషన్ పథకంలో భాగంగా ఉన్నాయి.

9. **మధ్యప్రదేశ్**
★ లూవా విద్యుత్ పథకం
★ **గాంధీసాగర్ పథకం:** చంబల్ నదిపై



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
జాగ్రఫీ

నిర్మించారు.
★ **బార్గి పథకం:** నర్మదా నదిపై నిర్మించారు.
బన్‌సాగర్ పథకం

10. **రాజస్థాన్**
★ రాణా ప్రతాప్ సాగర్ పథకం
★ **జవహర్ సాగర్ పథకం:** దీన్ని బెంటిల్ నదిపై నిర్మించారు.

11. **పశ్చిమ బెంగాల్**
★ ఫరక్కా విద్యుత్ పథకం
★ **మయూరాక్షి విద్యుత్ పథకం:** మయూరాక్షి నదిపై ఉంది.

12. **ఉత్తరప్రదేశ్**
★ **రిహాండ్ పథకం:** మీర్జాపూర్‌లో పింప్రి వద్ద రిహాండ్ నదిపై నిర్మించారు.
★ రామ్‌గంగా పథకం
★ యమున జల విద్యుత్ పథకం
★ శారదా జల విద్యుత్ పథకం
★ **మతతిల్ల పథకం:** బెట్వా నదిపై ఝాన్సీ జిల్లాలో ఉంది.

13. **జమ్ము – కాశ్మీర్**
★ బారాముల్లా విద్యుత్ పథకం
★ **సలాల్ పథకం:** చీనాబ్ నదిపై నిర్మించారు.
★ దూల్ హస్తి పథకం ★ కరాహ్ పథకం

14. **హిమాచల్ ప్రదేశ్**
★ **మండి విద్యుత్ పథకం:** ఉహి నదిపై జోగిందర్ నగర్‌లో ఉంది.
★ బాభానగర్ పథకం
★ **నాథ్‌పా-ఝుక్రి పథకం:** దీన్ని సట్లెజ్ నదిపై నిర్మించారు. ఇది దేశంలో కెల్లా అతి పెద్ద జల విద్యుత్ కేంద్రం.

15. **పంజాబ్**
★ షానన్ జల విద్యుత్ పథకం
★ ఎగువ భారి దాపూజ్ పథకం

సౌర విద్యుత్

★ దీన్ని సాంప్రదాయేతర శక్తి వనరుగా పరిగణిస్తారు. దేశ వాయువ్య ప్రాంతంలో సౌరశక్తి ఉత్పత్తికి చాలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో సూర్యతాపం అధికంగా ఉంటుంది.
★ సౌరశక్తిని సోలార్ థర్మల్ ఎనర్జీగా లేదా సోలార్ ఫొటో వోల్టాయిక్ సెల్‌ల ద్వారా విద్యుత్ శక్తిగా మార్చి వినియోగించుకోవచ్చు.
★ ఉత్తరప్రదేశ్‌లో అలీఘర్ జిల్లాలోని కళ్యాణ్‌పూర్‌లో మొదటి సౌరశక్తి కేంద్రాన్ని స్థాపించారు.
★ భారతదేశంలో అతిపెద్ద సౌర శక్తి కేంద్రాన్ని గుజరాత్‌లోని కచ్ జిల్లాలో 'భుజ్' వద్ద నిర్మించారు. ఇది ఆసియా ఖండంలోనే అతి పెద్దది.
భారతదేశంలో తొలిసారిగా సౌర విద్యుత్ ద్వారా విద్యుదీకరించిన ప్రాంతం – చోగ్లామ్‌సా (జమ్ము – కాశ్మీర్).

భూతాప శక్తి

★ ఇది సాంప్రదాయేతర శక్తి వనరు. భారతదేశంలో మొదటి భూతాప విద్యుత్ కేంద్రాన్ని మణికరన్ (హిమాచల్ ప్రదేశ్)లో ఏర్పాటు చేశారు.

ముఖ్యమైన భూతాప విద్యుత్ కేంద్రాలు:

★ **జమ్ము-కాశ్మీర్** – పూగాలోయ (లడఖ్ జిల్లా)
★ **ఒడిశా** – తాతాపానీ
★ **జార్ఖండ్** – సూరజ్ కుండ్
★ **ఉత్తరాఖండ్** – తపోవన్

అలల శక్తి

★ దేశం మొత్తం మీద అలల నుంచి 40 వేల మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు అవకాశాలున్నాయి.
★ భారతదేశంలో మొదటి అలల శక్తి కేంద్రం – విజింజం (కేరళ). దీంతో పాటు రెండో కేంద్రాన్ని అండమాన్ నికోబార్ దీవుల్లో నిర్మించడానికి ప్రతిపాదనలు చేస్తున్నారు.
★ మొదటి ఓషన్ థర్మల్ ఎనర్జీ కన్వెన్షన్ కేంద్రాన్ని తమిళనాడులోని 'ట్యూటికోరిన్' వద్ద ఏర్పాటు చేస్తున్నారు. దీనికి సహా యం చేస్తున్న దేశం అమెరికా.

తరంగ శక్తి

★ భారతదేశంలో మొదటి తరంగ విద్యుత్ కేంద్రాన్ని గల్ఫ్ ఆఫ్ కంబట్ ప్రాంతంలోని కాండ్లాలో ఏర్పాటు చేశారు.
★ రెండో కేంద్రాన్ని పశ్చిమ బెంగాల్‌లోని సుందర్‌బన్స్‌లో ఉన్న దుర్గాదువాని క్రీక్ వద్ద నిర్మించారు.

పవన విద్యుత్

★ దేశంలో రుతుపవన వ్యవస్థ కారణంగా పవన విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు పుష్కలమైన అవకాశాలున్నాయి.
★ భారతదేశంలో 20,000 మెగావాట్ల పవన విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చని అంచనా.
పవన విద్యుత్ ఉత్పత్తికి అత్యంత అనువైన ప్రదేశం గుజరాత్ తీరం. తర్వాత స్థానంలో కొంకణ్ తీరం (మహారాష్ట్ర) ఉంది.
★ 1986లో భారత ప్రభుత్వం పవన విద్యుత్ గురించి గుజరాత్, మహారాష్ట్రలో పరిశీలనలు నిర్వహించింది.
★ భారతదేశంలో మొదటి పవన విద్యుత్ కేంద్రం – మాండవి (గుజరాత్).
★ భారతదేశంలో ఎక్కువ విస్తీర్ణంలో గాలి మరలు ఉన్న ప్రాంతం ముప్పాండల్ పెరుంగుడి (తమిళనాడు).
★ దేశంలో మొదటి బయోగ్యాస్ కేంద్రం – జలధారి (పంజాబ్).
★ భారతదేశంలో అత్యంత వికేంద్రీకరణ శక్తి వనరు – బయోగ్యాస్.
★ 1990లో ప్రభుత్వ రంగంలో మొదటి సహజ వాయు ఆధారిత విద్యుత్ కేంద్రాన్ని విజ్జేశ్వరం వద్ద ఏర్పాటు చేశారు. ఇది ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లాలో ఉంది.
★ 1997లో ప్రైవేటు రంగంలో మొదటి సహజ వాయు ఆధారిత విద్యుత్ కేంద్రాన్ని జేగురుపాడు వద్ద నిర్మించారు. ఇది ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లాలో ఉంది.

అణు పరిశోధన కేంద్రాలు

1. బాబా అణు పరిశోధనా కేంద్రం – ముంబై.
2. ఇందిరాగాంధీ అణు పరిశోధనా కేంద్రం – కల్పకం (తమిళనాడు).
3. అటామిక్ మినరల్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రీసెర్చ్ – హైదరాబాద్.
4. సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ – ఇండోర్.
5. న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ – హైదరాబాద్.
6. ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ – హైదరాబాద్.
7. న్యూక్లియర్ వాటర్ బోర్డ్ – ముంబై.
8. న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ – ముంబై.
9. యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ – జాదుగూడ (జార్ఖండ్).
10. ఇండియన్ రేర్ ఎర్త్స్ లిమిటెడ్ – ఆల్వే (కేరళ).

★ భారత అణ్వస్త్ర పితామహుడు – హోమీ జహంగీర్ బాబా.
★ 1948లో అటామిక్ ఎనర్జీ కమిషన్‌ను ఏర్పాటు చేశారు.
★ 1974 మే 18న రాజస్థాన్‌లోని పోఖ్రాన్ వద్ద మొదటి అణు పరీక్షను జరిపారు. ఈ పరీక్షలకు 'బుద్ధుడు నవ్వాడు' అని పేరు పెట్టారు.
వాజ్‌పేయి హయాంలో 1998 మే 11న పోఖ్రాన్ వద్ద మూడు అణు పరీక్షలను నిర్వహించారు. దీంట్లో భాగంగా హైడ్రోజన్ బాంబును కూడా పరీక్షించారు.
★ 1998 మే 13న పోఖ్రాన్ వద్ద మళ్లీ రెండు అణు పరీక్షలు జరిపారు. వీటికి 'బుద్ధుడు మళ్లీ నవ్వాడు' అని పేరు పెట్టారు.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. భారతదేశంలో మొదటి అణుశక్తి కేంద్రాన్ని ఎక్కడ ప్రారంభించారు?
   (జైల్ వార్డెన్ – 2012)
   1) కల్పకం 2) సూరత్
   3) తారాపూర్ 4) నరోరా
2. 'బలిమెల' రిజర్వాయర్ ఎక్కడ ఉంది?
   (స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ కానిస్టేబుల్ – 2008)
   1) ఖమ్మం 2) ఒరిస్సా
   3) శ్రీకాకుళం 4) ఏదీకాదు

సమాధానాలు

1) 3; 2) 2.

విద్య, ఉద్యోగ సమాచారం

జిప్‌మర్, పుదుచ్చేరిలో వివిధ ఉద్యోగాలు

పుదుచ్చేరిలోని జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(జిప్‌మర్)..ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **పోస్టుల వివరాలు:** సీనియర్ ప్రాజెక్ట్ అసిస్టెంట్-01, డేటా ఎంట్రీ ఆపరేటర్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. దీనితో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
» **వయసు:** 02.05.2025 నాటికి 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** సీనియర్ ప్రాజెక్ట్ అసిస్టెంట్ పోస్టుకు రూ.30,600. డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు రూ.29,200.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఈమెయిల్:** pdyunitystudy@gmail.com
» **దరఖాస్తులకు చివరితేది:** 02.05.2025.
» **వెబ్‌సైట్:** https://jipmer.edu.in

ఐఐఎఫ్‌సీఎల్, న్యూఢిల్లీలో మేనేజర్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్(ఐఐఎఫ్‌సీఎల్) డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.


» **మొత్తం పోస్టుల సంఖ్య:** 08.
» **పోస్టుల వివరాలు:** మేనేజర్(గేడ్-బి)-04, అసిస్టెంట్ మేనేజర్(గ్రేడ్-ఏ)-04.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఏదైనా డిగ్రీ, పీజీ, ఎంబీఏ/పీజీడీబీఎం/బీటెక్/సీఏ/సీడబ్ల్యూఏ/ఎల్‌ఎల్‌బీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 31.03.2025 నాటికి గ్రేడ్ ఏ పోస్టుకు 30 ఏళ్లు, గ్రేడ్-బి పోస్టుకు 40 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** గ్రేడ్-బి పోస్టుకు నెలకు రూ.52,200 నుంచి రూ.99,750, గ్రేడ్-ఏ పోస్టుకు రూ.44,500 నుంచి రూ.89,150.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 14.05.2025.
» **ఆన్‌లైన్ పరీక్ష తేది:** మే/జూన్ 2025.
» **వెబ్‌సైట్:** http://www.iifclprojects.in

జీర్ణాశయంలో పాక్షికంగా జీర్ణమైన ఆహారాన్ని ఏమంటారు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

జీవశాస్త్రం



1. పోషణ- ఆహార సరఫరా వ్యవస్థ

బహుళైచ్ఛిక సమాధాన ప్రశ్నలు

1. లాలాజలం P^{H} ——— స్వభావాన్ని కలిగి ఉంటుంది.
   ఎ) ఆమ్ల బి) క్షార
   సి) ఎ, బి డి) పైవేవీ కావు
2. కిరణజన్య సంయోగక్రియ రేటు దేనితో ప్రభావితం కాదు.
   ఎ) కాంతి తీవ్రత బి) ఆర్ద్రత
   సి) ఉష్ణోగ్రత
   డి) కార్బన్ డై ఆక్సైడ్ గాఢత
3. మొక్కను 48 గంటలపాటు చీకటిలో ఉంచిన తర్వాత కిరణజన్య సంయోగ క్రియకు సంబంధించిన ప్రయోగం చేస్తారు. ఎందుకంటే
   ఎ) క్లోరోఫిల్‌ను తొలగించడానికి
   బి) కిరణజన్య సంయోగక్రియ జరుగుతుందని నిరూపించడానికి
   సి) పిండి పదార్థాన్ని తొలగించడానికి
   డి) పిండి పదార్థం అయిపోతుందని తెలుసుకోవడానికి
4. ప్రొటీన్ లోపం వల్ల కలిగే వ్యాధి?
   ఎ) మెరాస్మస్ బి) స్థూలకాయత్వం
   సి) క్వాషియార్కర్ డి) పెల్లగ్రా
5. కిందివాటిలో ఎంజైము లేని జీర్ణ రసం?
   ఎ) బైల్ బి) జఠర రసం
   సి) పైత్యరసం డి) లాలాజలం
6. ఏకకణ జీవుల్లో ఆహార సేకరణ పద్ధతి?
   ఎ) శరీర ఉపరితలం ద్వారా
   బి) నోటి ద్వారా
   సి) దంతాల ద్వారా డి) రిక్తిక ద్వారా
7. కిరణజన్య సంయోగక్రియ జరిగేటప్పుడు మొక్కలో ఏ భాగం గాలిలో నుంచి కార్బన్ డై ఆక్సైడ్‌ను గ్రహిస్తుంది?
   ఎ) మూలకాకేశాలు బి) పత్ర రంధ్రం
   సి) ఆకు ఈనె డి) రక్షక పత్రాలు
8. పిండి పదార్థాన్ని పరీక్షించడానికి ఉపయో గించే ద్రావణం?
   ఎ) అయోడిన్ బి) బెటాడిన్
   సి) బెంజిన్ డి) ఎ, బి
9. ఆక్సిజన్‌ను కనుగొన్న శాస్త్రవేత్త?
   ఎ) ప్రీస్ట్లే బి) లెవోయిజర్
   సి) కెల్విన్ డి) మెల్విన్
10. మొక్కల్లో అధిక మొత్తంలో వాయువుల వినిమయం వేటి ద్వారా జరుగుతుంది?
    ఎ) పత్ర రంధ్రాలు
    బి) స్తంభాకార కణజాలం
    సి) స్పంజి కణజాలం డి) మధ్య ఈనె
11. కాండం, వేర్లలో ఏ కణజాలం ద్వారా వాయు వినిమయం జరుగుతుంది?
    ఎ) స్తంభాకార కణజాలం
    బి) స్పంజి కణజాలం
    సి) ధారు కణజాలం
    డి) పోషక కణజాలం
12. కిరణజన్య సంయోగ క్రియలో ఏర్పడే అంత్య పదార్థం?
    ఎ) కొవ్వులు బి) ప్రొటీన్‌లు
    సి) పిండి పదార్థం డి) విటమిన్‌లు
13. క్లోరోఫిల్ అంటే?
    ఎ) కాండం బి) వేరు
    సి) వర్ణయుత పుష్పం
    డి) ఆకుపచ్చని ఆకులు
14. హరిత రేణువులో థైలకాయిడ్ దొంతర లను ఏమంటారు?
    ఎ) ఆవర్ణిక బి) పత్రహరితం
    సి) గ్రానా డి) క్రిస్టే
15. పత్రహరితంలో ఉండే మూలకం ఏది?
    ఎ) ఐరన్ బి) మెగ్నీషియం
    సి) క్లోరిన్ డి) జింక్
16. నీటి కాంతి విశ్లేషణను నిరూపించిన శాస్త్రవేత్త?
    ఎ) లెవోయిజర్ బి) ప్రీస్ట్లే
    సి) హిల్ డి) మెల్విన్
17. కిందివాటిలో వృక్ష పరాన్నజీవి?
    ఎ) గులాబీ బి) కస్కుట
    సి) వేప డి) మల్లె
18. లాలాజలంలో ఉండే ఎంజైము ఏది?
    ఎ) అమైలేజ్ (టైలిన్)
    బి) లైపేజ్ సి) పెప్సిన్
    డి) సుక్రోజ్
19. జీర్ణాశయంలో పాక్షికంగా జీర్ణమైన ఆహారాన్ని ఏమంటారు?
    ఎ) HCl బి) లాలాజలం
    సి) కైమ్ డి) జఠర రసం
20. జీర్ణాశయంలో ఆహార పదార్థాల స్థితి?
    ఎ) ఆమ్ల బి) క్షార
    సి) తటస్థ డి) లవణయుతం
21. ఎమల్సీకరణంలో చిన్న చిన్న రేణువులుగా మారే పదార్థాలు?
    ఎ) విటమిన్‌లు బి) ప్రొటీన్‌లు
    సి) కొవ్వులు డి) పిండి పదార్థాలు
22. క్లోమ రసంలో ఏ ఎంజైమ్ ప్రొటీన్ల జీర్ణ క్రియకు ఉపయోగపడుతుంది?
    ఎ) ట్రిప్సిన్ బి) లైపేజ్
    సి) రెనిన్ డి) మాల్టోజ్
23. కొవ్వుల జీర్ణక్రియకు ఉపయోగపడే ఎంజైమ్?
    ఎ) ట్రిప్సిన్ బి) లైపేజ్
    సి) పెప్సిన్ డి) అమిలాప్సిన్
24. చిన్న పేగులో చిన్న వేళ్లు మాదిరిగా ఉండే నిర్మాణాలు?
    ఎ) జఠర సంవరిణి బి) ఆయత కండరాలు
    సి) సూక్ష్మ చూషకాలు డి) ఉండుకం
25. ప్రొటీన్‌లు, కెలోరీలు రెండింటి లోపం వల్ల కలిగే వ్యాధి?
    ఎ) క్వాషియార్కర్ బి) మెరాస్మస్
    సి) స్థూలకాయత్వం డి) పెల్లగ్రా
26. ప్రొటీన్ లోపం వల్ల కలిగే వ్యాధి?
    ఎ) మెరాస్మస్ బి) స్థూలకాయత్వం
    సి) క్వాషియార్కర్ డి) పెల్లగ్రా

సమాధానాలు

1) బి; 2) బి; 3) సి; 4) సి; 5) సి; 6) డి; 7) బి; 8) డి; 9) ఎ; 10) ఎ; 11) బి; 12) సి; 13) డి; 14) సి; 15) బి; 16) సి; 17) బి; 18) ఎ; 19) సి; 20) ఎ; 21) సి; 22) ఎ; 23) బి; 24) సి; 25) బి; 26) సి.

విద్య, ఉద్యోగ సమాచారం

ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాలో 309 ఉద్యోగాలు

సైన్స్‌లో డిగ్రీ చేసిన వారికి ఉద్యోగావకాశం. ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)లో ఖాళీగా ఉన్న 309 జూనియర్ ఎగ్జిక్యూటివ్ (ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది.

» **మొత్తం పోస్టులు:** 309
» **కేటగిరీ వారీగా వివరాలు:** అన్ రిజర్వ్‌డ్ కేటగిరీలో 125, ఈడబ్ల్యూఎస్ 30, ఓబీసీ 72, ఎస్సీ 55, ఎస్టీ 27 ఖాళీలు ఉన్నాయి(పీడబ్ల్యూబీడీ కింద మరో 07 అదనం)
» **అర్హతలు:** అభ్యర్థులు మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ సబ్జెక్టులతో మూడేళ్ల బీఎస్సీ డిగ్రీలో ఉత్తీర్ణత సాధించాలి. ఇంటర్మీడియెట్ స్థాయిలో ఇంగ్లిష్‌ను ఒక సబ్జెక్టుగా తప్పనిసరిగా చదివి ఉండాలి. దీంతోపాటు ఇంగ్లిష్‌లో మాట్లాడటం, రాయడంలో నైపుణ్యం ఉండాలి.
» **వయసు:** దరఖాస్తు నాటికి 18 నుంచి 27 ఏళ్ల లోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగ అభ్యర్థులకు పదేళ్ల మినహాయింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి రూ.1,14,000.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) ద్వారా ఎంపిక చేస్తారు. సీబీటీ టెస్టులో మార్కుల ఆధారంగా షార్ట్ లిస్టు చేసి..వారికి వాయిస్ టెస్ట్/ సైకోయాక్టివ్ సబ్‌స్టాన్సెస్ టెస్ట్/ సైకలాజికల్ అసెస్మెంట్ టెస్ట్/ ఫిజికల్ మెడికల్ టెస్ట్/ బ్యాక్ గ్రౌండ్ వెరిఫికేషన్‌తో ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 24.05.2025
» **పరీక్ష తేది:** పరీక్ష తేదీని వెబ్‌సైట్‌లో వెల్లడిస్తారు. అభ్యర్థులు తరచుగా వెబ్‌సైట్‌ను సందర్శిస్తూ ఉండాలి.
» **వెబ్‌సైట్:** https//www.aai.aero

సీఎస్ఐఆర్ మద్రాస్ కాంప్లెక్స్‌లో ఉద్యోగాలు

చెన్నైలోని సీఎస్ఐఆర్-మద్రాస్ కాంప్లెక్స్‌లో జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్, జూనియర్ స్టెనోగ్రాఫర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 08.
» **పోస్టుల వివరాలు:** జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్(జనరల్)-01, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్(ఎఫ్-ఏ)-02, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ (ఎస్-పీ)-01, జూనియర్ స్టెనోగ్రాఫర్-04.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 10+2 ఉత్తీర్ణతతో పాటు టైపింగ్ వచ్చి ఉండాలి.
» **వయసు:** 20.05.2025 నాటికి జేఎస్ఏకు 28 ఏళ్లు, జూనియర్ స్టెనోగ్రాఫర్‌కు 30 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు జేఎస్ఏ పోస్టులకు రూ.37,885, జూనియర్ స్టెనోగ్రాఫర్ పోస్టుకు రూ.51,408.
» **ఎంపిక విధానం:** ప్రొఫిషియన్సీ టెస్ట్, రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.05.2025.
» **వెబ్‌సైట్:** https://www.csircmc.res.in

ఐఐఎం బోధ్‌గయాలో 14 నాన్ ఫ్యాకల్టీ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) బోధ్‌గయా ఒప్పంద ప్రాతిపదికన నాన్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 14.
» **పోస్టుల వివరాలు:** ఎస్టేట్ కమ్ ప్రాజెక్ట్ ఆఫీసర్-01, సిస్టమ్ మేనేజర్-01, కార్పొరేట్ రిలేషన్స్ మేనేజర్-01, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్-01, ఇంటర్నల్ ఆడిట్ ఆఫీసర్-01, ఏఏవో(హిందీ లాంగ్వేజ్-అడ్మినిస్ట్రేటివ్)-01, ఏఏవో(ప్లేస్‌మెంట్)-02, వెబ్ డిజైనర్-01, ఐటీ-కంప్యూటర్ అసిస్టెంట్(అడ్మిషన్స్)-01, ఆఫీస్ అసిస్టెంట్-01, నర్సింగ్ స్టాఫ్(ఫీమేల్)-01, జూనియర్ హార్టికల్చరిస్ట్-01, లీగల్ ఆఫీసర్(కాంట్రాక్ట్)-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, ఎంబీఏ, పీజీడీఎం, పీజీ, సీఏ, మాస్టర్స్ డిగ్రీ, డిగ్రీ, నర్సింగ్, బీఎస్సీ, అగ్రికల్చర్, ఎల్ఎల్‌బీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** లీగల్ ఆఫీసర్‌కు 65 ఏళ్లు, జూనియర్ హార్టికల్చరిస్ట్‌కు 32ఏళ్లు,నర్సింగ్ స్టాఫ్‌కు 35 ఏళ్లు, వెబ్ డిజైనర్, ఆఫీస్ అసిస్టెంట్, ఐటీ అండ్ కంప్యూటర్ అసిస్టెంట్, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఇంటర్నల్ ఆడిట్ ఆఫీసర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌కు 40 ఏళ్లు, కార్పొరేట్ రిలేషన్‌షిప్ మేనేజర్, సిస్టమ్ మేనేజర్‌కు 50 ఏళ్లలోపు, ఎస్టేట్ కమ్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌కు 55ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 07.05.2025.
» **వెబ్‌సైట్:** https://iimbg.ac.in

ఏపీసీఆర్‌డీఏలో ఎన్విరాన్‌మెంట్ స్పెషలిస్ట్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజియన్ అథారిటీ (ఏపీసీఆర్‌డీఏ).. ఒప్పంద ప్రాతిపదికన ఎన్విరాన్‌మెంట్ స్పెషలిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ (ఎన్విరాన్‌మెంటల్ సైన్స్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.05.2025.
» **వెబ్‌సైట్:** https://crda.ap.gov.in

Which of the following is the code for ‘rare’?

Bank Exams

REASONING



Model Questions

The areas which are common in the bank clerical examination are..

1) CODED INEQUALITIES
2) SYLLOGISMS
3) CODING DECODING
4) MIXED SERIES

CODED INEQUALITIES


1. **Statements:**
   $N > A \geq C, P = N, P \leq L$
   Conclusion:
   I) $N > C$ II) $L > A$
   Solution:
   $N > A \geq C$
   Hence, $N > C$. Conclusion I is true.
   $L \geq P = N > A$
   Hence, $L > A$. Conclusion II is also true.
2. **Statements:**
   $S > K, M \leq T \leq R, K < M$
   Conclusions:
   I) $R > S$ II) $K > T$
   Solution:
   $R \geq T \geq M > K < S$. Hence, R and S cannot be compared. Conclusion I is not true.
   $T \geq M > K$. Hence, $T > K$. So, conclusion II is not true.
3. **Statements:**
   $S \geq P > L, P = N < K, S < Z$
   Conclusions:
   I) $Z = K$ II) $N \leq S$
   Solution:
   $Z > S \geq P = N < K$. As Z and K cannot be compared, conclusion I is not true.
   $S \geq P = N$. Hence, $S \geq N$. so, conclusion II is true.
4. **Statements:**
   $V > W = X, X \geq Q, Z \leq Q$
   Conclusions:
   I) $W = Z$ II) $W > Z$
   Solution:
   $W = X \geq Q \geq Z$. Hence, $W \geq Z$, which means $W > Z$ or $W = Z$. Either I or II is true.
5. **Statements:**
   $S \geq P > L, P = N < K, S < Z$
   Conclusions:
   I) $Z > K$ II) $Z \leq K$
   Solution:
   $Z > S \geq P = N < K$.
   As contradictory symbols (>, <) are there between the terms Z and K, they cannot be compared. But, they can form a **complementary pair**. So, Either I or II follows.

SYLLOGISMS

6. **Statements:** All stars are suns.
   Some suns are planets.
   All planets are satellites.
   Conclusions:
   I) Some satellites are stars.
   II) No star is a satellite.

Solution:


Basic Diagram Alternate Diagram



As all the given statements are affirmative, there is a possibility of ‘some stars are satellites’. Hence, both the conclusions form a complementary pair. Answer is ‘Either I or II’ follows.


7. **Statements:** All fishes are birds.
   All birds are rats.
   All rats are cows.
   Conclusions:
   I) Some cows are not birds
   II) All cows are birds
   Solution:

Basic Diagram *Alternate Diagram*




As all the given statements are affirmative, there is a possibility of ‘All cows are birds’. Hence, both the conclusions form a complementary pair. Answer is ‘Either I or II’ follows.

8. **Statements:**
   All curtains are rods.
   Some rods are sheets.
   Some sheets are pillows.
   Conclusions:
   I) Some pillows are rods.
   II) Some rods are curtains.
   Solution:
   Basic Diagram




As the given conclusions are both ‘affirmative’, the validity of these have to be checked in the basic diagram. Clearly, only II conclusion is valid.

9. **Statements:** No wall is roof.
   All pens are walls.
   All doors are roofs.
   Conclusions:
   I) Some doors are walls.
   II) No roof is wall
   Solution:
   Basic Diagram



‘No roof is wall’ is a valid conclusion as the statement given is ‘No wall is roof’. Only conclusion II follows.

10. **Statements:**
    All switches are plugs.
    Some plugs are bulbs.
    All bulbs are sockets.
    Conclusions:
    I) Some sockets are plugs.
    II) Some plugs are switches.
    Solution:
    Basic Diagram



Clearly, both the conclusions are valid.

CODING DECODING

Directions (Q.11-15): In a certain code, **‘tep lo ka gi’** is a code for **‘money is most important’**, **‘lep ka so pri’** is a code for **‘important things are rare’**, **‘pri lo da so’** is a code for **‘most essential are rare’** and **‘stp so tep da’**, is a code for **‘Is rare really essential?’**.

11. Which of the following is the code for ‘most’?
    1) so 2) da 3) lo 4) pri
    5) Can’t be determined
12. What does the code ‘tep’ stand for?
    1) money 2) Most
    3) rare 4) really
    5) is
13. Which of the following is the code for ‘rare’?
    1) so 2) stp 3) tep
    4) lo 5) lep
14. ‘really important topic’ may be coded as
    1) ka da lep 2) stp ka so
    3) ja da stp 4) ka stp yo
    5) ja ka tep
15. What does the code ‘da’ stand for?
    1) essential 2) Most
    3) rare 4) really 5) is

Solutions (Q.11-15):


tep lo ka gi = money is most important ——— (i)
lep ka so pri = important things are rare ——— (ii)
pri lo da so = most essential are rare ——— (iii)
stp so tep da = is rare really essential ——— (iv)
from (i) and (iii), lo = most ——— (v)
from (i) and (iv), tep = is — (vi)
from (ii), (iii) and (iv),
so = rare ——— (vii)
from (i) and (ii), ka = important ——— (viii)
from (i), (v), (vi) and (viii), gi = money ——— (ix)
from (ii), (iii) and (vii) pri = are ——— (x)
from (ii), (vii), (viii) and (x),
lep = things ——— (xi)
from (iii), (iv) and (vii)
da = essential ——— (xii)
from (iv), (vi), (vii) and (xii),
stp = really ——— (xiii)
The word ‘topic’ is not given in the given statements. Hence, based on the options yo = topic
11) 3;12) 5; 13) 1; 14) 4; 15) 1.

MIXED SERIES

Directions (Q.16 – 20): Study carefully the following arrangement of letters, digits and symbols to answer these questions.

M 7 £ 8 L P @ ? 6 N ß T Y 3 2 = E $ 4 9 © G H 5

16. How many such letters are there in the arrangement each of which is immediately followed by a number?
    1) Three 2) Four
    3) One 4) Two
    5) None of these
    Solution: There are three such type of pairs, **M7, Y3** and **H5.** Hence, the option is 1.
17. How many such symbols are there in the arrangement each of which is immediately preceded by a number and immediately followed by a letter.
    1) Two 2) Three
    3) Four 4) Nil
    5) None of these
    Solution: there are two such kind of triplets, 2 = E and 9 © G. Answer is 1
18. If all the symbols are deleted from the arrangement, which of the following will be fourth to the left of the 17th element from the left end?
    1) 9 2) E 3) 2 4) 4
    5) None of these
    Solution: The following elements remain after removing the symbols. **LEFT** M 7 8 L P 6 N T Y 3 2 E 4 9 G H 5 **RIGHT**
    17th element from the left end is 5, and the fourth element to the left of 5 is 4. Hence, the option is 4.
19. ‘78’ is to ‘P ? N’ and ‘? N’ is to ‘T3 =’ in the same way as ‘2E’ is to ____ in the arrangement.
    1) 4©H 2) 49G
    3) 4©G 4) 9GH
    5) None of these



Solution:1
Clearly, it is 4©H.

20. Which of the following letters is as far away from M to the right as G is away from N?
    1) ß 2) N
    3) Y 4) T
    5) None of these
    Solution: G is 12th element to the right of N. In the same way Y is 12th to the right of M. So, the option is 3.